
# మహాత్మా జీసస్



శ్రీ శార్వరి

# మహాత్మా జీసస్


.. 0 OCT 2005
ANDHRA JYOTHI
LIBRARY
HYDERABAD.



శ్రీ శార్వరి



ప్రచురణ

మాస్టర్ యోగాశ్రమం

# MAHATMA JESUS

*"Sri Sarvari"* V.R.K. Sarma


Gen. Editor : Dr. VAASILI

First Edition : May, 2005

Price : Rs. 100/-

Published by :
**MASTER YOGA ASHRAM**
Plot 89 & 90, Krishna Enclave,
Military Dairy Farm Road, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Phone : (040) 27790094



A.C.No. 94475



Printed by :
**MASTER PRINT MEDIA**
Plot No. 90, 'YOGAALAYA', Krishna Enclave,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Phone : (040) 27796676

10 SEP 2005
ANDHRA JYOTHI
LIBRARY
HYDERABAD.

# జస్ట్ ఎ మినిట్

మా రచనలు, ప్రచురణలు ఏవి చదివినా

పాఠకులు చిత్రమైన ఆధ్యాత్మికానుభవాలు పొందడం జరుగుతుంది.

అపూర్వమైన యోగానుభూతులు కలుగుతుంటాయి.

కొందరిలో స్పందనలు,

మరికొందరిలో ప్రకంపనలు కలుగుతుంటాయి.

చదువుతుండగానే ఆవలింతలు వచ్చి,

కళ్లు బరువెక్కి మూతలు పడడం,

ఒక చిత్రమైన ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయి

మధుర ప్రశాంతిని అనుభవించడం జరుగుతుంది.

అనేక రకాలైన అతీంద్రియ భావ రూపాలను,

చిత్రాలను దర్శించి తన్మయులవుతారు.

ఈ విచిత్రానుభవాలు, అనుభూతి

పాఠకుల పరిపక్వతకు, సంస్కారానికి, సుకృతికి నిదర్శనం.

అదే యోగార్హత కూడా.

\- శార్వరి

# మహాత్మా జీసస్


| | | | |
|---|---|---|---|
| 1. | జాన్ జీసస్‌ల జననం | – | 11 |
| 2. | మేరి – ఎలిజబత్‌ల జ్ఞానార్జన | – | 18 |
| 3. | జాన్ ప్రబంధం | – | 28 |
| 4. | జీసస్ బాల్యం | – | 33 |
| 5. | భారత దర్శనం | – | 38 |
| 6. | టిబెట్ పర్యటన | – | 55 |
| 7. | పర్షియా పర్యటన | – | 58 |
| 8. | అస్సీరియా పర్యటన | – | 63 |
| 9. | గ్రీసు పర్యటన | – | 65 |
| 10. | ఈజిప్టు పర్యటన | – | 70 |
| 11. | సప్తర్షుల సమావేశం | – | 81 |
| 12. | ప్రయోక్త జాన్ | – | 87 |
| 13. | అంతర్మథనం | – | 91 |
| 14. | క్రీస్తు పథంలో తొలి మలుపు | – | 97 |
| 15. | మహాబోధ | – | 118 |
| 16. | మలి పిలుపు | – | 128 |
| 17. | తుది మెరుపు | – | 148 |
| 18. | ఆత్మనిర్వేదం | – | 175 |
| 19. | ఆత్మ నివేదన | – | 186 |
| 20. | మహాభినిష్క్రమణ | – | 197 |



గురూజీ శ్రీ శార్వరి      శ్రీ పి.సుధాకరరెడ్డి

*This Research Book*

**"MAHATMA JESUS"**

*is presented by*

**Shri P. Sudhakar Reddy**

Secretary

All India Congress Committee

# ఎందుకు?

ఆ మధ్య ఒక మిత్రుడు కనిపించి పలకరించాడు "ఇప్పుడు ఏం రాస్తున్నారు"? సాధారణంగా బంధువులు, మిత్రులు అయితే "బావున్నారా? ఆరోగ్యం ఎలా ఉంది?" అని దిగులుగా పరామర్శిస్తారు. ఆ పలకరింపులో 'ఇంకా మీరు ఆరోగ్యంగానే ఉన్నారే! ఇంకా బ్రతికే ఉన్నారే?' అన్న వంకరతనం కనిపిస్తుంది. ఏం రాస్తున్నారు? అని అడగడంలోనూ కొంటెతనం ఉంది. "ఇన్నేళ్లువచ్చి ఇంకా రాస్తూనే ఉన్నారా? బోర్ కొట్టడం లేదూ? జీవితాంతం రాస్తూ జనాల్ని బాధపెడుతూనే ఉంటారా?" అనేది అంతర్ధ్వని.

అడిగింది అభిమానంతో కనుక వినయంగానే చెప్పాను. 'మహాత్మా జీసస్!' ఆయన ఉలిక్కిపడ్డాడు. 'షాక్' కొట్టినట్లు రెండు నిమిషాలు కళ్లు తిరిగిపోయి సంబాళించుకుని "జీసస్ గురించి ఏం రాస్తారు? ఏముంది రాయడానికి?" అన్నాడు.

"ఏదో ఉంది. నేను రాయదగ్గదే ఉంది. చదివాక ఆశ్చర్యపోవచ్చు!" అన్నాను.

"అహఁ అది కాదు. మీ లైను వేరు కదా. అందుకని".

లోగడ 'కృష్ణావతారం' రాశాను. 'మాస్టర్ సి.వి.వి. జీవితకధ' రాశాను. నా ఆత్మకధ 'ఆత్మయోగి సత్యకధ' రాసుకున్నాను. నాకు జీవిత చరిత్రలు చదవడం, రాయడం ఇష్టం. మహాపురుషుల జీవితాలంటే మరీ ఇష్టం. ఒక వ్యక్తి జీవితంలో జరిగే సంఘటనల వెనక జీవితసత్యా లుంటాయి. మహాత్ముల జీవితాల్లో పెన వేసుకున్న తాత్వికత ఉంటుంది. నిగూఢ సత్యం ఉంటుంది.

1950-52లో నేను గుంటూరు ఎ.సి. కాలేజీలో ఇంగ్లీషు లిటరేచర్ డిగ్రీ చేశాను. అప్పుడు మా లెక్చరర్స్ అంతా ఫారినర్స్. ఇంగ్లీషు, ఐరిష్, అమెరికన్లు. వాళ్లతో కలిసి చర్చికి వెళ్లాను. బైబిల్ చదివాను. అప్పుడే అరవిందుని చదవడం మొదలు. అప్పటి నుండే యోగులపట్ల మనస్సు

మొగ్గచూపించి, వారి జీవితాలకు, బోధలకు సంబంధం కనిపించింది. 'యోగం' సాధన చేస్తేగాని, అరవిందులు పూర్తిగా అర్థం కాలేదు. యోగం చేస్తేతప్ప ఎవరికైనా మరొక యోగి హృదయం అర్థం కాదు. అప్పుడప్పుడు నాలోని 'రచయిత' పైకొస్తుంటాడు. నాలోని 'యోగి' మౌనంగా ధ్యానం చేస్తుంటాడు. అంటే ఎప్పుడూ నేను 'నేను' కాను.

చాలాకాలం క్రిందట యోగంలో 'జాన్ రివలేషన్స్' అని ఒక కోర్సు చేశాను. మాస్టరుగారి యోగా 'ప్రేయర్స్'లో అది ఒక ప్రేయర్‌గా ఎలా ప్రవేశించిందో నాకు తెలియదు. కాని అది చేసినప్పుడల్లా 'క్రీస్తు చైతన్యం'లో ఉక్కిరి బిక్కిరి కావడం జరిగింది. చాలాసార్లు 'క్రీస్తు' ఆత్మదర్శనం జరిగింది. ఎవరూ నమ్మకపోయినా నష్టం లేదు. అది నా అనుభవం.

జీసస్ అన్నట్లు, ప్రతి వ్యక్తి కొన్ని పనులు చేయడానికే జన్మిస్తాడు. ఆ పనులు చేయడం పూర్తి కాగానే జీవితం నుండి నిష్క్రమిస్తాడు. బహుశా నాకు నిర్దేశించిన పనిలో 'మహాత్మా జీసస్' రచన ఒకటి అయి ఉండవచ్చు. జీసస్ జీవితం గురించి ఇంతో అంతో తెలిసిన వారందరికీ 'జీసస్ జీవన సత్యాలు' తెలియకపోవచ్చు. అభిమానం పరిమితం. జీసస్‌పై అనేక కోణాలలో సినిమాలు, టి.వి. కథలు వచ్చాయి. నా దృష్టి 'క్రీస్తు తాత్వికత'పైన. జీసస్ జీవించిన కాలంలోనూ, ఆ తర్వాతా క్రీస్తు తాత్వికతను పూర్తిగా అర్థం చేసుకునే అవకాశం తక్కువ. జనంలో సంస్కారం, అవగాహన, పరిశీలన నేడున్నంత వేగంగా ఆనాడు లేవు. జీసస్ కాలంలో నాగరికత తక్కువ. ప్రజల విజ్ఞతా తక్కువే. గత రెండు వేల సంవత్సరాల వ్యవధిలో ప్రపంచం కొన్ని వేల సంవత్సరాల ముందుకు సాగింది. మనిషిలో మానసిక వికాసం బాగా పెరిగింది. ఇప్పుడు క్రీస్తు తాత్వికతను, తులనాత్మకంగా, అధ్యయనం చేసి అర్థం చేసుకునే వీలుంది.

'తులనాత్మకంగా' అనడానికి కారణం వేదవ్యాసుడు, గౌతమ బుద్ధుడు, జీసస్ క్రీస్తు, ఆది శంకరుడు, జరతుష్ట్ర, టావో మొదలైన మహాత్ములు వివిధ కాలాలకు, వివిధ దేశాలకు చెందినవారు కావడం వల్ల 'సత్యాన్ని' విభిన్న కోణాలలో దర్శించడం జరిగింది. అందరిదీ సత్యదర్శనమే. అందరూ ఆత్మ దర్శనం చెందిన మహాత్ములే. కాలాన్ని బట్టి, దేశ పరిస్థితుల్ని బట్టి అవతార పురుషుల ప్రబోధం ఉంటుంది. గుండె కదలికలుంటాయి.

ఈ పుస్తకం ఎందుకు? అన్న ప్రశ్నకు నావద్ద సమాధానం లేదు. ఇది ఒక 'స్పందన'. నాలోని ఒక భావ వినమ్రత. యోగస్ఫూర్తి, మహాకవి పోతనగారు

భాగవతం ముందుమాటగా చెప్పుకున్నాడు. "పలికెడిది భాగవతమట - పలికించెడి వాడు రామభద్రుండట - నే పలికిన భవహర మగునట" అని. అసలు భాగవతం అని ఎందుకు అన్నాడు? 'కృష్ణ చరితమ్' అనవచ్చు. అవును? భగవంతుని కధ. అది భగవతత్త్వం తెలిపే కధ. ఇందులో మరొక పేచీ ఉంది. పోతనగారు రామభక్తుడు. ఆయన పూజించింది, ఆరాధించింది శ్రీరామచంద్రుని. భాగవతం ఆయనచేత రామచంద్రుడే రాయించాడట. రామాయణమో, సీతాయనమో రాయవచ్చు గదా! మనిషి భక్తి, ఆరాధన ఏదైనా భగవతత్త్వం ఒక్కటే. ఏ మహాత్ముని గురించి రాసినా అది భాగవతమే. అందులో 'మతం' ఇబ్బందిపెట్టే అవకాశమే లేదు. ఏ మహాత్ముడు ఏ మతాన్ని స్థాపించలేదు. సత్యాన్ని మాత్రం ప్రవచించారు. ఆత్మవిలువల్ని, ధర్మాన్ని, నీతిని ప్రకటించారు. ప్రస్తుతించారు.

'క్రీస్తు తత్త్వం' గురించిన నా అన్వేషణలో చాలా పుస్తకాలు చదివాను. ఎవరినీ కోరకుండానే చాలా పుస్తకాలు నాకు అందడం విశేషం. వాటిని ఎవరు పంపారో, ఎందుకు పంపారో, నాకు తెలియదు. అది రియల్ మిస్టరీ. అలా వచ్చి చేరిన పుస్తకాలలో 'ది అక్వారియన్ గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రిస్ట్' ఒకటి. అది నాకు నచ్చింది. నా రచనకు బాగా సహాయపడింది. 19వ శతాబ్దం చివరన 'దివ్యజ్ఞాన సమాజం' ఒక మహోద్యమంగా సాగించింది. 'ది థియోసాఫికల్ సొసైటీ' ప్రపంచ దేశాలన్నింటిలో భావచైతన్యం తెచ్చింది. మేధావుల ఆలోచనాసరళి మార్చింది. ఆత్మలతో ఆడుకుంది. ఆత్మలు ఆధారంగా అద్భుత పరిశోధనలు చేసింది. లెడ్ బీటర్, మాడం బ్లవట్స్కీల సారధ్యంలో గొప్ప పరిశోధనలు జరిగాయి. మరిన్ని ఆవిష్కరణలు జరిగాయి. అందులో మిస్టిక్ రైటింగ్ ఒకటి. మహాత్ములతో సంభాషించడం మరొకటి. ఆ మహాత్ములనే 'మాస్టర్స్' గా వ్యవహరించారు.

వాటి పరిశోధనల్లోని ఒక అంశం 'ఆకాశిక్ రికార్డ్స్'. వాటిని 'గాడ్స్ రిమెంబరెన్స్' అనీ అంటారు. మహాత్ములైనవారు మరణానంతరం నక్షత్రాలుగా ప్రకాశిస్తుంటారన్నది భారతీయుల నమ్మకం. వీరు మరొక అడుగు ముందుకు వెళ్లి, భూమిపైన ఆది మానవుడి నుండి నేటి మనుషుల వరకు అందరి జీవితాలు, ఆలోచనలు, వ్యవహారాలు మొత్తంగా ఆకాశ చిత్రాలలో కంప్యూటరైజ్డ్ అయినా యని, మనం చూచే నక్షత్రాలన్నీ కెమెరాలు, ఫిలిమ్‌లు, సి.డి.లు కంప్యూటర్లు అన్నమాట. మన పూర్వీకుల జీవితాలు, మన జీవితాలు అందులో

ఉంటాయి. 'రీ–ప్లే' చేసుకోవచ్చు. 'డౌన్ లోడ్' చేసుకోవచ్చు. థియోసాఫికల్ సొసైటీ సహాయంతో కొందరు క్రైస్తవ యోగులు అలా 'డౌన్ లోడ్' చేసుకున్న మార్మికసత్యాలు చాలా ఉన్నాయి. వాటిలో ఇది ఒకటి.

ఇందులో నన్ను బాగా ఆకట్టుకున్న విషయం క్రీస్తులోని సత్య సంధత. ఆయన ఆలోచనలు భారతీయ తాత్త్వికతకు చాలా దగ్గరగా ఉన్నట్లు అనిపించాయి. కథల్లో కాస్త హెచ్చుతగ్గులుండవచ్చునేమో గాని, తాత్త్వికత మౌలికం. జీసస్ తాత్త్వికత సత్యసంధత, విశ్వజనీనం. అవి సత్యప్రమాణం. జీసస్ కథ ఇజ్రాయిల్ కథ కాదు. ఆయన యూదుల ప్రతినిధి కాదు. ఆయన ప్రపంచ పౌరుడు. ఆయనది విశ్వమంత విశాల హృదయం. ఆయన ఆశించింది సర్వమానవ సౌభ్రాతృత్వం. మనిషి కళ్లలో దివ్యత్వం తళుక్కున మెరవడం జీసస్ ఆశ. విశ్వయోగి అయిన జీసస్ తపస్సు, విజ్ఞత, విశ్వజ్ఞత.

ఆది శంకరాచార్యవలె జీసస్ జీవించింది కొద్ది కాలమే. ఆయన చెప్పదలచింది చెప్పగలిగాడా? ఆశించింది సాధించలిగాడా? జీసస్ బోధించింది ఏమిటి? నేను అర్థం చేసుకోగలిగినంత వరకు జీసస్ 'ఆత్మ'కు ప్రాధాన్యం ఇచ్చి ఆత్మతత్త్వాన్ని బోధించ తలచాడు.

భగవంతుడు ఉన్నాడని, అయినా ఈ కళ్లతో ఆయనను చూడలేమని నిర్ద్వంద్వంగా చెప్పాడు. 'ఆత్మ'తోనే చూడగలమని చెప్పాడు. భగవంతుడు కొలువు తీరింది ఆత్మలో అయితే, ఆత్మ ప్రవేశానికి మార్గం హృదయం. హృదయానికి ప్రవేశార్హతలు నిష్కల్మష జీవనం, కరుణ, ప్రేమ, త్యాగం, దయా, సహానుభూతి. ఇవి క్రీస్తు తత్త్వానికి మూల వరాలు. మౌలిక సూత్రాలు. మతం కన్న మనిషికి ధార్మికత, కరుణ ముఖ్యం. ప్రపంచంలో మహాత్ములైన వారంతా మానవ విలువల్ని బోధించారు. ఆ సూత్రాలు గౌరవించారు. సహనాన్ని ఉద్బోధించారు. ఆత్మ సంస్కారాన్ని ఆరాధించారు.

గౌతమ బుద్ధుడు చెప్పిందీ అదే. జీసస్ క్రీస్తు చెప్పిందీ అదే.

దివ్యత్వానికి పూర్ణ మానవత్వం యోగిస్తుందన్నది సూత్రం.

– శార్వరి

# మహాత్మా జీసస్

## 1. జాన్-జీసస్‌ల జననం

అగస్తస్ సీజర్ రోమ్‌ను పాలిస్తున్న రోజులు ..

హీరడ్ ఆంటిపస్ జెరూసలెం పాలకుడు.

పాలస్తీనా క్రింద మూడు ప్రాంతాలు ... జుడియా, సమరియా, గలిలీ. జొవాచిమ్ ఒక సంపన్న కుటుంబీకుడు. గలిలీ రాష్ట్రంలోని నజరెత్ అతని నివాసం. జొవాచిమ్ యూదుల ధర్మవేత్త. అతని భార్య పేరు అన్నా. జూడా తెగకు చెందిన స్త్రీ ఆమె. జొవాచిమ్, అన్నా దంపతుల సంతానం మేరి. కుమార్తె జన్మించిన సందర్భంగా జొవాచిమ్ మేరీ దంపతులు గొప్ప విందు ఏర్పాటుచేసి, బంధుమిత్రుల్ని, సంపన్నుల్ని ఆహ్వానించారు. కుంటి, గుడ్డి, పేద, సాద అనే భేదం లేకుండా పట్టణంలోని ప్రజలందరినీ విందుకు పిలిచారు. అందరికీ విలువైన బహుమతు లిచ్చారు.

విందులో జొవాచిమ్ మాట్లాడుతూ, వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ "భగవంతుని దయవల్ల నాకు సంపదలకు కొదవలేదు. ధనం, ఐశ్వర్యం భగవంతుడు కృపతో ప్రసాదించినవి. మీరంతా భగవంతుని బిడ్డలు. నా సంపద ఎప్పుడూ మీ అందరికీ సహాయ పడుతుంది".

మేరికి మూడు సంవత్సరాల వయస్సు రాగానే జొవాచిమ్ - అన్నా దంపతులు మతపెద్దల ఆశీస్సుల నిమిత్తం జెరూసలెం తీసుకువెళ్లారు. అప్పటి మతాధిపతి మంచి మనసున్నవాడు, వాక్శుద్ధి కలవాడు, దైవోపాసకుడు. ఆయన మేరీని ఆశీర్వదించి ఆమె భవిష్యత్తును సూచించాడు.

"ఈ పాప గొప్ప అదృష్టవంతురాలు. జగన్మాతగా పూజింపబడుతుంది. దేశ దేశాలలో మేరీ ఆరాధనీయురాలవుతుంది. ఈమె ఒక యుగపురుషునికి

జన్మనిచ్చి ధన్యురాలవుతుంది. ఈమెను ఇక్కడ ఉండనీయండి. దేవాలయ ప్రాంగణంలో వసతి ఏర్పాటు చేద్దాం. ఈమెకు మన పవిత్ర ధర్మాలు చిన్నతనం నుండే పరిచయం చేయాలి".

మేరి అక్కడ ఉండిపోయింది. బాల్యం అక్కడే గడిచింది. 'కన్య' వయస్సు రాగానే ఆమెను జోసెఫ్ అనే యువకుని కిచ్చి వివాహం జరిపించారు. జోసెఫ్ తండ్రి నజరత్‌లో ఒక వడ్రంగి. పేరు జాకబ్. జోసెఫ్ నియమనిష్ఠలు గల యువకుడు. దైవభక్తి కలవాడు. శీలస్వభావం కలవాడు. మేరీకి తగిన వరుడు.

★ ★ ★

(1) జూడా పర్వత పంక్తులతో హెబ్రాన్ సమీపంలో నివసిస్తున్నారు జకరియా ఎలిజబత్ దంపతులు. ఆ దంపతులు ధర్మవర్తనులు, దైవ భక్తులు. జకరియా చదువుకున్నవాడు. జ్యోతిష పరిజ్ఞానం ఉన్నవాడు. జరిగిన విషయాలు, జరగబోయే సంఘటనలు గ్రహచలన పరిజ్ఞానంతో తెలుసుకో గలిగినవాడు. నిత్యం పవిత్ర గ్రంథ పారాయణం చేస్తూ ఉంటాడు. అనతికాలంలో ఒక యుగ పురుషుడు జన్మించనున్నాడని అతని అంతర్వాణి ఉద్బోధించింది. ఆ ప్రభువు ఆగమనం కోసం నిరీక్షిస్తున్నాడు. అవతారమూర్తి దీనజన బాంధవుడని, బాధాతప్త హృదయాలకు ఉపశమనం కలిగిస్తాడని అతని నమ్మకం.

జెరూసలెం ఆలయంలో ఆయన ప్రధాన పూజారి, అర్చకుడు. నిత్యం పూజాదికాలు నిర్వహించడం అతని ఉద్యోగం. దేవుని విగ్రహం ముందు దీపారాధన చేసి అగరుధూపం వేసి, భక్తి భావనతో కళ్లుమూసుకోగానే గాబ్రియేల్ అతని మనోనేత్రంలో ప్రత్యక్షమైనాడు. జకరియా కలవరపడి, సంభ్రమాశ్చర్యాలతో వణికిపోయాడు. తమ యూదులకు ఏదో ఉపద్రవం రానున్నదని అనుమానించాడు. గాబ్రియేల్ మందస్మితంతో జకరియాను ఆశీర్వదించాడు :

"భక్తా, భయపడకు. నీ మనస్సు సంశయించిన ప్రమాదం ఏమీ లేదు. నీకొక సందేశం ఇవ్వడానికి వచ్చాను. నీకే కాదు – అది యావత్ ప్రపంచానికి సువార్త. శుభవార్త. అది మానవజాతికి శాంతిసందేశం. నీవు ఆశిస్తున్న శాంతిదూత అనతికాలంలో అవతరించబోతున్నాడు.ఆయనే ప్రభువు. మానవాళికి శాంతిదూత. ప్రేమ సందేశకుడు. నీ భార్య ఒక పవిత్రమూర్తికి జన్మనివ్వబోతున్నది. నీకు జన్మించబోయే కుమారుని పేరు జాన్. వైతాళికుడు జాన్ జన్మించినది మొదలు అద్భుతాలు ప్రదర్శిస్తాడు. మహర్షిగా జీవిస్తాడు. అతనిలో దివ్యత్వం ప్రకాశిస్తుంది".

8. రుసో మమ ప్రియాంబికా, మజవరీ పితాహీ రుసో
రుసో మమ ప్రియాంగనా ప్రియసుతాత్మజా రుసో
రుసో భగిని బంధుహీ, శ్వశుర సాసుబాయి రుసో
న దత్తగురు సాయి మా మజవరీ కధీహీ రుసో. 1

పుసో న సునబాయి త్యా, మజ న భ్రాతృజాయా పుసో
పుసో న ప్రియసోయరే ప్రియ సగే న జ్ఞాతీ పుసో
పుసో సుహృద నా సఖా స్వజననాప్తబంధూ పుసో
పరీ న గురు సాయి మా మజవరీ కధీహీ రుసో 2

పుసో న అబలాములే తరుణ వృద్ధహీ నా పుసో
పుసో న గురుథాకుటే, వజథోర సానే పుసో
పుసో న చ భలేబులే సుజన సాధుహీ నా పుసో
పరీ న గురు సాయి మా మజవరీ కధీహి రుసో 3

రుసో చతుర తత్త్వవిత్, విబుధ ప్రాజ్ఞ జ్ఞానీ రుసో
రుసోహి విదూషీ స్త్రియా, కుశల పండితాహీ రుసో
రుసో మహిపతీ యతీ, భజకా తాపసీహీ రుసో
న దత్త గురు సాయి మా మజవరీ కధీహీ రుసో 4

రుసో కవి ఋషీ మునీ అనఘ సిద్ధ యోగీ రుసో
రుసో హి గృహదేవతా ని కుల గ్రామదేవీ రుసో
రుసో ఖల పిశాచ్ఛహీ మలిన ఢాకినీ హీ రుసో
న దత్తగురు సాయి మా మజవరీ కధీహీ రుసో 5

రుసో మృగ ఖగ కృమీ అఖిల జీవజంతూ రుసో
రుసో విటప ప్రస్తరా, అచల ఆపగాబ్ధీ రుసో
రుసో ఖ పవనాగ్ని వార్, అవని పంచతత్త్వే రుసో
న దత్తగురు సాయిమా మజవరీ కధీహి రుసో 6

రుసో విమల కిన్నరా, అమల యక్షిణీహీ రుసో
రుసో శశి ఖగాదిహీ, గగని తారకాహీ రుసో
రుసో అమరజహీ అదయ ధర్మరాజా రుసో
న దత్తగురు సాయిమా మజవరీ కధీహి రుసో 7

పశువుల కాపరుల ఆనందానికి అవధుల్లేవు. అంతా పల్లెకు పరుగుతీశారు ఆ వార్త చెప్పడానికి. భగవంతుని మానవ రూపంలో దర్శించాలన్న వారి ఆరాటం, ఉత్సాహం వర్ణనాతీతం. ఆ పశువులశాలకు దగ్గరగా ఉన్న ఒక ఇల్లాలు మేరీ, జోసెఫ్‌లు ఉండడానికి ఒకచిన్న ఇల్లు ఏర్పాటు చేసింది. వారు అక్కడనే కొన్ని రోజులున్నారు. మేరీ ప్రసవించిన వార్తను జోసెఫ్ జకరియా ఎలిజబెత్‌లకు అందచేశాడు. వార్త అందగానే వారిరువురు బెత్లహాంకు బయలు దేరారు.

మేరి; ఎలిజబత్ అనేక కబుర్లు కలబోసుకున్నారు. ఇద్దరు తల్లులు బిడ్డల్ని చూచుకుని తెగమురిసిపోయారు. చుట్టుపక్కలవారు, వీరి అదృష్టానికి తెగ మెచ్చుకోసాగారు. ఆచారం ప్రకారం మేరీ కన్న బిడ్డకు బారసాల, నామకరణం జరిగింది. మేరీ తన కొడుక్కి 'జీసస్' అని పేరు పెట్టింది.

(2) జీసస్ వయస్సు నలభై రోజులు. ఆచారం ప్రకారం మేరీ కుమారుని జెరూసలెం ఆలయానికి తీసుకువెళ్లింది. యూదుల సంప్రదాయం ప్రకారం చిన్న పిల్లలకు దేవాలయంలో శుద్ధి చేయించాలి. ప్రధాన పూజారి లాంఛనాలు పూర్తి కావించాడు. దక్షిణగా మేరీ ఒక గొర్రెను రెండు పావుకాళ్లను సమర్పించుకుంది.

దేవాలయంలో సైమన్ అనే యూదువృద్ధుడు నివశిస్తున్నాడు. ఆయన చిరకాలంగా ఇమ్మాన్యుయేల్ అవతరణ కోసం కలలు కంటున్నాడు. తాను మెస్సయ్య అవతరించేవరకు బ్రతికి ఉంటాననేవాడు. ప్రభువు ఆగమనం కళ్లారా చూడాలని అతని ఆశ. ఆయన పసివాడైన జీసస్‌ను చూడగానే ఆనందం పట్టలేక పోయాడు. తన చిరకాలస్వప్నం నెరవేరిందనుకున్నాడు.

"ప్రభువు నాకు దర్శనం ఇచ్చాడు. ఇంక నేను ప్రశాంతంగా వెళ్లిపోతాను" అని జీసస్‌ను తన చేతుల్లోకి తీసుకుని, "ఈ పసివాడు యూదుల్ని రక్షిస్తాడు. ఇజ్రాయిల్ ఒక్కటే కాదు, ప్రపంచం మొత్తం ప్రభువుని స్మరిస్తుంది. ప్రపంచంలో శాంతి నెలకొంటుంది. బిడ్డ నుదుటిపైన నాకు శుభచిహ్నాలు కనిపిస్తున్నాయి".

ఆ దేవాలయంలో 84 సంవత్సరాల వృద్ధ వనిత ఒకామె ఉంది. ఆమె రాత్రింబవళ్లు దైవస్మరణ చేస్తుంది. ఆమె బాలుడైన జీసస్‌ను చూడగానే అమితానందం పొందింది. "భగవాన్, ఇమ్మాన్యుయేల్" అని అప్రయత్నంగా ఆమె నోటినుండి మాటలు వెలువడ్డాయి.

"ఇమ్మాన్యుయేల్, భగవాన్! నువ్వు ఈ బాలునిగా అవతరించావా? నీ నుదుటిపై నున్న వైభవ చిహ్నాలు నేను గుర్తించాను భగవాన్." అంటూ ఆమె

10 SEP 2005

జీసస్ ముందు పరవశంతో మోకరిల్లింది. అంతలో ఒక ధవళవస్త్రధారి అయిన మహర్షి రూపం ఆమె ఎదుట ప్రత్యక్షమై "ఆగవమ్మా, నీవు చేస్తున్నపని హర్షణీయం కాదు. ఎవరూ మానవుల్ని పూజించకూడదు. రూపాల్ని పూజించకూడదు. ఈ బాలుడు భగవంతుని అవతారమే అయివుండవచ్చు. కాని మానవరూపంలో ఉన్నాడు. మానవులందరూ భగవంతుని బిడ్డలే. ఒకరు మహనీయుడు అయినా, మహాత్ముడు అయినా మానవుడే కద! నీవు ఆరాధించవలసింది, పూజించవలసింది నేరుగా భగవంతుడిని" అని హెచ్చరించాడు. ఆయన హెచ్చరిక విన్న మేరీ కలవరపడసాగింది. వెంటనే బిడ్డను తీసుకుని బెత్లహాంకు బయలుదేరింది.

(3) యూఫ్రెట్స్ నదికి అవల మాగియన్లు నివశిస్తున్నారు. వారు దివ్యజ్ఞానులు, మేధావులు, ఖగోళ జ్యోతిష పరిజ్ఞానం కలవారు. జెరూసలెం పైన ఆకాశవీధిలో వారికొక దివ్యతార కనిపించింది. దాని వెలుగు ప్రసరణ బట్టి, వారు మానవ రూపంలో జన్మించే మహాత్మను దర్శించాలని నిశ్చయించి, కొన్ని విలువైన బహుమతులు మూట కట్టుకుని బయలుదేరారు.

అ ముప్పురు దివ్యజ్ఞానులు జెరూసలెం చేరుకున్నారు. జనం వారిని పరదేశీయులుగా గుర్తించి విచారణ జరిపారు. ఎవరీ పరదేశులు! ఏం పని బడి వచ్చారు?

సమాధానంగా పరదేశులన్నారు "ప్రభువు ఇక్కడ జన్మించాడు ఆయన సందర్శనానికి వచ్చాం".

ఎవరో మహాత్ముడు జన్మించాడని, అతను ప్రభువు అవుతాడని దివ్యజ్ఞానుల రాక వార్తతో హిరోద్ సింహాసనం కదిలినట్లయింది. హిరోద్ వారిని తన వద్దకు రప్పించుకున్నాడు. వారు రాజుగారి కొలువుకు వచ్చి అదే విషయం విన్నవించారు – "ప్రభువు జన్మించాడు. భగవంతుడే ఇక్కడ అవతరించాడు. మేము యూఫ్రెట్ నదికి అవల ఉంటాం. మాకు ఆకాశంలో దివ్యనక్షత్రం కనిపించింది. అది మహాత్ముని జనన సంకేతం. అ ప్రభువును దర్శించడానికి వచ్చాం".

అ మాటలతో హిరోద్ వణకిపోసాగాడు. భయం పట్టుకుంది. తన సింహాసనం ఎవరో లాగేసినట్లు కంపించసాగాడు. తనపైన ఎవరో కుట్రపన్ను తున్నారు, దివ్యజ్ఞానులు రావటం ఆకుట్రలో భాగం. తనను రాజ్యభ్రష్టుని చేయాలని చూస్తున్నారు. యూదులు స్వతంత్రించి తమ వాడిని ప్రభువును చేయాలను కుంటున్నారు. ప్రభువు కాదగిన లక్షణాలు పుట్టిన ఏ బిడ్డలో ఉన్నాయో ఎలా తెలుస్తుంది! అప్పుడు పుట్టిన బిడ్డల వివరాలు సేకరించడానికి నిశ్చయించాడు.

అతను దైవజ్ఞులతో వినయంగా చెప్పాడు, "స్వామి! మీరు నగరంలో తిరుగుతూ విశేషాలు చూస్తుండండి. ఈలోగా మీరు కోరిన సమాచారం సేకరిస్తాను".

పురప్రముఖుల్ని, పండితులను హిరోద్ సమావేశ పరచాడు. మాగీల అన్వేషణ ఆంతర్యం ఏమిటని ప్రశ్నించాడు. అలాటి దివ్యలక్షణాలు గల వ్యక్తి ఏ ఇంటిలోనైనా జన్మించాడా? అని ప్రశ్నించాడు. వారంతా సమాలోచన జరిపి అన్నారు : "కొంతకాలంగా ప్రజలు కాలజ్ఞానం చెబుతూనే ఉన్నారు. ఇజ్రాయిల్‌ను రక్షించేందుకు ఒక మహాత్ముడు అవతరిస్తాడని, ఆ మెస్సయ్య మన బెత్లహాం లోనే జన్మిస్తాడని మికా అనే జ్యోతిష్కుడు ఎప్పుడో రాసి పెట్టాడట. 'బెత్లహాం సమీపాన పర్వతాలపైన, ఒక నిర్జన ప్రదేశంలో జన్మించే శిశువు ప్రజల హృదయాధినేత అవుతాడని". "హిరోద్ దివ్యజ్ఞానుల్ని పిలిపించి చెప్పాడు మీరు బెత్లహాం వెళ్లండి. వెళ్లి వెతకండి. ఇల్లిల్లు గాలించండి. అలాంటి శిశువు జన్మించి వుంటే, వచ్చి నాకు చెప్పండి. నేనూ వెళ్లి ఆ ప్రభువు దర్శనం చేసుకుంటాను".

మాగీలు జ్ఞానదృష్టితో జీసస్ జన్మించిన ప్రదేశాన్ని గుర్తించి మేరీని, జీసస్‌ను దర్శించి, తెచ్చిన బహుమతులు అందజేసి, అభినందించారు. వారు దివ్యజ్ఞానులు కావడం వల్ల హిరోద్ కుతంత్రాన్ని పసికట్ట గలిగారు. మేరీ, జోసెఫ్‌లకు పొంచివున్న ప్రమాదం గురించి చెప్పి, వెంటనే మరెక్కడకైనా సురక్షిత ప్రాంతానికి తరలి పొమ్మని హెచ్చరించారు. దివ్యజ్ఞానులు తిరుగు ప్రయాణం జెరూసలెం మీదగా కాక, వేరే మార్గం ద్వారా స్వదేశం చేరుకున్నారు. ఆ రాత్రికి రాత్రి మేరీ, జోసెఫ్‌లు జీసస్‌ను తీసుకుని రహస్య మార్గం ద్వారా ఈజిప్టుకు ప్రయాణమైనారు. అక్కడ జోవన్‌లో ఎలిహు, సలోమీల ఆతిథ్యం వారికి సులభంగా లభించింది.

దివ్యజ్ఞాన మూర్తిత్రయం తిరిగి రాకపోవడంతో హిరోద్‌కు అనుమానం కలిగింది. వారిపైన ఆగ్రహించాడు. అతను నియమించిన గూఢచారులు బెత్లెహాంలో జన్మించిన మరొక బాలకుని సమాచారం అందించారు. అతను 'ప్రభువు'కు వైతాళికుడని, ఈయన ప్రజల్ని సన్నద్ధం చేస్తాడని, ప్రజలు చెప్పుకొంటున్న విషయం చెప్పారు. హిరోద్‌కు ఒళ్లు మండింది. సైనికుల్ని పిలిచి, బెత్లహాం మొత్తం గాలించి, ఎక్కడ కనిపించినా 'జాన్' అనే పిల్లవాడిని చంపివేయమని ఆజ్ఞాపించాడు. జీసస్‌ను, జాన్‌ను కడతేర్చాలని అతని పన్నాగం. ఎందుకైనా మంచిదని, రెండు సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలందర్నీ చంపివేయమని ఆజ్ఞాపించాడు.

హిరోద్ దృష్టి తన కుమారునిపైన పడ్డదని ఎలిజబత్‌కు తెలియదు. కుమారునితో ఆనందంగా బెత్లహాంలోనే ఉండిపోయింది. అయితే హిరోద్ మనుషులు తమకోసం గాలిస్తున్నారని తెలియగానే జాన్‌ని తీసుకుని రహస్యంగా పర్వతాలపైకి పారిపోయింది. ఆ విషయం తెలుసుకున్న సైనికులు ఆమె వెంట పడ్డారు. ఆమెకు ఆ పర్వత దారులన్ని చిరపరిచయం. ఏ దారి ఎటు పోతుందో తెలుసు. ఒక రహస్య గుహలో ఆమె దాక్కుని సైనికులు వెళ్లిపోయేవరకు బయటకు రాలేదు.

సైనికులు తిరిగి వచ్చి 'కనిపించిన పిల్లలందర్నీ చంపివేశాం. కాని జాన్ ఎవరో మాకు దొరకలేదు' అని నివేదించారు.

అసలు వాడిని పట్టుకోలేక పోయినందుకు కుళ్లికుళ్లి ఏడ్చాడు హిరోద్.

కొందరు రాజోద్యోగులు వెళ్లి జకరయాను వత్తిడి చేశారు. అతని భార్యా బిడ్డలు ఎక్కడ ఉన్నారో చెప్పమని వేధించారు. "వారెక్కడకు వెళ్లిందీ ఎక్కడ ఉన్నదీ నాకే తెలియదు. భగవంతునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. నన్ను వదలి పెట్టండి" అని బ్రతిమిలాడాడు. అదే విషయం సైనికులు వచ్చి హిరోద్‌కు విన్నవించుకున్నారు.

హిరోద్ నమ్మలేదు. మరల వెళ్లి ఎలాగైనా సమాచారం రాబట్టమని సైనికుల్ని పంపాడు.

జకరయా వారితో గట్టిగా అన్నాడు "ఈ రోజు మీరు నా ప్రాణం తీయగలరు. ప్రభువు నా 'ఆత్మ'ను రక్షిస్తాడు".

దేవాలయంలో పూజలు చేస్తున్న జకరయాను హిరోద్ సైనికులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. మర్నాడు మిగిలిన పూజారులు, భక్తులు వచ్చే వేళకు అతను రక్తపు మడుగులో చచ్చిపడి ఉన్నాడు.

జకరయా మరణానికి జెరూసలెం మొత్తం కన్నీరు కార్చింది.

సింహాసనం పైన కూర్చుని ఉన్న హిరోద్ ఉన్న పళంగా బిగుసుకుపోయాడు. సేవకులు, పరివారం వచ్చి చూచేసరికి అతను చనిపోయి ఉన్నాడు. ఆ తర్వాత హిరోద్ కొడుకు సింహాసనం అధిష్ఠించాడు.

◆ ◆ ◆

# 2. మేరి - ఎలిజబత్‌ల జ్ఞానార్జన

(1) జెరూసలెంలో హిరోద్ పాలన అంతమైంది. అతని కుమారుడు ఆర్కెలస్ సింహాసనం ఎక్కాడు. ఇతను పరమ దుర్మార్గుడు, కుత్సితుడు, స్వార్థపరుడు. తన పట్ల విధేయత, విశ్వాసం చూపించని వారిని నిర్దాక్షిణ్యంగా చంపించాడు. రాజోద్యోగుల్ని, విద్యావంతుల్ని, మతాధిపతుల్ని సమావేశపరచి, తన సింహాసనం అధిష్ఠించే 'బాలుని' గురించి ఆరా తీశాడు. సమావేశానికి హాజరైన వారంతా జాన్, జీసస్‌ల పేర్లు చెప్పారు. ఎలాగైనా వారిద్దరినీ కడతేర్చాలని తీర్మానించారు. దాంతో ఆర్కెలస్ మనస్సు నిమ్మళించింది.

జోసెఫ్, మేరీ దంపతులకు జెరూసలెం సంగతులు తెలియవు. వారు ఈజిప్టులోని జోవన్ చేరుకున్నారు. ఎలిజబత్ తనకొడుకు జాన్‌తో జుడియా పర్వత గుహలలో కాలం గడుపుతున్నది. వీరి జాడకోసం ఎలిహు, సలోమీలు వేగులను పంపించారు. వేగులు ఎలిజబత్ ఆవాసం తెలుసుకొని తల్లీ కొడుకుల్ని తీసుకువెళ్ళి ఎలిహూ పంచన చేర్చారు. ఎలిజబత్ రాక మేరీకి సంతోషం కలిగించింది. ఎలిహు వారిద్దరినీ అభిమానంతో, ప్రేమగా చూచుకుంటున్నాడు.

ఒకనాడు వారిద్దరినీ పిలిచిచెప్పాడు, "కాలం ఎప్పుడూ ఒకేలా సాగదు. రోజులు ఒకేలా గడవవు. ప్రస్తుతం ఇక్కడ మీకు ఎలాంటి లోటు లేదు. మీకెలాటి కష్టం రానీయను. భగవంతుడు కరుణామయుడు. మీరు మాతో కలిసి జీవించాలన్నది భగవంతుని సంకల్పం కావచ్చు. ఇక్కడ విద్యాలయం అతి ప్రాచీనమైంది. నిగూఢ, తాత్విక, ధార్మిక విషయాలు ఇక్కడ బోధించడం జరుగుతుంది. మీరు జీవన వేదాన్ని నేర్చుకుంటే బావుంటుందనిపిస్తూంది".

వారు అందుకు అంగీకరించారు. ఎలిహు, సలోమీలు వారిద్దరినీ వెంట బెట్టుకుని ప్రాచీన జ్ఞాన విద్యాలయానికి తీసుకువెళ్లారు. వారిరువురినీ ఆశీర్వదించి ఎలిహు అన్నాడు, "ఒక విధంగా మీరిద్దరూ అదృష్టవంతులు. మీరిరువురు ఇద్దరు మహాత్ములకు జన్మనిచ్చారు. మీ బిడ్డలు కారణ జన్ములు. మీరు ఒక

విషయం మరచిపోకూడదు. ఒక మహాదివ్య సౌధనిర్మాణానికి గట్టి పునాదులు వేయవలసింది మీరే. మాతృమూర్తులైన మీరు ఆ భవనానికి మూలస్తంభాలు కావాలి. మీ జ్ఞానం అందుకు పునాది కావాలి. ఈ పవిత్రాలయం శాశ్వతంగా నిలవడానికి బాధ్యత మీరు వహించాలి.

"కాలాన్ని యుగాలుగా విభజిస్తాం. ఒక యుగం మారి మరో యుగం రావడానికి మధ్య కాలం యుగసంధి ... అది కాలంలో మైలురాయి వంటిది. ప్రతి జాతి యుగసంధిలో గొప్ప మలుపు తిరుగుతుంది. అది యుగధర్మం. ఆ జాతి కొత్త చైతన్యం పొందుతుంది. చైతన్యం అంటే మనిషిలో కలిగే దివ్యప్రేరణ. దైవాంశ ప్రవేశం. అంటే మానవత్వంలో దివ్యత్వం ప్రవేశించడం. అప్పుడు మానవరూపంలో భగవంతుడు జన్మిస్తాడు. మీ బిడ్డలిద్దరూ అటువంటి అవతార మూర్తులు. కారణజన్ములు. వారు మానవజాతిని ఉద్ధరిస్తారు. ఉద్బోధిస్తారు. వారు నిర్వర్తించవలసిన కార్యం బహుదొడ్డది. విశాలమైనది. ఈ మనుషులు ఒక్కసారిగా కాంతిని భరించలేరు. వెలుగులు తట్టుకోలేరు. మీ బిడ్డలను సుశిక్షితులుగా తీర్చిదిద్దాలి. వారి ఆత్మల్ని శుద్ధిపరచాలి. వారిని కల్మష, దోష రహితుల్ని చేయాలి. వారి హృదయాలలో ప్రేమను నింపి ఉద్యమింపచేయాలి. వారి అవతార లక్ష్యాన్ని వారికి తెలియచెప్పడం తల్లులుగా మీ కర్తవ్యం.

"మనిషికి, భగవంతుడికి తేడా లేదు. ఇరువురు ఒక్కటే. మనిషి తన వాంఛలతో, స్వార్థంతో, ఆలోచనలతో దైవానికి, దైవత్వానికి దూరమవుతున్నాడు. తన పతనాన్ని తనే ఆహ్వానిస్తున్నాడు. దైవచింతన మనిషిని దేవుని చేస్తుంది. దేవుడంతటి వానిని చేస్తుంది. అందుకు ప్రేమ ఒక్కటే తారక మంత్రం. ప్రేమ సూత్రంతో మనిషి దేవుడవుతాడు. భగవంతుడు లోకాన్ని ప్రేమిస్తున్నంతగా మనిషి భగవంతుని ప్రేమించటం లేదు. ప్రపంచాన్ని ఉద్ధరించేది ప్రేమ. మనిషి పతనం కాకుండా రక్షించేది ప్రేమ. 'క్రీస్తు' ఆ ప్రేమ రహస్యాన్ని మనకు బోధించడానికే జీసస్‌గా అవతరించాడు. ప్రేమ ప్రవహించడానికి అనువుగా మీ మనస్సులు సిద్ధం చేసుకోండి. లోకాన్ని సిద్ధపరచండి. మీ పరిసరాలను ప్రేమ పూర్ణం చేయండి.

"అమ్మా, ఎలిజబత్! నీ కుమారుడు రూపం దాల్చిన పవిత్రత. తను ప్రేమ మార్గాన్ని సిద్ధం చేస్తాడు. ప్రస్తుతం ఈ మనుషులు అంతటి స్వచ్ఛమైన ప్రేమను ఉపయోగించుకునే స్థితిలో లేరు. అయినా కృషి వృథా కాదు. బోధన నిష్ఫలం కాదు. భగవంతుని స్మృతిలో మానవుని ప్రతి ఆలోచన నమోదై ఉంటుంది. ప్రపంచం సిద్ధంగా ఉన్నప్పుడు భగవంతుడు, ఎవరి ద్వారానో ఆ సందేశాలు

అందచేస్తుంటాడు. మనం మనకు తెలిసిన భాషలో, మనకున్న సంస్కారం మేరకు ఆ సందేశాలను అందుకుంటాం. ప్రతి మనిషి కాంతిని దర్శించగలడు. వెలుగులోకి పయనించగలడు. తానే వెలుగుమయం కావాలి. అప్పుడు మనిషి భగవంతునితో సమం అవుతాడు".

"మరొక విషయం గమనించండి. మనిషి సమాజంలో ఒంటరిగా బ్రతకలేడు. ప్రతి చిన్న పనికి ఇతరులపైన ఆధారపడక తప్పదు. అది సత్సంబంధం కావాలి. సత్సంబంధం నెలకొనాలంటే హృదయం పవిత్రంగా, నిష్కల్మషంగా ఉండాలి. హృదయం నిర్మలంగా ఉన్నవారే ఇతరుల్ని నిస్వార్థంగా ప్రేమించగలరు. ఎలాంటి ప్రతిఫలం ఆశించరు. వారు తిరిగి తమను ప్రేమించాలని అనుకోరు. ఇతరులు తమపట్ల ఎలా ప్రవర్తించాలని ఆశిస్తారో, తాము ముందుగానే ఇతరులపట్ల అలా ప్రవర్తిస్తారు.

"మనుషుల్లో రెండు రకాల స్వభావాలుంటాయి. పైకి కనిపించేది ఒకటి. ఆంతర్యం మరొకటి. మనిషి ఔన్నత్యాన్ని చూపేది ఆత్మసంస్కారం. అది అంతరాత్మ ప్రబోధం ద్వారా వ్యక్తమవుతుంది. రెండవది లౌకిక సంబంధి. శరీరావసరాలు, వాంఛలు, కోర్కెలు గూడుకట్టుకున్నది రెండవది. ఇది అశాశ్వతం. మనిషిలో నిగూఢంగా ఉండే దైవత్వం శాశ్వతం. ఎన్నటికి నశించదు. ఉన్నతాత్మ సత్యానికి ప్రతినిధి. అది రూపుదాల్చిన సత్యం. రెండవ సగం వక్రించిన సత్యం. అంటే అసత్యం. ఉన్నతాత్మలో న్యాయం, కరుణ, ప్రేమ, ధర్మం ఉంటాయి. రెండవ సగంలో అసూయ, ద్వేషం, స్వార్థం, కుటిలత్వం చోటుచేసుకుంటాయి. ఉన్నతాత్మ మంచికి కేంద్రం. భౌతిక పార్శ్వంలో సుఖాలు, భోగాలు, లాభాలు, స్వీయ ప్రయోజనాలు. బాధ, అశాంతి, మృత్యుభయం, శత్రుబాధ ఉంటాయి. ఇహ లోకంలో సుఖాలు, బోగాలు ఆకర్షణీయంగా ఉంటాయి. కాని వాటి వెనుక విషాలుంటాయి.

"ఏం చదవాలి? మీ ఆత్మని తెలుసుకోవడమే గొప్ప చదువు. అంతర్యాన్ని తెలుసుకోవడమే అనుభవం. ఆ తర్వాత చదివేందుకు ఏం మిగులుతుంది? తర్వాత తనను తాను తెలుసుకోవాలి. ఎవరు తన బాహ్యప్రవర్తన గమనిస్తారో, వారికి ఈలోకం అశాశ్వతం, భ్రమ అనిపిస్తుంది. తన అంతరంగాన్ని గమనించిన వారికి భగవంతుడు తెలుస్తాడు. నశింపులేని విషయాలు, సత్యాలు గ్రహించ గలుగుతాడు. ప్రేమ ప్రధానంగా పవిత్ర జీవనం సాగించేవారు ఉత్తములు. వారికి ఎలాంటి బాధలు ఉండవు. మనిషి సహజంగా స్వార్థపరుడు. తన చుట్టూ ఒక వలయం గీసుకుని, అందులో తిరుగుతుంటాడు. తనను ఉద్ధరించుకుంటే

చాలనుకుంటాడు. మనిషి రక్షణ కోరతాడు దేని నుండి? భయం నుండి, అస్తిమితం నుండి, పాపం నుండి. అసలు విముక్తి. భయంకర ప్రపంచం నుండి. దేవతలకున్న శక్తుల వంటివి దయ్యాలకు, క్షుద్రశక్తులకూ ఉన్నాయి. వారికి అసూయలు, ద్వేషాలు, అభిమానాలు ఉన్నాయి. జంతువుల్ని బలియిస్తే తప్ప క్షుద్రశక్తులకు తృప్తి కలగదు. విలువైన కానుకలు సమర్పిస్తే తప్ప వారు అనుగ్రహించరు. క్షుద్రశక్తులకు వినడానికి చెవులుండవు. చూడడానికి కళ్లుండవు. అసలు వాటికి హృదయం ఉండదు. సానుభూతి చూపడానికి, జాలి పడడానికి అవకాశమే లేదు. మనిషిని రక్షించే శక్తి ఏ క్షుద్ర దేవతకు లేదు.

**(2) మేరి, ఎలిజబత్‌లకు సలోమి జీవన ధర్మాలు బోధించింది :**

"అన్ని రోజులూ, అన్ని కాలాలు ఒకేలా ఉండవు. కాలం మారిపోతుంది. అది కాల ధర్మం. ఈనాడు మగవారి మాటకు విలువ ఉంది. వారి అధికారాలు చెల్లుతున్నాయి. రేపు అధికారాలు ఆడవారి హస్తగతం కావచ్చు. నీతిని, ధర్మాన్ని బోధించేది ఆడవారు కావచ్చు. దేశాన్ని ఆడవారు పాలించవచ్చు. జీవితంలో స్త్రీ పురుషులది సమాన పాత్ర అవుతుంది. చేయిచేయి పట్టుకుని నడవ వలసిందే. ఒకరు లేకపోతే రెండవ వారి పాత్ర సగమే అవుతుంది. ఏ ఒక్కరైనా సగం పని మాత్రమే చేస్తారు. మిగిలిన సగం జీవిత భాగస్వామి పూర్తి చేయవలసిందే. మనం ప్రకృతి నుండి నేర్చుకోవలసింది చాలా ఉంది. సూర్యతాపం – రాత్రి చంద్రుని చల్లదనం, అనుతాపం. సూర్యతాపానికి చంద్రుని వెన్నెల చల్లదనం అవసరం. అది ఉపశమనం.

"ఈ రోజు మనిషి బరువులతో, బాధ్యతలతో క్రుంగి పోవచ్చు. రేపు అదే జీవితంలోకి ఆనందం తొంగిచూస్తుంది. ఈనాడు అదృష్టం అనుకున్నది రేపు దురదృష్టం కావచ్చు. అదే జీవితం. చీకటి వెలుగుల మిశ్రమం జీవితం. ఈనాడు కష్టాల్నిచూచి జీవితాన్ని శపించినవారు రేపు సుఖ సంతోషాలతో స్వర్గం చేసుకుంటారు. ఈనాడు అసూయ, ద్వేషం, వైరంతో క్రుద్ధుడైన మనిషి రేపు శాంతిస్తాడు. కోర్కెలకు అతీతంగా ఎదిగి దివ్యానందాన్ని అనుభవిస్తాడు. మనిషి వేయి సార్లు, వేయి విధాల ఆలోచిస్తాడు. ఉచ్చనీచాలు ఎందుకని కుమిలి పోతుంటారు. వారు మనవంటివారే. భగవంతుడు మనల్ని సృష్టించినట్లే వారినీ సృష్టించాడు. ఎవరికి అప్పగించిన పనులు వారు చేస్తుంటారు. సత్యాన్ని తెలుసుకోవడం మన కర్తవ్యం. అది అన్నింటిని మించిన పని. ఒక్కటి నిజం. ప్రతి మనిషి తన అనుభవాలనుండి సత్యాన్ని గ్రహిస్తాడు. జీవితానుభవాలను వడబోస్తే 'సత్యం' కనిపిస్తుంది".

మేరీ అన్నది : "నాకు ఈ రోజు చాలా ఆనందంగా ఉంది, తృప్తిగా ఉంది. నా ఆలోచనల సరళి మారింది. తీరు మారింది. నా జీవిత విధానం మారింది. నాలో ఈ చైతన్యానికి, ఉద్వేగానికి కారణం ఏమిటి సలోమీ? ..."

సలోమి : "అవును మేరీ! ఈ రోజు నీ హృదయంలో దైవత్వం ప్రవేశించింది. నీకు సత్యదృష్టి ఏర్పడ్డది. అదే నీ తృప్తికి, ఆనందానికి అసలు కారణం. దానిని భగవత్కృప అనవచ్చు. భగవంతుని సృష్టిని మనం మూడు విధాలుగా అధ్యయనం చేయాలి. భగవంతుడు ఒక్కడే, క్రియలు మూడు. కిరణాలు ఏడు. సకల చరాచర సృష్టికి మూలకారణం భగవంతుడు ఒక్కడే. అదే విశ్వశక్తి. అదే మహాప్రాణ కళ. సృష్టికి మూలమైన శక్తి ప్రాణంగా మారి అగ్నిగా రూపాంతరం చెందుతుంది. సృష్టికి మూలం ప్రేమ. భగవంతుని సంకల్పం వల్లనే సృష్టి ఏర్పడ్డది.

"భగవంతుని శ్వాస నుండి ఏడు శక్తులు ఉద్భవించాయి. ఆ ఏడు శక్తులు లోకాన్ని సృష్టించి, పోషించి, లయింప చేస్తుంటాయి. ఆ శక్తులు అన్నీ కూడ బలుక్కొని మనిషిని సృష్టించాయి. ప్రాచీన కాలంలో ప్రాచ్యదేశాలలో 'టావో'ను పరమాత్మగా భావించారు. అక్కడ భగవంతునికి వారు పెట్టిన పేరు 'టావో' ... ఆయన సూర్య, చంద్ర, నక్షత్రాలను సృష్టించాడని అంటారు. ఆయనే భూమిని, ఆకాశాన్ని సృష్టించాడు. ఒకటి రెండై, రెండు మూడయి, మూడు ఏడైన తర్వాత విశ్వరచన జరిగింది.

ప్రాచ్యదేశాల సిద్ధాంత రీత్యా ఆత్మకు, పరమాత్మకు భేదం లేదు. రక్త మాంసాలవల్ల కోరికలు కలుగుతున్నాయి. అవి లేనప్పుడు వాంఛలుండవు. పరమాత్మ ఎప్పుడు మంచినే ప్రేమిస్తుంది. కోరికలు శరీరం పరిధిలోనివి. ఆత్మకు వాటితో సంబంధం లేదు. రెండింటి రణక్షేత్రం అంతరాత్మ. కోరికల్ని జయించిన మనిషికి 'ఆత్మ' విలువ తెలుస్తుంది. అలాంటి వారు పరమాత్మ నీడలో పరమాత్మ ప్రతినిధులుగా జీవిస్తారు".

(3) మరొక సందర్భంలో ఎలిహు మేరి, ఎలిజబత్‌లకు ఇలా ఉపదేశించాడు:

"ప్రాచీన కాలంలో ప్రాచ్యదేశాలలో ఒక జాతివారు భగవంతుడు ఒక్కడేనని విశ్వసించేవారు. ఆ భగవంతుని 'బ్రహ్మం'గా పేర్కొని ఉపాసించారు. వారు తమది ప్రాచీన ఆర్షధర్మమని చెప్పుకునేవారు. వారు మనశ్శాంతితో సుఖ శాంతులతో జీవించారు. వారి ఆత్మజ్ఞానం బహుముఖాలుగా విస్తరించింది. వారు హృదయంలో జ్యోతిని దర్శించి, దానిని పరంజ్యోతి అనేవారు.

"అలాంటి వారికి కాలక్రమంలో ఐహిక వాంఛలపట్ల ఆసక్తి పెరిగింది. ధర్మాన్ని తమకు అనుకూలంగా మలుచుకోసాగారు. పేదలను, విద్యాహీనులను హింసించసాగారు. అలా 'బ్రహ్మ' విద్యావేత్తలు పతనోన్ముఖులైనారు. లోకం అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడసాగింది. అయినా కొందరు మహర్షులు మానసిక సంయమనం కోల్పోలేదు. దృఢచిత్తంతో ఉన్నారు. బ్రహ్మజిజ్ఞాసను వదలి పెట్టలేదు. ఆత్మజ్ఞానానికి దూరం కాలేదు. వారే లోకానికి వెలుగు దివ్వెలుగా, వైతాళికులుగా మిగిలిపోయారు. బ్రహ్మజ్ఞానం మొక్కపోలేదు. చెక్కు చెదర లేదు. వారు రాసి పెట్టుకున్న వేదాలు ప్రామాణికం అయ్యాయి అవి సత్యానికి భాష్యాలు.

"చాల్దియా లోనూ బ్రహ్మజ్ఞానులున్నారు. 'ఉర్'లో 'తేరు' అనే బ్రహ్మ ఒకరుండేవారు. ఆయన కుమారునికి బ్రహ్మజిజ్ఞాస అధికం. బ్రహ్మతత్వం గురించి ఆరాటపడేవాడు. అతనే 'హీబ్రూ' జాతికి మూలపురుషుడు. ఆ 'బ్రహ్మ' భార్యా బిడ్డలతో, పశుగణంతో, బంధుమిత్ర బలగాలతో పశ్చిమ దేశాలకు వలస వెళ్లాడు. కెనాన్ అనే తావుకు చేరి, ఓకు అడవుల్లో నివాసం ఏర్పరచుకున్నాడు. ఒకసారి అక్కడ కరువు ఏర్పడింది. అబ్రం తన పరివారంతో, పిల్లా మేకతో ఈజిప్టుకు వలస వచ్చాడు. జోవన్ నదీ తీరభూములు సారవంతం కావడం వల్ల ఇక్కడ నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఈ నదీ తీరంలో 'అబ్రం' నివసించిన ప్రదేశాల ఆనవాళ్లు ఇక్కడ ప్రజలకు తెలుసు. అబ్రం ఈజిప్టుకు రావడంలో మరొక రహస్యం ఉంది. ఈజిప్టు తాంత్రిక దేశం. ఇక్కడ యోగులు, మహర్షులు ఎక్కువ. ఆధ్యాత్మిక వికాసం ఎక్కువ. ప్రపంచంలో అన్ని గుప్త విద్యలు, నిగూఢ రహస్యాలు, యోగ సంప్రదాయాలు ఈజిప్టులో చెక్కుచెదరకుండా ఉన్నాయి. అందుచేత ప్రపంచంలోని వివిధ దేశాల యోగులు, రుషులు, తాత్వికులు ఈజిప్టుకు వచ్చిపోతుంటారు.

అబ్రం గొప్ప ఖగోళశాస్త్రవేత్త. ఆయనకు గ్రహచలనశాస్త్రం తెలుసు. ఇక్కడ విద్యార్థులకు ఖగోళశాస్త్రం బోధించేవాడు. దేవాలయమే ఆయన విద్యాలయం. విద్యాబోధన పూర్తికాగానే తన పరివారాన్ని పశుగణాన్ని తీసుకుని కనాన్‌కు వెళ్లిపోయాడు. 'మామ్రే' మైదానంలో ఆవాసాలు ఏర్పరచుకున్నారు. అక్కడే ఆయన జీవితాంతం ఉన్నాడు. అతని జీవిత విశేషాలు ఇజ్రాయిల్‌లో లభిస్తాయి.

పర్షియా పండితులకు 'బ్రహ్మ' సంప్రదాయం తెలుసు. 'బ్రహ్మం' విశ్వానికి మూలపురుషుడని, సృష్టికి కారణమని అంగీకరిస్తారు. అంతకు మించిన విశేషం చెప్పరు. 'బ్రహ్మం'నే సుదూర ప్రాచ్యదేశాలలో 'టావో' అంటారు. ప్రాచీన కాలంలో అన్ని దేశాలలో ప్రజలు మనశ్శాంతితో జీవిస్తుండేవారు. మిగిలిన దేశాలలో వలె, పర్షియాలోనూ ఒక వర్గం వారిలో స్వార్థం పెరిగింది. భౌతిక సుఖలాలస

పెంచుకున్నారు. 'జ్ఞానం' వారి స్వంత ఆస్తిగా భావించసాగారు. అధికారం చేజిక్కించుకొని, అమాయక జనంపై పెత్తనం చలాయించారు. మతం కలుషితమై మసక బారింది. జంతువులను, పక్షులను, పాముల్ని దేవుళ్లుగా, దైవశక్తులుగా పూజించసాగారు. కొంత కాలానికి అక్కడ ఒక మహాత్ముడు అవతరించాడు. ఆయనను ప్రజలు 'జరతుష్ట్ర' అని పిలవసాగారు.

"జరతుష్ట్ర ఆత్మకు ఉన్నత స్థానం కల్పించి పెట్టాడు. చిల్లర దేవుళ్లను పూజించవద్దని ప్రబోధించాడు. పర్షియా మొత్తం అతని బోధలకు ప్రభావితమై, అతనిని అనుసరించసాగింది. ప్రజలంతా ఒక్కటే. భగవంతుడు కూడా ఒక్కడే. అందరికీ ఒకే దేవాలయం. విగ్రహారాధనకు కాలదోషం పట్టింది. దాంతో పర్షియా జ్ఞాన శిఖరానికి చేరింది.

"భగవంతుడు ఒక్కడేనంటే జనాలకు తృప్తి ఉండదు. కనిపించని భగవంతుని అంత సులభంగా అంగీకరించరు. దేవుడైనా సరే కంటి ముందు కనిపిస్తే అదొక తృప్తి. ఒకరూపం కావాలి. అరూపారాధన కష్టమైన పని. జరతుష్ట్ర ఇలా ఉద్బోధించాడు :

"అన్నింటికన్న ఉత్తమమైనది, ఉన్నతమైనది ఆత్మ – 'అహురా మాజ్దా' – అది సూర్య తేజస్సులా ప్రకాశవంతమైనది. ఉజ్జ్వలమైనది. సూర్యునిలోని తేజస్సే అహురా మాజ్దా. అంచేతనే ప్రజలు సూర్యదేవాలయాలలో పూజలు నిర్వహిస్తారు. సూర్యుని ఉపాసిస్తారు".

పర్షియా సూఫీలకు ఆయువుపట్టు. జీసస్ జననాన్ని ఇక్కడి మాగీలే ముందుగా గుర్తించారు. అంతదూరం వెళ్లి జీసస్‌ను మొదట దర్శించింది వీరే. జరతుష్ట్ర సిద్ధాంతాలు, ధర్మసూత్రాలు 'అవెస్తా'లో లిఖించబడిఉన్నాయి. వాటిని మీరు అధ్యయనం చేయవచ్చు, ఆచరించవచ్చు. అయితే సూత్రాలు ఎన్ని చదివినా, ధర్మాలు ఎన్ని తెలుసుకున్నా ఆచరణలో పెట్టినప్పుడే వాటి ప్రయోజనం తెలుస్తుంది. మనసా, కర్మణా ఆచరించగలగాలి. ఆమోదించాలి. సత్యం ఒక్కటే. మనం సత్యార్థం గ్రహించి, సత్యసమ్మతం కావాలి. సత్యంగా మారిపోవాలి. అంత పట్టుదల ఉంటేతప్ప ఎవరికీ సత్యం అవగతం కాదు. సత్యాచరణ వల్ల భగవచ్ఛక్తి తెలుస్తుంది. సత్యసంధత వల్ల జీవితం వెలుగు నిండుతుంది. జీవితం సత్యసమ్మత మైనపుడు మనిషి దేవుడయినట్లే".

మరొక రోజున భారతీయ తత్త్వచింతనపై ఎలిహూ ప్రసంగించాడు: "భారత దేశంలో పురోహిత వర్గం అని ఒకటి ఉంది. వీరు దేవాలయ పూజారులు.

ఆవర్గం స్వార్థంతో అవినీతిని ఆశ్రయించింది. 'బ్రహ్మ'ను గురించి సామాన్య ప్రజలు మరచిపోయారు. మానవధర్మం క్రమంగా సన్నగిల్లింది. అలా ధర్మగ్లాని జరిగినపుడు భగవంతుడు అవతరిస్తాడు. అలా జన్మించిన మహాత్ముడు బుద్ధుడు. ఆయన మహాజ్ఞాని. తపస్సుచేసి జ్ఞానోదయం పొందాడు. రాజభోగాలు, సుఖాలు, సర్వసంపదలు తృణప్రాయంగా త్యజించగలిగాడు. అరణ్యాలకు వెళ్లి, నిర్జన ప్రదేశాలలో యోగం చేశాడు. నిశ్శబ్దంగా తన హృదయంలో అన్వేషించడం ఆయన సాధన. ఆ తపస్సుచేత తనలోని తమస్సును ఛేదించాడు. జ్ఞాని అయి, బుద్ధుడై ఉన్నత విలువలు బోధించాడు. మనిషి 'ఆత్మ' సాధనతో జ్ఞానం పొందే మార్గం కనిపెట్టాడు.

బుద్ధుడు దేవుళ్లను ఆశ్రయించలేదు. దైవశక్తుల్ని వాంఛించ లేదు. దైవపరమైన సిద్ధాంతాలు ప్రవచించ లేదు. మనషికి అవసరమైన ప్రేమ, కరుణ, స్వధర్మం ఆయన బోధించాడు. బుద్ధుని బోధనలు కొన్ని వివరిస్తాను. మీరు వాటిని ఆచరణలో పెట్టవచ్చు. ద్వేషం పనికి రాదు. ఇతరులు నిన్ను ద్వేషిస్తే లక్ష్యపెట్టవద్దు. నీవుగా ఎవరినీ ద్వేషించవద్దు. ద్వేషించిన వారిని ప్రేమించు. వారికి నీ ప్రేమను పంచు. సానుభూతితో వ్యవహరించు. మంచిచెయ్యి ... కరుణ ఒక్కటే అన్ని రుగ్మతలకు దివ్యౌషధం. ప్రపంచంలో అందరికీ పంచ గలిగినంత మంచితనం మనిషిలో ఉంది. మంచి మనస్సుతో మనిషిలోని చెడును నిర్మూలించవచ్చు. నీ మంచితనంతో దుర్మార్గులు మంచివారయ్యేట్లు చేయవచ్చు. నీ సత్యవర్తనంతో వక్రమార్గాన్ని సరిదిద్దవచ్చు. సత్యం దారి తప్పినప్పుడు 'చెడు'గా కనిపిస్తుంది. వక్రించిన సత్యం అకృత్యాలకు నీడనిస్తుంది. చెడుగా ఆలోచించే వారికి, వారి ఆలోచనలు కష్టాలు తెచ్చి పెడతాయి. అన్ని బాధలకు అవే కారణమవుతుంటాయి. బండిలాగే వానిపైనే చక్రం విరిగి పడుతుంది. యుద్ధంలో వేయిమందిని చంపినవానికంటే ఆత్మను జయించినవాడే విజయుడు.

నీకు అపకారం చేసిన వారిని మనస్ఫూర్తిగా క్షమించు. వారికి నీ ప్రేమను పంచు. తర్వాత వారు అపకారం చేయరు. నీ ప్రేమ వారిలోని చెడును తుడిచి వేస్తుంది. ప్రేమ నీకెంత మేలుచేస్తుందో నీ ప్రేమను పంచుకున్న వారికి అంతే మేలుచేస్తుంది.

బుద్ధుని బోధనలు భారతదేశంలో విస్తారంగా ప్రాచుర్యం పొందాయి. అనేకులు వాటిని గ్రంథాలలో పదిల పరచారు. వాటిని చదువు. అవి పరమ సత్యాలు. పరమ ప్రామాణికాలు. ఈజిప్టులో అనేక మార్మికనిధులున్నాయి. నిక్షేపాలున్నాయి. ఇక్కడి దేవాలయాలలో, గ్రంథాలయాలలో అవి భద్రంగా

ఉన్నాయి. దేశదేశాలనుండి జిజ్ఞాసులు వస్తుంటారు. మీ బిడ్డలు పెద్దవారైన తర్వాత, ఈజిప్టు జ్ఞాన భాండారాన్ని పరిచయం చేయండి".

మరొకనాడు సలోమీ సంభాషించింది :

"సూర్యుడిని చూస్తాం. ఏమనిపిస్తుంది? భగవంతుని శక్తి, వర్చస్సు అన్నీ సూర్యకాంతిలో ఉన్నట్లు అనిపిస్తుంది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు భగవంతుని ప్రతినిధులు. వీటి ద్వారా భగవంతుడు మనతో సంభాషిస్తాడు. పర్వతాలు, నదీనదాలు, అరణ్యాలు, ప్రకృతి అందాలు ... వీటిని చూచినా మనకు భగవంతుని అనంతశక్తి బోధపడుతుంది. గాలి కెరటాలలో, నీటి అలల్లో భగవంతుని స్పర్శ తెలుస్తుంది. సెలయేటి సవ్వడిలో నిశ్శబ్దాన్ని అనుభూతిస్తే భగవంతుని లీలలు తెలుస్తాయి. మేఘాలు, ఉరుములు దేవుని కల్పనలు. మనం శిరస్సు వంచి వినమ్రంగా ఉంటే ప్రకృతి మనకు అన్నివిధాల సహకరిస్తుంది. ప్రకృతిలోనే భగవంతుని విశ్వరూపం దర్శించవచ్చు. హృదయాన్ని విప్పి సమర్పించుకోవడమే అసలైన ప్రార్థన. పెద్ద పెద్ద మాటలతో స్తుతించడం ప్రార్థన కాదు. అరవడం ఆరాధన కాదు. దేవుని మనం మాటలతో భూషించనవసరం లేదు. మౌనంగా ధ్యానిస్తే చాలు. ఆయన శక్తిని, ప్రేమను మనం నిత్యం శ్లాఘించనవసరం లేదు. శూన్యంలో లీనమైతే భగవంతునిలో తన్మయమైనట్లే.

"ధ్యానం అన్నది సత్‌సంకల్పం. జీవితంలోని ప్రతిభాగాన్ని శుద్ధిపరచడం ధ్యానప్రక్రియ. ప్రతి పనిని అర్థవంతం చేసేది ప్రార్థన ... మన ధ్యానంవల్ల ప్రతి జీవి, ప్రతి ప్రాణి స్పందన పొందగలగాలి. ఆనందించ గలగాలి. ఒక సత్కార్యం ఒక మంచిమాట. సత్సంకల్పం 'ధ్యానం' అంతటి విలువకలది ధ్యానం. జరిగేది హృదయంలో. హృదయంలోపలి భావన ప్రార్థన కావాలి. భాషతో నిమిత్తం లేదు. భాష అవసరం లేదు ధ్యానానికి. హృదయం ప్రేమతో నిండినప్పుడు ప్రార్థనకు పూర్ణత్వం లభిస్తుంది. ప్రయోజనం ఉంటుంది".

కొంతసేపు అందరు మౌనంగా ధ్యానం చేశారు.

ఎలిహు తన హితబోధ ప్రారంభించాడు. మేరీ, ఎలిజబత్‌లు హృదయంతో వినసాగారు :

"చాలా రోజులుగా, చాలా విషయాలు చెప్పుకుంటున్నాం. నేటితో మీ విద్యార్థిదశ అయిపోయింది. పైనుండి పిలుపు వినిపిస్తోంది. ఇంక మీరు ప్రయాణానికి సిద్ధం కావాలి. మార్గం శుభ్రంగా ఉంది. మీరు మీమీ స్వదేశాలకు వెళ్లిపోవచ్చు. మీరు నిర్వహించవలసిన మహత్కార్యాలు చాలా ఉన్నాయి.

ప్రపంచానికి మార్గదర్శకులయ్యే వారిని మీరు తీర్చిదిద్దాలి. శిక్షణ యివ్వాలి. అప్పుడే మీ బిడ్డలు ఆ పనిని సమర్ధంగా నిర్వహించగలుగుతారు. మనిషిని పాపకర్మల నుండి విముక్తం చేయడం, సుఖభోగాలకు దూరం చేయడం, భ్రమలను తొలగించడం, దివ్యసంకల్పం కలిగించడం – మీ కర్తవ్యం. ఆమహాత్కార్య నిర్వహణలో మీ బిడ్డలు చాలా కష్టాలు పడవలసి వస్తుంది. ముళ్ల బాటలలో నడవవలసి ఉంటుంది. ప్రలోభాలను ఎదుర్కొనక తప్పదు. అందరివలె సుఖంగా జీవించడం కుదరదు. బరువులు తలకెత్తుకోవలసి వస్తుంది. అకారణంగా అవమానాలు, నిందలు భరిస్తారు. బందీలవుతారు. అయితే అద్భుతాలు, మహత్తులు ప్రదర్శిస్తారు. వారికి భగవంతుని రక్షణ ఎప్పుడూ ఉంటుంది".

ఎలిహు, సలోమి జీవిత పాఠాలు నేర్పడం పూర్తయింది. మూడు సంవత్సరాలు మేరి, ఎలిజబత్‌లు అక్కడ విద్యాభ్యాసం చేసినట్లయింది. మేరి, ఎలిజబత్, జోసెఫ్ ఇద్దరు పిల్లలతో బయలుదేరారు. అయితే వారు జెరూసలెం దారిని వెళ్లలేదు. అక్కడ ఆర్కిలస్ దుష్టపాలన సాగుతోంది. సముద్ర మార్గాన 'ఎన్‌గెడి' పర్వత ప్రాంతం చేరి, జాషువా అనే బంధువు ఇంట కొంత కాలం ఉన్నారు. ఎలిజబత్ జాన్‌తో అక్కడ ఉండిపోయింది. జోసెఫ్, మేరీ జీసస్‌లతో జోర్డాన్ వైపు బయలుదేరి కొన్ని రోజులకు నజరత్ చేరుకున్నారు.

◆ ◆ ◆

# 3. జాన్ ప్రబంధం

(1) ఎలిజబత్ జాన్ ఆలన పాలన చూచుకుంటూ ఒంటరిగా బ్రతుకుతోంది. ఏ సంపదలు, సుఖాలు లేకపోయినా జాన్ ఆటపాటల్లో ఆనందం, మనశ్శాంతి లభిస్తున్నాయి. ఎలిహూ, సలోమి వద్ద నేర్చిన జీవిత సత్యాలను జాన్‌కు కధలుగా చెబుతుంది. కొండలు, గుహలు, వాగులు, వంకలు ఆమె నేస్తాలు. అవే జాన్ విహార భూములు. ప్రకృతి అతని విశ్వవిద్యాలయం. అతనికి దివ్య సందేశాలు గాలి తరంగాలలో వినిపిస్తాయి. ప్రకృతి అందాలలో కనిపిస్తాయి. నీటి అలలపై తేలుతూ వస్తాయి. అక్కడి కొండలలో లెక్కలేనన్ని గుహలు. అవి నిశ్శబ్దంగా, తపస్సు చేసుకుంటున్న రుషుల్లా ఉంటాయి. ఆ కొండగుహల్లో ఎందరో తాపసులున్నారు. యోగులున్నారు. మహాత్ములున్నారు. ఒక గుహలో ఎన్గెడి రుషి నివశిస్తున్నాడు. అది జాన్ ఉండే గుహకు దగ్గర. ఎన్గెడి రుషి ఈజిప్టుకు చెందినవాడు. మధెనో జాతివాడు. అయనకు సకారా దేవాలయానికి సంబంధం ఉంది.

జాన్‌కు ఏడుసంవత్సరాల వయస్సు. మధెనో అతనిని వెంటతీసుకొని వెళ్లి, డేవిడ్‌తో కలిశాడు. మధెనో మహాజ్ఞాని. చక్కగా బోధిస్తాడు. అతని బోధనా పద్ధతి జాన్‌కు నచ్చింది. మనస్సుపెట్టి ఆయన మాటలు వినేవాడు. హృదయంలో పదిలంగా దాచుకునేవాడు. క్రమంగా మధెనోను తన గురువుగా, మార్గదర్శిగా భావించసాగాడు. మధెనో ఈ చిన్ని శిష్యునికి పెద్ద విషయాలు బోధించడానికి వెనుకాడేవాడు కాదు. జాన్‌కు పర్వత నివాసమన్నా, పర్వత గుహలన్నా ఇష్టం. గురువులాగ తనూ నిరాడంబరంగా జీవించేవాడు. పళ్లు, దుంపలు, కాయలు అతని ఆహారం .... సాత్వికాహారం అన్నా, సౌమ్యజీవనం అన్నా ఇష్టం.

మధెనో యూదుల పండుగలకు, ఉత్సవాలకు జెరూసలెం వెడుతుండేవాడు. జాన్‌కు తొమ్మిది సంవత్సరాల వయస్సులో జెరూసలెంలో జరిగే ఒక ఉత్సవానికి వెంట తీసుకొని వెళ్లాడు. అది ఆర్కెలస్ రాజ్యమని జాన్‌కు తెలుసు. అతను

పరమ దుర్మార్గుడని విన్నాడు. అయినా జంకలేదు. ఆర్కెలస్ దుర్మార్గం భరించలేని ప్రజలు అతనిని బహిష్కరించారు. జెరూసలెం యాత్ర జాన్‌కు నచ్చింది. గురువు మధెనో ముందుగానే అక్కడి పద్ధతులు, ఆచారాలు, సంప్రదాయాలు వివరించి చెప్పాడు. అక్కడ దేవతా విగ్రహాలకు బలులిచ్చే పద్ధతి ఉందని చెప్పాడు. చేసిన పాపాలు జంతుబలులవల్ల ఏ విధంగా పోతాయో జాన్‌కు అర్థం కాలేదు. జంతువుల్ని, పక్షుల్ని దేవుని ముందు చంపి కాల్చుకు తినడం హీనాతిహీనం అనుకున్నాడు. గురువుగారిని ప్రశ్నించాడు.

మధెనా చెప్పాడు : "దేవుడు మనిషికి కనిపించడు. తనకు పక్షుల్ని జంతువుల్ని బలియిమ్మని కోరడు. బలి ఇచ్చే ఆచారం ఇతర దేశాలనుండి అంది పుచ్చుకున్నది. కొన్ని దేశాలలో విగ్రహపూజలు చేస్తారు. దేవుళ్ల తృప్తికోసం జంతువుల్ని బలియిస్తుంటారు. నిజమే. బలులివ్వడం వల్ల మనుషులు చేసిన పాపాలు నశించవు. మనిషిలోని పశు లక్షణాలు, క్రూరత్వమే ఆ పాపకార్యాలను ప్రోత్సహిస్తుంది. పాపాలు నశించాలంటే మనిషి సౌమ్యంగా జీవించాలి. పాపపు పనులు చేయకూడదు. మన హృదయాన్ని ప్రేమతో, కరుణతో నింపుకుంటే 'పాపం' అంటే ప్రసక్తే ఉండదు. ప్రేమ అన్ని లోపాలను పరిష్కరిస్తుంది. ప్రజల హృదయాలను ప్రేమతో నింపడమే ప్రయోక్త తొలికర్తవ్యం. మహాత్ముల ప్రధాన ఆశయం అదే".

"క్షమ అంటే ఏమిటి గురూజీ?" జాన్ ఆసక్తిగా ప్రశ్నించాడు.

"రుణ విముక్తి చెందడం. మనిషి చేసిన అప్పు తీర్చుకోవడం. తప్పులు తెలుసుకోవడం. ఒక మనిషి మరొక మనిషికి చేసిన ద్రోహానికి నిష్కృతి లేదు. ఆ చేసిన తప్పును సరిదిద్దుకోవడమే క్షమ. అదే క్షమాగుణం.

"అయినప్పుడు ఒకరిని మరొకరు క్షమించడం ఉండదు కదా. ఎవరు చేసిన తప్పులు వారే సరిదిద్దుకోవాలి. అంటే ప్రతిమనిషిలో క్షమాప్రవృత్తి ఉన్నట్లే కదా!

"మనిషి తనను తాను శపించుకోగలడు, క్షమించుకోగలడు. ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. తనను తాను గమనించడం ఒక్కటే మార్గం. సన్మార్గంలో పయనిస్తే పాపాలు నశించిపోతాయి. అదే క్షమ అంటే".

గురుశిష్యులిరువురు ప్రాచీన గ్రంథాల గురించి, గ్రంథస్థ విజ్ఞానం గురించి చర్చించుకున్నారు. వాటిలో నిక్షిప్తమై ఉన్న విషయ నిగూఢతను తలపోశారు. జాన్ అడిగాడు : "మహాత్మా! ఇవన్నీ ప్రామాణిక సత్యాలే కదా. ఇంక వేరే గ్రంథాలు చదవవలసిన అవసరం ఏముంది?"

మథెనో అన్నాడు! "భగవంతుడు అంటే పరమాత్మ. అది సత్యం. మిగిలిన వన్నీ కాలానుగుణంగా ఒక్కొక్కటిగా పైకొస్తాయి. ఒక్కొక్కటిగా అంతరిస్తుంది. ఈ అవతార, నిష్క్రమణలు భగవంతుని అధీనంలో ఉంటాయి. ఏ ఒక్కటి అన్ని కాలాలకు వర్తించదు. శాశ్వతంగా నిలిచి ఉండదు. కాలం మారుతుంది. కాలంతో పాటు ఇవీ మారుతుంటాయి. సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. చంద్రుడు ఉదయిస్తాడు. చంద్రునికి వృద్ధి క్షీణతలున్నాయి. సూర్యుని వేడిమికి హెచ్చు తగ్గులున్నాయి. అలానే నక్షత్రాలు పుడుతుంటాయి నశిస్తుంటాయి. వర్షం కురుస్తుంది. గాలులు వీస్తాయి. రుతువులు మారుతుంటాయి. అది ఋతు ధర్మం. ఇది కాల ధర్మం. మనుషులు పుడుతుంటారు, చస్తుంటారు. అది జీవధర్మం. జాతులు వెలుస్తుంటాయి, నిష్క్రమిస్తుంటాయి. ఒక దేశంలో ఒక సంస్కృతి నాగరికత పెరిగి, పతన మవుతుంది. వాటి అవసరం తీరిన తర్వాత ఏ సంస్కృతి మిగిలి ఉండదు. కాలగర్భంలో కలిసి పోతుంది.

ఏ దేశచరిత్ర చూచినా అనేకానేక సంఘటనలు కనిపిస్తాయి. ఏ జాతి చరిత్ర చదివినా, ఉత్థాన పతనాలు కనిపిస్తాయి. చివరికి నిలిచేది 'సత్యం' ఒక్కటే. అలా నిలవకలిగిందే సత్యం. భగవంతుడు మనిషిని ఒక మహత్తర ప్రయోజనం కోసం సృష్టించాడు. మనిషి స్వతంత్రుడే కాని సంపూర్ణుడు కాదు. సర్వశక్తి సమన్వితుడు కాదు. దైవత్వం వచ్చి కలిస్తే మనిషి పూర్ణమానవుడవుతాడు. కష్టాల కొలిమిలో కాలినప్పుడే పూర్ణప్రజ్ఞ భాసిస్తుంది. మనిషి యంత్రంగా మారకూడదు. కష్టాలవేడికి కనలకూడదు. సృజనశక్తిగల మహాత్ములు మనిషికి అండగా ఉంటాయి. మనిషి సంకల్పానికి బలాన్నిస్తాయి. మనిషి స్వతంత్రంగా నిర్ణయించుకోవచ్చు. స్వతంత్రంగా ఎదగవచ్చు. స్వకృషి తోనే మనిషి మహాత్ముడవుతాడు. లేదా అధః పాతాళానికి క్రుంగిపోతాడు. తను సంకల్పిస్తే మహాశక్తివంతుడు కాగలడు. అన్ని ప్రతిఘటనల్ని అధిగమించి లక్ష్యాన్ని చేరగలడు. శ్రమించని వానికి ఫలితం దక్కదు. సోమరితనంతో విజయం సాధించడం కుదరదు. మనిషి తన సమస్యల్ని తానే పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలి. గమ్యం వైపుగా పురోగమించాలి.

"మనిషి ప్రమాదాల్లోంచి నడుస్తుంటాడు. లోపల, బయట శత్రువులుంటారు. అంతశ్శత్రువుల్ని జయించడం మరీకష్టం. మనిషి ఏకాకి, ఒంటరిగా, తనలో తను జీవిస్తాడు. తానే ఖడ్గం, తానే కవచం. పరమాత్మ సేవలో మార్గం కనిపిస్తుంది. నడిచే బాటలో వెలుగు కనిపిస్తుంది. కోరుకుంటే సదా మనిషికి భగవంతుని సహాయం లభిస్తుంది. మార్గదర్శకత్వం లభిస్తుంది. అయినా ప్రయాణం ఒంటరిగనే. మనిషి చేతిలో ఎప్పుడూ ఒక దివ్వె ఉంటుంది. అది వెలిగించుకోకుండా చీకటిలో

ప్రయాణం సాగిస్తాడు. దివ్వె వెలిగించుకుంటే ప్రమాదాలు దాటటం సులభం. బాటలో ఎత్తు పల్లాలు తెలుస్తాయి. లేకుంటే చిన్న గుంటలో పడ్డా కాళ్లు విరుగుతాయి. మనిషికి ఎప్పుడూ ఒక 'మహాత్మ' అండగా ఉంటుంది. అదనపు శక్తి ఆ మహాత్మనే.

"వేద కాలానికి ముందర చాలా మత గ్రంధాలు, పవిత్ర గ్రంధాలు ఉండేవి. అవి మనిషికి మార్గ నిర్దేశకత్వం చేసేవి. బ్రతుకు బాటలో వెలుగు చూపించేవి. మనిషికి మరింత విజ్ఞానం అవసరమైంది. అప్పుడే వేదాలు, అవెస్తా, టావో రచనలు వెలుగులోకి వచ్చాయి. అవి మనిషి మనస్సును మరింత పదును పెట్టాయి. ఒక కాలంలో మనిషికి జ్ఞానం కలిగించడానికి హీబ్రూబైబిల్, ధర్మపన్నాలు ఆవిష్కరించబడ్డాయి. కాలం గడుస్తున్న కొద్దీ పాతవాటికి కాలదోషం పట్టింది. కొత్తజ్ఞానం అవసరమయింది. ఇప్పుడు మరో జ్ఞాన నక్షత్రం బయట పడ్డది. మరో వెలుగుతార ఆకాశంలో తళుకొత్తింది. జీసస్ ఆ నక్షత్రం. జీసస్ రంగంమీదికి రావడానికి నీ సహకారం అవసరం. నీవు ప్రయోక్తవు, అతను ప్రవక్త. వైతాళికుడవై నీవు జనగణాన్ని నిద్రమేల్కొల్పాలి. నీవే ఆ ప్రవక్తకు స్వాగతం పలకాలి. రానున్న కాలంలో మనిషి జ్ఞానం ఉన్నతశిఖరాలకు చేరుకుంటుంది. మరిన్ని జ్ఞాన నక్షత్రాలు ఆకాశ వీధుల్లో దర్శనమిస్తాయి. చివరకు 'పరబ్రహ్మ' తానుగా జన్మించి మనిషిని మృత్యుంజయుని చేయగలడు. అప్పుడు మనిషి సంపూర్ణ మానవుడు, దివ్యుడు అవుతాడు. మృత్యుంజయు డవుతాడు.

**2** జాన్‌కు పన్నెండు సంత్సరాల వయస్సులో తల్లి కాలం చేసింది. ఇరుగు పొరుగు వారు అమె భౌతిక కాయాన్ని హెబ్రాన్ శ్మశాన వాటికలో జకరయా సమాధి ప్రక్కనే సమాధి చేశారు. జాన్ తనకున్న ఒకే ఒక్క ఆత్మబంధువు తల్లి మరణానికి దుఃఖించాడు. మథెనో జాన్‌ను శాంతింప చేశాడు!

"మరణానికి విలపించడం వివేక లక్షణం కాదు. జ్ఞానం తెలిసిన వారెవరూ చావుకు భయపడరు. మరణానికి దిగులుపడి క్రుంగిపోరు. మనిషికి మరణం శత్రువు కాదు. నిజానికి మంచి మిత్రుడు. మనిషి జీవితంలో తను చేయవలసిన పని ఇంక లేనపుడు మరణం సంభవిస్తుంది. అది సహజం. మనిషి అనే పడవను భూమితో కట్టి ఉంచిన తాడు తెగిపోతుంది. తర్వాత పడవ నిశ్చల సాగరంపైన అనంత తీరాలకు పయనిస్తుంది".

"కన్న తల్లి ఋణం తీర్చలేనిది. తల్లి ప్రేమ విలువ కట్టలేనిది. నీ బాధ నేను అర్థం చేసుకోగలను. ఆమె తన కర్తవ్యం నిర్వహించేవరకు భగవంతుని

పిలుపు రాలేదు. మంచివారిని మృత్యువు తొందరపడి ముందే ఆహ్వానిస్తుంది. అదే విచిత్రం. మన సమస్యలు ఒక జీవిత కాలంలో పరిష్కారం కావు. మరణం అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది. అలా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించడానికే మనిషి మరణిస్తుంటాడు. చనిపోయిన వారిని తిరిగి భూమిపై ఆహ్వానించడం మన స్వార్థం. మీ అమ్మగారి ఆత్మను ప్రశాంతంగా ఉండనివ్వు. ఆమె జీవితం నీకు ఆదర్శంగా మలచుకో. ఆమె నీకు మార్గదర్శకం. ఇప్పుడు నీ జీవితం ఒక మలుపు తిరుగుతుంది. ఇది క్లిష్టమైన మలుపు. నీవు నిర్వహించ వలసిన బాధ్యతలు తెలిసి వస్తాయి. మీ అమ్మ నీ ఆత్మ ద్వారా ప్రబోధిస్తుంది. ఎందరో మహర్షులు నిన్ను గమనిస్తున్నారు.

"నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి మార్గం చూపే వ్యక్తి అటు ఇటు పరుగు తీయనవసరం లేదు. ఎందరికైనా మార్గం నిర్దేశించవచ్చు. కాలం రహదారి పైన నీ పాద ముద్రలు కనిపించాలి. పవిత్ర జీవనం వల్ల పాపక్షయం అవుతుందని నీవు నిరూపించాలి. ఇదే మార్గమని, ఇదే ఏకైక మార్గమని చెప్పవద్దు. నీవు చేసింది జనం నమ్మాలి. అప్పుడు నిన్ను అనుసరిస్తారు".

జోర్డాన్ నదిలో స్నానం చేయించి, పర్వతాలపైకి తీసుకువెళ్లి 'ఉపదేశం' యిచ్చిన తర్వాత ఇద్దరూ ఈజిప్టుకు బయలుదేరారు. నైల్‌నదీ లోయలోని 'సకారా' దేవాలయం చేరేవరకు వారు విశ్రమించలేదు. మధెనో చాలా సంవత్సరాలు ఆ దేవాలయంలో పూజారి. అక్కడ ఉన్న వారికి జాన్‌ను పరిచయం చేశాడు.

పద్ధెనిమిది సంవత్సరాలు జాన్ ఆ దేవాలయాన్ని విడిచి పెట్టలేదు. అప్పటికి అతనిలో ఆత్మజ్ఞానం కలిగింది. తన కర్తవ్యం తెలుసుకున్నాడు. ఆత్మ దర్శనం పొందాడు.

◆ ◆ ◆

# 4. జీసస్ బాల్యం

(1) నజరత్‌లో మార్మియన్ ప్రాంతంలో జోసెఫ్ నివాసం. మేరీ తాను ఎలిహు, సలోమీల వద్ద అధ్యయనం చేసిన విషయాలను జీసస్‌కు బోధించసాగింది. జీసస్‌కు వేదపాఠాల పట్ల ఆసక్తి ఎక్కువైంది. అవెస్తా బోధనలు బాగా నచ్చాయి. డేవిడ్ తాత్వికత ఒంట పట్టింది. సాల్మన్ జ్ఞానసంపదను అధ్యయనం చేశాడు. యూదుల గ్రంథాలలోని మార్మికతను జీర్ణించుకున్నాడు. అన్నింటినీ తులనాత్మకంగా పరిశీలించసాగాడు. ఏడు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి పుస్తకాలు చదవనవసరం కనిపించలేదు. అన్ని విషయాలు తనకు పూర్వం పరిచయం అయినట్లే ఉండేవి. చదివినదంతా మనస్సు పొరల్లోకి చేరిపోయింది. ప్రతిమాట, ప్రతిభావం మనస్సు నమోదు చేసుకున్నది.

జీసస్ తాతగారు జోవాచిమ్ జీసస్ పుట్టినరోజు పండుగ చేశాడు. ఆ విందుకు పెద్దల్ని, బంధువుల్ని, సంపన్నుల్ని ఆహ్వానించాడు. జీసస్‌ను పరిచయం చేయాలని, అతని ప్రతిభను అందరికీ ఎరుక పరచాలని ఆయన ప్రయత్నం. ఆహుతులను ఉద్దేశించి జీసస్ అన్నాడు :

"నాకొక చిత్రమైన కల వచ్చింది. నేను సముద్ర తీరంలో ఉన్నాను. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సముద్ర గర్భంలో ఏదో తుఫాను వచ్చినట్లు, సముద్రం కలవరపడుతోంది. పైనుండి ఎవరో మహాత్ముడు నా చేతికి ఒక మంత్రదండం అందించాడు. నేను ఆ కర్రను నేలపైన తాటించాను. అద్భుతం. ఆశ్చర్యం. ఒక్కసారిగా తుఫాను కల్లోలం తగ్గింది. అలల ఉధృతి తగ్గింది. నేను నీళ్లపైన నడిచాను. నా పాదాలకు నీరు తగలగానే సముద్ర తీరం అంతా పచ్చని చెట్లతో ఆనందవనంగా మారింది. చెట్ల నిండుగా పూలు, పళ్లు. ఎంతో సుందరవనంగా మారింది. గొప్ప సంగీతం వినిపించింది. ఎక్కడి నుండో భక్తిగీతాలు పారవశ్యంతో పాడుతున్నట్లయింది. మృత్యువు లేదు. మరణం లేదు. సృష్టి అంతా ప్రాణమయం, ప్రాణప్రదం అని వినిపించింది నా చెవులకు".

జీసస్ అమ్మమ్మ 'అన్నా' ఆ కథ విని ఎంతో సంతోషించింది. జీసస్‌ను చేతుల్లోకి తీసుకుని ముద్దాడింది. తలపైన ప్రేమగా నిమురుతూ అన్నది : "అవును కన్నా, నీవు మహాసాగరతీరం లోనే ఉన్నావు. నీ పాదస్పర్శతో సముద్రమే పరవశించింది. ప్రకృతి పులకించి సుందరవనంగా మారింది. నీ స్పర్శకు జలకణాలు, గాలి తరగలు పులకించాయి. అదే దాని అర్థం. నాకు తెలుసు.

"జీవన సముద్రం దిగంతాల వరకు వ్యాపించి ఉంటుంది. అందులో తుఫానులు, ఉప్పెనలు ఉంటాయి. వాటితో పోల్చితే మానవ జీవితం ఒక రేణువు. మన జీవితాలన్నీ రేణువులే. సత్యం, ప్రేమ అనే మంత్రదండంతో నీవు సాగరతీరాన్ని స్పృశించావు. అంటే నీవు మానవ హృదయాల్ని స్పృశించి పులకింప చేస్తావు. ప్రతి ఒక్కరికి నీ తేజస్సు అందుతుంది. నిన్ను స్మరిస్తారు. జీవన సాగరాన్ని నీ పాదాలతో పునీతం చేస్తావు. కల్లోలం సమసిపోతుంది. ప్రపంచంలో నీ వల్ల శాంతి నెలకొంటుంది."

"జోవాచిమ్ అన్నాడు బాబూ జీసస్. పుట్టిన రోజు కానుకగా ఏం కావాలో కోరుకో".

జీసస్ : "నాకు బహుమతులు, కానుకలు వద్దు తాతగారూ. నాకు ప్రపంచంలో ఏదీ అవసరం అనిపించదు. నా ఈడు పిల్లల మొహాలపై ఆనందం చూడాలని ఉంది. అందరినీ విందుకు పిలిపించండి. నాకదే ఆనందం".

జోవాచిమ్ : "నీవే వెళ్లి పిలుచుకురా, ఈలోగా అందరికీ భోజనం ఏర్పాటు చేద్దాం".

జీసస్ బయటకు పరుగెత్తి ప్రతి ఇల్లు, గుడిసె గాలించి, పిల్లలందరినీ పిలుచుకు వచ్చాడు. మొత్తం మీద అరవైమంది పిల్లలు దొరికారు ..... జీసస్ స్వయంగా పిల్లలందరికీ వడ్డించాడు. వారి కళ్లలోని వెలుగులు చూచి తను ఆనందించాడు.

(2) నజరత్ దేవాలయానికి చెందిన రబ్బీ బరాకియా జీసస్‌కు విద్య బోధించడంలో మేరీకి సహాయంగా ఉంటున్నాడు. ఒకనాడు దేవాలయంలో పూజా కార్యక్రమం అయిన తరువాత రబ్బీ జీసస్ దగ్గరకు వచ్చాడు. జీసస్ కళ్లు మూసుకుని, ధ్యానంలో ఉన్నాడు. ఆయన జీసస్‌ను తట్టిలేపి ప్రశ్నించాడు.

"జీసస్! పది నిబంధనల్లో (టెన్ కమాండ్‌మెంట్స్) ముఖ్యమైంది ఏది?"

జీసస్. "ఒకటి ప్రధానం అయితే, మిగిలినవి అప్రధానం అవుతాయి. అన్నీ ముఖ్యమైనసూత్రాలే. అన్నింటినీ 'ప్రేమ' అనే దారంతో ముడివేశారు.

మొత్తం పది సూత్రాలలో ప్రతి దానిలోనూ 'ప్రేమ' ఉంది. ప్రేమతో నిండిన మనిషి భగవంతుని ధ్యానిస్తాడు తప్ప సూత్రాల్ని జపించడు. ప్రేమే భగవంతుడు. ప్రేమించే వ్యక్తి హింసకు పాల్పడడు. ఎవరినీ ద్వేషించడు. అబద్ధం చెప్పడు. అతనిలో పిరికితనం ఉండదు. ప్రతి మనిషిలో భగవదంశను చూస్తాడు. ప్రేమించే వారికి సూత్రాలతో, సిద్ధాంతాలతో పని లేదు".

రబ్బీ బరాచియా ప్రశ్నించాడు : "నీ మాటల్లో పూర్ణత్వం, ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నాయి. నీవి సత్యవాక్కులు. నీ కీ సత్యాలు ఎలా తెలుస్తాయి జీసస్?"

జీసస్ : తెలుస్తాయి అంతే. ఏ గురువు వాటిని నాకు బోధించిన జ్ఞాపకం లేదు. నా దృష్టిలో 'సత్యం' దాచేస్తే దాగనిది. అన్వేషించే వారికి 'సత్యం' ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుంది. సత్యమందిరం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. సత్యం ఏ ఒక్కరి సొంతం కాదు. అన్ని చోట్ల, అన్ని కాలాల్లో, అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుంది సత్యం. మన మనస్సులోని మూసిన కిటికీ రెక్కలు తెరిస్తే చాలు సత్యపవనాలు లోపల ప్రవేశిస్తాయి. ఏ కాస్త అవకాశం చిక్కినా సత్యం అక్కడ స్థిరంగా ఉండిపోతుంది.

రబ్బీ : నిజమే జీసస్ ... నీ వన్నది నిజం. కాని, కిటికీ తలుపులు తెరవడానికి బలమైన చేతులు అవసరం. ఆ చేతులకు శక్తి ఉండాలి. మనస్సుకున్న తలుపులు తెరిచే దెవరు? ఎవరైనా తెరిస్తే కదా, సత్యం ప్రవేశించ వీలవుతుంది?

జీసస్ : అందుకు ప్రేమ ఒక్కటే చాలునని నా అభిప్రాయం. మూసుకు పోయిన ఎన్ని తలుపులైనా ప్రేమతో తెరవవీలుంది. ప్రేమను మించినది మరొకటి లేదు.

ఒకనాటి సాయంవేళ ఏకాంతంగా ఉన్నప్పుడు జీసస్ తల్లితో అన్నాడు : "మన రబ్బీ మహాశయుడు భగవంతుడు పక్షపాతంగా వ్యవహరిస్తున్నాడన్నట్లు భావిస్తున్నాడమ్మా. అందరూ దేవుని బిడ్డలే అయినపుడు, దేవుడికి పక్షపాతం ఎందుకుంటుంది? భగవంతుడు యూదులనే ఎక్కువగా ఇష్టపడతాడని, మిగిలిన వారిని చిన్నచూపు చూస్తాడని రబ్బీ అభిప్రాయమా? అలా పక్షపాతం చూపిస్తే దేవుడు కొందరికి అన్యాయం చేసినట్లు అవుతుంది. సమరిటన్‌లు, యూదులు, గ్రీకులు, రోమనులు, అందరూ భగవంతుని బిడ్డలే కదా! అందరూ ఆయనకు సమానులే. సమాన ప్రీతిపాత్రులే. నాకు అనిపిస్తోంది యూదులు తమ చుట్టూ పిచ్చి నమ్మకాలతో గోడలు కట్టుకున్నారని. గోడ అవతల ఏమి ఉందో ఏం జరుగుతుందో తెలుసుకోడానికి ఇష్టపడరు. తమకు తెలిసిందే మహాజ్ఞానమని వీరిభావన. వీరి అజ్ఞానం తొలగించాలి. భగవంతుడు తమని అభిమానించినట్లే

అందరినీ అభిమానిస్తాడని తెలియచేయాలి. ఇతర దేశాలలో ఎందరో మహర్షులు, జ్ఞానులు ఉంటారు. వారిని కలవాలి. వారి జ్ఞానాన్ని పంచుకోవాలి. ప్రపంచ మంతటినీ ప్రేమించాలి".

(3) జెరూసలెంలో వార్షికోత్సవాల సంబరం మొదలైంది. జోసెఫ్ మేరీలు జీసస్‌ను తీసుకుని జెరూసలెం చేరుకున్నారు. వారితో కలిసి బంధువులు వెళ్లారు. అప్పుడు జీసస్ పది సంవత్సరాల పసివాడు. ఉత్సవాలలో గొర్రెల్ని పక్షుల్ని దేవునికి బలివ్వడం, కాల్చితినడం జీసస్‌కు బాధ అనిపించింది. ఆ క్రూరత్వానికి అతని లేత హృదయం కలత చెందింది. అక్కడ పూజారిని ప్రశ్నించాడు.

"జంతువుల్ని, పక్షుల్ని చంపడం ఎందుకు? దేవుని పేరు చెప్పి వాటిని కాల్చుకు తినడం ఎందుకు?"

పూజారి అన్నాడు : ఇది సనాతన ధర్మం, ఆచారం. మనం చేసిన పాపాలు తొలగిపోవాలంటే దేవునికి బలులివ్వాలి. భగవంతుడే ఈ బలులు ఇమ్మని ఆదేశిస్తాడు.

జీసస్ ఎదురు ప్రశ్నించాడు : ఇతర త్యాగాలు దేవునికి తృప్తి కలిగించవా? దేవిడ్ ప్రభువు ఏం చెప్పాడు? పాపాలు నశించడానికి బలులు ఇవ్వనవసరం లేదని చెప్పాడు కదా! అసలు ఇలా మరొక ప్రాణిని హింసించడం, చంపడం ఒక పాపం.

పూజారి అన్నాడు : బాబూ, నీవింకా పసివాడివి. నీకు ఆచారాల విలువ, సంప్రదాయాల మహిమ తెలియవు. అది దేవిడ్ ప్రవచనం కాదు, నీ స్వంత ప్రవచనం. ఇజ్రాయిల్ మతాధికారుల కన్న నీకు ఎక్కువ తెలుసునా? నీలాంటి కుర్రాళ్లతో వాదించడం అనవసరం. నీ మాటలు ఇక్కడ ఎవరూ వినరు.

అతని మాటలు జీసస్‌కు తృప్తి కలిగించలేదు. అసహనంగా హిల్లెల్ వద్దకు వెళ్లాడు. హిల్లెల్ 'సన్ హెడ్రిన్' ప్రధానాధికారి. ఆయనను జీసస్ ప్రశ్నించాడు.

"రబ్బోనీ, నేను మీతో కొంచెం మాట్లాడాలి. ఇక్కడి ఆచారాలు నాకు నచ్చలేదు. దేవాలయం అంటే పవిత్రంగా ఉండాలి. ప్రేమ, దయ, కరుణ కనిపించాలి. ఇక్కడ జరిగే బలులు మీకు తెలియవా? భగవంతుడు ఇంతటి అమానుషత్వాన్ని భరించడు. మీరు జ్ఞానులు. చెప్పండి ఏదీ భగవంతుడు".

హిల్లెల్ జీసస్‌కు సూటిగా సమాధానం చెప్పలేకపోయాడు. అయినా జీసస్ పట్ల అతనికి సానుభూతి కలిగింది. జీసస్ కన్నీటికి అతను కరిగిపోయాడు.

"బాబూ, భగవంతుడు ప్రేమ పూర్ణుడే. నాతో రా, ఇద్దరం కలిసి, ప్రేమ స్వరూపి అయిన దేవుని అన్వేషిద్దాం" అన్నాడు.

జీసస్ అన్నాడు : ఎక్కడికి పోతారు? అన్నిచోట్ల భగవంతుడు ఉంటాడు. మన హృదయాలు నిర్మలం, నిష్కల్మషం చేసుకుంటే ఇక్కడే భగవంతుడుంటాడు.

జీసస్ మాటలకు రబ్బీలో కాస్త కదలిక కలిగింది. ఆ పసివాని ముందు సిగ్గుతో తలదించుకున్నాడు. "ఇతను సామాన్యుడు కాదు. భగవంతుడే ఈ బాలకుని రూపంలో అవతరించాడు" అనుకున్నాడు.

జీసస్ తల్లిదండ్రుల్ని కలుసుకుని, జీసస్‌ను తనతో ఉండనిమ్మని కోరాడు. ఆనాటి నుండి జెరూసలెం ఆలయం జీసస్‌కు నివాసం అయింది. హిల్లెల్ ప్రతిరోజు జీసస్‌కు తమ ప్రాచీన విజ్ఞానం బోధించసాగాడు. కొంతకాలం తర్వాత నజరత్‌కు తిరిగి వెళ్లి, తండ్రికి పనిలో సాయం చేయసాగాడు.

(4) జెరూసలెంలో మళ్లీ సంవత్సరం ఉత్సవాలకు జోసెఫ్, మేరీ, జీసస్‌లు హాజరైనారు. అప్పుడు జీసస్ వయస్సు పన్నెండు సంవత్సరాలు. ఉత్సవాలకు అనేక దేశాలవారు, మతాలవారు వచ్చారు. పట్టణం జనంతో కిటకిటలాడింది. దేవాలయ ప్రాంగణం పెద్దలతో, ఉద్యోగులతో కోలాహలంగా ఉంది. దేవాలయ సభా భవనంలో పెద్దల నడుమ జీసస్ చోటు చేసుకున్నాడు. ఒక పుస్తకం చదివి అందులో ఉట్టంకించబడిన భవిష్య విషయాలు వివరించ సాగాడు.

"ఇది భవిష్యవాణి, దివ్యవాణి సందేశం. మతంపేర కొందరు, అధికారం పేర కొందరు పేదవారిని అణచివేస్తున్నారు. హింసిస్తున్నారు. కొందరు మాత్రం భోగాలు, సుఖాలు అనుభవిస్తున్నారు. ఇక్కడ జరిగే బలి ప్రదానం ఏదీ భగవంతునికి హితవు కాదు. భగవంతుడు కోరేది మనిషి ఆత్మ నివేదన. మనిషిని మనిషి మోసం చేయడం దేవుడు సహించడు. ఈ వ్యవస్థ మారిపోవాలి. ప్రపంచం మొత్తం మీద ఒకే ధర్మం నెలకొనాలి. ఒకే సత్యం విస్తరించాలి".

ఆ మాటలు చెప్పి జీసస్ బయటకు వెళ్లిపోయాడు. సమావేశమైన పెద్దలందరు నిర్ఘాంతపోయి మొహామొహాలు చూసుకున్నారు.

ఉత్సవాలు ముగిశాయి. జీసస్ మత పెద్దలందరి దగ్గరకు వెళ్లి, అభినందిస్తూ, నమస్కరిస్తూ "మళ్లీ కలుసుకుందాం" అని సెలవు తీసుకున్నాడు. తల్లి తండ్రులతో నజరత్ బయలుదేరాడు.

◆ ◆ ◆

# 5. భారత దర్శనం

(1) జెరూసలెంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో భారతదేశం నుండి ఒక రాజవంశీయుడు పాల్గొన్నాడు. ఆయన ఉత్కల యువరాజు. ఆయన పేరు రవణ్ణ. ఆయన రాజవంశీకుడే కాక, గొప్ప విద్యావంతుడు, తాత్వికుడు. మత విషయాల పట్ల ఆసక్తి, అనురక్తి కలవాడు. రవణ్ణ భారతదేశం నుండి వచ్చిన పండిత బృందానికి నాయకుడు. బ్రాహ్మణ పండిత మండలికి ఆధ్వర్యం వహించిన కారణంగా జెరూసలెంలో అన్నిదేశాల వారితో ఆయనకు పరిచయం కలిగింది. యూదు పండితుల మధ్య ఉన్న జీసస్ అతని దృష్టిని ఆకర్షించాడు. కారణం జీసస్ వయస్సు. అతని నిర్భీకత, సత్యసంధత. జీసస్‌ను ఒక సంపూర్ణ యోగిగా, అవతారమూర్తిగా రవణ్ణ సంభావించాడు. జీసస్‌ను గురించిన వివరాలు హిల్లేల్ తనకు తెలిసినంతవరకు చెప్పాడు. జీసస్ జన్మించిననాడు జరిగిన సంఘటనల్ని వివరించాడు. దైవజ్ఞుల రాక, వారు ఆశీస్సులు తెలపడం గురించి చెప్పాడు. రవణ్ణ నజరత్‌కు వెళ్లే మార్గం అడిగి తెలుసుకున్నాడు. వెళ్లి స్వయంగా దర్శనం చేసుకుని, సంభాషించాలని కోరిక. తన బ్రాహ్మణ బృందంతో ప్రయాణమై గలిలీకి చేరి నజరత్ చేరుకున్నాడు. తాను విడిదిచేసిన ధర్మశాలలో జీసస్‌ను భోజనానికి ఆహ్వానించాడు రవణ్ణ. జీసస్ తల్లిదండ్రులు రవణ్ణ బృందానికి ఆతిధ్యమిచ్చారు. రోజూ జీసస్‌తో వేదాంత విషయాలు చర్చించేవాడు.

తాను జీసస్ అభిమానినని, పోషణభారం తాను వహిస్తానని, తన వెంట భారతదేశానికి తీసుకుపోతానని జీసస్ తల్లిదండ్రుల్ని ప్రార్థించాడు. జీసస్‌ను బ్రహ్మ విద్యావేత్తను చేస్తానని మాట యిచ్చాడు. కొన్ని రోజుల తర్వాత అనుమతి లభించింది. రవణ్ణ జీసస్‌తో, తన పరివారంతో బయలుదేరాడు. కొన్ని దినాలకు సింధునదిని దాటి ఆర్యావర్తంలో ప్రవేశించారు. మరి కొన్ని రోజులకు ఉత్కల చేరుకున్నారు. బ్రాహ్మణ పండితులు వేదమంత్రాలతో జీసస్‌కు స్వాగతం చెప్పారు.

జగన్నాధుని ఆలయంలోకి ఆలయ మర్యాదలతో జీసస్‌కు స్వాగతం చెప్పారు. జీసస్‌కు వేదమంత్రాలు నచ్చాయి. తాను వేదాలు, మనుధర్మశాస్త్రం,

అధ్యయనం చేయసాగాడు. జీసస్ ఏకసంథాగ్రాహి. ఒక్కసారి పాఠం చెబితే చాలు మనస్సులో ముద్రించుకునే వాడు. మహాపండితులు సైతం అతని మేధా సంపత్తికి అబ్బుర పడసాగారు. అనతి కాలంలోనే వేదాలకు కొత్త నిర్వచనాలు చెప్పి, అన్వయించసాగాడు. అందరు జీసస్‌ను జ్ఞానావతారుడని అభినందించారు.

(2) జగన్నాథాలయ పండితులలో 'లమాసా' అనే వ్యక్తికి యూదు అతిథిపట్ల అనురక్తి ఏర్పడ్డది. లమాసా పండితుడు బ్రహ్మ జిజ్ఞాసాపరుడు, బ్రహ్మవేత్త. ఆయనను అందరూ 'బ్రహ్మ' అనే పిలుస్తారు. ఒకనాడు జీసస్ లమాసా జగన్నాథాలయ ప్రాంగణంలో ఏకాంతంగా ముచ్చటించుకుంటుండగా జీసస్ ప్రశ్నించాడు "మహాత్మా! సత్యం అంటే ఏమిటి?"

లమాసా పండితుడు సమాధానంగా "ఎన్నటికీ మారనిది సత్యం" అన్నాడు. "ప్రపంచం మొత్తంలో ఉన్నవి రెండే రెండు – సత్యం – అసత్యం. ఎప్పటికీ నిలిచి ఉండేది సత్యం – నశించేది అసత్యం. సత్యం శాశ్వతం అయినా దానికి మూలం ఉండదు. కారణం కనిపించదు. అయినా సృష్టి స్థితులకు కారణం సత్యం. లయకు కారణం అసత్యం. సత్యం వల్లనే అసత్యం ఏర్పడుతుంది. సృష్టించ బడినదంతా లయించి పోవలసిందే. ఆరంభం ఉన్నప్పుడు అంతం ఉంటుంది. మానవ నేత్రానికి గోచరమయ్యేదంతా సృష్టింపబడిందే. లయించి పోయేదే. ఒక విధంగా చూస్తే సృష్టి అంతా అసత్యమే. అంటే నశించేదని అర్థం. అంటే 'మాయ'.

మనం చూచే వస్తుజాలం అంతా ప్రతిబింబాలు. అలా అనిపిస్తాయి కనిపిస్తాయి. ఆ భ్రమ కలిగేది చలనం వల్ల. వాయువు గతి మారినప్పుడు వస్తు భ్రమ తొలగిపోతుంది. వస్తువు అదృశ్యమవుతుంది. రూపాన్ని కోల్పోయి, అరూప మవుతుంది. మనిషీ అంతే. పరమాత్మ ఒక్కటే సత్యం. ఉన్నది, ఉండేది, నిలిచేది సత్యం. కనుక సత్యం నశించదు, మారదు".

లమాసా : మిత్రమా, నీవు చెప్పింది బావుంది. సరే 'మనిషి' అంటే ఏమిటి?

జీసస్ నవ్వి సమాధానంగా అన్నాడు : మనిషి అంటే సత్యాసత్యాల విచిత్ర సమ్మేళనం. రూపుదిద్దుకున్న ప్రాణాన్ని మనిషి అనవచ్చు. అందులో శ్వాస అన్నది జీవం. రక్తమాంస నిర్మితమైన శరీరానికి ప్రాణం తోడైతే మనిషి. అంచేతనే మనిషి సత్యాసత్యాల సమ్మేళనం. ఆరెండింటి ఘర్షణలో అసత్యం లయించి సత్యం మాత్రం మిగులుతుంది.

లమాసా ప్రశ్న : శక్తిని ఎలా నిర్వచిస్తావు మిత్రమా?

జీసస్ : చలనానికి వేగం తోడైనప్పుడు శక్తిగా మారుతుంది. లేనిది ఉన్నదన్న భ్రమ కలిగించడమే శక్తి. అంటే శక్తి అన్నది నిజానికి ఒక భ్రమ. శక్తి నశించ వచ్చు. కానీ చలనం మారదు. వేగం తగ్గుతుంది. గాలిలో చలనాన్ని బట్టి, వేగాన్ని బట్టి శక్తి మారుతుంది. చలనం అన్నది దైవసంకల్పం. మనిషిలో చలనం సైతం దైవేచ్ఛ. అది సర్వశక్తిమంతం. ప్రాణస్పందన కారణంగా శక్తి ఆవిష్కరించ బడుతుంది. గాలిలో, నీటిఅలల్లో శక్తి ఉంది. మెరుపుల్లో, మేఘాలలో శక్తి ఉంది. చేతుల్లో, కాళ్లలో శక్తి ఉంది. కంటి చూపులో, పంటి వత్తిడిలో శక్తి ఉంది. ఈ శక్తులన్నింటికీ ఆధారం 'ఈథర్'. అంటే ఆకాశతత్వం. చేయవలసిన పని అయిపోతే ఆశక్తి ఉండదు.

లమాసా బ్రహ్మ మరో ప్రశ్న వేశాడు "వివేకం అంటే ఏమిటి?"

జీసస్ : వివేకం అన్నది ఒక బండరాయి. వివేకం అనే రాతిపైన మనిషి వ్యక్తిత్వం నిలబడుతుంది. నిర్మితమవుతుంది. వ్యక్తిత్వంలో సత్యం అసత్యం రెండూ కలగలసి ఉంటాయి. బాహ్యప్రపంచంలో వివేకం ఉపయోగపడుతుంది. అంతర్జగత్తులో జ్ఞానం ఉపయోగిస్తుంది. దానిని 'అభిజ్ఞానం' అనవచ్చు.

లమాసా : జ్ఞానం అంటే?

జీసస్ : మనిషి తన ఉనికిని, మనుగడను, గమ్యాన్ని గుర్తించడమే జ్ఞానం. జ్ఞానం పొందిన మనిషి దేవునితో సమానం. అప్పుడు బ్రహ్మానికి మనిషికి భేదం ఉండదు. సత్యం సత్యమే అయినా, అప్పుడప్పుడు అసత్యం కూడా సత్యమన్న భ్రమ కలిగిస్తుంది. నిజానికి స్వర్గం, నరకం ఎక్కడా లేవు. ఉన్నవన్న భ్రమ మనస్సు కల్పిస్తుంది. స్వర్గ నరకాల్ని మన చుట్టూ కల్పిస్తుంది. మనం నివశిస్తున్న ప్రపంచం వాస్తవికం. దీనిని పరివేష్టించిన భ్రమలు స్వర్గనరకాలు. సత్యం వెలుగులో అన్వేషిస్తే భగవంతుని ఉనికి తెలుస్తుంది. భగవంతుడే పరమాత్మ.

లమాసా : విశ్వాసం అంటే ఏమిటి? ఎంత విశ్వాసం అవసరం?

జీసస్ : విశ్వాసం అనే మాటను భగవంతుని పరంగా అన్వయిద్దాం. భగవంతునికి, మనిషికి మధ్య నెలకొనవలసింది విశ్వాసం.

లమాసా : విముక్తి అంటే?

జీసస్ : మనిషి తన హృదయం నుండి బయలుదేరి పరమాత్మను చేరే బాట. ఆ కోణంలో చూస్తే మనిషి బహుదూరపు బాటసారి. పరమాత్మను చేరే మార్గం విముక్తి. దానికి మూడు మెట్లు ఉన్నాయి. మొదటి మెట్టు : నమ్మకం. దీనిని మనిషి సత్యం అని భ్రమపడుతుంటాడు. రెండవది : విశ్వాసం. మనిషి

దీనినీ 'సత్యం' అనే భ్రమపడతాడు. మూడవది : పారవశ్యం. ఇక్కడ మనిషి తన భౌతిక మానసిక స్థితుల్ని మరచిపోయి సత్యంగా మారడం జరుగుతుంది. విశ్వాసం బలపడిన తర్వాత నమ్మకంతో పని ఉండదు. తన్మయత్వంలోకి ప్రస్థానించిన తర్వాత మన నమ్మకం, విశ్వాసం రెండూ చెల్లవు. అలా జీవన శిఖరం చేరిన మనిషి భగవంతునిలో కలిసి పోయినట్లే.

**3** లమాసా పండితుడు జీసస్ కలిసి ఒరిస్సా అంతా పర్యటించారు. పుణ్యక్షేత్రాలు దర్శించారు. తర్వాత ఇరువురు గంగాతీరం చేరుకున్నారు. ఎటువెళ్లినా బ్రాహ్మణుల ఆధిక్యం కనిపించింది. వైశ్య, క్షత్రియ, శూద్ర భేదాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి. ఒకే మతస్తులలో ఇన్ని విభాగాలు, ఇంతటి అంతరాలు జీసస్‌కు అంతు బట్టలేదు. అక్కడ రోమనుల ఆధిక్యం కన్న ఇక్కడ బ్రాహ్మణుల ఆధిక్యం ఎక్కువగా కనిపించింది. కాశీలో పండితుల్ని కలిశారు. కాశీ క్షేత్రంలో జీసస్ లమాసాలు చాలా కాలం గడిపారు. ఆత్మశక్తితో రోగచికిత్సలు చేయడంలో ప్రసిద్ధులైన ఉద్రకుని వద్ద జీసస్ శిష్యుడుగా చేరాడు. యోగ చికిత్సా రహస్యాలు గ్రహించాడు. వనమూలికలు, ఆకులు, పసర్లు ఉపయోగించి చికిత్స చేసే ఆయుర్వేదం నేర్చుకున్నాడు. ప్రకృతి వైద్య రహస్యాలు తెలుసుకున్నాడు. సూర్య రశ్మితో, చంద్రకాంతితో చికిత్సలు చేయడం అధ్యయనం చేశాడు.

ప్రకృతి చికిత్సా విధానం ప్రకృతిపైన ఆధారపడ్డది. ప్రకృతి గుణాలకు అనుగుణంగా జీవించే వ్యక్తి రోగగ్రస్థుడు కాడు. ప్రకృతి ధర్మాలు పాటించక పోవడమే అసలైన పాపం. పాపం చేసినవారు జబ్బుపడడం సహజం. ధర్మాలు పాటించే వారికి సంయమనం ఉంటుంది. సంయమనం పాటించే మనిషి మానసికంగా ఆరోగ్యంగా ఉండి, వివేకవంతుడవుతాడు. మనిషి శరీరం వీణ వంటిది. అన్ని తీగలు సరిగా శ్రుతి అయితేనే రాగాలు పలుకుతాయి. ప్రకృతిలోని ప్రతి అంశం మనిషికి ఉపయోగపడుతుంది. ప్రతి ఆకు, పూవు వైద్యానికి పనికొస్తుంది. గాలి, నీరు, చికిత్సకు పనికివస్తాయి. మందులకు మించింది సంకల్పం. సంకల్పబలంతో ఉద్రేకాలను తగ్గించుకోవచ్చు. ఉద్రేకాలను నియంత్రిస్తే ఆరోగ్యం చక్కబడుతుంది. అన్ని బాధలకు, కష్టాలకు దైవశక్తి ఉపశమనం కలిగిస్తుంది. విశ్వాసాన్ని మించిన వైద్యం ఉండదు. ఆత్మలు ఆత్మలతో సంభాషిస్తాయి. ఆత్మ సంభాషణలు చెవికి వినిపించవు.

హస్త స్పర్శతో, సంకల్పంతో వేలమందికి చికిత్సలు చేయవచ్చు. అందులో ప్రధాన సూత్రం ప్రేమ. ప్రేమతో సంకల్పించడం, ఆశ్వాసించడం దేవునికి ఇష్టమైన పద్ధతి. ఆకాశంలో అనేక దుష్టశక్తులు సంచరిస్తుంటాయి. అవి మనిషి కంటికి

కనిపించవు. కాని అవి మనిషి జీవన తంత్రుల్ని కదిలిస్తుంటాయి. అపస్వరాలు పలికిస్తుంటాయి. మనిషి అజ్ఞానంతో ప్రకృతిని లెక్కచేయడు, పరమాత్మను లెక్కచేయడు. దుష్టశక్తులు గాలిలో సంచరిస్తుంటాయి. నిజమైన చికిత్సకుడు ఆత్మశక్తితో ఆత్మలకు చికిత్సచేస్తాడు. అతనికి ఉండేది ఆత్మబలం. ప్రేమ, ఆత్మబలంతో క్షుద్రశక్తుల్ని నిగ్రహించవచ్చు. వాటి ప్రభావం నుండి మనిషిని ఉద్ధరించవచ్చు. ధన్వంతరి చెప్పిన విషయాలు జీసస్ గ్రహించాడు.

(4) నాలుగు సంవత్సరాలు జీసస్ పూరి జగన్నాథాలయంలోనే ఉన్నాడు. ఒకనాడు ఒక పండితుని ప్రశ్నించాడు : "పండిట్‌జీ! ఇక్కడ కులాల తేడాలు చాలా కనిపిస్తున్నాయి. ఒక విశ్వాసం కలవారిని ఒక మతస్థులు అంటారు. మీరు మనుషులంతా సమానమేనని బోధిస్తూ కొందరిని అంటరానివారుగా చూస్తున్నారు. కొందరిని అమితంగా గౌరవిస్తున్నారు. భగవంతుని దృష్టిలో ఈ తేడాలు ఉంటాయా?"

అతని జవాబు : "ఉంటాయి నాయనా, ఉన్నాయి. మేము పరబ్రహ్మను పరదైవంగా ఆరాధిస్తాం. బ్రహ్మ సృష్టిలో మేము అధికులం. జన్మతః సంక్రమించిన ఔన్నత్యం మాది. బ్రహ్మ తనవంటి వారిని సృష్టించదలచినప్పుడు ముందుగా ఆయన నోటి నుండి పుట్టుకొచ్చింది మేమే. తెల్లగా, కోమలంగా అచ్చం తన లాగా ఉన్న మమ్మల్ని 'బ్రహ్మలు' అన్నాడు. అందుకే మాకు ఉన్నతస్థితి కలిగించాడు. బ్రహ్మ బుజాలనుండి ఒకరు ఉద్భవించారు. వారు ఎర్రగా, బలిష్టంగా ఉండడంతో క్షత్రియులన్నారు. బ్రాహ్మణుల్ని రక్షించడం, పూజించడం, పోషించడం క్షత్రియుల పని. బ్రహ్మగారి ఉదరం నుండి ఉద్భవించిన వారు వైశ్యులు. వీరి పని పంటలు పండించటం. దేశం సుభిక్షంగా ఉండేటట్లు చూడడం. బ్రహ్మ పాదాల నుండి జన్మించిన వారు శూద్రులు. వీరు మాకు సేవలు చేసి బ్రతక వలసిన వారే.

జీసస్ : మీరు చెప్పే 'బ్రహ్మ' దేవుడు కాదు. భగవంతుడు ఒకరిని ఎక్కువగా ఒకరిని తక్కువగా ప్రేమించడు. ఆయనకు పక్షపాతం ఉండదు.

జీసస్ మాటలకు పురోహిత వర్గం ఆగ్రహించింది. ఆయన పైకి దూకారు. కొట్టి చంపాలని ప్రయత్నించారు. కాని లమాసా వారిని నిలువరించాడు.

"ఆగండి. జీసస్ సామాన్యుడు కాదు. ఆయన ధ్యానంలో ఉండగా చూచాను నేను. ఆయనలో బ్రహ్మతేజస్సు వుంది. మీకు నచ్చక పోతే వదిలేయండి. ఎవరి నమ్మకం వారిది. మరొకరి విశ్వాసం తప్పు అని చెప్పే హక్కు మనకు లేదు... సత్యం ఏనాటికైనా నిలుస్తుంది".

పురోహితులు శాంతించారు. అయినా ఒకరన్నారు, "ఈ అప్రాచ్యుని మన పవిత్ర దేవాలయంలో ఉండనీయకండి. బ్రాహ్మణ్యాన్ని గౌరవించని వానికి దేవాలయంలో ఉండే అర్హత లేదు".

తర్వాత జీసస్ నివాసం దళితవాడకు మారింది. ఊరి చివర గుడిసెల్లో నివసించే పేదలు, శూద్రులు, దళితులు ఆయనకు ఆశ్రయం ఇచ్చారు. చదువు సంధ్యలు లేని కూలీలు, రైతులు జీసస్ దర్శనం కోసం రాసాగారు. వారిని తనచుట్టూ కూర్చోపెట్టుకుని రాత్రిపూట కథలు చెప్పసాగాడు. ఒకసారి ఒకకథ చెప్పాడు :

ఒక ఊరిలో ఒక గొప్ప ధనవంతుడున్నాడు. ఆయనకు బాగా ఆస్తి, భూములు, సంపదలు ఉన్నాయి. ఆయనకు నలుగురు కొడుకులు. వారు తనంత సమర్థులు, యోగ్యులు కావాలని ఆ తండ్రి అభిలాష. నలుగురూ స్వంతంగా కష్టపడి పైకి రావాలని, స్వంత తెలివితేటలతో బాగుపడాలని కోరిక. అంచేత నలుగురు కొడుకుల్ని పిలిచి, ఆస్తిపాస్తులను సమంగా పంచాడు. స్వతంత్రంగా జీవించమని ఆదేశించాడు.

నలుగురిలో పెద్దవాడు మహా స్వార్థపరుడు. కాస్త తెలివి ఎక్కువ. ఆశలు మరీ ఎక్కువ. అనుకున్నాడు, "నేను పెద్దవాడిని. తండ్రికి మొదటి వారసుడిని నేను. తమ్ముళ్లు నాకాళ్ల దగ్గర పడిఉండవలసిన వారు. నాకున్న తెలివి వారికి లేదు. ముగ్గురిలో పెద్దవాడిని పిలిచి చెప్పాడు. "నీవు నా కంటే బలం కలవాడివి. నీకు ధైర్యసాహసాలు ఎక్కువ. నీ పొలం నా పొలంలో కలుపు. నీవు మొత్తానికి రాజువు. మొత్తం మన పొలాలు రక్షించే భారం నీది. నేను జోక్యం కలిగించు కోను. పెత్తనం నీది" అన్నాడు. అతను సంతోషించాడు.

రెండవ తమ్ముణ్ని పిలిచి చెప్పాడు "ఒరేయ్ తమ్ముడూ, నేను చిన్నన్న ఈ పొలం పనులు చూచుకోలేం. మాకు అంత తీరిక లేదు. నీ పొలంతో చేర్చి మా పొలాలూ నీవే సాగు చేసి పండించుకో. వచ్చే దాంట్లో మాకూ కాస్త పంట పంచు. మొత్తం ముగ్గురి పొలాలు నీవే" అన్నాడు. అతను సంతోషించాడు.

తర్వాత చివరి తమ్ముణ్ని పిలిచి చెప్పాడు, "ఒరే చిన్నాడా ... నీకు చదువు లేదు, బుద్ధి జ్ఞానం లేవు. మా ముగ్గురి పొలాలు, చిన్నన్న సేద్యం చేస్తున్నాడు. నీవు ఒక్కడివే ఏం చేస్తావు. అసలే అర్భకుడివి. రెండవ అన్న రక్షిస్తాడు. నీవూ నీ పొలం చిన్నన్న స్వాధీనం చేసి వాడి చేతికి సాయంగా ఉండు. నీ కష్టం వాడు ఉంచుకోడులే. ఏదో నీ కింతపడేస్తాడు".

ఇదేదో బాగుందని తన పొలం ఇచ్చేశాడు.

కొంత కాలానికి తండ్రి తిరిగి వచ్చాడు. కొడుకులు నలుగురు ప్రయోజకులై ఉంటారని భావించాడు. తీరా చూస్తే పెద్దవాడు, చిన్నవాళ్లని మోసం చేసి అణచి వేసినట్లు గమనించాడు.

ఒక శూద్రుడు ప్రశ్నించాడు. "జీసస్! మీరు చెప్పిన కథ మాదే కదూ! మేం ఇంతకాలం బానిసలుగా, శూద్రులుగా, అంటరానివారుగా బ్రతుకుతున్నాం. బ్రహ్మలు చెప్పినట్లే వింటున్నాం. చేస్తున్నాం. మీరు నిజం చెప్పి, మా కళ్లు తెరిపించారు.

జీసస్ : భగవంతుని దృష్టిలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులన్న తేడాలుండవు. అందరిలో ఉన్నది ఆత్మే .... ప్రతి ఆత్మ పరమాత్మ అంశలోనిదే.

**5** ఒరిస్సా పట్టణాలన్నింటిలో జీసస్ పర్యటించి కటక్ చేరుకున్నాడు. నదీ తీరంలో ఒక ఆశ్రమంలో ఉంటున్న జీసస్‌ను దర్శించడానికి వేలమంది రాసాగారు. పూరి జగన్నాథ రథోత్సవం జరుగుతున్న సమయంలో జీసస్ ఒక వ్యాఖ్య చేశాడు. "చూడండి ఆత్మలేని విగ్రహాల్ని ఊరేగిస్తున్నారు. దేవాలయంలోను దీపారాధన లేదు. రథంలో శ్రీకృష్ణుడు లేడు. చూడండి, ఈ రథోత్సవం ఒక ఉన్మాదచర్య. మనుషుల మూర్ఖత్వానికి చిహ్నం. ప్రశాంతంగా ఉండే శ్రీకృష్ణ పరమాత్మ ఈ హాహాకారాలు, అట్టహాసాలు తట్టుకోలేక పారిపోయివుంటాడు. అసలు భగవంతునికి ఆలయాలు అవసరం లేదు. ఆలయంలో దేవుడు బందీ అయి ఉండడు. మనిషి భగవంతుని దర్శించవలసింది హృదయంలో, మౌనధ్యానం ద్వారా. భగవంతుడు నిశ్శబ్దంగా మనిషితో మాట్లాడుతాడు. నిశ్శబ్దం భగవంతునికి ఇష్టం.

ఒక సంప్రదాయవాది అడిగాడు : నాహృదయంలో ఉండే దేవుని చూపించండి స్వామీ! నిశ్చలత్వంలో పరమాత్మను చూపించండి?

జీసస్ : పరమాత్మ మన భౌతిక నేత్రాలకు దర్శనం ఇవ్వడు. మనిషి పరమాత్మను ఆత్మతో దర్శించాలి కాని కళ్లతో చూపులతో కాదు. దేవుని రూపమే మనిషిది. పరమాత్మ లక్షణమే మనిషి ఆత్మది. సాటిమనిషిని ప్రేమిస్తే భగవంతుని ప్రేమించినట్లే. అదే సరైన ఆత్మనివేదన. మన హృదయంలోకి భగవంతుని ఆహ్వానించడానికి సాటివారిని ప్రేమించాలి".

అతను అడిగాడు : నివేదనలు తప్పా? బలులిస్తే గానీ దేవతలకు ప్రీతి కలుగదు.

జీసస్ : అది మీ భ్రమ. భగవంతుడు మనలా తిండిపోతు కాదు. ఆయనకు రక్తం, మాంసం నివేదన లెందుకు? టెంకాయలు, పూలు, ఫలహారాలు. ఇవన్నీ భౌతికావసరాలు. ఆకలి దప్పికలు, కోరికలు, కామనలు ఉన్న మనిషికి, దేవాలయాల్లో మీరు పెట్టే నివేదనలు దేవుడు తింటాడా? లేదే! ఇంత డబ్బు దేవునిపేర ఖర్చు చేయడంకన్న లేనివారి కోసం ఖర్చుచేయడం మంచిది కదా! ఆర్తుల ఆకలి తీర్చడం, అవసరాలకు ఆదుకోవడం గొప్ప దైవకార్యం. ఈ విగ్రహాలను పూజించడం వల్ల ఏం వొరుగుతుంది? విగ్రహాలు మీరు చేసుకున్నవి. అందాలు, అలంకారాలు మీరు కల్పించినవి. అసలు దేవుడు ఎలా ఉంటాడో ఒకరినైనా చెప్పమనండి. చూచిన వారేరీ? కళ్లకు కనిపించదు కదా! హృదయంతో అనుభూతిస్తారు. ఆత్మలో లీనం అవుతారూ. అక్కడ రూపం ఉండదు కదా."

జనంలోఎవరూ కాదన్న వారు లేరు. అవునన్న వారూ లేరు.

(6) అప్పటికే జీసస్ కీర్తి నలుదిశల వ్యాపించింది. అయితే సంప్రదాయ వాదులకు అతని భావాలు కన్నెర్ర కలిగిస్తున్నాయి. కుల మత భేదాలు కాదనడం దైవ ధిక్కారంగా భావించారు. వర్ణాశ్రమాలు మంటకలుపుతున్నాడని గగ్గోలు పెట్టారు. జీసస్ బ్రహ్మనదీ తీరంలో బీహార్‌లో చాలా కాలం ఉండవలసి వచ్చింది. బీహార్‌లో ఒక సంపన్నుడు 'అజ' ఆతిథ్యం ఇచ్చి ఆదరించాడు. ఒకసారి జీసస్ మాటలు వినడానికి దొంగలు, దోపిడిదారులు, దేవదాసీలు, వేశ్యలు హాజరైనారు. జీసస్ వారందరినీ ఆత్మీయంగా పలకరించాడు. అది కొందరు కులీనులకు నచ్చలేదు. కొందరు విద్వాంసులు జీసస్‌తో భేటీ వేశారు.

"రబ్బోనీ! మీరు జ్ఞానులు, పండితులు, తాపసులు. మీరు ఇలా తక్కువ వారితో కలవడం, వారిని గౌరవించడం బాగా లేదు. వారకాంతలతో కలిసి తిరగడం వల్ల మీకు అపఖ్యాతి వస్తుంది. మీ కీర్తికి మచ్చ కలుగుతుంది. అగ్రవర్ణాలవారు మిమ్మల్ని వెలివేస్తారు. బహిష్కరిస్తారు".

జీసస్ : పవిత్రత మనస్సుది. మనస్సు పవిత్రంగా ఉంటే కళంకం ఎట్లా వస్తుంది? వారకాంతలు, వ్యభిచారులూ మనవంటి మనుషులే. నా కీర్తికి ఎలాంటి ప్రమాదం లేదు. కీర్తి ప్రతిష్టలు నీటి బుడగల్లాంటివి. ఎవరు ప్రజలు ... అయోగ్యులు. అపవిత్రులు భయపడతారు. నాకు అలాంటి భయం లేదు. భగవంతుడు మీవంటి జ్ఞానులనే కాదు ... అమాయకుల్ని ప్రేమిస్తాడు. గుణం ముఖ్యం ...

వారు పాపులు. పాపం చేశారు? అన్నారు ఆ పాపం చేయిస్తున్నది మీ వంటి గొప్పవారు. వారుచేసే పాపంలో మీకూ భాగం ఉంది. మీ ఆలోచనలోనే

పాపం ఉంది. వారి శరీరాలు తప్పుచేశాయి. మీ మనస్సులు పాపం చేస్తున్నాయి. స్వార్థంతో అహంకారంతో మీరే గొప్ప అనుకుంటున్నారు. అహంకారం, స్వార్థం లేనివారు సామాన్యులుగా ఉండిపోతున్నారు.

ఒక్కరూ నోరు విప్పలేదు. అందరూ తలలు వంచుకున్నారు.

జీసస్ : ఇతరుల్ని నిందించడం, వేలుపెట్టి చూడడం మంచిది కాదు. హృదయం స్వచ్ఛంగా ఉన్నవారు ఇతరుల లోపాలు వెతకరు. తమ లోపాలు కప్పి పుచ్చుకునేవారే ఇతరుల దోషాలు వెదుకుతుంటారు. జాలి నటిస్తారు. 'నటన' తొలగిస్తే ప్రతి ఒక్కరి నగ్నత్వం బైటపడుతుంది. మనిషి తన లోపాలు తను చక్కదిద్దుకుంటే చాలు. ఇతరుల లోపాలు, పాపాలు వెతికినంత కాలం తనకు ఒరిగేది ఉండదు.

**7** వారణాశి పవిత్రక్షేత్రం. జ్ఞానులకు, బ్రహ్మవిద్యావేత్తలకు కేంద్రం. అక్కడ ఒక సంస్కృత పండితుడు ఉద్రకుడు జీసస్‌కు ఆశ్రయమిచ్చాడు. జీసస్ ధర్మప్రచారం చేయసాగాడు. అప్పుడప్పుడు ధర్మోపన్యాసాలు యిచ్చేవాడు. జీసస్ గౌరవార్థం ఉద్రకుడు ఒక విందు ఏర్పాటు చేసి, పండిత సభకు జీసస్‌ను పరిచయం చేయదలచాడు. విందు తర్వాత పండిత పరిషత్తు జరిగింది. అనేక ప్రాంతాల నుండి వచ్చిన బ్రాహ్మణ పండితులు పాల్గొన్నారు. జీసస్ ప్రసంగించాడు.

"ఈ పండిత పరిషత్తులో ప్రసంగించడం నాకు ఆనందంగా ఉంది. నేను జీవిత విలువల గురించి మాట్లాడతాను. అవధరించండి ....

"మీ వలె నేను కూడా సృష్టి మొత్తం పరమాత్మ స్వరూపమని నమ్ముతాను కాని సృష్టిలో పరమాత్మ స్వభావం కనిపించడం లేదు. భగవంతుడు ఒక్కడే. పరబ్రహ్మ అనండి, పరమాత్మ అనండి, మరొకటి అనండి. అంతర్యం ఒక్కటే, భావన ఒక్కటే. మనం అనేక దేశాలలో అనేక మతాలలో ఉన్నప్పటికి మనందరి భావన 'పరబ్రహ్మ' పరంగానే ఉంటుంది. భగవంతుని శ్వాస మన ఊపిరులు. సృష్టిలో, ప్రపంచంలో ఎక్కడ కాస్త జీవస్పందన కలిగినా అది విశ్వ వ్యాప్త మవుతుంది. పరివ్యాప్త మవుతుంది. మన కాలిక్రింద ఒక క్రిమి నలిగినా పరమాత్మకు దాని బాధ తెలుస్తుంది. న్యాయం అపహాస్యం పాలవుతుంది. ధర్మగ్లాని జరిగినట్లే".

ఒక పండితుడు ప్రశ్నించాడు "మహాత్మా! మీరు ఎవరిని భగవంతు డంటారు? మేమంతా ఆ భగవంతుని వారసులం, పూజారులం, ప్రతినిధులం!

జీసస్ : నేను చెప్పే భగవంతుడు సర్వాంతర్యామి. మందిరాలలో మీరు దాచిపెట్టిన రాతి విగ్రహం కాదు. అన్నిచోట్ల ఉంటాడు. మంత్రాలకు వశుడు కాదు. దేవాలయాలకు పరిమితం కాదు. ఆయన నిర్గుణుడు. నిరాకారుడు. స్తోత్రాలకు అందదు. స్తుతులకు లొంగదు. ప్రేమ, జ్ఞానం ఈ రెండు గుణాలు భగవంతునికి నేస్తాలు. కొందరు శక్తిగా ఆరాధిస్తారు. కొందరు 'జ్ఞానం'గా భావిస్తారు.

"ప్రపంచంలో అనేక దేశాలున్నాయి. ఒకే భగవంతుని వేనవేల కోణాలలో దర్శించడం జరుగుతోంది. ఎవరి దర్శనం వారిది. తాము అనుభూతించిన దానిని భగవంతుడనడం సహజం. ప్రతి జాతి, ప్రతి మతం భగవంతుని తమ కోణం నుండి చూచి, మిగిలినవి కాదంటారు. అది తప్పు. మీరు పరబ్రహ్మ అంటారు. ఈజిప్టువారు 'తోత్' అంటారు. గ్రీకులు 'జియస్' అంటారు. హీబ్రూలు 'జెహోవా' అంటారు. విగ్రహాలకు మీరు రూపురేఖలు దిద్ది, అలంకరణలు చేసి, దేవుని విగ్రహాలంటారు. పూజలు చేయడం ఎందుకు? మన కోర్కెలు తీరడం కోసం, మన అవసరాలు తీరడం కోసం. భగవంతుని ఆరాధించాలి. అవీ హృదయంలో నిశ్శబ్దంగా ఎవరికి వారు "తండ్రీ, పరమాత్మా, పరబ్రహ్మా" అని పిలవవచ్చు. మన చేతిని భగవంతుని చేతికి అందించాలి. మనలను మనం భగవంతునికి నివేదించుకోవాలి, సమర్పించు కోగలగాలి. మిగిలినవన్నీ ఆర్భాటాలు, శుష్క కలాపాలు ..."

జీసస్ ప్రసంగానికి జనం నిర్ఘాంతపోయారు. ఈయన్ని పరబ్రహ్మ ఆవేశించింది అనుకున్నారు. కొందరైతే ఏదో దయ్యం ఆవహించిందన్నారు.

**8** జీసస్ ప్రశస్తి సంచార బేహారుల వల్ల దేశదేశాలకు వ్యాపిస్తోంది. లాహోరుకు చెందిన బ్రాహ్మణోత్తముడు అజైని. జీసస్ జ్ఞాన విజ్ఞానాల గురించి విని ఆసక్తుడైనాడు. ఆయనను దర్శించాలని వారణాశి చేరుకున్నాడు. దేవాలయ ప్రాంతాలలో జీసస్ గురించి విచారించాడు. పూజారులు అతనికి వ్యతిరేకంగా చెప్పారు. ఉద్రకుని ఉదంతం తర్వాత అతనిని పూజారులు దాదాపు వెలివేశారు. దేవాలయ ప్రవేశం నిషేధించారు. అయితే కొందరు బ్రాహ్మణ పండితులకు అతని మాటల్లో సత్యం కనిపించి, మళ్లీ అతని పాఠం వినాలని ఉవ్విళ్లూరు తున్నారు. దేవాలయానికి రమ్మని జీసస్‌ను ఆహ్వానించారు. జీసస్ వారికి సమాధానం పంపాడు : "దివ్యకాంతి ఉజ్జ్వలమైంది. దాచేస్తే దాగనిది సత్యం. నిషేధిస్తే ధర్మం ఆగదు. ఎక్కడ ఉన్నా దీపం వెలుగు ఒకేలా ఉంటుంది. వెలుతురు కావాలంటే మీరు దీపం వద్దకు రండి".

జీసస్ పంపిన సమాధానం వారికి రుచించ లేదు. తలపొగరు అని, అవిధేయత అని నిరసించారు. అజైనుడు విలువైన కానుకలిచ్చి, తన వారిని జీసస్ వద్దకు పంపాడు.

వారు జీసస్‌ను అర్థించాడు : మహాత్మా! తమరు కారణజన్ములు. మీరు దేవాలయంలో ఉన్నా, సామాన్యరైతు ఇంట్లో వున్నా ఒక్కటే. జాతిరత్నం విలువ స్థానాన్ని బట్టి మారదు. దయవుంచి, మా అభ్యర్థన మన్నించండి.

జీసస్ : భగవంతుని దృష్టిలో రాయి, రత్నం ఒక్కటే. నేనున్న తావుకు ఎవరైనా రావచ్చు. భగవంతుని ఎవరైనా ధ్యానించవచ్చు. అందుకు పుణ్యతీర్థం, పాపతీర్థం అని ఉండవు. నేనెవరినీ నిషేదించను. ఎవరినీ బహిష్కరించను. అందరినీ ప్రేమిస్తాను. మనుషులు పెట్టే నియమాలు, ధర్మాలు భగవంతుడు అమోదించడు. మీ బహుమతులు తీసుకుపొండి. డబ్బుతో భగవంతుని అనుగ్రహం పొందలేరు.

ఆ మాటలు పూజారులకు మరింత ఆగ్రహం తెప్పించాయి. ఎలాగైనా జీసస్‌ను కాశీ నగరం నుండి తరిమికొట్టాలని నిశ్చయించుకున్నారు. కాని అజైనినుడు వారిని అడ్డుకున్నాడు. ఒక అర్ధరాత్రి దేవాలయం వదలి జీసస్ ఉన్న తావుకు చేరాడు. “మహాత్మా! నేను దూరదేశం నుండి తమ దర్శనార్థం వచ్చిన వాడిని. లాహోర్ వాసిని”.

జీసస్ : మనం నిమిత్తమాత్రులం. ప్రభువును భూమిపైన వెతికి ఏం లాభం? విశ్వప్రేమ ఆయన సామ్రాజ్యం. ప్రేమలో, ప్రేమతో వెతకండి.

అజైనిన్ : నాకూ ప్రభువు అనుగ్రహం ప్రసాదించండి.

జీసస్ : నీ లోపల ప్రవేశించు. నీవే తానుగా మారిపోతావు. ఎవరి మధ్యవర్తిత్వం, పౌరోహిత్యం అవసరం లేదు. ఈ వలువలు, విలువలు ఇక్కడ వదలి వెళ్లాలి. ఆయన కోరేది విలువైన కానుకలు కాదు. పవిత్రమైన మనస్సు, కల్మషం లేని హృదయం.

జీసస్ మాటలు అజైనిన్‌కు బోధపడలేదు.

**9** ఒక సాయంసమయాన జీసస్ గంగాతీరంలో సంచరిస్తుండగా విదేశీ వర్తకబృందం కనిపించింది. వారు జీసస్‌ను గుర్తించారు. వారు చాలా కాలం పశ్చిమ దేశాలలో వ్యాపార వాణిజ్యాలు నిర్వహించినవారు. జీసస్‌ను గుర్తించి ఆయన వద్దకు వచ్చి చెప్పారు.

"జీసస్ ! మీ తండ్రిగారు కాలం చేశారు. మీ అమ్మగారు నీ కోసం ఎదురు చూస్తున్నారు. ఆమెను ఎవరూ ఓదార్చే వారు లేరు. నీవు అసలు బ్రతికి ఉన్నావో లేదో, ఉంటే ఎక్కడ ఉన్నావో ఆమెకు తెలియదు. వెంటనే వెళ్లి ఆమె ఆలనా పాలనా చూడు".

ఆ వార్త వినగానే కొద్దిసేపు జీసస్ మౌనంగా ధ్యానించాడు. ఆయన ఆత్మశాంతికి మౌన ప్రార్థన చేసి, ఒక లేఖ ఇలా రాశాడు :

"అమ్మా .... మన దేశం నుండి వచ్చిన వ్యక్తి ఒకరు నాన్న మరణవార్త తెచ్చాడు. నీవు దిగులుపడి ఉన్నావని, బాధపడుతున్నావని చెప్పాడు. అమ్మా! అంతా సవ్యంగానే ఉంది. నాన్న ఆత్మ శాంతంగా ఉంది. బాధపడనవసరం లేదు. దిగులు చెందనవసరం లేదు. నాన్న ఈ భూమిపైన చేయవలసిన పనులు పూర్తి చేశారు. వెళ్లిపోయారు. ఆయన కల్మషరహితుడు. గొప్పగా జీవించాడు. ఎవరూ వేలెత్తి చూపలేరు. ఈ జన్మలో ఆయన చాలా మంచిపనులే చేశారు. ఆయన పైలోకంలో నిర్వహించవలసిన పనులున్నాయి. ఆ పనులకు శరీరం ఆటంకం. అందుకే వెళ్లిపోయాడు. నాతండ్రి అయిన భగవంతుడు నాన్నకు తోడుగా ఉన్నాడు. నాన్న పరమాత్మ దగ్గర ఉన్నాడు. ఆయనకు దైవరక్షణ వుంది. నీవు ఆయన కొరకు విచారించవద్దు. కన్నీటి బిందువులు విచారాన్ని జయించలేవు. ముక్కలైన హృదయాన్ని ఉపశమింపచేసే శక్తి విషాదానికి లేదు. విచారం వల్ల అలసత్వం, నిష్క్రియత్వం ఏర్పడతాయి. ఆత్మ ఎప్పుడూ ఎవరికోసం విచారించదు. విషాదానికి మెత్తపడదు. అసలు ఏ ఆత్మకు విచారించే వ్యవధి ఉండదు. విషాదం హృదయాన్ని తాకగానే, మనల్ని మనం మరచిపోయి విశ్వప్రేమలో పడాలి. ప్రేమ ఉన్నచోట విచారం, విషాదం ఉండవు. ఉండలేవు.

"అమ్మా! నీవు ప్రేమమూర్తివి, ప్రేమ స్వరూపిణివి. నీ హృదయం ప్రేమ పూర్ణం. లోకం నీ ప్రేమకోసం తపిస్తోంది. వీరికి నీ ప్రేమను పంచు. గతం గురించి విచారించడం కన్న ఆ గతాన్ని స్మరించడం మేలు. ప్రాపంచికతను మరచిపో. కాలమే మన సమస్యల్ని పరిష్కరిస్తుంది. విషాదం తొలగిపోతుంది. ఆత్మ తృప్తి మిగులుతుంది. తృప్తిగా జీవించు. నేను వచ్చి నిన్ను కలుస్తాను. చాలా విలువైనది నీకు కానుకగా సమర్పించుకుంటాను.

"అమ్మా! జాన్ నీ బాగోగులు చూచుకుంటాడని నా నమ్మకం. మనిషికి మనిషి తోడుండాలి కదా. నీ అవసరాలు తను చూస్తాడు. నన్ను స్మరిస్తున్నంత కాలం నీకు ఎలాంటి లోటు రాదు. నీకు ఆత్మశాంతి లభిస్తుంది".

జెరూసలెం వెళుతున్న వ్యాపారికి ఆలేఖ యిచ్చి పంపాడు.

(10) జీసస్ వ్యవహార సరళి, బోధలు సామాన్యజనాన్ని ఆకర్షిస్తున్నా, బ్రాహ్మణ్యానికి పంటిక్రింద రాయిలా తయారైనాయి. అతనివల్ల సమాజంలో బ్రాహ్మణాధిక్యం తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. దానికి తోడు బీదాబిక్కి జనాలు అతనిని దేవుడుగా ఆరాధించసాగాయి. అతనిని కీర్తిస్తున్నారు. పూజారి వర్గాల ఫిర్యాదులు విని రాజులుసైతం జీసస్ పేరు వింటే ఉలిక్కిపడుతున్నారు. మానవులంతా ఒక్కటే ననడం దారుణం. వర్ణాశ్రమ ధర్మం మంట కలుస్తోంది. దేవాలయ పూజలు, నివేదనలు, జంతు బలులు తప్పని బోధిస్తున్నాడు. అతనికి విగ్రహారాధన బొత్తిగా నచ్చని విషయం. దేవాలయాలు మూసివేసే ప్రమాదం ముంచుకొచ్చింది. వేదాధ్యయనానికి చివరి దశ దాపురించింది.

ఒక సమావేశం ఏర్పాటు చేసి, భరతఖండంలోని అన్నిదేశాల వేద పండితుల్ని ఆహ్వానించారు. కాశీలో సమావేశం జరిగింది. జగన్నాథాలయ పండితుడు లమాసాకు జీసస్ ఆంతర్యం తెలుసు. అతను కాశీ పండిత సభకు హాజరై జీసస్ పక్షాన వాదించాడు.

"బ్రహ్మ విద్యావేత్తలారా! తాము చేస్తున్న పని మంచిది కాదు. మరొకసారి ఆలోచించుకోండి. ప్రపంచం మనవేపు వేయికళ్లతో చూస్తున్నది. భరత ఖండం మొత్తం మనల్ని గమనిస్తున్నది. ఇది బ్రాహ్మణ అభిజాత్యానికి ఒక అగ్నిపరీక్ష. మనం అజ్ఞానంతో అవివేకంగా ఏదో నిర్ణయం తీసుకుంటే అటు రాజానుగ్రహం కోల్పోగలం. ఇటు ప్రజాభిమానం పోగొట్టుకుంటాం. ఇటు ప్రజలను కాదని, అటు ప్రభువులకు దూరమై మనం చేసే నిర్వాకం ఏముంటుంది! జీసస్ పట్ల అనుచితంగా ప్రవర్తించి అకృత్యానికి పాల్పడితే, మన చేతులకు రక్తం అంటుతుంది. మనం మలిన పడతాం. అది బ్రహ్మహత్యా దోషం కదా! ఏ దేశం వాడైతేనేం, ఏ మతం వాడైతేనేం, ఒక బ్రహ్మజ్ఞానిని చంపిన పాపం మనకు చుట్టుకుంటుంది. తరతరాలపాటు ఆ పాపం మనల్ని వదలదు. మన పతనాన్ని మనమే చేజేతులా ఆహ్వానిస్తున్నాం".

సభాసదులు అరచి, గోలచేసి అతనిని మాట్లాడనీయలేదు. పూజారులు పురోహితులు కోపం నిగ్రహించుకోలేక అతనిని కొట్టారు, తిట్టారు, శపించారు, దుర్భాషలాడారు. రక్తం వోడుతుండగా వీధిలోకి తరిమికొట్టారు. చివరకు అంతా ఒక మాటపైన నిలిచారు. రాజసేవకులు జీసస్‌ను రక్షించడానికి ఆయన ఉండే తావుకు వెళ్లారు. ఒక బహిరంగ ప్రదేశంలో ప్రసంగిస్తున్న జీసస్‌ను కలిసి, పరిస్థితి వివరించి, పారిపొమ్మని సలహా యిచ్చారు. జీసస్ వారి మాటను లక్ష్య పెట్టకపోవటంతో బలవంతంగా రాజాస్థానానికి తీసుకువెళ్లారు. జనం వేల

సంఖ్యలో నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని వ్యక్త పరిచారు. రాజు జీసస్ విషయంలో మెత్తపడడం నచ్చని బ్రాహ్మణ్యం జీసస్ హత్యకు కుట్రచేయసాగారు. ఒక కిరాయి హంతకుని ప్రలోభపెట్టి అర్ధరాత్రివేళ జీసస్‌ను హత్య చేయమని నియమించారు. అర్ధరాత్రికి ముందే జీసస్ అంతర్ధానమైనాడు. హిమాలయ పర్వతదేశం కపిలవస్తు చేరుకున్నాడు.

◆ ◆ ◆

(11) కపిలవస్తు గౌతమబుద్ధుని జన్మభూమి. ప్రేమాదరణలకు, కరుణకు ఆటపట్టు. ఒక బౌద్ధ విహారం జీసస్‌ను స్వాగతించి, ఆతిధ్యమిచ్చింది. అక్కడి బౌద్ధ పరివ్రాజకులలో 'బరత్ అరబో' జీసస్‌లోని వర్ఛస్సును, ప్రజ్ఞను పసికట్టాడు. ఇద్దరూ మంచి మిత్రులైనారు. జీసస్, బరత్‌లు కలిసి బౌద్ధగ్రంధాలు లోతుగా అధ్యయనం చేయసాగారు. తర్వాత వేదాలు, అవెస్తా, గౌతమ సిద్ధాంతాలు తులనాత్మకంగా పరిశీలించారు. మానవ పరిణామం గురించి మాత్రం బరత్, జీసస్‌తో విభేదించాడు.

సృష్టి అంతటిలో మానవ నిర్మాణం విచిత్రమైంది. నిగూఢమైంది. అద్భుతమైంది. మనిషికి సృష్టికి సంబంధం ఉంది. మనిషికి భగవంతునికి పోలిక ఉంది. అన్ని పరిస్థితులలో భగవంతునికి మనిషి అవసరం ఉంది. మనిషికి భగవంతుని అవసరం ఉంటుంది. ఒక కాలంలో మనిషి లేడు. సృష్టి ఉంది. మనిషి లేని ప్రపంచం ఉండేది. అప్పుడు మనిషి రూపం లేని స్థితిలో ఉన్నట్లు. రూపరహితుడై ఉన్నట్లు. కాలం పొరల్లో జీవం దాగి ఉండేది. కొంత కాలానికి రూపప్రపంచం ఏర్పడ్డది. పరిణామం దశల వారీగా సాగుతూ వచ్చింది. ఖనిజ, వృక్ష, జంతు పరిణామాల తర్వాత మానవపరిణామం ఏర్పడ్డది. అంటే మనస్సు ఏర్పడ్డది. ఆలోచన ఏర్పడ్డది. మనస్సు సహకారంతో మనిషి పూర్ణత్వం సాధించి, పూర్ణ మానవుడు కావలసి ఉంది. మనిషి దేవుడంతటి వాడు కావాలి. మృత్యువును జయించాలి.

జీసస్ అన్నాడు : మిత్రమా బరతా! ఈ సిద్ధాంతం ఎవరు నేర్పారు నీకు? లేక నీ స్వంత నిర్ణయమా ఇది. మనిషికి మనస్సు ఏర్పడినట్లు జంతువులకు మనస్సు ఏర్పడే అవకాశమే లేదు మిత్రమా!

భరత్ : ప్రాచీన కాలం నాడే మన మహర్షులు సెలవిచ్చారు అలా అని.

జీసస్ : మిత్రమా, నీవు బుద్ధజ్ఞాని వని నా నమ్మకం. ఆత్మదర్శనం పొందని వారు ఎవరో చెప్పిన మాటల్ని నమ్మక్కు. అనుభవం సత్యాన్ని నిర్ధారిస్తుంది. తనుగా



సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 94475
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

నిర్ధారించుకోవడమే ఆత్మజ్ఞానం. అది ప్రజ్ఞా విశేషం. మనిషి బలహీనత ఇతరులు చెప్పింది వెంటనే నమ్మటం. తానుగా తెలుసుకోడానికి ప్రయత్నించడు. తానుగా తెలుసుకోవడం మొదలైతే ఇతరులు చెప్పింది గుడ్డిగా నమ్మడు. నిగ్గు తేల్చుకుంటాడు. నిలదీస్తాడు. తన జ్ఞానంతో సానపడతాడు. పూర్వం ఎందరో మహర్షులు చెప్పిందీ నమ్మకు. నీ మనస్సుకు పదును పెట్టు, పనిపెట్టు. మన జ్ఞాపకాలు మన ఆలోచనలను పదును పెట్టగలగాలి. మహర్షులు కాలాన్ని చీల్చుకుని వెనక్కి వెళ్లిపోగలరు. ఎప్పటి సత్యాలైనా, విషయాలైనా గ్రహించ గలరు. మనిషిలేని కాలంలో మనస్సు లేదు. మనస్సే లేనపుడు కాలం అనేదే లేదు. ఆరంభం వున్న ప్రతిదానికి అంతం ఉంటుంది. మనిషి లేనప్పుడు కాలంతో పనిలేదు గదా!

'పరమాత్మ నుండి ఏడు శక్తులు బయటకొచ్చాయి. మా భాషలో ఆ శక్తుల్ని 'ఐ లోహిం' అంటారు. ఆ ఏడు శక్తులే సృష్టికి మూలం. వాటి ప్రభావం వల్ల సృష్టి జరుగుతుంది. పరమ పురుషుని నుండి ఏర్పడిన ఆశక్తులు అనంతంగా వ్యాపించివున్న సూర్యతలం పైకివచ్చి పరుచుకోగానే ఏడురకాల వాయువులు (ఈథర్స్) జీవసృష్టికి తలపడి ఏడురకాల జీవజాల సృష్టికి కారణమైనాయి. అవే సప్తధాతువులు. అవి భగవత్సంకల్పంతో ఏర్పడినవే. సప్త లోకాలకు చెందిన ఏడు మూలధాతువుల సంగమమే సృష్టి. ఈ ఏడులోకాలను, సప్త మాతృకలను మనిషి చూడలేడు. భౌతిక నేత్రాలకు అవి గోచరం కావు. అవి సూక్ష్మ ధాతువులు. మనిషి సృష్టికి ఆకరమైన ఆత్మగా పరిణమించినప్పుడు వాటిని తెలుసుకోగలడు. ఆత్మ జ్ఞానంతో, అంటే 'ఆత్మ' అనే నేత్రంతో ఈథర్ లోకాలను, అంటే పరలోకాలను తెలుసుకోవచ్చు. ఎందుచేతనంటే అన్ని భూమికలపైన అన్ని రకాల ప్రాణులు భగవంతుని భావనలే. అన్ని జీవులు వాటివాటి పరిధిలో ఆలోచిస్తాయి. ప్రతి జీవికి ఇచ్ఛాశక్తి ఉంటుంది. నిర్ణయించుకునే శక్తి ఉంటుంది. సప్తలోకాలలో ఏ లోకంలోని జీవులకైనా అక్కడ వాతావరణం బట్టి పోషణ, మనుగడ ఏర్పడుతుంది. అక్కడి ఈథర్ అన్నిటిని సమకూరుస్తుంది.

మనం భూమిపైన జరిగే పరిణామం పరమాద్భుతం అనుకుంటాం. ఇది ఒక రకంగా పతనస్థితి. ఏడు లోకాలలో చివరిది, క్రిందిది భూలోకం. ఇక్కడి జీవుల సంకల్ప వికల్పాల వల్ల పతనం చెందడం జరుగుతుంది. ఇక్కడి ఈథర్ వేగం తగ్గిపోయిన కారణంగా రూపాలు ఏర్పడుతున్నాయి. సాంద్రత పెరుగుతోంది. ఈథర్ ఘనీభవించడం వల్ల భౌతికత్వం ఏర్పడుతోంది. పై లోక జీవులు దేవతలు గానీ కిన్నెర కింపురుషులు గానీ సంకల్పం చెడనివ్వరు. కనుక వారు మరణించరు.

అంటే జీవధాతువు క్షీణించదని అర్థం. అక్కడ ఈథర్ ఎప్పుడు పరమాత్మ అధీనంలో ఉంటుంది. వికల్పం చెందదు. పై లోకాల జీవులకు భూలోక జీవుల వలె ఆకలి దప్పులు, కోరికలు, భౌతికావసరాలు ఉండవు. అదే భౌతిక శాశ్వతత్వం. మనిషి కోల్పోయిన శాశ్వతత్వాన్ని పునరుద్ధరించడం. భూమిపైన ఈథర్ స్థిరపడడమే శాశ్వతత్వం".

బరత్ ఆశ్చర్యపడ్డాడు జీసస్ ఆత్మ పరిశోధనకు. అది ఆయన ప్రజ్ఞ. జీసస్, బరత్‌ల సంభాషణ విద్యాపతి అనే బౌద్ధ భిక్షువు విన్నాడు. ఆ విషయం కపిలవస్తులోని బౌద్ధులందరికీ చెప్పాడు.

"ఇంతకు ముందు ఆరుసార్లు పరమాత్మ అవతరించడం జరిగింది. ఇప్పుడు మరొకమారు పరమాత్మ జీసస్‌గా అవతరించాడు. ఈయన అకళంక చరితుడు. ఈయన ఆత్మయోగి విశ్వయోగి".

విద్యాపతి కపిల నగర వాసులకు జీసస్ బోధలు వినమని చెప్పాడు. కపిల జనానీకం జీసస్‌ను 'కరుణామయుడు' 'అపరబుద్ధుడు' అన్నారు.

**(12)** ఆనాడు జీసస్ నదీ తీరాన విహరిస్తుండగా కొందరు కార్మికులు, కర్షకులు దర్శనానికి వచ్చారు. అందరి ముఖాలపై అలసట కనిపించింది. ఎవరి కళ్లలోనూ ఆనందం లేదు. ఎందుకింత దిగులుగా ఉన్నారని ప్రశ్నించాడు.

"అయ్యా, మాకు ఆనందం అంటే తెలియదు. మా బ్రతుకుల్లో ఆనందానికి చోటులేదు. కష్టపడడం, పనిచేయడం, బ్రతికినంత కాలం బ్రతకడం, ఆయువు తీరగానే చనిపోవడం అంతే మాకు తెలిసింది".

జీసస్ హృదయం చలించింది. వారిని అనునయించాడు.

"చూడండి, శ్రమించడం వల్ల విచారం కలగకూడదు. కష్టపడి పని చేయడంలోనే ఆనందం ఉంది. చేసే పనిని ప్రేమించండి. ఆశను పనిలో రంగరించండి. అప్పుడు తృప్తి కలుగుతుంది. ఆనందం మిగులుతుంది. దానినే స్వర్గం అంటారు".

ఒకరన్నారు "అవును స్వర్గం గురించి విన్నాం. స్వర్గం చేరడానికి ఎన్ని జన్మలెత్తాలి స్వామీ?"

జీసస్ : "సోదరా! మీ ఆలోచన తప్పు. మీరు కోరుకునే స్వర్గం ఎక్కడో దూరంగా లేదయ్యా. మీ మానసికానందమే స్వర్గం. భగవంతుడు వేరుగా స్వర్గాన్ని నరకాన్ని సృష్టించి ఉంచలేదు. మీ హృదయం తలుపులు తెరవండి లోపల వెలుగు కనిపిస్తుంది. అదే స్వర్గం".

"మనిషి కూడా లోపలకు వెళ్లడం నేర్చుకోవాలి, ప్రతి మనిషిలోనూ నిక్షేపాలుంటాయి. గొప్ప నిధులుంటాయి".

బుద్ధపూర్ణిమ. కపిల వస్తు నగరం శోభలీనుతోంది. ఎక్కడెక్కడ నుండో బౌద్ధ బిక్షులు కపిల వస్తువకు చేరుకున్నారు. భారతదేశంలోని అన్ని బౌద్ధారామాల వారూ వచ్చారు. చాలా మంది ప్రసంగించారు. జీసస్‌ను ఒక సభలో ప్రసంగించమని కోరారు. అయన ప్రసంగానికి అందరూ తన్మయులైనారు. బుద్ధ భగవానుడే మరలా అవతరించాడా అన్నంత భ్రమ కలిగింది జనాలకు. బుద్ధుడు వినా మరొకరు అంత ప్రజ్ఞతో ప్రసంగించలేరని అనుకున్నారు.

(13) విద్యాపతి, జీసస్ మంచి మిత్రులైనారు. ఇద్దరూ తాత్విక విషయచర్చ చేసుకునేవారు. ప్రస్తుత ప్రపంచ పోకడలు చర్చించుకునేవారు. ఒకసారి ఇరువురు, పర్వత సానువులపై కూర్చుని మాట్లాడుకుంటుండగా జీసస్ అడిగాడు.

"నా కనిపిస్తుంది విద్యా, ముమ్ముందు ఈ పూజారుల అవసరం ఉండదు. మనిషి నేరుగా భగవంతుని ఆరాధించే కాలం వస్తుంది. ఈ దేవాలయాలు, నైవేద్యాలు, పూజారులు, మధ్యవర్తిత్వాలు ఉండక పోవచ్చు. మనిషి పవిత్రంగా జీవించగలిగితే చాలు దైవానుగ్రహం కలుగుతుంది".

విద్యాపతి : ఈ ఆచారాలు, సంప్రదాయాలు కేవలం సంకేతాలు మాత్రమే జీసస్. మనిషి లోపల హృదయంలో జరిగే పనులకు ఇవి గుర్తులు, సంకేతాలు. అసలు దేవాలయం హృదయం. అక్కడ ఆరాధించవలసింది ఆత్మను. ప్రాచీన కాలం నుండి ఈ ఆచారాలు వస్తున్నాయి. ఆత్మ సంస్కారం కలవారికి వీటితో పనిలేదు. వీటి అవసరమూ లేదు. మనిషి తన కోసం కాక, ఇతరుల తృప్తి కోసం కొన్ని పనులు చేస్తుంటాడు.

జీసస్ : భగవంతునికి ఈ సేవలు, అర్చనలు, ఆడంబరాలు అవసరమా? లేదు కదా!

విద్యాపతి : రానున్న కాలంలో ఆధ్యాత్మిక జీవనానికి విలువ పెరుగుతుంది. విగ్రహారాధన పట్ల మక్కువ ఎవరికైనా కొంత కాలమే ఉంటుంది. తర్వాత ఆత్మ సంస్కారం కలుగుతుంది. అదే అసలైన ఆధ్యాత్మికత. అదే ధ్యానం, తపస్సు. మతాలు ప్రబలంగా ఉన్నంతకాలం ఆధ్యాత్మికత కుంటుపడుతుంది. ఆత్మజ్ఞానంతో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి. మనిషి 'మతం' గోడలు దాటి, తనను తాను తెలుసుకునే రోజు వస్తుంది".

◆ ◆ ◆

# 6. టిబెట్ పర్యటన

(1) టిబెట్ దేశంలో 'లస్సా' ఒక గొప్ప యోగకేంద్రం. అది ఆధ్యాత్మిక విజ్ఞాన విహారం. అక్కడ ప్రాచీన విజ్ఞానానికి సంబంధించిన తాళ, బూర్జ పత్రగ్రంధాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిని కూలంకషంగా అధ్యయనం చేసిన ఒక భారతీయయోగి జీసస్‌కు ఆ విషయం తెలియచేశాడు. వాటిలో ఎంతో మార్మిక రహస్య విషయ విజ్ఞానం ఉన్నదని, వాటిని చదవమని చెప్పాడు. ప్రాచ్యతత్వవేత్త "మెంగ్సే" మహర్షి టిబెట్‌లోనే ఉన్నాడని అయన్ని కలిస్తే ఆలయానికి మార్గం చెప్పగలడని చెప్పాడు. ఆలయం చేరడం చాలా కష్టం. ఎన్నో కొండలు దాటాలి. దుర్గమ, నిర్జన ప్రాంతం చేరాలి. ఎమోడస్ అనే పర్వత శిఖరం పైకి ఎక్కడం కష్టం. ఆ శిఖరం దాటితేగాని ఆలయం చేరరు. జీసస్ అక్కడకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. ఆ ప్రాంతాలు పరిచయమున్న ఒక వ్యక్తిని విద్యాపతి జీసస్‌కు సహాయకునిగా పంపాడు.

జీసస్ కొన్ని రోజులపాటు పర్వతారోహణ చేయవలసి వచ్చింది. చాలా శ్రమించాడు. చివరకు 'లస్సా' దేవాలయం చేరుకున్నాడు. మెంగ్సే జీసస్‌కు స్వాగతం చెప్పాడు. బస, భోజనం ఏర్పాటు చేశాడు. అక్కడ ఎందరో విద్యార్థులున్నారు. పండితులు, యోగులు, తాత్వికులు ఉన్నారు. అదొక విశ్వ విద్యాలయం. జీసస్‌కు వారంతా పూర్తి సహకారం అందించసాగారు. తాళపత్ర గ్రంధాలు చదివించుకుంటూ మెంగ్సేతో అప్పుడప్పుడు చర్చించేవాడు. ముందు ముందు ప్రపంచ పరిణామం ఎలా ఉంటుంది? ఆధ్యాత్మిక ప్రగతి ఎలా ఉంటుంది? ఎలాంటి మార్పులు వచ్చే అవకాశం ఉంది? చర్చించేవారు. లస్సాలో ఉన్నంత కాలం తన అభిప్రాయాలు బోధించలేదు. అంతా మహా పండితులు, యోగులు, జ్ఞానులు అక్కడ ఉన్నది. కొంతకాలానికి 'లస్సా' వదలి పశ్చిమ దిశగా ప్రయాణం సాగించాడు. పర్వత కనుమలు దాటి లద నగరం 'లెహ్' చేరుకున్నాడు. బౌద్ధ భిక్కులు ఆయనకు స్వాగతం చెప్పారు. అక్కడ పేదలు, వ్యాపార వర్గాల వారు ఆయనను ఎక్కువగా ఇష్టపడసాగారు.

జీసస్ విడిదికి దగ్గరలోనే ఒకామె ఉంది. ఆమె కొడుక్కి జబ్బు చేసి మృత్యుముఖంలో ఉన్నాడు. భిషక్కులు పెదవి విరిచారు. ఆమె జీసస్ గురించి విన్నది. జీసస్ హస్తవాసి మంచిదని, ఆయనకు మృత సంజీవని మంత్రం తెలుసునని, చనిపోయిన వారిని బ్రతికించగలడని ఎవరో చెప్పగా విన్నది. మృత్యు ముఖంలో ఉన్న పసివాడిని తీసుకుని జీసస్ వద్దకు పరుగుతీసింది. ఆమెకు పరదేశి అయినా తన పట్లగల విశ్వాసానికి జీసస్ హృదయం దయార్ద్రమైంది. ఆకాశం వైపు దృష్టి మరల్చి, రెండు చేతులెత్తి ప్రార్థించాడు.

"భగవాన్, నీలో ఉన్న అనంత ప్రాణశక్తిని కాస్త కనికరించి నాకు అందించు దేవా! ఈ పసివాడిని బ్రతికించు. వీనికి ప్రాక్షభిక్ష పెట్టు". క్షణాలలో పసివాడి ఆరోగ్యం చక్కబడ్డది.

ఆ బిడ్డను కన్న తల్లితో అన్నాడు. "అమ్మా! భగవంతుడు ఎప్పుడూ కరుణామయుడే. పూర్తి విశ్వాసం ఉంచితే నీ విశ్వాసమే భగవంతుని అనుగ్రహంగా మారి నిన్ను రక్షిస్తుంది".

ఆ సంఘటన చూచినవారు, విన్నవారు జీసస్ సాక్షాత్తు భగవంతుని అవతారం అని ప్రస్తుతించారు. మృత్యువునుండి రక్షించడం మాటలు కాదు. అది వైద్యం కాదు మహత్తు. ఆనాటి నుండి పరిసరాల రోగులు అనేక మంది రాసాగారు. జీసస్ వారిని ఒక్క 'ప్రార్థన'తో, స్పర్శతో స్వస్థుల్ని చేసి పంపసాగాడు.

లధక్ గ్రామసీమలలో జీసస్ చాలా రోజులు పర్యటిస్తూ, రోగులకు స్వస్థత కలిగిస్తూ, జ్ఞానబోధ చేస్తూ గడిపాడు. 'ప్రార్థన'తో ప్రాణనిధిని అందుకునే మార్గం చూపించాడు. పాపాలను నివృత్తి చేసుకుని, బ్రతుకులు స్వర్గంగా మార్చుకోమని హితవు చెప్పాడు. ఆయన నిరాడంబర జీవనం, హితోక్తులు సామాన్య ప్రజకు బాగా నచ్చాయి. అందరితో కలిసి మెలిసి తిరిగేవాడు. నిరహంకారి, నిగర్వి సాధువు. ఎవరైనా ఆయన చేతిని స్పృశించి, ముద్దాడవచ్చు. ఆ స్పర్శద్వారా జీసస్ శక్తిపాతం జరిపేవాడు. ఆయన వెళ్లిపోతున్నప్పుడు జనం దిగులుపడ్డారు. జీసస్ వారికొక కథ చెప్పాడు :

ఒక రాజుగారున్నాడు. ప్రజల్ని చక్కగా ప్రేమించేవాడు, పాలించేవాడు. అనేక బహుమతులు, ధనం తన కుమారునికిచ్చి, ప్రజలకు పంచమని ఆదేశించాడు. అలాగే చేయసాగాడు. ఆదేశంలో గుడులు, గోపురాలు చాలా ఉన్నాయి. ఆ గుళ్లలో దేవతామూర్తులున్నాయి. గుళ్లకు పూజారులున్నారు. రాజు గారి సంపదలు పేదవారికి చేరడం పూజారులకు నచ్చలేదు. వారు ప్రజల్ని రెచ్చగొట్టారు.

"యువరాజు ఇస్తున్నది అసలు సిసలు బంగారం కాదు. రాజుగారు మిమ్మల్ని మోసం చేస్తున్నారు. ఎవరైనా బంగారం ఇలా ఉచితంగా ఇస్తారా?" పూజారుల మాటలు నమ్మిన ప్రజలు బంగారు నాణాన్ని విసిరిపారవేశారు. యువరాజును పట్టి, కొట్టి, తరమివేశారు. రాజకుమారుడు అన్ని దెబ్బలు బాధలు భరిస్తూ భగవంతుని ప్రార్థించాడు. "తండ్రీ, వీరంతా నీ బిడ్డలు. అజ్ఞానంతో నన్ను, నిన్ను నిందిస్తున్నారు. వీరిని క్షమించు".

ఈ కథ చెప్పి అందరినీ ఆశీర్వదించి జీసస్ ముందుకు నడిచాడు.

'ప్రస్తుతం వెళ్లిపోతున్నాను మళ్లీ కలుద్దాం' అని హామీ యిచ్చాడు.

★ ★ ★

బేహారుల బృందం ఒకటి కాశ్మీర్ లోయలో ప్రయాణం చేస్తున్నది. వారు గుర్రపు బండ్లతో, ఒంటెలతో సరుకులు మోయిస్తూ ప్రయాణం సాగిస్తున్నారు. వారు హంద్‌నదీ (సింధు) తీరంలోని లాహోరుకు వెడుతున్నట్లు తెలిసింది. వారిలో కొందరు జీసస్‌ను గురించి విన్నారు. 'లెహ్' నగరంలో జీసస్‌ను దర్శించారు. ఇక్కడ మార్గమధ్యంలో జీసస్ దర్శనం కావడం వారికి ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆయన లాహోర్ మీదగా సింధు, పర్షియా దేశాలకు వెళ్లనున్నారని తెలుసుకుని ఒక ఒంటెను బహుమతిగా ఇచ్చారు.

జీసస్ లాహోర్ చేరగానే అజైనిన్, కొందరు విద్వాంసులతో కలిసి వచ్చి స్వాగతం చెప్పాడు. అజైనిన్ పురోహిత పండితుడు. వేదాలు చదివిన వాడు. వారణాశిలో రాత్రి వేళల్లో వచ్చి రహస్యంగా జీసస్‌ను కలుసుకునేవాడు. అప్పటి వారి పరిచయం తర్వాత స్నేహంగా మారింది. అజైనిన్‌కు అతిథిగా జీసస్ అక్కడ కొంత కాలం గడిపాడు. అతనికి ఓషధీ విద్యతో చికిత్సా విధానాలు నేర్పాడు. అజైనిన్ జీసస్‌కు అతీంద్రియ శక్తుల్ని స్వాధీన పరచుకునే పద్ధతులు నేర్పాడు.

◆ ◆ ◆

# 7. పర్షియా పర్యటన

(1) స్వదేశం తిరిగి వెళుతూ, మార్గమధ్యంలో జీసస్ పర్షియాదేశం చేరుకున్నాడు. అప్పటికి జీసస్ వయస్సు ఇరవైనాలుగు సంవత్సరాలు. ఆయన సంపన్నులను ఆశ్రయించలేదు. ధనికుల ఆతిథ్యం కోరలేదు. పేదసాదలతో కలిసి జీవించేవాడు. వారు తినేదే తనూ తిని, వారితో కలిసి నిద్రించేవాడు. మంచిమాటలు బోధిస్తూ మంచిగా జీవించమని చెప్పేవాడు. రాజకుటుంబాలు, మతపెద్దలు ఆయన్ని పెద్దగా పట్టించుకోలేదు. పేదసాదలే జీసస్‌ను అభిమానించే వారు. కొన్ని సందర్భాలలో అధికారులు, ధనికులు ఆయనకు ఆటంకాలు కలిగించారు. ప్రసంగించకుండా, చికిత్సలు జరపకుండా నిరోధించేవారు. వారి అవరోధాలు, తిరస్కారం ఆయన ఎన్నడూ పట్టించుకుని బాధపడింది లేదు.

పర్సిపోలిప్ నగరం చేరాడు. పర్షియాదేశ రాజనగరు పర్సిపోలిస్. అక్కడ మాంగీలు, జ్ఞానులు, యోగులు ఎక్కువ. హర్, లున్, మెర్ అనే ముగ్గురు దివ్య జ్ఞానులు ఈ నగరం వారే. వీరే ఇరవై నాలుగు సంవత్సరాల క్రితం, జ్ఞానదృష్టితో జీసస్ జననం తెలుసుకుని జెరూసలెం వెళ్లి జీసస్‌ను గుర్తించారు. వీరికి జ్ఞానదృష్టి ఎక్కువ. ఆదృష్టితోనే ఇప్పుడు జీసస్ పర్సిపోలిస్ వస్తున్నట్లు తెలుసుకున్నారు. ఎదురువెళ్లి స్వాగతం చెప్పడానికి ఉద్యుక్తులైనారు.

ఆ ముగ్గురు జ్ఞానవృద్ధులు జీసస్‌ను కలిసినప్పుడు, దివ్యకాంతి వారిచుట్టూ వ్యాపించింది. పరిసరాలు వెలుగుతో నిండిపోయాయి. చూచేవారికి వారు నలుగురు వెలుగు బొమ్మల్లా కనిపించారు. కాంతి ఘనీభవించిన భ్రాంతి కలిగింది. వారు దేవతలే అనిపించారు. వారిలో హార్, లున్‌లు మరీ వయోవృద్ధులు. వారిద్దరిని జీసస్ తన ఒంటెపైన ఆశీనుల్ని చేసి తను, మెర్ ఇరువైపుల నడుస్తూ నగర ప్రవేశం చేశారు. మాగీల నివాసం మహాత్ముల పాదస్పర్శతో పునీతమైంది. జీసస్ వారికి తన కథ వినిపించాడు. వారు జీసస్ ఆత్మకథను హృదయంతో విన్నారు.

ఉత్తర పర్షియా నుండి మరో ముగ్గురు యోగులు వచ్చి పర్సిపోలిప్‌లో మకాం వేశారు. వారు కస్పర్, జరా, మెల్జోన్. మాగీల బృందంలో కాస్పర్‌కు

మహా మేధావిగా గుర్తింపు వుంది. ఆ ముగ్గురు హార్ ఇంట్లోనే ఉన్నారు. జీసస్ వచ్చిన సమయంలో మొత్తం ఏడుగురు మహాయోగులు ఏడు రోజులు ఏక దీక్షగా ధ్యానంలో గడిపారు. ఏడు రోజులపాటు వాతావరణం నిశ్శబ్దం. పరిసరాలు సైతం తపోనిష్టలో గడిపాయి. నిశ్శబ్దమే వారి యోగం. మౌనమే వారి సంభాషణ. వారు సమష్టిగా దివ్యశక్తిని అవాహన చేసి, భూమిపైకి తీసుకు వచ్చారా అనిపించింది. ప్రపంచానికి మహాత్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది. దివ్యత్వం కోసం మానవాళి వేయి కళ్లతో ఎదురుచూస్తుంది. వేయి చేతులతో స్వాగతిస్తుంది.

(2) ఉత్సవాలు జరుగుతున్న సమయం అది. పలుప్రాంతాల నుండి పెద్దలు, భక్తులు వచ్చారు. పర్సిపోలిప్ కనుల పండువగా ఉంది. నగరంలో ఉత్సాహం. భక్తుల రద్దీ. భారీగా భోజన భాజనాలు జరుగుతున్నాయి. మతాధికారి ఒక ప్రకటన చేశాడు : “ఈ నగరంలో నాలుగు గోడల నడుమ ఎవరికైనా స్వేచ్ఛ ఉంది. ఎవరైనా తమ అభిప్రాయాలు నిర్భయంగా ప్రకటించవచ్చు”.

ఆ అవకాశాన్ని జీసస్ వినియోగించుకో దలచాడు. వేదికపైకివచ్చి ప్రసంగించసాగాడు : “సోదర సోదరీ మణులారా! భగవద్భక్తులారా! మీరు నిజంగా అదృష్టవంతులు. ఇక్కడ సమావేశం కావడం మన అదృష్టం. మీ ముందు ప్రసంగించే అవకాశం కలగడం నా అదృష్టం. మీరంతా పవిత్ర మనస్సుతో వచ్చారు. మీ భక్తి శ్రద్ధలు, ఆరాధనలు భగవంతుని అలరించాయి. మీ జాతి ప్రవక్త జరతష్ట్రకు నా నమస్కారాలు, కృతజ్ఞతలు.

“మీరంతా అంగీకరిస్తారు భగవంతుడు ఒక్కడేనని. పరమాత్మ, పరబ్రహ్మ, భగవంతుడు అన్నీ ఒక్కరే. ఒక్కటే. ఆ ఒక్కటైన పరాశక్తి, ఏడు పాయలుగా విభాగితమైంది. ఆ శక్తుల ప్రచలనంవల్ల భూమి, ఆకాశం ఏర్పడ్డాయి. వాటి ప్రభావం వల్లనే సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు ఏర్పడ్డాయి. మీ ప్రాచీన గ్రంథాలు నేను చదివాను. ఆ ఏడు శక్తులలో రెండు చాలా శక్తివంతమైనవి. బలమైనవి. వాటిలో ఒకటి మంచిని సృష్టిస్తే రెండవది చెడును సృష్టిస్తుంది. ఇక్కడ మహాజ్ఞానులు, యోగులు అనేక మంది ఉన్నారు. వారిని నేను అర్థిస్తున్నాను. దైవశక్తి చెడును ఎందుకు సృష్టించింది? లేక ‘మంచి’ నుండే చెడు ఏర్పడిందా?”

ఒక పండితుడు లేచి “నాప్రశ్నకు మీరు సమాధానం చెప్పగలిగితే మీ సమస్యకు సమాధానం లభిస్తుంది. చెడు ఉన్నదని అందరం అంగీకరిస్తున్నాం. ప్రతిదానికి కారణం ఉంటుంది. భగవంతుడు సృష్టికి మూలకారణం. ఆ భగవంతుడే ‘చెడు’ను కల్పించాడు. ఆ చెడుకు ఒక దేవుడుంటాడా?”

జీసస్ : మంచిదేవుడు, చెడు దేవుడని ఉండరు మహాశయా. భగవంతుడు ఒక్కడేనని అందరూ అంగీకరిస్తున్నారు. చెడును సృష్టించే దేవుడు మరొకడు ఎలా ఉంటాడు. మంచి వెనకనే చెడు ఉండాలి. ఏడు శక్తులూ మంచివే. సృష్టిని గురించి ఆలోచించండి. సృష్టించబడిన సమస్త వస్తుజాలం, ప్రాణికోటికి రంగులున్నాయి, రూపాలున్నాయి, స్థితులున్నాయి. అంతర్యంలో అన్నీ మంచివే. దేనికది విడిగా ఉన్నప్పుడు స్వచ్ఛంగా, నిష్కల్మషంగా ఉంటుంది. సంఘర్షణ కారణంగా, సంకరం జరిగినప్పుడు చెడు తలెత్తుతుంది. మనిషిలో చెడు అలా ఏర్పడేదే. మనిషి తన తెలివితేటలతో భగవంతుని విస్మరిస్తాడు. దైవాన్ని విశ్వసించినంత కాలం చెడుమార్గంలోకి పోడు".

ప్రసంగం ముగించి జీసస్ మౌనం వహించాడు. మాగీ పండితులు ఎవరూ ఎదురు చెప్పలేకపోయారు. జీసస్ లేచి ధ్యానానికి వెళ్లిపోయాడు.

**3** ఉదయమే జీసస్ బయలుదేరాడు. వీధివీధి, ఇల్లిల్లు తిరిగి, అర్థించిన వారిని ఆదుకోవడం, స్వస్థత చేకూర్చడం ఆయనకు దినచర్య. ఆయన నడుస్తుంటే చుట్టు కాంతివలయం ఏర్పడి, ఆయన వెలుగులో నడుస్తున్నట్లు, జనాలను వెలుగులోకి నడిపిస్తున్నట్లు అనిపిస్తుంది. కాని ఆరోజున ఆయన చుట్టూ చీకటి ఆవరించింది. ఒక చీకటి దేవత రెక్కలు విప్పి ఆయనపైన వెలుగు ప్రసరించ కుండా కప్పివేసింది. ఒక మతాధికారి దానిని పసిగట్టి జీసస్ వద్దకు వచ్చి ప్రశ్నించాడు.

"మహాశయా, తమరు బోధించే విషయాలు ఎక్కడివి? ఎక్కడ నుండి వస్తాయి? మీ చుట్టూ కనిపించే తేజస్సుకు అర్థం ఏమిటి? దాని అంతర్యం ఏమిటి?"

జీసస్ సమాధానం చెప్పాడు : "నిశ్శబ్దంలో శబ్దం లీనమవుతుంది. ఆత్మ పరమాత్మను అనుభూతిస్తుంది. ఆ శూన్యం నుండి ఆత్మ పరమాత్మ ప్రజ్ఞను అందుకుంటుంది. జ్ఞానం దాటి ప్రజ్ఞను ప్రదర్శించేవారిచుట్టూ తేజస్సు వలయంగా ఏర్పడుతుంది. అది జ్ఞాన తేజస్సు. అది ప్రజ్ఞావిశేషం. అది దైవత్వానికి గురుతు. జ్ఞానంతోపాటు ప్రేమ, దివ్యశక్తి వారిని వరిస్తాయి".

అతను మరలా ప్రశ్నించాడు. "ఆ ప్రశాంతిని గురించి, తేజస్సును గురించి, మరికాస్త వివరించండి మహాత్మా! నాకు అలాంటి ప్రశాంతిని పొందాలని ఉంది?"

జీసస్ : ప్రశాంతి అనేది ఒక ప్రదేశం కాదు, ఒక స్థితి కాదు. అది అతీంద్రియం. దానిచుట్టూ గోడలు, అవరోధాలు ఉండవు. దానికి నియతి, పరిమితి

ఉండవు. అది నిరీహస్థితి. అతీంద్రియ ప్రస్థానం. అది మీలో భగవంతుని దర్శించే పరిస్థితి. కొండ శిఖరాలపైన ఉన్నా, అగాధంలో ఉన్నా, గుహలో ప్రశాంతంగా ఉన్నా, ఏపని చేస్తున్నా నిశ్శబ్దం కావచ్చు. మానసికంగా శబ్ద ప్రపంచాన్ని దాటి పోవడమే నిశ్శబ్దం. ఏ సమయంలోనైనా నీ హృదయం తలుపులు తెరవవచ్చు, నిశ్శబ్దం కావచ్చు. ఆ హృదయం లోపలకు వెళ్లి, తలుపులు గట్టిగా మూస్తే నిశ్శబ్దం నీదవుతుంది. ప్రశాంతి నిన్ను ఆవరిస్తుంది. భగవంతుడు ఉండేది నీ ఆత్మలోనే. కొండ గుహల్లో తపస్సు చేయడం ముఖ్యం కాదు. ఆలోచనలు లేకుండా చేసుకోవడం ముఖ్యం. బరువులు మోయలేనప్పుడు సమస్యలు తలెత్తుతాయి. ఆలోచనలు కల్లోల పరుస్తాయి. ప్రశాంతి అన్నది ఆత్మకు సంబంధించింది. కంటికి కనిపించదు. చెవికి ఏమీ వినిపించకపోవడం నిశ్శబ్దం. అది ప్రశాంతి కాదు. నీ మనస్సులో అనేక భావాలు, చిత్రాలు, ఆలోచనలు తిరుగుతుంటాయి. గట్టిగా పొమ్మంటే అవి వెళ్లిపోవాలి. మహాత్ములైన వారు చెప్పిన మాటలు మనస్సులు వింటాయి. ఆత్మలు వింటాయి. పవిత్ర జీవనం ఒక్కటే 'ఆత్మ' ప్రవేశానికి అనుమతి నిస్తుంది. నీలో కల్మషాలు ఉన్నంతకాలం ఆత్మతీరం చేరలేవు. మానసిక విచారాలు, వికారాలు దాటిపోవాలి ముందుగా. వత్తిడులకు, భయాందోళనలకు లోను కాకూడదు. ఇబ్బంది కలిగించే ఆలోచనలు వదలిపెట్టాలి. అసలు నీవు ఆలోచించడం మానడం మరీ మంచిది. నీ సంకల్పం ఎప్పుడూ దైవ సంకల్పానికి అనుకూలంగా స్పందిస్తుండాలి.

"అప్పుడు నీవు పవిత్రాలయం చేరినట్లు. అది దివ్యమందిరం. దివ్యతేజస్సు అక్కడ కనిపిస్తుంది. దివ్యజ్యోతి దర్శనమవుతుంది. మనస్సు ద్వారాలు దాటి హృదయ మందిరం లోపలకు వెళ్లి, ఇంకా లోపలకు వెళ్లి, చీకట్లను చీల్చుకుని లోపలకు పోతే అంతా వెలుగు మయం. చిత్రంగా నీలో ఆపాదమస్తకం జ్యోతులు వెలగడానికి సిద్ధంగా ఉంటాయి. అప్పుడు గమనించు. నీలోకి జ్ఞాన ప్రవాహాలు వచ్చి చేరుతుంటాయి. సత్యదీప్తులు నీచుట్టూ పరవళ్లు త్రొక్కుతుంటాయి. ఆ శాంతి జలాలలో సుస్నాతుడవై నీవు అక్కడే ఉండి పోతావు.

"అప్పటికి అన్ని భ్రమలు తొలగిపోతాయి. నీవే పరమాత్మ అన్న భావన బలపడుతుంది, స్థిరపడుతుంది. నీవు వేరు బ్రహ్మం వేరు కాదు. భయపడ వలసిన అవసరం లేదు. అది అంతా నిగూఢం. మార్మికం. అవ్యక్తం. నీకు రహస్య 'లిపి' తెలుస్తుంది. అది మార్మిక లిపి. సృష్టి రహస్యాలు నీ మనోనేత్రానికి తెలుస్తాయి. నీ బుద్ధికి అందుతాయి. భగవంతుని లీలలు అర్థమవుతాయి. సృష్టిలో ఏదీ రహస్యం కాదు. భృక్తం రహితం కావాలి. అక్కడే 'ప్రాణకళ' ఉంటుంది. అదే

ప్రాణనిధి. ప్రతి ఆత్మ తన సంబంధిత రహస్యాలను అక్కడ ఆగారంలో దాచుకుంటుంది. వాటిని కొన్ని దివ్యశక్తులు రక్షిస్తుంటాయి. ఎవరైనా తన ఆత్మతో వెళ్లి, తనవైన సంపదల్ని తెచ్చుకోవచ్చు".

ఆ హీబ్రూ జ్ఞానయోగి మాటలు ఆయనకు నచ్చాయి. అక్కడ నుండి జీసస్ బయలుదేరాడు.

◆ ◆ ◆

# 8. అస్సీరియా పర్యటన

(1) జీసస్ పర్షియా వదలి స్వదేశానికి వెళ్లడానికి సిద్ధమైనాడు. పండితులు, యోగులు ఆయనను యూఫ్రేట్స్ వరకు సాగనంపారు. "మరొకమారు ఈజిప్టులో కలుద్దాం" అని జీసస్ వారికి మాట ఇచ్చాడు. జీసస్ చాల్డియా చేరాడు. 'అబ్రహాం' జన్మించిన 'ఉర్'లో కొద్ది రోజులు గడిపాడు. అక్కడివారికి తనను పరిచయం చేసుకున్నాడు.

"మనమంతా సహోదరులం. రెండువేల సంవత్సరాల క్రితం మా పూర్వీకులు ఇక్కడ నివశించేవారు. మా రుషి అబ్రహాం ఇక్కడే జన్మించాడు. ఇక్కడే ఆయన బోధించాడు. ఇజ్రాయిల్‌లో మా అందరికీ ఆయన ఆరాధనీయుడు. అబ్రహాం, సారా ఈ నేలను వదలి వందల ఏళ్లు గడిచాయి. ఆయన వంశీయులు ఇక్కడ ఉండే ఉంటారు. వారి హృదయాలలో అబ్రహాం జ్ఞాపకాలుంటాయి. ఈ ద్రాక్షతోటలలో అబ్రహాం తీపి గురుతులు నాకు కనిపిస్తున్నాయి".

సద్భావన, శాంతి గురించి జీసస్ సందేశాలిచ్చాడు. మానవులంతా సోదరులవలె కలసి మెలసి జీవించాలని ఉద్బోధించాడు. మనిషిలోని నిగూఢ శక్తుల్ని గురించి వివరించాడు. ఆత్మని గురించి బోధించాడు. అత్మశక్తుల్ని ప్రబోధించాడు.

జీసస్‌ను 'ఆష్బినా' అనే మహర్షి సత్తముడు కలిశాడు. ఆష్బినా అస్సీరియాలో కెల్లా పరమ పూజనీయుడు. సాధుశీలి. ప్రజలకు ఆయన సుపరిచితుడు. అప్పుడప్పుడు ధర్మోపన్యాసాలిస్తుంటాడు. అయితే ఆయన ఏకాంత జీవి, నిరాడంబరుడు. ఎక్కడ నివశించేది ఎవరికీ తెలియదు. ఆయన దర్శనమే వారికి ఆనందం కలిగిస్తుంది.

ఆ మహాత్ములిరువురు కలిసి అస్సీరియాలో గ్రామాలు, పట్టణాలు పర్యటించారు. టైగ్రస్-యూఫ్రేట్స్ మధ్య భూభాగం అంతా తిరిగారు. వెళ్లిన ప్రతిచోట జీసస్ జ్ఞానబోధ చేశాడు, చికిత్సలు నిర్వహించాడు.

(2) జీసస్ అష్బీనాలు బాబిలోన్ చేరుకున్నారు. కోటలు పాడుబడి, గోడలు బీటలువారిఉన్నాయి. కోటగుమ్మం దాటి ఇరువురు నగరం ప్రవేశించారు. శిధిల భవనాలు, నిర్మానుష్య ప్రాసాదాలు వారికి స్వాగతం చెప్పినట్లయింది. ఒకప్పుడు ఇజ్రాయిల్‌ను దాస్యంలో ముంచిన నగరం. జూడా వంశీకులు వైభవంగా తిరిగిన ప్రాసాదాలు బోసిపోయి ఉన్నాయి.

“భగవంతుడా, ఇది మనిషి అహంకారానికి, ఆభిజాత్యానికి పట్టిన అధోగతి. బాబిలోన్ ప్రభువు జెరూసలెంలోని ప్రాచీనదేవాలయాన్ని నేలమట్టం చేశాడు. జెరూసలెం నగరాన్ని అగ్నికి ఆహుతి చేశాడు. ప్రజల్ని శృంఖలాలలో బంధించాడు. పిల్లా, పాపను ఇక్కడకు బందీలుగా తెచ్చుకున్నాడు. ఇది వారి ఘాతుకానికి ప్రతీకారం. ఒకజాతి మరొకజాతికి చేసే అన్యాయానికి శిక్ష తప్పదు. ఇప్పుడు బాబిలోన్ ప్రభ అంతరించింది.

బేలన్ దేవాలయంలో జీసస్, అష్బీనాలు నిశ్శబ్దంగా ధ్యానం చేశారు.

షినార్ శిథిలాల మధ్య జీసస్ ఏడు రోజులు గడిపాడు. అష్బీనాతో కలిసి తీవ్రంగా ధ్యానించాడు. భవిష్యత్తులో ఇక్కడ ప్రజలు సుఖశాంతులలో వర్ధిల్లాలని ఆకాంక్షించాడు. అది ఋషి వాక్కు, మహావాక్యం.

అక్కడ నుండి బయలుదేరిన జీసస్ కొన్ని రోజులకు జోర్డాన్ దాటి జన్మభూమికి చేరుకున్నాడు. సరాసరి నజరత్‌కు దారితీశాడు. జీసస్‌ను చూడగానే మేరీ మాతృహృదయం ఆనందంతో ఉప్పొంగింది.

జీసస్ తన పర్యటన గురించి తల్లికి, చెల్లెలు మిరియాలకు మాత్రం వివరంగా చెప్పాడు. తాను ఎంత జ్ఞానం సంపాదించింది, ఎందరు నిరుపేదలకు, రోగార్తులకు సహాయం చేసిందీ చెప్పాడు. మిగిలిన వారెవరికి తన 'ఆత్మయానం' గురించి చెప్పలేదు. చెప్పినా అర్థం చేసుకునే సంస్కారం, సహృదయం వారికి లేవని తెలుసు.

◆ ◆ ◆

# 9. గ్రీసు పర్యటన

(1) గ్రీకు తత్వశాస్త్రం అత్యున్నత ప్రమాణాలు సంతరించుకున్నదని, అక్కడ గొప్ప తత్వవేత్తలు, దార్శనికులు ఉన్నారని విని జీసస్ ఆ దేశం వెళ్లి అక్కడి తత్వజ్ఞానం తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఒక విద్యార్థిగా నజరత్ వదలి, కార్మెల్ పర్వతాలు దాటి, సముద్రతీరంలో పడవఎక్కి గ్రీకు రాజధాని చేరుకున్నాడు. ఏథెన్స్‌లో కొందరు జీసస్ గురించి కర్ణాకర్ణిగా విని ఉన్నారు. అతని తత్వచింతన గురించి విన్నారు. జీసస్‌కు ఒక తత్వవేత్తగా గౌరవం ఉంది. ఆయన స్వయంగా ఏథెన్స్‌కు రావడం వారికి ఆనందం కలిగించింది.

గ్రీకు తత్వవేత్తలలో అపోలో ప్రసిద్ధుడు. అతనిని ధర్మదేవతగా గౌరవిస్తారు. ఇతర దేశాలవారు అపోలోను మహర్షి అంటారు. జీసస్‌కు అపోలో ఆతిధ్యం లభించింది. గ్రీకు తత్వభాండారం ఆయన ముందు విప్పి పరిచాడు. ఏరోపగస్‌లో అనేకమంది తాత్వికోపన్యాసాలు వినే అవకాశం కలిగింది. ఎందరితోనో ఎన్నో విషయాలు చర్చించాడు. జీసస్ అనుభవం, జ్ఞానం వేరు. వారి ఆత్మవిచారణ వేరు, అవగాహన వేరు. అవి భిన్నమార్గాలు. ఒకసారి సమావేశంలో అపోలో జీసస్‌ను ప్రసంగించమని కోరాడు. జీసస్ వెంటనే అంగీకరించాడు.

"ఏథెన్స్ తత్వవేత్త లైన మీ అందరకు నాకృతజ్ఞతలు, – చాలా సంవత్సరాల క్రితం మహాజ్ఞానులు ఈ దేశంలో జన్మించారు. అనేక దేశాలలో మహర్షులున్నారు, జ్ఞానులున్నారు. ఈ దేశంలో ఉన్న మీ హృదయస్పందనలు ఇతర దేశాలలోని తాత్వికులకు అందుతుంటాయి. మన భావ తరంగాలు ఈథర్ ద్వారా పయ నిస్తుంటాయి. జిజ్ఞాస కలవారికి అందుతుంటాయి. భావసంగమం జరిగేది ఆకాశంలో. వాటి కాంతి కిరణాలు నక్షత్రాలుగా ప్రకాశిస్తుంటాయి. ప్రపంచంలో అన్ని దేశాలకన్న ఏథెన్స్‌లో చైతన్యస్పందన ఎక్కువగా ఉంది. గ్రీసు మొత్తంగా ఒక విజ్ఞాన ఖని. ఒక జ్ఞాన భాండారం. ఇక్కడ ఉన్నంతమంది మేధావులు మరే దేశంలోనూ లేరు. సాహిత్యం, విజ్ఞానం, దర్శనం, కళలు, సంగీతం – అన్ని శాఖలలోనూ మీరే నిష్ణాతులు.

"నేనిప్పుడు విజ్ఞానం గురించి మాట్లాడడం లేదు. తాత్వికచింతన, కళోపాసన గురించి ప్రసంగించను. ఆయా విషయాలలో మీరే అగ్రగణ్యులు. ఇవి కల్పనలు, కేవల భౌతికాలు. అవి భౌతికత పరిధిలోనివి. నేను 'పరం' గురించి ప్రస్తావిస్తాను. పరేంగిత ప్రజ్ఞను గురించి, పరావిద్య గురించి, అతీంద్రియ శక్తి గురించి ప్రస్తావిస్తాను. అది ఒక్కటే నాకిష్టమైన అంశం. ఎవరూ పరాన్ని అలక్ష్యం చేయకూడదు. విజ్ఞానశాస్త్రాలలో ఆత్మప్రసక్తి ఉండదు. అందరి అభిప్రాయాలు నేను గౌరవిస్తాను. అయితే నా ప్రస్థానం భగవంతుని వైపుగా సాగుతుంది.

"ఆత్మ సహకారం లేకుండా, కేవలం మానసికశక్తితో సమస్యలు పరిష్కారం కావన్నది నా నమ్మకం. ఇంద్రియజ్ఞానం వల్ల మన మనస్సులో చిత్రాలు, రూపాలు ఏర్పడుతుంటాయి. అవి కరిగిపోతుంటాయి క్రమంగా. ఆ భావాలు వాస్తవం కావు. ఆ చిత్రాలకు రూపం ఉండదు. వాటికి శాశ్వతమైన విలువ లుండవు. మనిషికి 'ఆత్మ' ఒకటి ఉంటుంది. అది మనస్సు పొరల్ని చీల్చి దివ్యత్వాన్ని దర్శింపచేస్తుంది. దానిని ఆత్మ దర్శనం, ఆత్మ చైతన్యం అంటారు. ఆత్మ జాగృతం అయిన తర్వాత ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఆ చైతన్యం ప్రతి మనిషిలోనూ నిద్రిస్తుంటుంది. మనం మనలోకి మనంగా దివ్యత్వాన్ని స్వాగతిస్తే తప్ప దివ్యత్వం మన లోపల ప్రవేశించదు.

"ఆ తలుపుల్ని తెరిచేశక్తి వివేకానికి లేదు. తత్వం, వేదాంతం, సాహిత్యం కళలు తెరతొలగించి లోపలకు తొంగిచూడడానికి పనికొస్తాయి తప్ప లోపలకు ప్రవేశించవు. వాటిద్వారా పూర్తిలక్ష్యాన్ని సాధించడం కుదరదు. ఆ తలుపుల్ని తెరవ కలిగింది పవిత్ర జీవనం, దివ్యభావన. ధ్యానం ఆపని చేయగలదు. సంకల్పం తలుపులు తెరవగలదు. మీరంతా మేధావులు. ఈ విషయాన్ని గ్రహించగలరు. మీ ప్రతిభ, ఆలోచన, శక్తి యుక్తుల్ని అటువైపు తిప్పండి. ఆధ్యాత్మ బోధనల వైపు కాస్త మొగ్గు చూపండి. మనిషి ప్రార్థిస్తే భగవంతుడు ప్రసన్నమవుతాడు. అప్పుడు మీ ఆత్మ చైతన్యం పొంది జాగరిత మవుతుంది".

జీసస్ ప్రసంగానికి సభికులు అవాక్కయినారు. జీసస్ సభాసదులకు అభివాదం చేసి వేదిక దిగిపోయాడు. ఆయన మాటల్లో ఏదో నిజాయితీ ఉంది. ఏదో సత్యం దోబూచులాడుతోంది - అనుకున్నారు శ్రోతలు.

**2** చాలాకాలం జీసస్ గ్రీకు తత్వవేత్తలతో కలసి అధ్యయనం చేస్తూ గడిపాడు. అప్పుడప్పుడు ప్రసంగాలు చేస్తుండేవాడు. గ్రీక్ విద్యావేత్తలు జీసస్ అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవించకపోయినా గౌరవించేవారు. ఆయన తాత్త్వికత, జిజ్ఞాస, నిర్భీకత, నిజాయితీ వారికి నచ్చాయి.

ఒకనాడు జీసస్, అపోలో సముద్ర తీరంలో విహరిస్తుండగా ఒక వ్యక్తి పరుగునవచ్చి, "అపోలో మాస్టర్. త్వరగా రండి. ఓరకల్ (దివ్యవాణి) మీతో సంభాషించాలని ఆదేశించింది. రండి త్వరగా" అన్నాడు.

గ్రీకు దేశంలో 'ఓరకిల్' సంప్రదాయం ఉంది. అప్పుడప్పుడు ఒక దేవతా విగ్రహం నుండి దివ్యవాణి వెలువడుతుంది. అపోలోతో పాటుగా జీసస్ బయలుదేరాడు. ఆయనకు ఈదైవవాణి వినిపించడం కొత్త. ఆ విగ్రహం ముందు అపోలో భయభక్తులతో తలవంచి నిలబడ్డాడు.

దివ్యవాణి పలికింది, "మహర్షీ కొత్తయుగం ప్రారంభం కానున్నది. పాత యుగం అంతరించి కొత్త యుగం అవతరించనున్నది".

యుగాలు మారుతుంటాయి. డెల్ఫిన్ యగంలో దేవతలతో మనుషలకు సంబంధాలుండేవి. ఓరకిల్ అంటే కొయ్యతో, బంగారంతో, రాతితో చెక్కిన ఒక విగ్రహం. ఆ విగ్రహం సందేశాలివ్వడం ఓరకిల్.

"ఇంక ఓరకిల్స్ వినిపించవు. ఇకపైన దైవ సందేశాలు మహాత్ముల నోటి నుండి వినిపిస్తాయి. మహాత్ములే దేవుని ప్రతినిధులు. అది పరమాత్మ నిర్ణయం. ఇకపైన నాశక్తి పనిచేయదు. నేను మీకు వినిపించను. ఇకపైన పరమాత్మ అయిన ఇమ్మాన్యుయెల్‌ను నేరుగా ప్రార్థించండి".

ఆ తర్వాత ఓరకిల్ వినిపించలేదు. విగ్రహంలో తేజస్సు తగ్గిపోయింది. గ్రీకు మేధావులు ఈ విపత్కరానికి ఆశ్చర్యపోయారు.

మరొకసారి అపోలో ప్రశ్నించాడు. "జీసస్ మహాశయా, ఓరకిల్స్ అనేక సందర్భాలలో గ్రీకు ప్రజలకు గొప్ప సందేశా లిచ్చింది. నాకో సందేహం? ఆ వాణి ఎవరిది? ఎలా వినిపిస్తుంది? అది మానవ స్వరమా? దివ్యస్వరమా! మీకేం అనిపిస్తుంది?"

జీసస్ : ఆ పలికేది మనిషి కాదు. దేవుడూ కాదు. అది మీ ప్రాచీన గ్రీకు మహర్షుల సమష్టి గొంతుక. అది వారి సందేశం. అది పరమాత్మ సందేశం మహాత్ముల ద్వారా వినిపించడం. రూపం లేకపోయినా మహాత్మలు పలుకుతాయి. ఆ పలుకులు మనకు వినిపిస్తాయి. మహాత్మలు అంతర్హితమైతే ఆ సందేశాలు వినిపించవు".

(3) జీసస్ సముద్రతీరం వెంట నడుస్తున్నాడు. అకస్మాత్తుగా తుఫాను ప్రారంభమైంది. క్షణాలలో సముద్రం కల్లోలమైంది. పడవలు ఎగిరెగిరి

పడసాగాయి. కొన్ని సముద్రగర్భంలో మునిగిపోసాగాయి. జాలరులు, నావికులు సముద్రజలాల్లో మునిగిపోతున్నారు. తీరం వెంట శవాల కుప్పలు చేరుతున్నాయి. జీసస్ కొంతమందిని రక్షించి ఒడ్డుకు చేర్చాడు.

సముద్ర తీరంలో జలదేవత విగ్రహం ఉంది. అనేక ఆలయాలున్నాయి. అన్నింటిలో బెస్తలు సముద్రదేవత విగ్రహాలు పెట్టి పూజలు చేస్తుంటారు. ఉత్సవాలు చేస్తుంటారు. ఆ దేవత తమని ఉపద్రవాల నుండి రక్షిస్తుందని వారి నమ్మకం.

కొంతసేపటికి తుఫాను తగ్గు ముఖం పట్టింది. అలల ఉధృతం తగ్గింది. జీసస్ వారినుద్దేశించి అన్నాడు. "అమ్మలారా, అయ్యలారా! మీరు ఈ కొయ్య బొమ్మల్ని, రాతి విగ్రహాలను, దేవుళ్లని ప్రార్థిస్తున్నారు. సరే. ఈ విగ్రహాలకు, తుఫానులకు ఏమిటి సంబంధం? ఈ బొమ్మలకు ప్రళయాన్ని ఆపే శక్తి ఎక్కడిది? చెక్కతో ఓ బొమ్మను చేసి, రంగులద్దినంత మాత్రాన దేవత అవుతుందా? దానికి శక్తి వస్తుందా? కత్తులు, కటార్లు ఆ బొమ్మల చేతిలో పెట్టినంత మాత్రాన, అవి మిమ్మల్ని రక్షిస్తున్నట్లా? మనం మనవంతు కృషి చేయాలి. మనం చేసేపనికి ప్రకృతి సహాయపడుతుంది. దేవాలయాల్లో, బొమ్మలకొలువు వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. మీరు వెళ్లి వీలైనంత మందిని రక్షించుకోండి. రక్షించ వలసింది భగవంతుడు. ఆ శక్తిని మీకు ఇచ్చేది భగవంతుడు. ఏ దేవతలో దిగివచ్చి, మీ బరువులు బాధ్యతలు తీసుకోరు. మీ పనులు మీరే చేయనప్పుడు దేవుళ్లెందుకు చేస్తారు? మీరు పని చేయడానికి సిద్ధం కండి. ఆ శక్తిని భగవంతుడే మీ కిస్తాడు. కష్టాలలో ఉన్న వారికి సహాయపడడం అంటే భగవంతుని అనుగ్రహం పొందడం. మీరు ఇతరులకు సహాయం చేస్తే, భగవంతుడు మీకు సహాయం చేస్తాడు".

(4) జీసస్ గ్రీసు నుండి బయలుదేరాడు. దక్షిణాపథంలో పయనించి ఈజిప్టు చేరాలని ఆయన సంకల్పం. అపోలో ఇతర మిత్రులు రేవులో వీడ్కోలు పలికారు. వారికి కృతజ్ఞతలు చెప్పి జీసస్ తన వీడ్కోలు సందేశం వినిపించాడు.

"మిత్రులారా! నేనూ మీ వంటి మానవుడినే. అనేక దేశాలు తిరిగాను. అనేక దేవాలయాలు దర్శించాను. అనేకమంది జ్ఞానుల్ని కలుసుకున్నాను. 'సద్భావన, విశ్వశాంతి' నా ప్రధాన జీవితాశయాలు. కొందరు నా మాటలు విశ్వసించి, నన్ను ఆదరించారు. కొందరు చీత్కరించారు. గ్రీసులో మీరు ఎంతగానో ఆదరించారు. మానవస్వేచ్ఛా సౌభ్రాతృత్వాలకు గ్రీకు భావన గ్రీకు తాత్వికత ఎంతగానో ఉపకరిస్తాయని నా విశ్వాసం.

"గ్రీసు దేశం అనేక యుద్ధాలు చేసి చేసి అలసిపోయింది. మీ వారికి భుజబలం పైన, సైనికశక్తి పైన నమ్మకం ఎక్కువ. మీ బుద్ధి, జ్ఞానం పైన విశ్వాసం మరీ ఎక్కువ. కానీ మీరంతా ఆధ్యాత్మికత్వాన్ని అలక్ష్యం చేస్తున్నారు. 'ఆత్మ' శక్తిని గుర్తించడం లేదు. ప్రభుభక్తికి ఆత్మ శక్తి తోడుకావాలి. ఆత్మశక్తికి ఆత్మవిశ్వాసం ప్రధానాధారం. ప్రపంచం ఎల్లకాలం ఇలాగే ఉండదు. మార్పు వచ్చి తీరుతుంది. ప్రతి దేశం స్వతంత్రిస్తుంది. ఒకరి పెత్తనం మరొకరిపైన ఉండదు. ఉత్తిష్ఠ! భగవంతుని విశ్వాసానికి మీరూ పాత్రులు కండి. ప్రగతికి ఆధారమైన ఆత్మను జాగృతపరచండి. మిమ్మల్ని, మానవజాతిని రక్షించేది భగవంతుని అనుగ్రహం. ఆత్మశక్తి".

అపోలోతో, మిగిలిన మిత్రులతో కరచాలనం చేసి, జీసస్ సెలవు తీసుకున్నాడు. హీబ్రూ రుషి గ్రీసు తీరాన్ని దాటి వచ్చాడు.

◆ ◆ ◆

# 10. ఈజిప్టు పర్యటన

(1) ప్రయాణం సుఖంగా సాగింది. జీసస్ ఈజిప్టు నేలపై కాలుమోపాడు. ఎలిహూ, సలోమిల నివాసం చేరుకున్నాడు. ఇరవై అయిదు సంవత్సరాల క్రితం వారు మేరీకి ధర్మోపదేశం చేశారు. ఇప్పుడు తమ గురుకులంలో ముగ్గురి సమావేశం దైవఘటన. లోగడ ఇక్కడ మేరీ చదువుకున్నప్పుడు జీసస్ పసివాడు. ఇప్పుడు పాతికేళ్ల యువకుడు. జ్ఞాన యోగి. దేశదేశాలు తిరిగి జ్ఞానార్జన చేసినవాడు. జగద్గురువు స్థాయికి ఎదిగినవాడు. తలపండిన పండితులతో తలపడి తలపులు పండించుకున్నవాడు.

వృద్ధులైన గురు దంపతులకు తన ఆత్మకథ నివేదించుకున్నాడు. సంచార విశేషాలు చెప్పాడు. ఏ దేశంలో ఎవరెవరిని కలిసింది, ఏయే విషయాలు అధ్యయనం చేసిందీ వివరించాడు. ఎలిహూ-సలోమిలు జీసస్ కథాకథనం శ్రద్ధగా విన్నారు. నిండు మనస్సుతో యువకుని ఆశీర్వదించారు.

"హే భగవాన్ ..... ఈ జీసస్ నీ కుమారుడు. నీ ప్రజ్ఞకు ప్రతినిధి. ఇతని ద్వారా ప్రపంచానికి శాంతిని ప్రసాదించు భగవాన్! తన ద్వారా నీ ప్రేమ సందేశాన్ని సర్వులకు అందించు. దేశదేశాల ప్రజలు, సుఖ సంతోషాలతో జీవించేటట్లు అనుగ్రహించు దేవా!"

కొన్ని రోజుల తర్వాత జీసస్ హెలిలో పోలిస్ పట్టణం చేరుకున్నాడు. దానిని 'సూర్యనగరం' అంటారు. దేవాలయ ప్రాంగణంలో బసచేయడానికి అనుమతి లభించింది. ఆ దేవాలయ ప్రవేశానికి చాలా నిబంధనలున్నాయి. మతపెద్దలు, పూజారులు సమావేశమై, నిండుసభలో జీసస్‌ను ప్రశ్నించారు. అన్ని ప్రశ్నలకు జీసస్ నదురు బెదురు లేకుండా సమాధానం చెప్పాడు. పెద్దలు జీసస్‌ను అభినందించారు.

"రబ్బోనీ, నీవు ఇక్కడకు ఎందుకు వచ్చావు? నీవు నేర్చుకోవలసింది ఏముంది? నీవు సర్వజ్ఞుడవు. సాక్షాత్తు భగవంతుడే నీ నాలుకపైన నర్తిస్తున్నట్లుంది. నీ ప్రజ్ఞ అనితరసాధ్యం".

జీసస్ సమాధానం : "ప్రపంచంలో అనుభవించాలి. అనుభవంతో నేర్చుకోవాలి. ఎక్కడైనా ఎవరికైనా నేర్చుకోవలసింది ఎప్పుడూ ఉంటుంది. మనిషి ఉన్నతుడు కావడానికి అనేక మార్గాలుంటాయి. అనేక ఉపాయాలుంటాయి. నేనూ కొన్ని కష్టాలు పడాలి కదా. నన్ను మీతో ఉండనీయండి. మీ కఠోర నియమాలతో నన్ను పరీక్షించండి".

(2) సరస్సులో స్నానం చేసి వచ్చిన తర్వాత జీసస్‌కు సన్యాస దీక్ష యిచ్చి ప్రత్యేక దుస్తులు అందచేశారు. అప్పుడు మరల ప్రధానాచార్యుని ముందు హాజరు పరిచారు. ఆయన గోడకు వేలాడుతున్న ఒక 'పతకం' అందుకున్నాడు. దానిపైన ఒక అంకె, ఒక పదం రాసి ఉన్నాయి. అది వ్యక్తిత్వ పరీక్ష. ఆ సంఖ్యను బట్టి, ఆ పదాన్ని బట్టి, ఆ వ్యక్తి పూర్వజన్మ సంస్కారం, అర్హతలు తెలుసుకుంటారు. 'సున్న' పూర్ణత్వానికి చిహ్నం. ఏడు సంఖ్య పూర్ణ ప్రజ్ఞకు సంకేతం. పూర్ణత్వం పరమాత్మకు చిహ్నం (లొగోస్) లొగోస్ అంటే సృష్టి బ్రహ్మ. ఆయన సృష్టికి కారకుడు. సృష్టి కర్త. సృష్టి, స్థితి, లయ కారకుడు లొగోస్. హిబ్రూ మాస్టర్ అటువంటి పరమాత్మ. వర్తులం పూర్ణ మానవత్వానికి చిహ్నం. ఏడు కాలానికి గుర్తు. అది జీసస్ గుర్తు.

ప్రధానాచార్యుడన్నాడు : "ఏ వ్యక్తి తనను తాను తెలుసుకునేవరకు అంటే ఆత్మదర్శనం అయ్యేవరకు దివ్య కాంతిని దర్శించలేడు. పో, గుహలోకి వెళ్లి, నీ ఆత్మను వెతుక్కో. తర్వాత రా".

అంతలో ఒక అభ్యాసి వచ్చి జీసస్‌కు బాసటగా నిలబడి, సౌంజ్ఞ చేశాడు. అతను జీసస్‌ను ఒక చీకటి గుహలోకి తీసుకువెళ్లాడు. గది నిర్మానుష్యంగా, మసక మసకగా ఉంది. సూర్యోదయానికి ముందు ఉండే ఉషఃకాంతి అక్కడ పరచుకుంది. గోడలకు ఏవేవో బొమ్మలు, చిత్రాలు వేలాడుతున్నాయి. చుట్టూ మంత్రాలద్దిన యంత్రాలు కనిపించాయి. జీసస్‌ను ఆ మందిరంలో ఒంటరిగా వదలి, అభ్యాసి వెళ్లిపోయాడు. జీసస్ గోడమీది రాతల్ని చదివాడు. చిత్రాలలోని చిత్ర లిపిని అర్థం చేసుకున్నాడు. మంత్రాల మార్మికత గ్రహించాడు. ఆయా మంత్రాలను జపించాడు. ఆచార్య తనను ఆ మందిరంలో ఎందుకు బందీని చేసిందీ అర్థమైంది. మొదటిసారిగా తన 'ఆత్మ' మేల్కొన్నది. తన మనస్సు మత్తు వదిలించింది. తనను తాను గుర్తించిన తర్వాత తాను ఏకాకిని కానని, తన లోపల 'ఆత్మ' ఉన్నదని, తనను అహరహం అంటిపెట్టుకుని, తనను నడిపిస్తున్నది ఆత్మ అని గ్రహించ గలిగాడు.

ఒక రోజున అర్ధరాత్రి, నిద్రిస్తున్న సమయంలో, ఒక రహస్య ద్వారం తెరచుకుంది. అక్కడ ఒక ద్వారం ఉన్నదని అంతవరకు తనకు తెలియదు. ఒక

మతాధిపతి, స్వచ్ఛమైన, తెల్లటి దుస్తులు ధరించి జీసస్ వద్దకు నెమ్మదిగా వచ్చాడు. "సోదరా, క్షమించు. ఇలా వేళకాని వేళ వచ్చి నీకు నిద్రాభంగం కలిగించాను. నేను వచ్చింది నీ మేలుకోరి, నిన్ను రక్షించడానికి. నీవు గొప్ప ప్రమాదంలో చిక్కుకున్నావు. ఇక్కడ నీపైన ఘోరమైన కుట్ర జరుగుతోంది. హెలిపోలిస్ మతాధిపతులు నీవంటే చాలా అసూయగా ఉన్నారు. నీవు ఈ గుహనుండి ఎప్పటికీ బయట పడలేవు. నిన్ను ప్రాణంతో బయటపడ నివ్వరు. వీరిని మోసం చేస్తే తప్ప నీవు బయట పడలేవు. నీకు కావలసినంత నేర్చుకో. అప్పుడు నేను మళ్లీ వస్తాను. ఇక్కడి రహస్య మార్గాలు నాకు తెలుసు. నిన్ను రక్షించి తీసుకుపోతాను".

జీసస్ : సోదరా, మీరు వచ్చింది మోసం నేర్పడానికా? నేనున్నది పవిత్రాలయంలో. నాకున్నది పవిత్రాశయం. కుట్రలు, కుతంత్రాలు నాకు వద్దు. భగవంతుని ప్రేరణతో వచ్చాను. నా ప్రయత్నం విరమించుకోను. దయచేసి మీరు వెళ్లిపోండి!

ఆయన అన్నారు. "కపటాన్ని కపటంతోనే ఎదుర్కోవాలి. ఇక్కడి మతాధిపతులు కపటులు, మోసగాళ్లు. ఒకరు బాగుపడడం, పైకి రావడం వారి కిష్టం ఉండదు. దీపం ఉండగానే ఇల్లు చక్క పెట్టుకోవాలి. తర్వాత నీవూ, నేను చేయగలిగింది లేదు. భగవంతుని సాక్షిగా నిన్ను మోసం చేయడానికి నేను రాలేదయ్యా. నేను చెప్పవలసింది చెప్పాను తర్వాత నీ ఇష్టం".

ఆయన హెచ్చరించి వెళ్లిపోయాడు. మరికొంతసేపటికి మరొక మతాధికారి, తెల్లనిబట్టలతో ప్రత్యక్షమై అన్నాడు :

"మంచి నిర్ణయం చేసుకున్నావయ్యా. ఈ మందిరం నీ సహనానికే పరీక్ష. నీ సందేహాలకు, సంశయాలకు అగ్నిపరీక్ష ఇది" ఆయన జీసస్‌ను తనతో రమ్మని సైగచేయగా వెంటవెళ్లాడు. ఇద్దరు ధర్మపీఠం చేరుకున్నారు. సోదర బృందం కొలువు తీరివుంది. ప్రధానాచార్యుడు వచ్చి జీసస్ తలను స్పృశించి చేతిలో ఒక పతకం ఉంచాడు. అందులో ఒకే ఒక్క మాట ఉంది – 'నిజాయితీ'.

మరొక అభ్యాసివచ్చి జీసస్‌ను తనవెంట తీసుకువెళ్లాడు. అది ఒక విశాలమైన మందిరం. 'విశ్రాంతి తీసుకో' అని చెప్పాడు.

(3) "భగవంతుడైన పరమాత్మ విశ్రాంతి తీసుకుంటున్నాడా? లేదుకదా! నేనెందుకు విశ్రాంతి తీసుకోవాలి? సకల సుఖాలున్న ఈ మందిరం నాది ఎట్లా అవుతుంది. వీటిని ఉపయోగించే హక్కు నాకు లేదు. నేను సుఖాలు పొందడానికి

ఇక్కడకు రాలేదు. భగవంతుని లక్ష్యం నెరవేర్చడం ఒక్కటే నా విధి. జీవితాన్ని అర్థం చేసుకోవాలి. జీవితాన్ని అనుభవించడం అంటే సుఖాలు అనుభవించడం కాదు. జీవిత సత్యాలు ప్రామాణికంగా గ్రహించగలగటం. పరీక్షలకు తట్టుకోవాలి – బాధలు భరిస్తాను. ఆత్మపరంగా ప్రతి విజయం కొత్తను స్ఫురిస్తుంది.

జీసస్ అలా తలపోయగానే తోడు వచ్చిన అభ్యాసి, జీసస్‌ను మరొక చోటుకు తీసుకువెళ్లాడు. అది చిమ్మచీకటిగా వున్న గది. ఆ నిశ్శబ్దంలో, చీకటిలో ఎన్ని రోజులు గడిచాయో తెలియదు. ఆహారం లేక శరీరం నీరసించింది. ఒకరోజు నిస్రాణతో నిద్రిస్తున్న సమయంలో ఒక రహస్య ద్వారం తెరుచుకుంది. మత బోధకుల ఆహార్యంలో ఇరువురు లోపలకు వచ్చారు. వారి చేతుల్లో చిన్న దీపాలున్నాయి. వారిలో ఒక వ్యక్తి జీసస్ వద్దకు వచ్చి చెప్పాడు :

"బాబూ, నువ్వు పసివాడివి, అమాయకుడివి. నిన్ను చూస్తే జాలివేస్తోంది. ఈ భయంకరమైన గుహలో తిండి తిప్పలు లేకుండా ఎందుకు చచ్చిపోతావు? ఏం సాధించాలని? నీ మేలు కోరి చెబుతున్నాం. మా వెంట రా. రహస్యమార్గం గుండా నీకీ చెర తప్పిస్తాం. ఒకప్పుడు నీలాగా మేమూ ఇక్కడ బందీలుగా ఉన్నాం. ఈ హింసలు భరిస్తే అతీంద్రియ, అద్భుత శక్తులు వస్తాయని మేమూ భ్రమపడ్డాం. చివరకు ఇక్కడ మోసం గ్రహించి పారిపోయాం. అప్పుడు తెలిసింది భగవంతుని పేరున ఇక్కడ జరుగుతున్న కపటనాటకం. ఇక్కడ మతాచార్యులంతా హంతకులు, క్రూరులు, దయలేనివారు. పారిపో, వీరు ఎప్పుడో నిన్ను వారి దేవుడికి బలి యిస్తారని మా భయం".

జీసస్ అన్నాడు : అర్ధరాత్రి వేళ, చిరుదీపాల సాయంతో వచ్చారు. ఎవరు మీరు? మనిషి నైజం వారి మాటల్లో, ప్రవర్తనలో తెలుస్తుందంటారు. ఇదా మీ నైజం? ఈ గుహాలయంలోకి మీరు ఎలా రాగలిగారు".

ఒకతను సమాధానం చెప్పాడు : గోడలక్రిందగా రహస్య మార్గాలున్నాయి. మేమిక్కడ చాలా సంవత్సరాలుగా ఉంటున్నాం. మాకు ఆ మార్గాలు బాగా పరిచయం.

జీసస్ : అయితే మీరు స్వామి ద్రోహు లన్నమాట. ద్రోహం చేసేవారు పాపం చేసినట్లు. మిత్రులమనిచెప్పి మోసం చేస్తారు. ద్రోహచింత కలవారిని విశ్వసించకూడదు. వారిలో స్వలాభం, స్వార్థం ఉంటుంది. మీరు ఎలాంటి వారో నాకు తెలియదు. మీ మాట నేను వినను. ఇక్కడ ఉన్న వందల మంది దైవభక్తులను నేను మోసం చేయలేను. అలా మోసం చేస్తే నావంటి విశ్వాసహీనుడు, మరొక రుండరు, దయచేసి మీరు వచ్చిన త్రోవన వెళ్లండి.

నన్ను, నా ఆత్మను ఈ చీకటి గుహలోనే ఉండనీయండి. మీరు చూపిందే చిరు వెలుగులు నాకు అవసరం లేదు. మీ ఉచిత సలహాలు నేను తీసుకోను. ఇక్కడ సోదర బృందంపైన నాకు విశ్వాసం ఉంది. ఏదైనా స్వయంగా నిర్ణయించుకో గలను. నా మంచి చెడ్డలు నిర్ణయించవలసింది మీరు కాదు నేనూ కాదు, భగవంతుడు దయచేసి వెళ్లండి. నాకు ఇక్కడే హాయిగా ఉంది. ఇక్కడ వెలుగు పడకపోవచ్చు. నాలోపల వెలుతురుంది. ఆత్మజ్యోతి వెలుగు నాకు చాలు. సూర్య చంద్రుల వెలుగుకంటే ఆత్మ తేజస్సు గొప్పది".

వచ్చిన వారు జీసస్‌ను బెదిరించి, భయపెట్టి నిష్క్రమించారు.

కొద్దిసేపటి తరువాత ఒక వృద్ధమతాచార్యుడు ఆ గదికి వచ్చాడు. ఆయన రాకతో ఆ మందిరం దేదీప్యమానంగా వెలిగింది. ఆయనకు జీసస్ ప్రణామం చేసి నిలబడ్డాడు ఆయన ఒక్కమాట మాట్లాడలేదు. జీసస్ చేతికి ఒక శాసనం అందించాడు. దానిపైన 'ధర్మం' అని రాయబడి ఉంది.

అప్పటికి జీసస్ అసూయాద్వేషాలు జయించాడు. వాటికి అతీతుడై ప్రేమ మూర్తి అయినాడు.

**(4)** ఏడు రోజుల నిరీక్షణ తర్వాత జీసస్‌కు మరో మందిరంలో ప్రవేశం లభించింది. అది చీకటి గుహ కాదు. శోభాయమానంగా, దేదీప్యమానంగా స్వర్గతుల్యంగా వుంది. గాంధర్వ సంగీతం వినిపిస్తోంది. బంగారం, వెండితో చేసిన వస్తువులు, ఫలహారాలు, బీరువాలలో తాళపత్ర గ్రంధాలున్నాయి. గోడలకు గొప్పచిత్రాలు. శిల్పకళాఖండాలు. జీసస్ వాటినన్నింటిని ఆరాధన భావంతో పరిశీలించసాగాడు. అంతలో ఒక మతాచార్యుడు ఆ గదిలో ప్రవేశించి జీసస్‌తో చెప్పాడు :

"జీసస్ ఈ మందిరం బావుంది కదూ. నీవు నిజంగా అదృష్టవంతుడివి. చిన్న వయస్సులోనే ఉన్నతస్థితికి వచ్చావు. ఎందుకిలా నిగూఢ సత్యాలను పరిశీలించడంలో కాలం వృధా చేసుకుంటావు. నీవే ఒక కొత్త ధర్మాన్ని స్థాపించ వచ్చుగదా. పాతవాటిని నేర్వడం కన్న కొత్త సిద్ధాంతం ప్రతిపాదించడం గొప్ప ప్రతిజ్ఞ. తద్వారా కీర్తి సంపాదించవచ్చు. ప్లేటో తత్వచింతన కన్న నీ ప్రేమ సిద్ధాంతం గొప్పది. నీ బోధలు జనసామాన్యాన్ని అలరించేవిగా ఉన్నాయి. ఈ చీకటి గుహల్లో ఎంతకాలం శోధించినా ఏం ప్రయోజనం ఉండదు. మార్మిక విజ్ఞానం వల్ల వొరిగేది ఏమీ ఉండదు వెళ్లి పో. జనంలోకి వెళ్లు. వారితో కలిసి మెలిసి హాయిగా జీవించు. నిన్ను దేవుడుగా కొలుస్తారు. పూజిస్తారు నీకు ఆ అర్హత లున్నాయి. ఇక్కడ ఉపదేశాలు, ఉపాసనలు నిష్ఫలాలు, నిరుపయోగాలు.

ఇవి తాత్కాలికం వీటిని సాధించాలంటే నీవు చాలా వాటిని త్యాగం చేయవలసి ఉంది. అలా త్యాగం చేస్తే తప్ప మార్మిక యోగివి కాలేవు".

మతాధికారి కపట నీతులు బోధించి జీసస్ మనస్సు వ్యాకుల పరచ యత్నించాడు. జీసస్ ఓ నిమిషం ధ్యానంలో గడిపి సమాధానం చెప్పాడు : "మహాశయా! సంఘర్షణలో చేదు నిజం ఉంది. మనిషికి అత్యాశ పనికిరాదు కాని ఆశ, ఆశయం ఉండాలి. లక్ష్యం కోసం పోరాడటం తప్పు కాదు. అధోచేతన ఘర్షణతో తలపడింది తల తిరిగింది. దివ్యత్వం భౌతికతతో పెనగులాడింది. ఇప్పుడు నాలో ఎలాంటి ఘర్షణ లేదు. ద్వైదీభావన లేదు. నాలోని విశ్వాసం నన్ను జయించింది. అవిశ్వాసం బొత్తిగా లేదు. అత్యాశ అసలు లేదు

"సంపదలు, కీర్తి ప్రతిష్టలు, లౌకిక ప్రపంచం పరిధిలోనివి. అవి క్షణికాలని నాకు తెలుసు ప్రపంచంలో మనిషి జీవించేది కొద్ది కాలమే మనిషితో పాటు అతని సంపదలు పోతాయి. మనిషి తన కోసం, స్వార్థంతో సంపాదించేవి ఏవీ మిగలవు. ఇతరుల కోసం చేసే మంచి పనులు అతని ఆత్మను ఉద్ధరిస్తాయి. ఆ మంచి భగవంతుని సన్నిధిలో ఆత్మకు అందచేస్తుంది. నన్ను ప్రేమను పంచ నీయండి. అది చాలు నాకు".

అంతలో ప్రధానాచార్యుని పిలుపు వచ్చింది. వెళ్లి ఆయనకు పాదాభి వందనం చేసి వినయంగా నిలబడ్డాడు. కొంత నిశ్శబ్ద విరామానంతరం జీసస్ చేతికి ఒక పత్రం అందింది. 'విశ్వాసం' అనే మాట ఉంది అందులో జీసస్ కృతజ్ఞత చెప్పి, సెలవు తీసుకున్నాడు.

**5** కొద్ది రోజుల విరామం తర్వాత జీసస్‌కు ఆనంద ధామంలో ప్రవేశం లభించింది. అది అక్షరాల ఆనంద నిలయం భౌతిక సుఖాలు, ఇహ భోగాలు లక్షించే వారికి అది స్వర్గం కన్న ఎక్కువ సుఖాలనిస్తుంది ప్రాపంచిక సుఖభోగ నిలయంగా ఆనంద ధామం తీర్చి దిద్దబడింది. అందమైన యువతులు, మత్తుపానీయాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. సుందరాంగినులు ఉత్తేజ పరిచే భంగిమల్లో వయ్యారాలు వొలికిస్తున్నారు.

జీసస్ ఆ వాతావరణాన్ని ఒక్క చూపులో సమీక్షించాడు. అంతలో ఒక మతాచారి అక్కడికి వచ్చాడు . "తుమ్మెదలు పూవులపై వాలి మకరందాన్ని సేకరిస్తాయి. ఇక్కడ శ్రమలేకుండా మధువు మాధుర్యం లభిస్తుంది. ఇక్కడ ఆనందాలు అనుభవించనివాడి జన్మ వ్యర్థం. మనిషికి ఎప్పుడు మరణం సంభవిస్తుందో తెలియదు. ఉన్న కొద్దిపాటి జీవితకాలంలో సుఖపడడం తెలివిగల

వారు చేసే పని. ఇతరుల సుఖంకోసం తమ జీవితాలు వృధా చేసుకోవడం శుద్ధ అవివేకం. చనిపోయిన ప్రతివాడు సమాధి అవుతాడు. సమాధిలో సుఖించేది ఏమీ ఉండదు. బ్రతికున్న వారెవరూ పోయిన వారికి కృతజ్ఞతగా ఉండరు. వెంటనే మరచిపోతారు. ఎవరి సహాయం ఎవరూ గుర్తుంచుకోరు".

అంతలో జీసస్‌కు ప్రధానాచార్యుల ఆహ్వానం వచ్చింది. ఈసారి ఆయన ఇచ్చిన పత్రంలో 'కరుణ' అనే పదం ఉంది. జీసస్ స్వార్థాన్ని జయించాడు.

**(6)** అక్కడ దేవాలయం విశాలంగా ఉంది. పెద్ద తోట మధ్యలో ఉంది. భారీ విగ్రహాలు, మండపాలు, మందిరాలు ఎన్నో ఉన్నాయి. అది ఒక ప్రత్యేక రాజ్యం లాగా ఉంది. గ్రంధభాండారాలు ఎన్నో ఉన్నాయి. అక్కడ ఎన్నో విషయాలు జీసస్ అధ్యయనం చేశాడు. ధ్యానంలో నలభై రోజులు గడిపాడు. ఆత్మదర్శనం చెందిన తర్వాత ప్రకృతిని చూచి పరవశించాడు. తానే ప్రకృతిలో ప్రకృతిగా మారిపోసాగాడు. మనుష్యులతో సంభాషించినట్లు ప్రకృతితో సంభాషించ సాగాడు.

తర్వాత భయంకర సంఘటన ఒకటి జరిగింది. ఆలయ సేవకులు ఎవరో వచ్చి జీసస్‌ను బంధించి, కాళ్లకు చేతులకు బేడీలు వేశారు. గొలుసులతో బంధించి క్రూరమృగాలున్న ఒక కందకంలో పడవేసి వెళ్లిపోయారు. ఆకలిగొన్న క్రూర జంతువుల మధ్య కాళ్లు చేతులు ఆడని స్థితి. పైన రాబందుల విహారం. క్షణంలో ఆ మృగాలు అతనిని నంజుకోగలవు. క్రూరమృగాల మధ్య, విషసర్పాల మధ్య, రాబందుల మధ్య జీసస్.

జీసస్ అనుకున్నాడు, "బంధించేది ఎవరు? బంధించబడేది ఎవరు? బాంధవ్యాలేవి? బంధనా లేవి? చచ్చేది ఎవరు? చంపేది ఎవరు? అన్నీ పరమాత్మే కద! ఆత్మను పరమాత్మ చంపదు. ఈ శృంఖలాలు నా ఆత్మను బంధించ లేవు. పరమాత్మను బంధించవు. ఇవి ఆత్మను బంధించి బాధించేవి కావు". ఆత్మస్థైర్యంతో లేచి నిలబడ్డాడు. క్షణంలో బంధాలు తెగిపోయాయి.

జీసస్ స్వగతంగా భావించాడు. మనుషుల్ని బంధించేవి గొలుసులు కావు. వాంఛలు, కోరికలు. జీవించాలన్న కోరిక ఉంటే భయం ఉంటుంది. ఈ విష జంతువుల కన్న మనిషి ప్రలోభాలు క్రూరమైనవి. భ్రమలను అగ్నిలో తప్తం చేయాలి. ఆత్మకు మరణం లేదు. ఆత్మ అగ్నిలో కాలదు. నీటిలో తడవదు. గాలికి క్షయించదు. నేను ఆత్మను. దేహభ్రాంతిలేని ఆత్మకు బాధ, భయం, క్షయం, క్షీణత ఉండవు కదా!

ఆ భావన కలగగానే ఆయన చుట్టూ వున్న క్రూర జంతువులు, విష సర్పాలు అంతర్ధానమైనాయి. ఇంతకాలం నేను భ్రమలో ఉన్నానా? ఈ జంతువులు

క్రిములు, పక్షులు నాలోని భ్రమలా? చీకటి పోవడమే వెలుగు ... భగవంతుని స్పందన మనిషికి ఊపిరి. శ్వాస.

జీసస్ ఎదురుగా ఒక బంగారు నిచ్చెన కనిపించింది. కందకం నుండి పైకి వెళ్లడానికి అవకాశం కనిపించింది. పైకి వెళ్లదలచిన వారికి ఒక అవకాశం ఎప్పుడూ ఉంటుంది. జీసస్ పైకి వెళ్లేసరికి మతాచార్యుడు నవ్వుతూ స్వాగతం చెప్పాడు. అదీ ఒక పరీక్ష అనిపించింది. 'సాహసం' అనే పదం గల ఫలకం చేతికిచ్చాడు. జీసస్ అన్ని భయాలను అధిగమించ గలిగాడు. ఆత్మదర్మథనంతో ప్రాపంచిక ప్రలోభాలకు దూరమైనాడు.

**7** అక్కడ సూర్యదేవాలయం అత్యంత ప్రసిద్ధం. సువిశాలం. విశాలమైన మందిరాలు, గాలిగోపురాలు, ప్రార్థనశాలలు శిల్పచాతుర్యంతో శోభిల్లుతున్నాయి. కొద్దిమందికి మాత్రమే అంతర్మందిరాలలో ప్రవేశం లభిస్తుంది. బహుకొద్ది మందిని లోపలకు అనుమతిస్తారు. చాలామంది మతాధిపతులకు ఆ మందిరం అంటేనే ఒళ్లు గగుర్పాటు. కొన్ని గుహలలో ప్రవేశిస్తే ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అది భయంకర తంత్రాలయం.

జీసస్ అప్పటికి అయిదు శీల పరీక్షలలో నెగ్గుకు వచ్చాడు. భయభ్రాంతుల్ని జయించిన తర్వాత ఈ మందిర ప్రవేశానికి అనుమతి లభించింది. ఒక అభ్యాసి జీసస్‌ను వెంట పెట్టుకుని చాలా గదులు దాటించి 'ప్రేమ' మందిరానికి చేర్చాడు. ఆ ప్రేమాలయంలో సంగీతం ప్రవహిస్తోంది. వీణా తంత్రుల్ని వింటూ జీసస్ పరవశించాడు. పారవశ్యంలో ఉన్న జీసస్ వద్దకు ఓ సుందర యువతి వచ్చింది. ఆమె అందంలో రూపుదాల్చిన అప్సర. మంచి యవ్వనం పొంగులో ఉంది. చూపుల్లో కామన బుస కొడుతోంది. కవ్వింపు కనిపిస్తోంది. జీసస్ ఆమె అందచందాలు గమనించలేదు. తన్మయత్వంలో ఉన్నాడు. ఆమె వచ్చి సరాసరి వీణ దగ్గర కూర్చొని స్వరాలు పలికించసాగింది.

జీసస్‌లో సౌందర్య పిపాస బొత్తిగా లేదు. బాహ్య సౌందర్యం గుర్తించాడు. అంతటి సుందరిని ఎప్పుడూ చూడలేదు. అంతటి గంధర్వగానం వినలేదు. ఆమె మధురంగా వీణ వాయించి వెళ్లిపోయింది. జీసస్ స్వగతంలో అనుకున్నాడు. "ఈ ఘటన ఏమిటి? ఆ సుందరి ఎవరు? ఈ సంగీతం ఏమిటి? నేనెవరు? తానెవరు?"

ఆ సుందరిని మరొకసారి చూడాలనిపించింది. అనుకున్నదే తడవు ఆ సుందరి జీసస్ ముందు ప్రత్యక్షమైంది. ఆమె నిజభామినా! లేక భావ సుందరా!

అది కలా, వాస్తవమా? సంకల్ప మాత్రంతో ప్రత్యక్షం కావడం ఏమిటి? జీసస్ తలను ఆమె చేతి వేళ్లు మృదువుగా స్పృశించాయి. ఆత్మ స్పందించిన అనుభూతి. ఆమె స్పర్శకు తన ఆత్మ జాగృతమైంది. ఎవరీమె! తానెవరు? తనకు ఆమెకు ఏమిటి సంబంధం? ఏమా సంస్పర్శ. ఏమా అనుభూతి పారవశ్యం? ఆమె వెంటనే వెళ్లిపోయింది? వెళ్లి పోయిందా. అదృశ్యమైందా? ఏమో! అదీ తెలియదు. జీసస్ హృదయం నిండా ఆమె ప్రేమ పరిమళం పరచుకున్నది. ఆమె స్నేహ మధురిమ పొంగులు వారింది. తనకేదో అయింది, ఏమిటది?

జీసస్ కంటికి నిద్ర కరువైంది. మనస్సు నిండా మధురోహలు, తీయతీయని తలపులు. ఏమీ తినాలనిపించదు. ఏ పనీ చేయాలనిపించదు. మనస్సు శూన్యమైంది. ఆ శూన్యం ప్రేమతో నిండిపోయింది. పదేపదే ఆమె రూప లావణ్యాలు జ్ఞాపకం వస్తున్నాయి. అంతలో అరూప మవుతున్నాయి.

"ఏమిటీ చాపల్యం? ఏమిటీ పరధ్యానం? నేను మానసికంగా అన్ని బలహీనతల్ని జయించాను. వ్యామోహాలను, స్వార్థాలను జయించగలిగాను. కామ వాంఛను జయించలేకపోతున్నానా? ఆ 'సుందరి' సమాగమాన్ని మనస్సు కోరుతోంది. "భగవాన్! నాకు దివ్యప్రేమను ప్రసాదించు తండ్రీ. ఈ వ్యామోహం నుండి నన్ను రక్షించు. నా ప్రేమను ఒక సుందరిపరం చేయలేను. ఐహిక సుఖాలకు నా పవిత్ర ప్రేమను బలిచేయలేను".

అట్టడుగు పొరల్లో ఎక్కడో ఆత్మ కదిలినట్లయింది. స్పందించి నట్లయింది. కొంత తడవు హృదయం ఘర్షణకు లోనైంది. "ఉహుఃు, నేను కామాన్ని జయిస్తాను" అనుకున్నాడు.

అంతలో ఆ సుందరి, వలపు మిఠారి మరల ప్రత్యక్షమై, చేయి చాచి, స్వాగతించి ప్రేమను పొలికించింది.

జీసస్ అన్నాడు. "అమ్మా ... నీవు సౌందర్యవతివి. నీవు ఇక్కడ ఉండవచ్చు. కాని నా 'ఆత్మ' వేరుగా ప్రబోధిస్తోంది. మనిషిగా నేను నీ ప్రేమను ఆశించలేను. ప్రపంచంలో అందరికీ నీ ప్రేమ కావాలి. నేను ప్రపంచంలో ప్రేమను పంచడానికి వచ్చిన వాడిని. అది నా జీవిత ధ్యేయం. దయచేసి నా జోలికి రాకు. నన్ను ప్రలోభ పెట్టకు. నా లక్ష్యాన్ని నీ అందంతో చెడగొట్టకు".

ఆమె విసవిసా వెళ్లిపోయింది. జీసస్ మనస్సు స్థిమిత పడ్డది.

అంతలో గుడిగంటలు మ్రోగాయి. ప్రధానాచార్యుడు జీసస్ ముందు నిలిచి "జీసస్ నీవు జేతవు, విజేతవు. భౌతిక లాలసలకు లొంగని వారే మహాత్ములవుతారు. నీవు మహాత్మవు".

(8) ఈజిప్టు ప్రాచీన జ్ఞాన భాండాగారం తలుపులు తెరిచి జీసస్‌కు స్వాగతం చెప్పింది. ప్రధానాచార్యునికి ఇప్పుడు జీసస్ ఆత్మీయుడు. మార్మిక విద్యలు నేర్వడానికి అర్హత, అనుమతి లభించాయి. కొంతకాలం పాటు ఈజిప్టు తంత్ర, మంత్ర, మార్మిక విద్యలు నేర్చి, నిష్ణాతుడైనాడు. జన్మరహస్యాలు మృత్యు రహస్యాలు తెలుసుకున్నాడు. మృత్యువు తర్వాత జీవితం గురించి అధ్యయనం చేశాడు. అధ్యయనానంతరం మృత్యుమందిరంలో ప్రవేశించాడు. అది విగత జీవుల భౌతిక అవశేషాలు భద్రపరిచే మందిరం. శరీరాలు శిధిలం కాకుండా అక్కడ ఉంచుతారు. ఆ మందిరంలో శవాలమధ్య అనుభవం సంపాదించాలి.

శవవాహకులు ఒక మృతదేహాన్ని శవపేటికలో భద్రంగా తెచ్చారు. అది ఒక వితంతు ఏకైక కుమారుని మృతదేహం. ఆమె రోదిస్తూ బిడ్డ శవం వెంట వచ్చింది. జీసస్ ఆమెను ఊరడించి, ఓదార్చాడు "అమ్మా, ఏడవకు. నీ కుమారుని శవం ఈ పేటికలో లేదమ్మా. ఇది ఉత్త పేటిక. నీ కుమారుడు చేయవలసిన మహత్కార్యం ఏదో ఉంది. అది నీకు తెలియక విచారిస్తున్నావు. ఇక్కడ పని ముగిసింది. మరొక చోట పని చేయడానికి వెళ్లాడు. చివరకు భగవంతుని సన్నిధికి చేరతాడు. పనికిమాలిన రక్తమాంసాల శరీరం వదలి పెట్టడం మృత్యువు కాదు. చనిపోవడం కాదు. నీ కుమారుడు ఆత్మ సాక్షిగా మరణించలేదు. ఆత్మకు మరణం ఉండదు. మరొక శరీరాన్ని ఆశ్రయిస్తుంది. రేపు మనం చేసే పనీ అదే. మానవుడు చిరంజీవి. మరణాన్ని జయించే మంచి పని చేయడం మనిషి జీవిత లక్ష్యం. లేకుంటే చివరకు చిక్కిశల్యమై పోతావు. నీవు చేయవలసిన పనులు పూర్తి చేయలేవు నీ కన్నీళ్లు నీ కొడుకును నిరోధిస్తాయి. అతని ఆత్మకు శాంతి కలగకపోగా నీ ఏడుపు అతనిని మరింతగా బాధిస్తుంది. ఇప్పుడతనికి కావలసింది నీ సహకారం, ప్రోత్సాహం. నీవు ఆనందంగా ఉంటే తనూ ఆనందంగా ఉంటాడు. వెళ్లు తల్లీ, నీ కన్నీరు తుడుచుకో. ఇతరుల కన్నీరు తుడవడానికి యత్నించు. మన విధుల్ని మనం సక్రమంగా నిర్వర్తిస్తే చాలు. అందులో ఆనందం ఉంటుంది. మనిషి జీవితంలో విషాదానికి అవకాశమే ఉండదు. మనం ఆనందంగా ఉంటే పోయిన వారి ఆత్మ శాంతంగా ఉంటుంది".

ఆమె కన్నీరు తుడుచుకుని వెళ్లి పోయింది. అంతలో శవ వాహకులు మరొక శవపేటికను మోసుకు వచ్చారు. అది ఒక పాపతల్లి శవం. శవం వెంట పాప మాత్రం వచ్చింది. మృత్యుమందిరం గుమ్మం వరకు రాగానే ఒక దృశ్యం ఆ పాప కంట పడింది. ఒక బోయవాడు పక్షిని కొట్టడం ఆ పాపచూచింది. తల్లి శవ పేటిక వెంటనడపడం ఆపి పరుగున వెళ్లి ఆ పక్షి పిల్లను గుండెకు

అదుముకుంది. జీసస్ ఆ పాపను ప్రశ్నించాడు. "పాపా, మీ అమ్మ శవాన్ని వదలి, రెక్కతెగిన పక్షిని రక్షించాలని ఎందుకనుకున్నావు?"

"అమ్మ శవానికి నేను చేయగలిగింది లేదు. అమ్మ చనిపోయిందిగదా. నేను ఏడ్చినా అమ్మ బ్రతికి రాదు. పక్షికి సాయం చేస్తే అది బ్రతుకుతుంది. ప్రాణం ఉన్న వారికే మనం సాయం చేయాలని అమ్మ చెప్పేది".

"విచారం, స్వార్థం, ఆశ, భయం – మనిషికి సహజం. మనం అనుభవించే ఈ సుఖ దుఃఖాలు జీవన సాగర తరంగాలు. ఏవీ మిగలవు. అన్ని అలలు సముద్రంలో కలిసిపోతాయి. మనిషి హృదయంలోంచి కన్నీళ్లు వస్తాయి. ఆత్మ దేనికీ విలపించదు. మనం వెలుగులోకి నడవాలి. కన్నీరు లేని తావుకు చేరు కోవాలి".

ఆ పాప మాటలకు జీసస్ హృదయం ద్రవించింది. వాటిని జీవన సత్యాలుగా భావించాడు. పసివారినోట సత్యాలు వెలువడతాయంటారు.

జీసస్ ఆ పాప తల నిమిరి ఆశీర్వదించాడు.

(9) మృత్యు మందిరంలోనూ జీసస్ విజయం సాధించాడు. నీల లోహిత మందిరంలోకి జీసస్‌ను ఆహ్వానించారు. వెళ్లి ప్రధానాచార్యుని ఎదుట నిలబడ్డాడు. మిగిలిన ఆచార్య బృందం అంతా అక్కడ సమావేశమై ఉంది. ప్రధానాచార్యులు సభనుద్దేశించి ప్రసంగించారు. "ఈ రోజు మనందరం గర్వించవలసిన దినం. ఇది జీసస్ అభినందన సమావేశం. మరొక విధంగా జీసస్‌కు వీడ్కోలు సభ. జీసస్ మానవోత్తముడు. ఇక్కడ అన్ని పరీక్షలలో విజయుడైనాడు.

"జీసస్! ఆరుసార్లు నీ సామర్థ్యాన్ని, శీలస్వభావాలను మేము పరీక్షించాం. ఇది అభినందన పురస్కారం. ఇకపైన నీవు 'క్రీస్తు'గా వ్యవహరించబడతావు. నీలో ఒక 'మహాత్మ' స్థిరపడ్డది. ఇంక నీవు వెళ్లిపోవచ్చు. ప్రపంచం నీ శాంతి సందేశాలకై ఎదురుచూస్తోంది."

ప్రధానాచార్యులు ప్రవచిస్తుండగా ఒక శ్వేత శాంతికపోతం రెక్కలు విప్పి, ఎగురుతూ వచ్చి జీసస్ శిరస్సుపైన వాలింది. 'తథాస్తు' అన్నట్లు గుడిగంటలు మ్రోగాయి. 'ఆమెన్' అన్న శబ్దం అందరి నోటి వెంట వెలువడింది.

◆ ◆ ◆

# 11. సప్తర్షుల సమావేశం

(1) అన్ని యుగాలలో, అన్ని కాలాల్లో ఏడుగురు మహర్షులు ప్రపంచాన్ని రక్షిస్తుంటారు. ప్రతి యుగారంభంలో వారు ఒకచోట సమావేశమై రానున్న యుగ ధర్మాన్ని నిర్దేశించి, సమీక్షిస్తారు. మానవ స్వభావాలను విశ్లేషిస్తారు. దేశాలు, ప్రజలు, భాషలు, సంస్కారం - వాటి తీరు తెన్నుల్ని సమీక్షించి, ధర్మ స్థాపనార్థం మార్గదర్శకసూత్రాలు రూపొందిస్తారు. సత్యం, ధర్మం, ప్రేమ, సౌభ్రాతృత్వం. వారి పరిశీలనాంశాలు. కొత్త యుగానికి ఏ ధర్మసూత్రాలు, నీతి సూత్రాలు అవసరమో చర్చించి వాటిని ఆమోదిస్తారు.

ఒక యుగం సమాప్తమైంది. మరొక యుగం ఆరంభం కావల్సి ఉంది. యుగసంధిలో సప్తర్షుల సమావేశం తప్పనిసరి. అలెగ్జాండ్రియాను సమావేశ స్థలంగా నిర్ణయించారు. అలెగ్జాండ్రియా ఆనాడు మేధావులకు కాణాచి. అక్కడ 'ఫిలో' గృహంలో సమావేశం. చీనా నుండి మెంగ్‌స్టే, భారత్ నుండి విద్యాపతి, పర్షియా నుండి కన్బర్, అస్సీరియా నుండి అస్బినా, గ్రీసు నుండి అపోలో, ఈజిప్టు నుండి మధెనో వచ్చారు. హిబ్రూ పండిత ఋషి 'ఫిలో' వారికి ఆతిధ్యం యిచ్చి, అధ్యక్షత వహించాడు. ఏడురోజుల పాటు మాటాపలుకు లేకుండా మౌనంగా ధ్యానించారు.

చివరన మెంగ్‌స్టే తన అభిమతం వెలిబుచ్చాడు. "మిత్రులారా, కాలచక్ర భ్రమణం మరొక మారు పూర్తయింది. ఇప్పుడు మానవ జాతిలో మేధో వికాసం కలిగింది. ఆలోచనా కౌశలం పెరిగింది. ఇప్పుడు మనిషి లోతుగా ఆలోచించ గలుగుతున్నాడు. సంస్కారం పెరిగింది. నాగరికత విస్తరిస్తున్నది. మన తాతలు, తండ్రులు కట్టిన బట్టలు చివికి చిరిగిపోయాయి. విలువలు మారుతున్నాయి. మానవ జాతికి మనం నూతన ప్రమాణాలు అందించాలి. నవయుగానికి తగిన రీతిలో మనం ఆలోచించాలి".

విద్యాపతి ఇలా ప్రసంగించాడు : "మన పూజారులకు పిచ్చి పట్టింది. ఎక్కడో అరణ్యంలో ఒక విగ్రహాన్ని ప్రతిష్టించి, దానికి పూజలు జరిపిస్తారు.

వీరికి ప్రజల హృదయం తెలియదు. మూఢాచారాలతో, సంప్రదాయాలతో ప్రజల్ని అపమార్గం పట్టిస్తున్నారు. ఆర్యావర్తంలోనూ ప్రజలు విద్యావంతులవుతున్నారు. కొత్తను అహ్వానిస్తున్నారు. పూజలు, పురస్కారాలంటే ప్రజలకు విసుగు పుట్టింది. చదువుకున్న వారు కొండగుహలకు, అరణ్యాలకు వెళ్లి తపస్సు చేసుకుంటూ, యోగం చేసుకుంటూ బ్రహ్మాన్ని ఆత్మ ద్వారా తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇది హర్షించదగిన పరిణామం. నవశకంలో అంతా నవ్యతను కోరుతున్నారు. ఎవరికివారు తమ హృదయాన్ని ఆలయంగా మార్చుకుని, 'ఆత్మ'ను ఆరాధిస్తున్నారు. ఎవరి ధ్యానం వారిది, ఎవరి తపస్సు వారిది. ఎవరి ఆత్మాన్వేషణ వారిది. ప్రతి మనిషి నేరుగా భగవంతుని చేరుకునే మార్గం అన్వేషిస్తున్నాడు".

కస్పర్ అన్నాడు : "దాదాపు పర్షియాలోనూ పరిస్థితి అదే. ప్రజలు పూజారుల్ని, మత పెద్దల్ని చూచి భయపడుతున్నారు. మా దేశంలో క్షుద్ర శక్తులు మరీ ఎక్కువ. అక్కడ చీకటి రాజ్యం చేస్తున్నది".

అస్బినా ఇలా వ్యాఖ్యానించాడు, "అస్సీరియా ప్రజలకు అనుమానాలెక్కువ. విశ్వాసం ఏర్పడితే బాగానే ఉంటారు. కాని ప్రతి చిన్నదానికి అనుమానించడం వారి కలవాటు. మనిషి భగవంతునికి తనవంటి రూపం కల్పించి పూజిస్తాడు. వారి హృదయంలో భగవంతుడు నిలవడు. అంటే లోలోపల భగవంతుని శక్తిని, ఉనికినీ శంకిస్తున్నారని అనుకోవాలి. మా వారికి కావలసింది నమ్మకం. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా నమ్మకమే ప్రధానం. ఎవరి మతం వారిది. ఎవరి ఆలోచన వారిది. ఆలోచన నమ్మకం కలగలిస్తే మతం అవుతుంది. ప్రతి ఆలోచనకు ఒక దేవుడుంటాడు. దేవుళ్ల మధ్య వైరాలు సృష్టిస్తుంటారు మన వారు. వారి మధ్య యుద్ధాలు కల్పించి, తృప్తి పడుతుంటారు. మనుషుల్లాగా దేవుళ్లూ కొట్టుకు చస్తుంటారు. రాగద్వేషాలుంటాయి. స్త్రీ వ్యామోహాలుంటాయి. అచ్చం మనుషుల బుద్ధులు, ప్రవర్తనలే దేవుళ్లకు అపాదిస్తారు మనవారు. అలాటి గుణాలు, బుద్ధులు లేని భగవంతుని ఊహించను కూడా ఊహించరు. నమ్మడం తర్వాతి విషయం. ఇప్పుడు మా జాతికి కావలసింది అందరికీ భగవంతుడు ఒక్కడేనని చెప్పి నమ్మించే ప్రవక్త. అలాంటి మహాత్ముడు ఈ యుగసంధ్యలో అవతరిస్తాడని నాకనిపిస్తుంది.

మథెనో అన్నాడు : "మా ఈజిప్టుకు ఘనచరిత్ర ఉందని అందరూ అంగీకరిస్తారు. మేం గొప్పవాళ్లం. మా తెలివితేటలు అమోఘం. అయితే మేము ఎప్పుడూ గతంలోనే బ్రతుకుతుంటాం. కొత్తదనాన్ని కోరం. అంగీకరించం. అది మా బలహీనత. ఒక విధంగా మా బలమూ అదే. మాకు సమాధులే విజ్ఞాన నిలయాలు. శవపేటికలే మా జ్ఞానవాటికలు. మా దేవాలయాలు చీకటి గుయ్యారాలు. లోపల వెలుగు ప్రసరించదు. ఒక్క వెలుగు కిరణాన్ని లోపలకు

రానివ్వం. అది మా సంస్కృతి. లోపల వెలుగు ప్రసరిస్తే మా రహస్యాలు తెలిసిపోతాయని, బయట పడిపోతాయని మా భయం. మాది అంతా రహస్యమే. బయట ప్రపంచానికి కనిపించకుండా మా జ్ఞానం దాచి పెడతాం. భగవంతుని గురించి ఎవరైనా తెలుసుకోవచ్చు. కాని ఆ హక్కు మా ఒక్కరిదేనని మా వారి భ్రమ".

ఫిలో అన్నాడు : "హీబ్రూ భావన, ఆలోచన వేరు, స్వేచ్ఛాప్రియులు యూదులు. హీబ్రూ రుషులు, ప్రవక్తలు ధర్మ బద్ధులు. వారిలో ఆసక్తి ఎక్కువ, ప్రతిభ ఎక్కువ. వారి ఆలోచనల్లో ఆవేశం ఎక్కువ. అంచేత ఎప్పుడూ ఓడిపోతుంటారు. ఓర్మి తక్కువ. సహనం లేని జాతి. సిద్ధాంతం పవిత్రమైనంత మాత్రాన ఒరిగేది లేదు. ఆచరణ కావాలి, స్వేచ్ఛ కావాలి. వివేకం కావాలి. మా పవిత్ర సిద్ధాంతాలపై భౌతికత నీడలు పడ్డాయి. ప్రజలు స్వేచ్ఛ కోరుతున్నారు. ఇప్పుడున్న ఇజ్రాయిల్ ధర్మం మంచిది కాదు. పూజారుల, మత పెద్దల ఆగడాలు శ్రుతి మించుతున్నాయి. మా పూజారులు అంతా దుర్మార్గులు. ఒక ప్రవక్త ఆగమనంతో ఈ చీకటి తెరలు తొలగిపోతాయి. మబ్బులు విడిపోతాయి. ప్రజల మధ్య అపార్థాలు తొలగిపోవాలి, ఇమ్మాన్యుయేల్ అవతరణ కోసం ఎదురు చూస్తున్నాం".

అందరూ సభా మందిరం తలుపులు బార్లా తెరచి ధ్యానమగ్నులైనారు. కొంతసేపటికి జీసస్ వారి మధ్యకు వచ్చి నిలబడి, అభివాదం చేశాడు. అప్పుడు ఏడుగురు రుషులు ఏడు రోజులు ధ్యానంలో నిమగ్నులైనారు.

ఏడు రోజులు దివ్యధ్యానంలో ఉండి ఏడుగురు భౌతిక చైతన్యంలోకి వచ్చారు. వారంతా జ్ఞానవర్చస్సుతో వెలిగిపోతున్నారు. విశ్వరచనను విప్పి చదవసాగారు. మానవ పరిణామం వారి జ్ఞాన నేత్రానికి అందింది. భావి కాలాలలో మానవజాతి సుఖ శాంతులతో ఉండగల మార్గం సుగమమైంది. సుబోధకమైంది.

ఏడుగురు మహర్షులు ఏడు మౌలిక సూత్రాలు ప్రతిపాదించారు. ఒక్కొక్క సూత్రాన్ని తాత్విక దృష్టితో విశ్లేషించసాగారు. ఆరాధనా రీతుల్ని ఏర్పాటు చేయదలచారు. వారిలో వృద్ధుడు మెంగ్‌స్టే అధ్యక్ష స్థానంలో ఉండి అందరి అభిమతాలు వివరించమని కోరాడు. ముందుగా తనే తన అభిప్రాయం వెలిబుచ్చాడు ఇలా :

"మనిషిలో 'విశ్వాసం' ఇంకా సంపూర్ణంగా ఏర్పడినట్లు లేదు. కళ్లతో చూడని దానిని పూర్తిగా విశ్వసించలేక పోతున్నాడు. మనిషికి వయసు పెరిగినా మనస్సు పసిగానే ఉంటోంది. అంటే పిల్లల మనస్తత్వం. రానున్న కాలంలో మనిషికి కథలు కావాలి. కల్పనలు కావాలి. క్రతువులు, కర్మలు కావాలి. ప్రతి

మనిషికి తానే గొప్పవాడిననే అహం ఉంది. తనవంటి రూపాన్ని నిర్మించి, కల్పించి దేవుడంటాడు. తన వంటి రూపం కాకపోతే నమ్మడు. తర్వాత విశ్వాసం బలపడి స్వతంత్రించే కాలం వస్తుంది. అప్పుడు మనిషి కళ్లతో చూడనిదాన్ని సైతం విశ్వసిస్తాడు. నిశ్శబ్దంలోని శబ్దాలను వినగలడు. 'ఆత్మ' ఆధిక్యాన్ని గుర్తిస్తారు. ఆత్మకు పై స్థాయిలో ఉన్నదాన్ని, అందరి ఆత్మలపై అధికారం కలదానిని పరమాత్మ అంటారు. మనం వెంటనే చూచేది దేవాలయ సంస్కృతి. దేవాలయాలు, క్రతువులు, పూజలు, భక్తి ఇవి ముందుగా పెరుగుతాయి. మనం ప్రస్తుతం చేయవలసినపని, మనిషి మనస్సును సానపెట్టడం. ఆలోచించడాన్ని క్రమబద్ధం చేయడం. అలాగే ఆత్మ సామ్రాజ్యానికి పునాదులు గట్టిపడేలా చేయాలి. మనుషులలో సమభావన, సమతాభావన ఏర్పడినప్పుడే అది సాధ్యం. సంపూర్ణ మానవుల నమూనాను మనం ప్రకల్పించాలి".

తర్వాత మెంగ్‌స్టే తనకు తోచిన మానవ మనస్తత్వ పరిణామాన్ని, వికాసాన్ని రాసి పెట్టాడు. ప్రపంచంలో అన్ని స్థితులు, ఆలోచనా రీతులు, భావన వైవిధ్యాలు, చైతన్యం, సంకల్ప స్వరూపస్వభావాలు వివరించాడు. భావనకు ముందు భగవంతుడు. భగవంతుని ప్రేరణ విశ్వాసం.

తర్వాత ఆర్యావర్త దేశ వాసి అయిన విద్యాపతి తన ఆలోచనలు బయట పెట్టాడు. "ఎవరికైనా దివ్యభావన ఒకేలా ఉంటుంది. దానికి ప్రేరణ పరమాత్మ. దివ్యభావన రెండు పాయలుగా విభాగితమవుతుంది. ఒకటి ప్రజ్ఞ, రెండవది శక్తి. భగవంతుని శ్వాసలో ప్రేమ ప్రభవిస్తుంది. పరమాత్మ ఒక వెలుగు. ఆ వెలుగు ఏడు కిరణాల సమాహారం. ఏడు గుణాల సమ్మేళనం. పరమాత్మ సంకల్పం నుండి ఏడు శక్తులు ఉద్యమించాయి. అవే సృష్టి, స్థితి, లయ కారకాలు. ఆ శక్తులే 'మనిషి'ని రూపకల్పన చేశాయి. లోకాల్ని సృష్టించుకున్నాయి".

కస్పర్ మూడవ నమూనా రాసి పెట్టాడు : "మనిషి భగవంతుని విశిష్ట భావన. విలక్షణ సృష్టి. భగవంతుడు సప్త ధాతువులతో మనిషిని సృష్టించి పెట్టాడు. కంటికి కనిపించని తీరుగా ఆత్మను మనిషిలో దాచి ఉంచాడు. ఆత్మను భగవంతుడు తన అధీనంలో ఉంచుకున్నాడు. ఆత్మ కనిపించనట్లే భగవంతుడు ఒక 'రూపం'లో మనిషికి కనిపించడు. ప్రతి మనిషి తనంతటి వాడయ్యే సాధన సంపత్తిని మనిషి అందించాడు. అది ఈథర్, సూక్ష్మశరీరంలో ఉంటుంది. మనిషిలో భగవంతుని సూక్ష్మరూపం. అంటే ఈథర్ రూపం. అలా భూమిపైకి వచ్చిన భగవంతుడు తన మౌలిక హక్కుల్ని కోల్పోయాడు. మనిషికి భగవంతునికి మధ్య ఉన్న సంబంధం తెగిపోయిందని చెప్పవచ్చు. దేవుని ఆసరా, అవసరం లేని మనిషి పతనోన్ముఖుడైనాడు. సత్సంబంధం లేకపోవడం, దివ్యత్వానికి దూరం

కావడం అంటే చెడుతో సహవాసం, మంచిమీద సమరం సాగించడం. అదే ప్రస్తుతం మనిషి మానసిక స్థితి. అది మారాలి, పరివర్తన రావాలి".

అష్మినా తన అభిప్రాయాలు ఇలా నమోదు చేసి పెట్టాడు :

"మీకు తెలుసు. విత్తనాలు వెలుతురులో మొలకెత్తవు. సారవంతమైన మట్టి లభిస్తేగాని మొక్కలు ఎదగవు. మనిషి కూడా విత్తనం లాంటి వాడే. ఈథర్ అనే ప్రాణస్పర్శ సోకితే తప్ప మానవ బీజం మొలకెత్తదు. అందుకే మనిషి భౌతిక సుఖాలు కాంక్షిస్తుంటాడు. చీకటి సుఖాలు పునరుత్పత్తికి అవకాశం కలిగించాయి. జీవితం అనే మహావృక్షం భౌతికత ఆధారంగా పెరుగుతుంది. ప్రకృతి నియమానుసారం మనిషి ఎప్పటికో పూర్ణత్వం సాధించకపోడు. అందులో భగవంతుని పాత్ర ఉండదు. సహజంగా ఎదగడమే పరిణామం. మనిషి పూర్ణమానవుడుగా పరిణమించడానికి స్వచ్ఛమైన జీవన పద్ధతి చాలు".

మహర్షి అపోలో తన నివేదిక చదివాడు :

"ఆత్మను నాలుగు శ్వేతాశ్వాలు వెలుగులోకి తీసుకుపోతుంటాయి. అవి : సంకల్పం, విశ్వాసం, ఆశయం, ప్రేమ. ఈ నాలుగు జవాశ్వాలు ఆత్మకు బలాన్నిస్తాయి. ఒకరు ఒక పనిని చేయాలని సంకల్పిస్తే ఆపనిని చేసే శక్తి సహజంగా సమకూరుతుంది. అది సంకల్పబలం. ఆ శక్తి తనలో ఉన్నదని తెలుసుకోవడం విశ్వాసం. విశ్వాసంవల్ల ఆత్మ చైతన్యం పొందుతుంది. అయితే స్వార్థంతో కూడిన విశ్వాసంవల్ల ఆత్మ వెలుగులోకి రాదు. వెలుగు బాటలో ఎవరూ ఒంటరిగా పయనించరు. అనేక మంది సంకల్ప సిద్ధులు తోడుగా నడుస్తారు. బాసటగా నిలుస్తారు. ఇతరుల సహాయ సహకారాలతో పయనించే వారే గమ్యాన్ని చేరగలరు. ఆధ్యాత్మిక జీవనంలో పవిత్ర ప్రేమ తోడుగా ఉంటుంది. ఆ ప్రేమలో స్వార్థం తొంగిచూడకూడదు".

మథెనో తన శాసనం రాసి పెట్టాడు : "అపోలో మహర్షి చెప్పిన మాట నిజం. విశ్వప్రేమలో స్వార్థానికి స్థానం లేదు. అది జ్ఞానం వల్ల, వివేకం వల్ల ఏర్పడుతుంది. అందుకు భగవత్సంకల్పం తోడు కావాలి. భగవత్కృప మానవ సేవ ద్వారా అందుతుంది. మహాత్ముల సందేశాలలో వినిపిస్తుంది. ప్రేమ ఎంత పవిత్రం అయినా ఆకాశం నుండి క్రిందికి రాదు. మన హృదయాలు పవిత్రం అయితే అక్కడ పుట్టే ప్రేమ పవిత్రంగా ఉంటుంది. అన్ని కాలాలలో, అన్ని యుగాలలో సత్యం ప్రేమ రూపంలో కనిపిస్తుంది. ఇక్కడ ప్రేమకు ప్రతి రూపం క్రీస్తు. 'క్రీస్తు' అన్న పదానికి 'ప్రేమ' అని అర్థం. అది పర్యాయపదం. క్రీస్తు ప్రేమ భౌతిక సుఖాలలో ఉండదు. అరిషడ్వర్గాలను జయించడమే క్రీస్తు తత్వం.

రాగద్వేషాలకు, అసూయాస్వార్థాలకు, అసహన ఉద్రేకాలకు అతీతమైనది దివ్య ప్రేమ".

ఫిలో ఏడవ నమూనా తయారుచేసి పెట్టాడు : "భగవంతుని సన్నిధికి చేరే పూర్ణ పురుషుని ప్రకృతి సహజంగానే తయారు చేస్తుంది. మనిషి జీవితం మనిషికి అర్థం కాదు. కాని భగవంతునికి తెలుసు. మనిషి జీవితం 'ఆత్మ' గతం అయినప్పుడు ఆత్మ భగవంతుని ఉపకృతి అవుతుంది. అప్పుడు మనిషి దేవునితో సమానమవుతాడు. సృష్టి లక్ష్యం నెరవేరుతుంది".

చివరకు మెంగ్స్టే సమీక్షించాడు. "చాలా సంవత్సరాల తర్వాత భగవంతుడు తన ప్రతినిధిని భూమిపైకి తనదూతగా పంపాడు. ఆయన పైలోకంలో ఉండే ప్రభువుకు వారసుడు, ప్రతినిధి. ఆయన భగవంతుని సందేశం మనకు వినిపించగలడు. మనం జీసస్‌ను సర్వజ్ఞుడిగా ఆమోదిద్దాం. జీసస్ మనందరి ప్రతినిధి".

ఏడుగురు మహర్షులు జీసస్ శిరస్సుపైన చేతులుంచి ఆశీర్వదించారు. తమ అర్జిత తపశ్శక్తులన్నీ విశ్వశ్రేయస్సుకోసం ధారపోశారు. తర్వాత అందరూ కలిసి ఏడు రోజులు ఏకదీక్షగా ధ్యానం కొనసాగించారు.

ఏడు రోజుల దీక్షానంతరం జీసస్ తన మనస్సులోని మాటల్ని బయట పెట్టాడు : "మీరన్నది నిజం. నరజాతి సమస్తం ఏడు సూత్రాలతో బంధించ బడింది. ఏడు స్తంభాలపైన నిర్మాణం జరుగుతుంది. అది విశ్వసౌభ్రాతృత్వం. మీరు నాకు అప్పగించిన పని నిర్వహించడంలో చాలా కష్టాలున్నాయి. ఎన్నో ఇబ్బందులు, ప్రతిఘటనలు ఎదుర్కోవలసి వస్తుంది. మానవ నైజం చిత్రమైంది కదా! విషాన్ని సైతం అవసరార్థం తాగవలసి వస్తుంది. భగవంతుని నిర్ణయాన్ని మనిషి పాటించక తప్పదు. నా శ్వాస భగవంతుడు. నా ఊపిరి భగవంతుడు. నేను చెప్పే మాటలు నావి కావు. అవి ఆత్మ వాక్యాలు. దివ్యసందేశాలు. అవి ఈశ్వర ప్రోక్తాలు. విశ్వమతస్థాపన నా గమ్యం. అయితే అది ఇప్పట్లో సాధ్యపడదు. మనుషుల్లో సంస్కారం ఇంకా పెరగాలి. ఆత్మ చైతన్యం కలిగితే తప్ప అది సాధ్యం కాదు. మీ అందరి తపశ్శక్తి, ధార్మికత నాకు అండగా ఉంటుందని భావిస్తున్నాను. ఈ సప్తగిరుల పైన నా 'ఆత్మ సామ్రాజ్యం' స్థాపిస్తాను. అందరికీ 'అంతరాత్మ' ఒక్కటేనని ప్రచారం చేస్తాను".

సప్తర్షులు జీసస్‌ను ఆశీర్వదించి, అభినందించారు. జీసస్ అక్కడ నుండి బయలుదేరి 'గలిలీ'లోని స్వగృహం చేరుకున్నాడు.

◆ ◆ ◆

# 12. ప్రయోక్త జాన్

1 ఆ మధ్య కాలంలో జకరియా ఎలిజబత్‌ల పుత్రరత్నం జాన్ ఈజిప్టులో అనేక మార్మిక విద్యాలయాల్లో అధ్యయనం పూర్తిచేసుకుని హెబ్రాన్ తిరిగి వచ్చాడు. అక్కడ కొంతకాలం ఉన్న తరువాత, నిర్జన పర్వత గుహలకు తన నివాసం మార్చుకున్నాడు. ఎవరికీ కనిపించకూడదని, ఎవరూ తనను చూడరాదని అతని అభిమతం. ఆయన మర్మయోగిగా అవతారమెత్తాడు. డేవిడ్ గుహను తన నివాసం చేసుకున్నాడు. డేవిడ్ కొంతకాలం ఈజిప్టు గురువుల్ని సేవించాడు. ఆ స్మృతులు జాన్‌ను అక్కడకు చేర్చాయి. కొందరు జాన్‌ని ఎన్గెడి స్వామి అని పిలిచేవారు. కొందరు అనాగరిక స్వామి అనేవారు. అతను పర్వత గుహల్లో అనాగరికంగా బ్రతుకుతాడు. అంతవరకే జనానికి తెలుసు.

జాన్ ధరించే దుస్తులు చిత్రంగా అతని వలె మొరటుగా ఉంటాయి. జంతుచర్మం ఒంటికి చుట్టబెట్టుకునేవాడు. పండ్లు, దుంపలు తింటాడు. ముప్పయి సంవత్సరాల వయస్సులో జెరూసలెం వెళ్లి ఏడు రోజులు మౌనదీక్షలో గడిపాడు. అప్పుడే అతనిని మౌనస్వామి అన్నారు. ఆయన్ని చూడడానికి మతాధికారులు, పూజారులు, కులీనులు, సామాన్యులు వందలు, వేలు గుంపులుగా వచ్చారు. ఆతని పుట్టు పూర్వోత్తరాలు ఎవరికీ తెలియవు. ఎక్కడి వాడో ఎవరివాడో ఎవరికీ తెలియదు. అడిగి తెలుసుకోవాలంటే నోరు విప్పడు. ఏడు రోజుల దీక్ష పూర్తి అయిన తరువాత ప్రజలనుద్దేశించి మూడు మాటల సందేశం యిచ్చాడు.

"ప్రభువు అవతరించాడు. జ్ఞానులు ప్రభువు రాకను ముందుగానే ఊహించి చెప్పారు. అందరు ఎదురు చూస్తున్నారు. మీరు ప్రభువుకు స్వాగతం చెప్పడానికి సిద్ధంగా ఉండండి".

ఆ నాలుగు మాటలు చెప్పి జాన్ అదృశ్యమైనాడు. ఆయన ఏమైంది? ఎక్కడకు వెళ్లింది? ఎవరికీ తెలియదు. ఆ వాక్యాలు విన్న జెరూసలెం ఉలిక్కి పడ్డది. ఆ వార్త పెద్ద కలకలం రేపింది. కొందరిలో కలవరం కలిగించింది.

ఆ పర్వతరుషి చెప్పిన మాటలు రాజుల చెవుల పడ్డాయి. తమ సింహాసనానికి ఎసరు వచ్చిందన్న భయం పట్టుకుంది. వేగుల్ని నలువైపులా పంపారు. ఎన్ని రోజులు ఎంత తిరిగినా వారికి పర్వత రుషి జాడ తెలియరాలేదు.

కొద్దికాలం తర్వాత ఒకనాడు జాన్ నగరం నడిబొడ్డున ప్రత్యక్షమైనాడు. ఆ వార్త వినగానే ప్రజలు బిలబిలమంటూ ఆయన దర్శనానికి పరుగులు తీశారు. జాన్ వారి నుద్దేశించి చెప్పాడు : "కలవరపడ నవసరం లేదు. రాజులు భయపడ నవసరం లేదు. రానున్న ప్రభువు ఎవరికీ శత్రువు కాదు. ఎవరికీ అపకారం చేయడు. ఆయనకు సింహాసనాలు అవసరం లేదు. ఆయన శాంతి ప్రియుడు. ఆయన సామ్రాజ్యం మీ హృదయం. మీ కళ్లకు ఆ సింహాసనం ఇప్పుడు కనిపించదు. సిద్ధంగా ఉండండి. ప్రభువుకు స్వాగతం చెప్పడానికి తయారు. కండి".

ఆ మాటలు చెప్పి జాన్ మరల అదృశ్యమైనాడు. మరొకమారు పండుగ రోజున, జెరూసలెం పండుగ ఉత్సాహంలో యూదుల ఉండగా మూడవసారి జాన్ ప్రజల మధ్య ప్రత్యక్షమైనాడు.

"ప్రజలారా! ప్రభువుకు స్వాగతం చెప్పడానికి సిద్ధం కండి. ఇంత కాలంగా మీరంతా పాపకూపంలో బ్రతుకుతున్నారు. ఎవరూ మిమ్మల్ని పట్టించుకోలేదు. ఇంతకాలం మీరు మోసానికి గురైనారు. మీరు హృదయంతో ప్రార్థించడం లేదు. ఈ దేవాలయాలు, పూజారులు మీకు సహాయం చేయరు. కళ్లు తెరవండి. వాస్తవం గ్రహించండి".

ఆ మాటలు చెప్పి జాన్ మరలా అదృశ్యమైనాడు. సామాన్యుని తల తిరిగి పోయింది. వ్యవస్థను విమర్శించడం సామాన్యమా! దేవాలయాల్ని, పూజారుల్ని తప్పుపట్టడం దైవ ద్రోహం కదా!

ప్రజల మనోభావాలెరిగి జాన్ మర్నాడు దేవాలయం ఎదుట ప్రత్యక్షమైనాడు. ఈసారి పూజారి వర్గం ఆయన్ని నిలదీసి ప్రశ్నించారు. "ఏమయ్యా! నీ మాటలకు అర్థం ఏమిటి? నీ వెవరు? ఎక్కడినుండి వచ్చావు? జనాల్ని ఎందుకిలా రెచ్చ గొడుతున్నావు? నీ మాటలలో సత్యం ఎంత? నిరూపించగలవా? ఎవరు వస్తారు? ఏం చేస్తారు! నీకూ ఆ వచ్చే వాడికీ సంబంధం ఏమిటి?"

జాన్ అన్నాడు : "నేను అనంతమైన ఆకాశానికి ప్రతినిధిని. దిగివచ్చిన దివ్యత్వానికి వారసుడిని. ప్రభువు వస్తున్నాడు. మార్గం శుభ్రం చేయండి. శాంతి దూత మిమ్మల్ని ప్రేమించి, ఉద్ధరించడానికి వస్తున్నాడు. మీ హృదయాలను పాలించేది ఇకపైన తను. సిద్ధంగా ఉండండి! మరోవారం తర్వాత నేను గిల్గాల్‌లో

కనిపిస్తాను" అంటూ దేవాలయం నుండి పరుగుతీశాడు. కొందరు, అతనిని బెతాని వరకు అనుసరించారు.

లాజరస్‌తో కొంతకాలం గడిపి, నజరెత్‌లో ఒక విందుకు వెళ్లాడు. అక్కడ మద్యం సేవించడం గమనించి తీవ్రంగా మందలించాడు. "మీరు మద్యం తాగి మతులు పోగొట్టుకోవద్దు. ప్రభువుకు ఈ విలాసాలు నచ్చవు. దయచేసి మద్యం మానండి". అని తన చేతికిచ్చిన మధుపాత్రను నేలకేసికొట్టి విసవిసా వెళ్లి పోయాడు.

అక్కడ నుండి బయలుదేరిన జాన్ సరాసరి జెరికో చేరాడు. అక్కడ ఆల్ఫోస్ ఇంట బసచేశాడు. జాన్ వచ్చిన వార్త అక్కడి ప్రజలకు నెమ్మదిగా తెలిసింది. గుంపులుగా వచ్చి దర్శనం చేసుకోసాగారు. వారు సందేశం యిమ్మని, మాటలు చెప్పమని కోరారు. ఏమీ చెప్పలేదు. తర్వాత జోర్డాన్ కోటకు వెళ్లినప్పుడు ప్రజల నుద్దేశించి ప్రసంగించాడు.

"మిమ్మల్ని ముందుగా శుద్ధి చేసుకోండి. పవిత్ర జలాలలో స్నానం చేసి రండి. మీ పాపాలు పోతాయి. అది మీ ఆత్మ పరిశుద్ధం కావడానికి ఒక గుర్తు".

జోర్డాన్ నదిలో వారంతా స్నానం చేసి వచ్చారు. కొన్ని నెలలు జాన్ ఆ ప్రాంతంలో పర్యటిస్తూ శుద్ధి కార్యక్రమం కొనసాగించాడు. ధర్మబోధన చేశాడు. పవిత్ర జీవన సూత్రాలు బోధించాడు. తర్వాత బెతానిలో హితబోధ చేశాడు. మొదట బహుకొద్దిమంది ఆయనను అనుసరించారు. కేవలం ధర్మచింతన కలవారు వచ్చారు. పోనుపోను దొంగలు, దగాకోర్లు, వ్యభిచారులు సైతం రాసాగారు. అయితే ప్రమాణం స్వీకరించేవారు కారు.

ధనవంతుల్ని గట్టిగా మందలించేవాడు "సిగ్గు విడచి అబ్రహాం సంతతి వారమని చెప్పుకుంటున్నారు. తప్పుచేసిన వారిని భగవంతుడు క్షమించడు. నిస్సహాయులకు సహాయం చేయండి. కొంత నిష్కృతి లభిస్తుంది".

కొందరు 'జాన్' ప్రవచనాలు విని అతనే క్రీస్తు అనుకోసాగారు. జాన్ బెతాని వదలి జోర్డాన్ చేరుకున్నాడు.

జాన్ జోర్డాన్ కోటలో ఉపదేశిస్తున్నట్లు గలిలీలో ఉన్న జీసస్‌కు తెలిసింది. తన మిత్రులతో కలిసి జోర్డాన్ చేరుకున్నాడు. జీసస్ జాన్‌ను చూడగానే నమస్కరించి "ఓ మహర్షీ ఓ మహాత్మా!" అని సంబోధించాడు. జీసస్‌ను జాన్ గుర్తించి 'భగవాన్' అని సంబోధించాడు.

జీసస్ జాన్‌తో అన్నాడు, "మహర్షీ నన్ను శుద్ధి పరచండి"

"మీకు ఆ అవసరం లేదు భగవాన్. మీరు పుణ్యమూర్తులు. పవిత్రులు. మీ మాట, మీ వర్తనం అన్నీ పవిత్రచిహ్నాలు. మీరు పట్టుబడితే ఆపని చేయనని చెప్పను. లాంఛనంగా మిమ్మల్ని 'శుద్ధి' చేస్తాను. నిజానికి నా కా అర్హత లేదు".

"మహర్షీ! ఇతరులు చేయదగిన పనులు చెప్పేముందు మనమే ఆ పనులు చేయడం విధి విధాయకం, ధర్మం. ప్రతి ఒక్కరు పూర్వపాపాలను కడిగి వేసుకోవలసిందే." (అదే బాప్టిజం).

జీసస్ అన్నాడు : "మీరు మహాత్ములు. ప్రయోక్త బాధ్యత తీసుకున్నాను. మీరే ఈ జగతికి వైతాళికులు. నిగూఢ తత్వాన్ని ఎరుక పరచడం ప్రయోక్త కర్తవ్యం. 'క్రీస్తు! విభూతిని ఎరుక పరచండి".

వారిరువురు నదిలో స్నానం చేసి, పరిశుద్ధాత్ములై ఒడ్డుకు రాగానే ఒక శాంతి కపోతం గగనం నుండి దిగివచ్చి జీసస్ తలపైన వాలింది. అప్పుడు దివ్యవాణి వినిపించింది : "జీసస్ భగవంతుని ప్రేమ స్వరూపం. దేవుని 'స్వ' రూపం జీసస్". ఆ మాటలు స్పష్టంగా జాన్‌కు వినిపించాయి. జీసస్ జాన్ వద్ద సెలవు తీసుకుని మిత్రులతో వెళ్లిపోయాడు.

◆ ◆ ◆

# 13. అంతర్మథనం

(1) జాన్ తనను లోకానికి ఒక ప్రవక్తగా పరిచయం చేశాడు. ప్రేమ స్వరూపిగా, మానవ రూపం ధరించిన దైవతంగా ప్రవచించాడు. సరే ... ఎట్లా? ఎట్లా? క్రీస్తు శకం ఆరంభమైంది! జీసస్‌లో అంతర్మథనం ప్రారంభమైంది. ఎవరెన్ని చెప్పినా బాధ్యత వహించవలసింది తను. అటు సప్తర్షుల అభిభాషణ, ఇటు జాన్ మహర్షి ప్రస్తుతి. మనస్సు ఎటూ తేలడం లేదు. సరాసరి ఏకాంత ధ్యానానికి పర్వతాలపైకి దారి తీశాడు జీసస్. ముందు తనను తాను తెలుసుకోవాలి! తన మనస్సు తనకు స్పష్టంగా తెలియాలి. తర్వాత కర్తవ్య నిర్వహణ, బాధ్యత. తన శక్తి ఎలాంటిదో తనకు తెలియకుండా ఉద్యమించకూడదు. తనకున్న అర్హత - జ్ఞానం ఒక్కటే. తనలో తను తర్కించుకోసాగాడు. బాహ్యంగా మనిషి భౌతిక బంధాలలో చిక్కుపడి ఉంటాడు. అంతరాత్మకు అంతశ్శక్తి ఉందో లేదో ఎవరికీ తెలియదు. బాహ్య ప్రవృత్తుల్ని జయించినంత మాత్రాన అంతశ్శక్తి పెరిగినట్లా? రేపు ప్రజల మధ్యకు వెళ్తే నిగ్గతీసి మరీ ప్రశ్నిస్తారు. నా అర్హతను ఎలా నిరూపించుకోవాలి! మనుషులు ముందుగా ఎదుటివారి బలహీనతలు వెతుకుతారు. వాటిని బట్టి అనర్హత వేటు వేస్తారు. నేను దైవదూతనని, మెస్సయ్య నని ఎలా నిరూపించగలను?

లోపల నుండి ఒక జ్ఞానకిరణం బయటకొచ్చింది. ఒక భావకెరటం పొంగి వచ్చింది. "నీవు దేవుని కుమారుడివి. ఈ రాళ్లను రొట్టెలుగా మార్చు - జనం నమ్ముతారు".

జీసస్ వివేకం ఎదురు తిరిగింది. అంతరాత్మ ఆవేదన చెందింది. "ఎందుకు నాకీ పరీక్ష? ఒక మహత్తు చూపినంత మాత్రాన నేను దేవుని కుమారుడినని నమ్ముతారా? క్షుద్రశక్తుల్ని ఉపాసించేవారు మహిమలు చూపిస్తారు. దయ్యాలు, భూతాలు అనేక బలప్రదర్శనలు చేస్తాయి. మాంత్రికులు అతీంద్రియ విద్యలు ప్రదర్శిస్తారు. నా మాటలు, ప్రవర్తన ఆదర్శంగా ఉండాలి. మెరమెచ్చులు

పనికిరావు. నేను ఆదర్శజీవితం గడిపితేనే జనం నమ్ముతారు. నిరాడంబరంగా ఉంటేనే సామాన్యజనం ఆదరిస్తారు".

లోపల నుండి మరొక ప్రలోభం తొంగిచూచింది, "జెరూసలెం వెళ్లు. అక్కడి దేవాలయం శిఖరంపైనుండి క్రిందికి దూకు. అప్పుడు ప్రజలు నిన్ను దేవుడిగా అంగీకరిస్తారు. నీవే మెస్సయ్య వని నమ్ముతారు".

జీసస్ మనస్సులో తర్కించుకున్నాడు. "అలా భగవంతుని మోసం చేస్తే అది దైవ ద్రోహం అవుతుంది కదా".

మరొక ప్రలోభం తొంగిచూచింది "చూడు! లోకంలో కీర్తి ప్రతిష్టలు సంపాదించి, సుఖపడు. అప్పుడు అందరూ నీవు గొప్పవాడివని గుర్తిస్తారు".

జీసస్ ఆలోచించసాగాడు. "నాకు ఎలాంటి ప్రలోభాలు వద్దు. వాటిని నా మనస్సులోకి రానివ్వకూడదు. మనస్సును నిగ్రహించాలి. సంపదలు, సుఖాలు నా కవసరం లేదు. వాటివల్ల నాలో గర్వం, స్వార్థం, అహంకారం పెరుగుతాయి".

నలభై రోజులు నిరాహారంగా, నిర్విరామంగా తపస్సమాధిలో గడిపాడు. ఉద్రేకాలను, ప్రలోభాలను జయించగలిగాడు. అంతరాత్మ విజయకేతనం ఎగుర వేసింది. నలభై రోజుల దీక్షానంతరం కళ్లు విప్పాడు. ఏకాంతం వదలి, దివ్యప్రపంచం నుండి, బాహ్యప్రపంచంలోకి వచ్చాడు.

(2) జాన్ అనుచరవర్గంలో గలిలీకి చెందినవారు చాలామంది ఉన్నారు. వారిలో విశ్వసనీయులు ఆంద్రూ, సైమన్, జేమ్స్, జాన్ అనే నలుగురు. వీరికి తోడు జాన్ సోదరుడు ఫిలిప్. ఈ అయిదుగురు జాన్ ఆత్మీయులు. ఒక రోజు ఆంద్రూ, ఫిలిప్‌లు జాన్‌తో మాట్లాడుతుండగా జీసస్ అక్కడ అనుకోకుండా ప్రత్యక్షమైనాడు. జాన్ సంభ్రమాశ్చర్యాలకు లోనై, "ఓహ్. క్రీస్తుకు స్వాగతం – సుస్వాగతం" అని ఆప్యాయంగా స్వాగతించాడు. జాన్ ముగ్గురు శిష్యులు జీసస్ వెంట వెళ్లారు. జీసస్ వారిని ప్రశ్నించాడు.

"మీకేం కావాలి? నాతో వస్తున్నారెందుకు?"

"తమరి నివాసం ఎక్కడ?"

జీసస్ వారిని తనవెంట తీసుకువెళ్లాడు.

ఆంద్రూ తన సోదరుడు సైమన్‌ను పిలిచి చెప్పాడు. "నాతో రా సైమన్. నేను క్రీస్తును చూచాను. నీవూ వచ్చి దర్శించుకో".

జీసస్ సైమన్ ముఖం చూడగానే అన్నాడు : "ఊఁ గట్టివాడివే, నీ పేరు పీటర్ కదూ?"

ఒక చెట్టు నీడన కూర్చుని ఉన్న నథానియల్ ఫిలిప్‌ను పిలిచి చెప్పాడు. "సోదరా, నాతో వస్తావా. నేను క్రీస్తు దగ్గరకు పోతున్నాను. ప్రభువు నజరత్‌లో ఉన్నాడు".

నథానియల్ అడిగాడు, "నజరత్ వెళ్లితే ఏమైనా లాభం ఉంటుందా?".

"వచ్చి చూస్తే కదా తెలిసేది".

జీసస్ నథానియెల్‌ను చూడగానే అన్నాడు, "ఇజ్రాయిల్ మొత్తంలో మంచి వాడివి నీ వొక్కడివే".

"అట్లా ఎలా చెప్పగలరు?"

"నీవు చెట్టు క్రింద ఉన్నప్పుడే గమనించాను. అప్పుడేగా మీ అన్న నిన్నూ పిలిచింది రమ్మని".

నథానియల్ చేతులెత్తి నమస్కరించాడు జీసస్‌కు. ఈ మహాత్ముడే క్రీస్తు. సందేహం లేదు. జాన్ ప్రవచించిన ప్రవక్త ఇతనే. జాన్ వెళ్లి తన సోదరుడు జేమ్స్‌ను వెంటబెట్టుకు వచ్చాడు. ఆరుగురు అనుయాయులు జీసస్ వెంట ఆయన నివాసానికి వెళ్లారు.

పీటర్ అన్నాడు : "మేం ఎంతో కాలంగా 'క్రీస్తు' అన్వేషణలో ఉన్నాం. గలిలీ నుండి జాన్ వద్దకు వెళ్లాం. ఆయనే క్రీస్తు అనుకున్నాం. తను క్రీస్తు కాదని ఆయన ఖచ్చితంగా చెప్పాడు. తన పని క్రీస్తు రాకను తెలియచేయడమే ననేవాడు. మీరే 'క్రీస్తు' అని జాన్ తెలియచెప్పాడు".

జీసస్ అన్నాడు : "పక్షులకు గూళ్లు ఉన్నాయి. నాకు తలదాచుకునే నీడ లేదు. నన్ను అనుసరించేవారు అన్నీ త్యజించవలసి ఉంటుంది. సుఖాలను త్యాగం చేయవలసి ఉంటుంది".

పీటర్ అన్నాడు : "ఇతరుల విషయం నాకు తెలియదు. నేను సర్వసంగ పరిత్యాగిని". జీసస్ అడుగుజాడల్లో నడుస్తామని అందరూ ప్రమాణం చేశారు.

**3** మర్నాడు జీసస్ వెళ్లి మరలా జాన్‌ను దర్శించాడు. ఏవైనా విషయాలు చెప్పమని జాన్ కోరగా, జీసస్ అన్నాడు : "దైవ సామ్రాజ్యం దగ్గరలోనే ఉంది. మీ ఎదుట ఉన్న వ్యక్తి చేతిలో మీ హృదయాలను తెరిచే బీగాలు ఉన్నాయి.

అతడే 'ఎలిజా' ఆత్మతో వచ్చిన వాడు. తలుపులు తెరవగానే ఎవరైనా వచ్చి లోపల దేవుని దర్శించవచ్చు. చెడ్డ మనసున్న వారికి ప్రవేశం ఉండదు. సుఖాలపట్ల, ఆడంబరాలపట్ల ఆసక్తి ఉండకూడదు. పరులకోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడిన వారికే ఇక్కడ ప్రవేశం, అర్హత. మీరిప్పుడు ప్రభువు మందిర ద్వారం వరకు వచ్చారు. లోపల ఎందరికైనా చోటు ఉంటుంది. కోరికల్ని విసర్జించి లోపలకు అడుగుపెట్టండి".

జీసస్ వచ్చిన వార్త చుట్టుప్రక్కల ప్రాకింది. పట్టణ ప్రజలు ఆయన్ని చూడడానికి రాసాగారు. వారి మధ్య నిలచి జీసస్ బోధించాడు "ఇంతకాలం మీరు ఎదురుచూస్తున్న ప్రభువు రావడం జరిగింది. ఈ జీసస్ 'ప్రభువు' కాదు. దైవసామ్రాజ్య ప్రతినిధి. దైవసామ్రాజ్యం మీ దగ్గరగా, మీలోనే ఉంది. దానిని ఈ కళ్లతో చూడలేరు. సింహాసనంపై నున్న ప్రభువును దర్శించడం అంత సులభం కాదు. ప్రభువు మానవుడు కాదు. రాజులు రాజ్యాలు జయిస్తారు. ప్రభువు మానవహృదయాలను జయిస్తాడు. ఒక రాజ్యం శిధిలమైతే మరొక రాజ్యం పైకొస్తుంది. ఆత్మసామ్రాజ్యం అలా శిధిలం కాదు. విస్తరిస్తూ పోతుంది. సద్ధర్మ పాలన చేసే రాజులకు ప్రభువు అనుగ్రహం లభిస్తుంది. వారికి భగవంతుని ఆశీస్సు ఉంటుంది. రోమన్ చక్రవర్తులు ప్రజారంజకంగా ఉంటే ప్రభువు కోపించడు.

"నేను సీజర్ వలె సింహాసనం అధిష్టించి, రాజ్యపాలన చేయడానికి రాలేదు. ప్రజలు నన్ను 'క్రీస్తు' అన్నారు. భగవంతుడు ఆమోదించాడు. 'క్రీస్తు' అంటే ఒక వ్యక్తి పేరు కాదు. క్రీస్తు అంటే విశ్వప్రేమ. ఈ జీసస్ మీలాంటి ఒక మనిషి. కోర్కెలు, వాంఛలు జయించిన మనిషి. బాధలు, కష్టాలు భరించడానికి సిద్ధమైన మనిషి. 'క్రీస్తు' నివశించే దేవాలయం జీసస్. ఈ దేవాలయం అందరికీ ప్రేమను పంచుతుంది.

"మీరు చూడవలసింది బక్కచిక్కిన ఈ శరీరాన్ని కాదు. లోపల ఉన్న ప్రేమను, కరుణను. ప్రేమ అంటేనే క్రీస్తు. ప్రతి మనిషిలోనూ ప్రేమ నెలకొనే అవకాశం ఉంది. విశ్వాసం స్థిరపడి, మీ హృదయాలు పవిత్రం అయితే మీలో భగవంతుడు ప్రవేశించినట్లు. భగవంతుని మీలో చూడగలరు".

జనం ప్రశ్నించారు, "మేము ఏం చేయాలి చెప్పండి?"

జీసస్ : "మనసా, వాచా, కర్మణా పవిత్రంగా జీవించండి. మీ దేహమే దేవాలయం అవుతుంది. పవిత్ర జీవనానికి నియమాలుండవు. మనిషి పాపం

చేయడానికి ముందుంటాడు. ప్రతి మనిషి పాపాలు చేస్తూనే ఉంటాడు. ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకుని, చెడునుండి బయటకుపడండి. చెడ్డగా ఆలోచించ కుండా, చెడు పనులు చేయకుండా ఉంటే అందరూ మంచివారే. మనిషి ఉన్నత స్థితికి చేరి నిస్వార్థంగా ఉంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి".

జీసస్ ఆరుగురు శిష్యులు వెంటరాగా జెరూసలెంకు బయలుదేరాడు. మాత్యూస్ ముందుగా జెరూసలెం చేరుకుని 'జీసస్' రాకను తెలియచేశాడు. ప్రజలు ఎదురువచ్చి స్వాగతించారు. జీసస్ బృందం సరాసరి దేవాలయ ప్రాంగణం చేరింది. అక్కడ ప్రజల నుద్దేశించి జీసస్ అన్నాడు "నా సందేశం మీలో స్పందన కలిగిస్తే క్రీస్తు మీ హృదయంలో ప్రవేశించినట్లే".

అక్కడ నుండి శిష్యులతో నజరత్ చేరుకున్నాడు. తల్లి, చెల్లెలు స్వాగతం చెప్పారు.

మర్నాడు పీటర్ వీధిలో పోతుండగా దేవాలయ పూజారి ఒకరు ఎదురుపడి ప్రశ్నించాడు "ఎవరీ జీసస్? నజరత్ వచ్చాడట?"

పీటర్ : "దైవజ్ఞులు చెప్పిన క్రీస్తు అయనే. ఇజ్రాయిల్ ప్రభువు. ఆయన తల్లి పేరు మేరి. మార్మియన్‌లో నివాసం".

అతనన్నాడు, "జీసస్‌కు నన్ను వచ్చి కలవమని చెప్పు, ఆలయంలో".

పీటర్ వెంటనే వెళ్లి జీసస్‌కు ఆవిషయం చెప్పాడు. జీసస్ అక్కడకు వెళ్లలేదు. పీటర్‌కు సమాధానం చెప్పలేదు. సాయంత్రం పూజారి స్వయంగా మేరీ ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. అతను జీసస్‌ను సూటిగా అడిగాడు, "నీవు దైవదూతవని నిదర్శనం ఏమిటి? కబురు చేస్తే రాలేదేం?"

జీసస్ : 'నేను ఎవరికీ సేవకుడిని కాను కబురు పెట్టగానే రావడానికి. మనుష్యులు పిలిస్తే నాకు వినిపించదు. నేను స్పందించను. నేను భగవంతుని ప్రతినిధిని. భగవంతుని దూతను. ఆయన ఒక్కడికే నేను సమాధానం చెప్పాలి. నేను దైవదూతను అవునో, కాదో అడిగే హక్కు తమకు లేదనుకుంటాను".

"ఏమిటీ మనిషి? నన్నే లెక్కచేయడం లేదు" అని కోపించి వెళ్లిపోయాడు. జీసస్ ప్రవచనం వినడానికి జనం ఉవ్విళ్లూరుతున్నారు.

స్వదేశంలో ప్రవక్తలు రాణించరు. వారికి పుట్టినచోట అసలు గుర్తింపు ఉండదు. రచ్చగెలిచి ఇంట గెలవాలి.

నజరత్‌లో ప్రసంగించడానికి జీసస్ ఇష్టపడలేదు.

**(4)** గలిలీ లోని 'కానా'లో ఒక సంపన్నుడు జీసస్‌ను విందుకు ఆహ్వానించాడు. జీసస్, మేరి, మిరియం విందుకు హాజరైనారు. గృహస్తుకు జీసస్ పట్ల విశ్వాసం ఉంది. ఆ సందర్భంలో జీసస్‌ను సందేశం యిమ్మని అర్ధించాడు. జీసస్ ఇలా ప్రసంగించాడు :

"వైవాహిక బంధం అన్ని బాంధవ్యాల కన్న గొప్పది. రెండు ఆత్మలు ప్రేమతో ముడిపడమే వివాహం. నిజానికి పెళ్లి స్వర్గంలోనే నిర్ణయ మవుతుంది. రెండు ఆత్మలబంధం స్వర్గంలోనే ఏర్పడుతుంది. మనుషులుగా పుట్టిన తర్వాత సుఖాసక్తి, ఆ ఇద్దరినీ ఏకం చేస్తుంది. బలవంతపు సంసారం దాంపత్యం అనిపించుకోదు. దాంపత్యానికి 'ప్రేమ' ప్రధాన సూత్రం".

ఆ మాటలు చెప్పి జీసస్ మౌనంగా కూర్చున్నాడు. అంతలో కలకలం. విందుకు సిద్ధం చేసిన ద్రాక్షరసం పాడైంది. మేరీ వచ్చి జీసస్‌తో అన్నది "ఏం చేద్దాం".

"అమ్మా, ద్రాక్ష రసం అంటే ఏమిటి. నీరు, కాస్త రంగు, సువాసన కలిస్తే ద్రాక్ష రసం అవుతుంది. ద్రాక్ష తాగుతున్న భావన తృప్తి నిస్తుంది. మనం అలాంటి భావన చేస్తే సరి, నీరు ద్రాక్ష రసంగా మారుతుంది".

జీసస్ ఆరు బిందెలు తెప్పించాడు. తన శిష్యులు ఆరుగురిని ఆ బిందెలలో నీరు నింపమని ఆదేశించాడు. తన సంకల్ప బలంతో గాలిలో తరంగాలు సృష్టించి నీటిని ద్రాక్ష రసంగా మార్చాడు. సేవకులు దానిని గృహస్థుకు చూపించారు. అంత రుచికరమైన ద్రాక్ష - ఇదివరకు ఎన్నడూ తాగింది లేదని అంతా ఆనందించారు. అది జీసస్ మహిమ అని తెలిసి మరీ ఆశ్చర్యపోయారు.

◆ ◆ ◆

# 14. క్రీస్తు పథంలో తొలి మలుపు

(1) యూదుల పండుగ దినాలు. జీసస్ తన తల్లిని కౌపర్‌నామ్‌లో విడిచిపెట్టి జెరూసలెం బయలుదేరాడు. జూడే ఇంట అతిధ్యం. జీసస్ దేవాలయ ప్రాంగణం చేరేసరికి జనం చుట్టుముట్టారు. తమను రోమన్ అధికారం నుండి తప్పించే ప్రభువు వస్తాడని ఎదురు చూస్తున్నారు. యూదుసామ్రాజ్య పునర్నిర్మాణం కోసం పరితపిస్తున్నారు. జీసస్ తమని ఉద్ధరిస్తాడని వారి నమ్మకం. జీసస్ వారిని పట్టించుకో లేదు. ఆయన దృష్టి అలయ ప్రాంగణంలోని వ్యాపారులపైన పడ్డది. పవిత్ర దేవాలయ ప్రాంగణం వ్యాపార కూడలిగా మారడం ఆయనను బాధించింది. గొర్రెల్ని, పావురాళ్లను అమ్ముతున్నారు. కొన్నవాళ్లు వాటిని బలియిస్తున్నారు. జీసస్ పూజారుల్ని పిలిచి చెప్పాడు "మీ స్వలాభం కోసం దేవాలయాన్ని తాకట్టు పెడుతున్నారు. దేవాలయం అంటే పవిత్ర స్థలం. ఇది ప్రార్ధనకు ఉపయోగపడాలి. దొంగలు, దగాకోర్ల వ్యాపారకేంద్రంగా, విహార కేంద్రంగా మార్చడం అనుచితం. దేవుని సన్నిధిలో మంచి చెడులు ఇలా కలిసి ఉండకూడదు".

పూజారులు ఆయన మాటలు పెడచెవిని పెట్టారు. వెంటనే కోపంతో రెచ్చిపోయి వ్యాపారుల్ని తరిమి తరిమి కొట్టసాగాడు. పంజరాల తలుపులు తెరిచి పావురాళ్లను వదిలిపెట్టాడు. గొర్రెల మెడకు కట్టిన తాళ్లను తెంచివేశాడు. ఆ భీభత్సానికి పూజారులు, అధికారులు పారిపోయారు. తిరిగి వచ్చి జీసస్‌ను కొట్టాలని ప్రయత్నించారు. కాని జనం వారిని లోపలకు రానివ్వలేదు. పూజారులు పరుగులు తీసి రాజప్రతినిధికి, అధికారులకు ఆ సంఘటన వివరించారు.

"ఎవడా జీసస్? అతనికి ఆ అధికారం ఎవరిచ్చారు?"

ప్రజలు అన్నారు : ఆయన దేవుడు, ఆయన క్రీస్తు. మా ఇజ్రాయిల్‌కు విముక్తి కలిగించే ప్రభువు ఆయన.

అధికారులు జీసస్‌ను నిలతీశారు : నీవు క్రీస్తువు అనడానికి నిదర్శనం ఏమిటి? వర్తకుల్ని దేవాలయం నుండి ఎందుకు తరిమి కొట్టావు?

జీసస్ . ఈ దేవాలయం కోసం నా ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను నేనే కాదు ఇక్కడ ఉన్న ప్రతి యూదు పౌరుడు ప్రాణత్యాగానికి సిద్ధం దేవాలయాన్ని అపవిత్రం చేస్తే సహించేది లేదు. ప్రజల పక్షాన, ప్రజల కోసం నేను ఈ పని చేశాను. సత్యానికి ప్రమాణం అవసరం లేదు నేను దైవ ప్రతినిధిని మెస్సయ్య అని నిరూపించాలి అంతేకదా! ఈ దేవాలయాన్ని నేల మట్టం చేయండి మూడు దినాల్లో ఇంతకంటే పెద్ద ఆలయాన్ని సుందరంగా పునర్నిర్మిస్తాను "

"వందల, వేలమంది శ్రామికులు నలభై ఆరు సంవత్సరాలు శ్రమించి నిర్మించిన దేవాలయాన్ని నీ కోసం కూల్చివేయడానికి మేం పిచ్చివాళ్ళం కాదు".

వారంతా జీసస్‌ను కొట్టి బంధించడానికి సిద్ధమయ్యేలోగా 'ఫిలో' అక్కడకు వచ్చాడు. ఉత్సవాలలో పాల్గొనడానికి ఫిలో ఈజిప్టు నుండి వచ్చాడు. అతనంటే ప్రజలకు గౌరవం ఉంది. ఆయన వారి చర్యల్ని వారించాడు :

"మిత్రులారా! జీసస్ సామాన్యుడు కాదు. గొప్ప జ్ఞాని. నేను జీసస్ ప్రసంగాలు విన్నాను వేలమంది రోగులను స్పర్శతో స్వస్థులను చేయడం కళ్ళారా చూచాను. జీసస్ మహర్షి. ముందు ముందు మీరు ఆయనను మహాత్ముడు అంటారు. ఆయన ప్రవక్త, యుగకర్త అని అంగీకరిస్తారు".

ఆయన మాటలతో పూజారి వర్గం చల్లబడ్డారు. ఆలోచనలో పడ్డారు. వారు అసహనంగా అన్నారు "తనే భగవంతుడినని చెప్పుకుంటున్నాడు".

జీసస్ వినయంగా చెప్పాడు : "నేను దేవుడినని ఎప్పుడూ ఎవరికీ చెప్పలేదు. అందరికీ భగవంతుడు ఒక్కడే మనందరికీ ప్రభువు భగవంతుడు. నేను మీలో ఒకడిని. మీతో కలిసి భగవంతుని ప్రార్థిస్తాను. నేను భగవంతుని చూపించే చిన్న దీప కళికను".

(2) మర్నాడు ఆలయ ప్రాంగణం జనంతో క్రిక్కిరిసి పోయింది. జీసస్ వస్తాడని, ఆయన మాటలు వినాలని ఎదురు చూడసాగారు. జీసస్ రాగానే సంతోషంతో కేరింతలు కొట్టారు జీసస్ వారి అభ్యర్థన మేరకు ఒక కథ చెప్పాడు .

"అనగనగా ఒక రాజుండేవాడు ఆయన మంచివాడు. ప్రజల్ని కన్న బిడ్డల వలె చూచుకునేవాడు ఆయన పాలనలో ప్రజలు శాంతిగా, సుఖంగా ఉన్నారు. కొంతకాలం తర్వాత రాజుగారు ప్రజల్ని సమావేశపరచి చెప్పాడు · 'ఇవిగో నా సంపదలు, నా భూములు, నగా నట్రా, ధనం. వీటిని మీరు తీసుకుని పంచుకోండి అయితే ఒక నిబంధన. వాటి విలువ పెంచాలి, ఆస్తులు పెంచాలి. మిమ్మల్ని మీరే పాలించుకోవాలి నేను విశ్రాంతి తీసుకుంటాను'.

ప్రజలు సంతోషించారు రాజ్యాన్ని చిన్నచిన్న ముక్కలుగా విడగొట్టి బుల్లి బుల్లి రాజ్యాలుగా, సంస్థానాలుగా విభాగించారు బలవంతులు తెలివి గలవారు అధికారం చేజిక్కించుకున్నారు కొంతకాలానికి వారిలో స్వార్థం పెరిగింది ఒకరి నొకరు కబళించుకోసాగారు. ఇతరుల ఆస్తుల్ని భూముల్ని ఆక్రమించాలని ప్రయత్నించారు ఆ స్వార్థం యుద్ధాలకు దారితీసింది తమకు అనుకూలంగా న్యాయశాస్త్రాలు రాయించి, చట్టాలు తయారు చేసుకున్నారు. 'రాజ్యం వీర భోజ్యం' అంటూ బలహీనుల్ని అణచివేయసాగారు. అశాంతి పెరిగింది.

ఈ అరాచకం రాజుగారు గ్రహించారు. ప్రజల్లో భయం పెరిగింది. శాంతి నశించింది. వారిని చక్కదిద్దే పనికి తన కుమారుని నియమించాడు ప్రజలలో పరివర్తన తీసుకు రావాలన్నది రాజుగారి కోరిక.

కాని విచక్షణా జ్ఞానం కోల్పోయిన ప్రజలు రాజుగారి కొడుకు మధ్యవర్తిత్వం ఆమోదించలేదు. తిరస్కరించారు".

ఒక న్యాయవాది ప్రశ్నించాడు : 'మెస్సయ్య అంటే ఏమిటి? ఎవరు? ఒక మనిషిని దైవకుమారునిగా చేసే హక్కు ఎవరికుంది?'

జీసస్ "మెస్సయ్య అంటే దైవప్రతినిధి అని అర్థం. దేవదూత. పతితుల్ని, భ్రష్టుల్ని, దళితుల్ని ఉద్ధరించడానికి దైవం నియోగించిన మనిషి. దేవదూతల్ని మనుషులు తయారుచేయరు వాస్తవానికి ప్రతియుగంలో భగవంతుడు తన ప్రతినిధిని అవతరింప చేస్తుంటాడు. ఆ అవతరణ ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క కాలంలో జరుగుతుంది మనుషులకు మంచిమార్గం చూపడం ధర్మం నిలబెట్టడం ఆ అవతార పురుషుల కర్తవ్యం మెస్సయ్య అన్నా, క్రీస్తు అన్నా ఒక్కటే

'మనిషి కొండల మీదనుండి ప్రవాహాలు పుట్టించవచ్చు. తుఫానులు సృష్టించవచ్చు. కొండల్ని కదిలించవచ్చు. రోగాలు నయం చేయవచ్చు. చనిపోయిన వారిని బ్రతికించనూ వచ్చు అంతమాత్రాన అతను భగవంతుడు కాడు, కాలేడు. ప్రకృతి అంతా మనిషి సంకల్పంలో ఉంటుంది. సంకల్పం ఆధీనంలో మెదులుతుంది. మంచివారికైనా, చెడ్డవారికైనా మానసిక శక్తి ఒక్కలాగే ఉంటుంది. పదార్థాన్ని నియంత్రించినంత మాత్రాన మెస్సయ్య కాలేరు మనిషి మేధస్సుతో భగవంతుని గుర్తించలేడు ప్రేమ కరుణ హృదయం-మెస్సయ్య గుణగణాలు. తన కోసం చూడడు. ప్రాపంచిక సుఖాలకు అతీతుడు అతని లక్ష్యం విశ్వశ్రేయస్సు విశ్వశాంతి మెస్సయ్యకు బంగారు సింహాసనాలు, కిరీటాలు అవసరం లేదు .

(3) సబ్బత్ - ఆనాడు (ఆదివారం) దేవాలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా ఉంది ఆ రోజు పూజారులు ఎలాంటి చికిత్సలు చేయరు. ప్రార్థన కోసం వచ్చే

భక్తులు మాత్రం దేవాలయానికి వస్తారు. కానీ జీసస్ వస్తాడన్న ఆశతో, చాలా మంది రోగులు - కుంటి, గుడ్డి, చెవిటివారు వచ్చారు. జీసస్ వచ్చాడు. సంప్రదాయానికి భిన్నంగా జీసస్ వారికి స్వస్థత కలిగించాడు. కొందరిని చేతులతో స్పృశించాడు. కొందరిని చెరువులో స్నానం చేయమన్నాడు. కొందరికి పండ్లు ప్రసాదంగా ఇచ్చాడు.

ఒక వైద్యుడు ప్రశ్నించాడు, "తమరు దైవశక్తితో చికిత్సచేస్తారని చెప్పారు. ఈ ప్రసాదాలు, తీర్థాలు, స్నానాలు ఏమిటి? అందరికీ స్పర్శతో చికిత్స చేయరాదా?"

జీసస్ అన్నాడు : "మీరు చికిత్సకులు. రకరకాల రోగాలకు రకరకాల కారణాలు ఉంటాయని మీకు తెలుసు. శరీరం వీణ వంటిది. ఏ తీగలు ఎలా శ్రుతి చేయాలో తెలిసి చేయాలి. అజ్ఞానికి అన్నీ అపస్వరాలే పలుకుతాయి."

సబ్బత్ రోజున రోగ నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ఆలయం అధికారులు అభ్యంతరం చెప్పారు. దేవాలయ ప్రాంగణం వదలి పొమ్మని వత్తిడి చేయసాగారు.

జీసస్ అన్నాడు : "సబ్బత్ అంటే పవిత్రమైన రోజని అర్థం. మంచి పని చేయడం పవిత్ర కార్యమే. సబ్బత్ రోజున మీలో ఎవరికైనా ప్రమాదం జరిగిందనుకోండి. ఆనాడు చికిత్స చేసుకోరా? మర్నాటి వరకు బాధపడతారా? పిచ్చిగా ఆలోచించకండి. ఏ రోజు కానీ నా సహాయం కోరిన వారిని కాదనను".

జీసస్ మొండి వాదనకు సమాధానం చెప్పలేక పూజారులు వెళ్లిపోయారు.

ఆ రోజు సాయంత్రం జీసస్ చెరువుగట్టున ఉండగా ఒక కుర్రవాడు ఆడుకుంటూ చెరువు నీటిలో పడ్డాడు. అతని స్నేహితులు సహాయం కోసం కేకలు పెట్టారు. బయటకు తీసేలోగా ఆ కుర్రవాడు చనిపోయాడు. జీసస్ చనిపోయిన కుర్రవానిని తిరిగి బ్రతికించాడు.

అలాగే ఒక కుక్క చావు బ్రతుకులో రోడ్డు ప్రక్కన పడి ఉంది. కదలలేని స్థితిలో ఉన్న కుక్కను జీసస్ చేతుల్లోకి తీసుకుని తన వెంట తీసుకువెళ్లి, గాయాలు నీటితో కడిగి శుభ్రం చేసి బ్రతికించాడు.

మరొకచోట ఒక అనాథ బాలుడు ఆకలితో అలమటిస్తుండగా, ఎవరూ రొట్టె ముక్క విదల్చలేదు. అది గమనించిన జీసస్ ఆ అనాథకు రొట్టె యిచ్చి, దుస్తులిచ్చి ఆదుకున్నాడు.

తనను అనుసరించి వస్తున్న వారితో అన్నాడు : "మనిషి పూర్ణత్వం సాధించాలంటే సౌభ్రాతృత్వం అలవరచుకోవాలి. సాటివారికి సహాయం

చేస్తుండాలి. సాటి మనుషులకే కాదు. జంతువుల విషయంలో, పక్షుల విషయంలో సానుభూతి అలవరచుకోవాలి. ప్రతిజీవి విషయంలో దయ చూపాలి. అన్ని జీవులు భగవంతుని దృష్టిలో సమానం. మనం ఇతరులకు సహాయం చేస్తే భగవంతుడు మనకు సహాయం చేస్తాడు".

**4** ఇజ్రాయిల్‌లో యూదుపాలకులలో నికొడమస్ ఒకరు. ఆయన విద్యావంతుడు. నిజాయితీపరుడు. దైవచింతన కలవాడు. ఒకసారి జీసస్ ప్రవచనం విన్నాడు. జీసస్ ప్రజ్ఞకు, సత్యస్ఫూర్తికి ఆకర్షితుడైనాడు. అయినా పాలకుడు కనుక ఆ మాట పైకి చెప్పి, ఒప్పుకోలేకపోతున్నాడు. రాత్రి వేళల్లో జీసస్ నివాసానికి వెళ్ళి, మారు వేషంలో ఆయన మాటలు, బోధలు ఆలకిస్తూండేవాడు. అతని మారు వేషం, నిజతత్వం జీసస్ గుర్తించాడు.

నికొడమస్ ఒకసారి ప్రశ్నించాడు, "మహాత్మా! తమరు దైవాంశ సంభవులని నాకు నమ్మకంగా తెలుసు. సామాన్య మానవులలో ఈ తేజస్సు, దివ్యత్వం ఉండవు. సామాన్యులు మహద్వాక్యాలు ప్రవచించలేరు".

జీసస్ : "జిజ్ఞాస, ఆత్మసంస్కారం ఉన్నవారికి నా అంతర్యం బోధపడుతుంది".

నికొడమస్ ప్రశ్నించాడు : "మనిషి మళ్లీ జన్మించడం ఎలా స్వామీ ...

జీసస్ : "ద్విజ అంటే మరల పుట్టడం. మనిషిలో ఉండేది మానవత్వం. దివ్యత్వం మనిషిలో ప్రవేశించడాన్ని ద్విజత్వం అంటారు. అంటే మరొక జన్మ ఎత్తినట్లు. అది సంస్కారం పొందడం, దివ్యత్వాన్ని అపేక్షించడం".

"నాకేమీ అర్థం కాలేదు మహాత్మా?"

"భగవంతుని సామ్రాజ్యం మనలోపలనే ఉంటుంది. భౌతిక దృష్టితో దానిని పొందడం కుదరదు. లౌకిక జ్ఞానం ఎంత సంపాదించినా, భగవతత్త్వం అర్థం కాదు. ఆత్మచైతన్యం పొందాలి. దివ్యజీవనం అలవడాలి. దేవుని లోకానికి ప్రేమ, విశ్వాసం అనేవి దారులు. ఒక వ్యక్తిపరంగా మనిషి ప్రేమను వ్యక్తం చేస్తాడు. ఒక స్థాయికి ఎదిగిన తర్వాత, భగవంతుని దిశగా ప్రేమ పయనించాలి. అది నిష్కల్మషమైన ప్రేమ. అది దివ్యప్రేమ".

జీసస్ మాటలు మననం చేసుకుంటూ ఆయన వెళ్లిపోయాడు.

జీసస్ వెంట కొంతమంది అభిమానులు బెత్లహాం చేరుకున్నారు. చిన్న తనంలో తానున్న పశులకాపరి ఇంట్లోనే దిగాడు. అక్కడ పర్వతాలు జీసస్‌కు ఇష్టం. రోజూ పర్వతాలపైన, నిర్జన ప్రదేశాలన్ని ఇష్టంగా తిరిగి చూచాడు.

అమాయక ప్రజలకు తెలిసింది 'జీసస్' వచ్చాడని. ఇప్పుడు శాంతిదూతగా తమ మధ్యకు వచ్చాడు. జీసస్ రాకతో బెత్లహాంకు కొత్త వెలుగు వచ్చింది. ఆకర్షణ పెరిగింది. సత్యం, విశ్వాసం అనేవి జీసస్ కట్టుకున్న బట్టలు. ప్రేమను పంచడం, శాంతి సందేశాలివ్వడం ఆయన నిత్యకృత్యాలు.

ముగ్గురు శిష్యుల్ని వెంట బెట్టుకుని జీసస్ హెబ్రాన్ వెళ్లి ఏడు రోజులు ప్రవచనం చేశాడు. అక్కడ నుండి బెతాని వెళ్లి లాజరస్ ఇంట కొంతకాలం ఉన్నాడు. ఒకనాటి సాయంత్రం కుటుంబ సభ్యులు జీసస్, లాజరస్, మార్తా, రూత్, మేరీలు సమావేశమైనారు. రూత్ దిగులుగా ఉంది. ఆమె భర్త జెరికాలో చిన్న ఉద్యోగస్తుడు. అతని పేరు అషీర్-బెన్.

అషీర్ ఫారిసీ మతస్తుడు. అతనికి క్రీస్తు పట్ల గౌరవం లేదు. అతని భార్యకు క్రీస్తు అంటే అభిమానం. అంచేత భార్యను ఇంటి నుండి వెళ్లగొట్టాడు. రూత్ దిగులు పడలేదు. క్రీస్తు పట్ల తన వైఖరిని మార్చుకోలేదు.

"నా మొగుడు నన్ను చంపగలడుకానీ నా విశ్వాసాన్ని చంపలేడు. నా ఆత్మను చంపలేడు. నేను ప్రభువు సన్నిధిలో ఉంటాను. క్రీస్తుతో జీవిస్తాను".

జీసస్ అన్నాడు: "అమ్మా! నీ భర్త అజ్ఞాని. తెలిసి తప్పు చేయడం లేదు. మంచివాడు. దైవచింతన కలవాడు. ఎవరైనా తన మతాన్ని విశ్వసించడం తప్పుకాదు. ఇతర మతాల్ని ద్వేషించడం, తక్కువగా భావించడం తప్పు. క్రీస్తును ప్రేమించేవారు తన ఇంట ఉండరాదనడం అజ్ఞానం. భిన్న మతాలకు చెందినవారు భార్యా భర్తలు కావచ్చు. తప్పు లేదు. ఎవరి నమ్మకం వారిది. ఎవరి ఆరాధన వారిది. అతను అవివేకంగా నిన్ను వెళ్లగొట్టాడు. అతనేదో ఘనకార్యం చేశానను కున్నాడు. తన అజ్ఞానం, అవివేకం ఒకనాటికి తెలిసి వచ్చి పశ్చాత్తాప పడతాడు. చేసిన తప్పుకు మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది.

"రూత్! ఇందులో నీ లోపమూ ఉంది. కొంత నింద నీవూ భరించాలి. మంచి పని చేశానని నీవు అనుకుంటున్నావు. నీవు కొంత ఓర్పు, సహనం పాటించి ఉండవలసింది. ప్రవాహానికి రాళ్లు సైతం కరిగిపోతాయి. నీ మంచితనం, ఓర్మి అతని కాఠిన్యాన్ని కరిగించి ఉండేవి. కొద్దిరోజులు ఆగి నీ ఇంటికి వెళ్లు. నీ ప్రేమతో అతని మనస్సును మార్చుకో. క్రీస్తును గురించి అసలు మాట్లాడవద్దు. భగవంతుని ప్రస్తావన చేయవచ్చు. నీ పాటికి నీవు మంచిగా మసలుకో. మంచిగా జీవించు. అతను మారతాడు. మనస్సు నొవ్వకుండా మాట్లాడి ఎవరినైనా మార్చవచ్చు!"

జీసస్ జెరికో వెళ్ళినప్పుడు ఒక సత్రంలో బస చేశాడు. సత్రంలో పనిచేసే అమ్మాయి జబ్బు పడ్డది. వైద్యులు లాభం లేదన్నారు. జీసస్ ఆమెను చేతితో తట్టి "మలోసీ ... లే" అన్నాడు. ఆమె లేచి కూర్చుంది. నిమిషంలో రోగం తగ్గింది. కొద్దిరోజుల తర్వాత జోర్డాన్ బయలుదేరాడు.

జీసస్ రాక ప్రజలకు ఆనందం కలిగించింది. వారిని ఉద్బోధించాడు : "పవిత్రులు మాత్రమే భగవంతుని సామ్రాజ్యంలో ప్రవేశానికి అర్హులు. ప్రతి ఒక్కరు హృదయ పరివర్తన చెందే అవకాశం ఉంది. జాన్ మిమ్మల్ని పవిత్రుల్ని చేస్తున్నాడు. 'బాప్టిజం' అన్నది లాంఛనం. హృదయం, మనస్సు పవిత్రం కావడం అన్నది అసలు కార్యం. క్రీస్తు మందిర ద్వారాలు ఎప్పుడు తెరిచే ఉంటాయి. పవిత్ర హృదయంతో ఎవరైనా లోపల ప్రవేశించవచ్చు".

(5) పూరీలోని జగన్నాథాలయంలో జీసస్, లమాసా పండితుడు మిత్రులు. బ్రహ్మ వేత్త అయిన లమాసా జీసస్ ప్రాచుర్యం గురించి వింటూనే ఉన్నాడు. జీసస్‌ను చూడాలని పాలస్తీనాకు బయలుదేరాడు. జెరూసలెం మార్గంలో లమాసా జాన్‌ను గురించి కర్ణాకర్ణిగా వినడం జరిగింది. అయనను నవయుగ వైతాళికుడుగా, భావ ప్రచారకుడుగా గుర్తించాడు. సాలిమ్‌లో లమాసా పండితుడు జాన్‌ను దర్శించి కొన్ని రోజులు ఆయనతో గడిపాడు. జాన్ బోధనల్లోని సత్యదీప్తి లమాసాను ఆకర్షించింది. ఈయన జీసస్‌ను 'క్రీస్తు'గా, అవతారుడుగా వర్ణించడంతో మరింత ఆనందం కలిగింది. జాన్ జీసస్‌ను ఇలా వర్ణించాడు:

"మహాశయా! క్రీస్తు ఎవరని మీ సంశయం కదూ! క్రీస్తు అంటే రూపుదాల్చిన ప్రేమ. మనుషులు ఈ ప్రపంచంలో జీవిస్తుంటారు. స్వార్థం, అత్యాశ, అహంకారం మనిషి గుణాలు. తన సుఖం కోసం స్వార్థంతో మనిషి జీవిక సాగిస్తాడు. రాజులూ అంతే, సామాన్యులూ అంతే. రాక్షసత్వం నుండి , క్రౌర్యం నుండి, స్వార్థం నుండి మనిషిని బయటపడవేయడమే జీసస్ లక్ష్యం. భుజబలం కన్న ప్రేమ గొప్పదని, ఉన్నతమైనదని చెప్పడం క్రీస్తు హృదయం. ప్రేమతోనే మనుషుల్ని మనసుల్ని జయించాలి. మనిషి హృదయంలోని ప్రేమ తత్వమే క్రీస్తు తత్వం. పవిత్రమానవుల హృదయాలే అసలైన దేవాలయాలు. వాటిలోనే భగవంతుడు కొలువై ఉంటాడు. హృదయాలయాల్లో పూజారులు, పురోహితులు ఉండరు. మంత్రాలు, తంత్రాలు ఉండవు. కేవలం అరాధన ఉంటుంది. మనుషులు భగవంతుని నేరుగా తమ హృదయాలలోనే ఆరాధించాలి. ప్రతి మనిషి తనను నివేదన చేసుకోవాలి".

జాన్ వద్ద సెలవు తీసుకుని వెళ్ళి లమాసా పండితుడు జీసస్‌ను కలిశాడు. కోటగుమ్మం వద్ద ప్రబోధం చేస్తుండగా లమాసా జీసస్‌ని చూచాడు. జీసస్ లమాసాను గుర్తించి "ఓ ... భరత మహర్షీ" అని స్వాగతం పలికాడు. జీసస్‌లోని బ్రహ్మ వర్ఛస్సు గుర్తించిన లమాసా మహదానంద భరితుడైనాడు.

జీసస్ తర్వాత తన ఆరుగురు శిష్యులను, లమాసా పండితుని వెంట బెట్టుకుని జోర్డాన్ వదలి గలిలీకి ప్రయాణమైనాడు. సమరియా గుండా ప్రయాణం. మధ్యలో సిచార్ ఉంది. ఆ దగ్గరలోనే జాకబ్ జోసెఫ్‌కు ఇచ్చిన భూవసతి ఉంది. జాకబ్ తవ్వించిన బావి దగ్గర కూర్చుని జీసస్ దీర్ఘంగా ఆలోచించ సాగాడు. శిష్యులు కొందరు తినడానికి రొట్టెలు తీసుకురావడానికి ఊరిలోకి వెళ్ళారు.

పట్టణానికి చెందిన ఒకామె నీళ్ల కోసం బావికి వచ్చింది. జీసస్‌కు దాహం వేసి, ఆమెను తాగడానికి మంచినీళ్లు అడిగాడు. ఆమె అన్నది! "నేను సమరియన్ మహిళను. నీవు యూదువు. సమరియన్‌లకు యూదులకు శత్రుత్వం కదా. నన్ను నీళ్లడగడంలో నీ ఉద్దేశం?"

జీసస్ అన్నాడు : అమ్మా, మనుషులంతా దేవుని బిడ్డలే. సమరియన్లు, యూదులు అందరూ దేవుని సంతానమే. స్వార్థాలవల్ల వైషమ్యాలు పెరుగుతాయి. ద్వేషాలు శత్రుత్వాలవుతాయి. నాకు అందరూ ప్రేమపాత్రులే. నేను అందరిని సమానంగా ప్రేమిస్తాను సోదరీ! భగవంతుడు ఈ పాత్ర ద్వారా ప్రేమామృతాన్ని అందరికీ పంచమని నిర్దేశించాడమ్మా!

ఆమె అన్నది : ఈ బావి లోతు ఎక్కువ. నీరు తోడేందుకు నా వద్ద తాడు లేదు. నీ దాహం నేనెలా తీర్చగలను?

జీసస్ : నా దాహార్తి ఈ నీటితో తీరదు తల్లీ! పరలోకం నుండి నిరంతరంగా వచ్చే ప్రేమజలాలు నా దాహాన్ని తీర్చవలసిందే. ఈ బావి నీళ్లు ఎన్నిసార్లు తాగినా మళ్లీ మళ్లీ గొంతు ఎండిపోతూనే ఉంటుంది.

ఆమె : ప్రభూ! ఆ నీరు నాకూ ఇవ్వండి. నా దాహం తీర్చండి.

జీసస్ : వెళ్లి నీ భర్తను తీసుకురా. మీరిద్దరూ కలిసి ప్రేమామృతం సేవించవచ్చు.

ఆమె : నాకు భర్త లేదు. నేను అవివాహితను.

జీసస్ : భర్త అంటే నీకు అర్థమైనట్లు లేదు. వివాహ బంధంలోని పవిత్రత

గ్రహించు. భ్రమరంలా పూవుపూవును స్పృశించకు. నీ సుఖాన్ని పంచి యిచ్చిన వారిలో నీకు భర్త కాదగిన వ్యక్తిని పెళ్లాడు.

ఆమె : నేను మీ నీతులు వినడానికి రాలేదు. నా జీవితం నా యిష్టం.

అంతలో సిచార్ వెళ్లిన ఆరుగురు శిష్యులు రొట్టెలతో తిరిగి వచ్చారు. జీసస్ ఒక సమరియా స్త్రీతో మాట్లాడుతుండటం చూచి బాధపడ్డారు. అయితే జీసస్‌ను ఎదురుపడి ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. వారిద్దరి సంభాషణ వినసాగారు. ఆమె వేశ్య అని గ్రహించారు. ఆమె నీళ్ల బిందెను అక్కడే వదలి పట్టణానికి బయలుదేరి వెళ్లింది.

ఫిలిప్ జీసస్‌తో అన్నాడు : మహాత్మా! భోజనం చేసి కాస్సేపు విశ్రమించండి. ఉదయం నుండి ఏమీ తినలేదు.

జీసస్ : నేను అలసిపోను, స్పృహ తప్పిపడిపోను. మీకు తెలియదు ఫిలిప్, నా ఆహారం వేరు. ప్రార్థనవల్ల నాకు అన్ని శక్తులు, బలం వస్తాయి. నాకు గాలిలో ఉన్న ప్రాణశక్తి చాలు. నన్ను పంపిన ప్రభువుకు నా ఆకలి తీర్చడం తెలుసు.

**6** సిచార్ రాజవీధుల్లో ప్రవచనం చేయసాగాడు. జనం దయ్యం పట్టిన ఒక మనిషిని జీసస్ వద్దకు తీసుకు వచ్చారు. ఆ గ్రహం చాలా భయంకరమైంది. క్రిందపడి దొర్లుతుంది. నానా భీభత్సం చేస్తుంది. జీసస్ ఆ దయ్యాన్ని ప్రేమగా పలకరించి, "నామాట విని వెళ్లిపో" అన్నాడు. దయ్యం జీసస్‌తో అన్నది, "నేను వదలి పోతాను సరే, ఎక్కడికి పోను? ..."

జీసస్ : ఎప్పుడో చేసిన పాపాలకు దయ్యంగా మారావు. ఇలా మనుషుల్ని ఆవహించి నీవు సాధించేది ఏమీ లేదు. నీ పాపం కరిగిపోదు. నీకు మంచి జన్మను ప్రసాదించమని నేను దేవుని ప్రార్థిస్తాను. నీవూ దేవుని అర్థించు. నీకు మంచి జన్మవస్తుంది.

జెరూసలెం నుండి జీసస్ వచ్చాడని, ప్రజలను వశపరచు కుంటున్నాడని విన్న మతపెద్దలు ఆగ్రహించారు. సమరియన్లను మంచి చేసుకుని తన మతం వైపు తిప్పుకొంటున్నాడని ప్రచారం జరిగింది. అతనిని తీసుకురమ్మని ఒక అధికారిని పంపారు. జీసస్ అతనితో "నేను ఎలాంటి రాజద్రోహం చేయలేదు. నేరం చేయలేదు. నేను వచ్చింది మనుషుల కష్టాలు తొలగించడానికి. ఆరోగ్యం ఇవ్వడానికి. నేను చట్టాన్ని గౌరవిస్తాను. ధర్మాన్ని రక్షిస్తాను. సత్యాన్ని ప్రవచిస్తాను".

అధికారి తిరిగి వెళ్లి విషయం చెప్పాడు. రాజప్రతినిధులు, మతాధికారులు కలిసి రాజవీధికి వెళ్లారు జీసస్‌ను చూడడానికి. వారిని చూచి జీసస్ అన్నాడు:

"మీరు సమరియా పాలకులు, పెద్దలు. ప్రజల్ని పాలించి, రక్షిస్తున్నవారు. నేను వచ్చింది ప్రజలకు సేవచేయడానికి. వారిని మేల్కొల్పడానికి. నేను చేస్తున్న పని మీకు ఎలాంటి ఆటంకం కలిగించదు. మనుషులు రెండు రకాలు. న్యాయం, ధర్మం, సత్యం, సమత్వం ప్రాతిపదికగా జీవించే వారు ఒక వర్గం. భగవంతుని అభిమతానికి అనుకూలంగా నడుస్తూ శాసనధిక్కారం చేసేవారు రెండవ రకం. మీరు సామాన్య ప్రజల్ని బాధిస్తున్నారు. వారికి సమానత్వం కావాలి. వారికి మీ ప్రేమ కావాలి. యూదులు, గ్రీకులు, రోమనులు, సమరియన్లు అందరూ సమానావకాశాలు పొందగలగాలి. స్పర్థలు, వైషమ్యాలు, ద్వేషాలు లేకుండా సోదరుల వలె వారిని జీవించనీయండి".

**(7)** క్రీస్తు బృందం గలిలీ వైపుగా ప్రయాణించింది. సమరియా చేరే సరికి జనం నిలిపి వేశారు. అక్కడ కొన్ని రోజులు ఉండిపొమ్మని అర్థించారు. అక్కడ పురపాలక మందిరంలో సభ జరిపారు. జీసస్ మోసెస్ ప్రవచనాలు బోధించాడు.

"ప్రపంచంలోని అన్ని జాతులు ఏకమవుతాయి – ఇజ్రాయిల్ ప్రపంచానికి కొత్త వెలుగునిస్తుంది – ఆ పని చేయవలసింది మనం. ఆ మహత్కార్యానికి ఇప్పుడే అంకురార్పణ జరిగింది. ఇజ్రాయిల్ ప్రపంచానికి మార్గదర్శకం కావాలి. మనం ఆచరించలేని వాటిని ఇతరులకు బోధించకూడదు. భగవంతుడంటే పరమాత్మ – ప్రేమ, శక్తి, విజ్ఞానం, విజయం. అన్నీ మన ఆత్మలోనే ఉన్నాయి. ప్రతి మనిషిలో నాలుగు గుణాలు నిక్షిప్తంగా ఉంటాయి. వాటిని పైకి తీసుకురావడం మన ప్రయత్నంలో, సంకల్పంలో, సాధనలో ఉంటుంది. వాటిని సరైన సమయంలో వినియోగించుకో గలగాలి. వాటిని సంపూర్ణంగా సమర్థంగా ఆచరించ గలిగినప్పుడు మనిషికి పూర్ణత్వం లభిస్తుంది. మీరు అధికారులు, ధర్మకర్తలు, మతోద్ధారకులు. అందరూ ఒక విధంగా భగవంతుని సేవకులే. ప్రజలు మిమ్మల్ని గమనిస్తుంటారు. మీరు ప్రజలకు మార్గదర్శకులు కావాలి. అధికారాలూ, భోగాలూ అనుభవించడం గొప్పకాదు. ప్రజల మన్నన పొందడం గొప్ప. మతాధికారి అంటే మార్గదర్శి. పూజారి అంటే భగవంతునికి, సామాన్యునికి మధ్యవర్తి. మీరు ఏది చెబితే ప్రజలు అది నిజమని నమ్మేస్తారు. గుడ్డిగా పాటిస్తారు. అనుసరిస్తారు. మీరు పాలకులు, వారు పాలితులు. మీలో ఒక్కరు దివ్యజీవన సూత్రాలు పాటిస్తే వేయిమందికి మార్గదర్శకులు కావచ్చు. వేయిమందిని సన్మార్గంలో నడిపించవచ్చు."

జీసస్ అక్కడ నుంచి బయలుదేరి సాయంత్రం ప్రార్ధన సమయానికి తోటకు చేరుకున్నాడు. ప్రజలు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

జీసస్ ధ్యానంలో ఉండగా అంతర్వాణి  వినిపించింది. అది పరమాత్మ తన ఆత్మకు ఇచ్చిన సందేశంగా భావించాడు.

జీసస్‌కు అంతరంగంలో ఒక స్త్రీ మూర్తి కనిపించింది. ఆమె మహా దైన్య స్థితిలో ఉంది. జబ్బుచేసి మృత్యుముఖంలో ఉంది. మాట్లాడేస్థితిలో లేదు. జీసస్ గురించి ఆమె విన్నది. ఆయన మహత్తులు గురించి తెలుసుకున్నది. తన మనస్సులోనే జీసస్‌ను ప్రార్థించింది తనను రక్షించమని. వెంటనే ఆమె సంకల్పం సిద్ధించింది. ఆమె కళ్ల ముందు ఒక్కసారిగా వెలుగు సోకినట్లయింది. క్రీస్తు చైతన్యం ఆమెలోకి ప్రవహించసాగింది. ఆమె కూర్చుని అందరితో కలిసి ధ్యానం చేసుకుంది. ఆమె బ్రతికినందుకు బంధువులు సంతోషించారు.

'ఎలా జరిగింది? ఏం జరిగింది?' అన్న ప్రశ్నలకు ఆమె సమాధానం "నాకు తెలియదు ప్రభువును అర్థించాను. క్షణంలో నాకు బాగైంది".

జీసస్ అందరినీ సమాధానపరచి ఉపదేశించాడు.

"ఆమెను బ్రతికించింది నేను కాదు. పరలోకంలో గాని, భూ ప్రపంచంలో గాని శక్తి అనేది సంకల్పం. అది ఆమె సంకల్ప శక్తి. అసలు సృష్టికర్త లోకాల్ని సృజించింది సంకల్పశక్తితోనే. నేను మహాత్ముడినని, శక్తివంతుడినని మీ విశ్వాసం. మీ విశ్వాసమే మీ బలం. అదే నా శక్తి. మృత్యువును సైతం జయించగలదు సంకల్పబలం. మీ రోగాల్ని తరిమివేయగలదీ సంకల్పమే. సంకల్పశక్తితో ఇంకా గొప్ప పనులు మీరు చేయగలరు. మీ సంకల్పం దివ్యం కావాలి, పవిత్రం కావాలి. మీ మనస్సును భౌతికసుఖాల నుండి దైవంవైపు మళ్లించండి. ఆత్మను ఆరాధించండి. దివ్య శక్తులు మీరూ సంపాదిస్తారు. ప్రార్థించండి".

జీసస్ అంతర్ధానమైనాడు. ఎలా అంతర్ధానమైందీ ఎవరికీ అర్థం కాలేదు. కొందరికి మార్గమధ్యంలో కనిపించి పలకరించాడు.

**8** పరకా, గలిలీ పాలకుడు హీరద్ ఆంటిపస్ మహాక్రూరుడు, దుష్టుడు. అతగాడు భార్యను తరిమివేసి మరొకడి భార్య అయిన హెరోడియస్‌ను స్వంతం చేసుకున్నాడు. ఆమె అతని వలె కామాంధురాలు. నీతి నియమాలు లేని స్వైరిణి. గలిలీ తీరంలో టైబెరియస్ నగరం వారి నివాసం.

జాన్ సాలింస్ప్రింగ్స్ ప్రాంతం వదలి గలిలీ సముద్రతీర ప్రాంతాల్లో ప్రజలకు జ్ఞానబోధ చేస్తున్నాడు. ఆయన, హీరద్ ఆంటిపస్ దుశ్చర్యలను ప్రజలకు తెలియ

చేస్తున్నాడు. అతనిని, కొత్తభార్యను పాపులుగా వర్ణిస్తున్నాడు. హీరోడియస్‌కు జాన్‌పైన మంటగా ఉంది. ఆ పనికిమాలినవాడు, దేశద్రిమ్మరి తననూ తన ప్రియుడ్ని విమర్శించడం తట్టుకోలేకపోయింది. జాన్‌ను పట్టి బంధించి, చెరసాలలో వేయమని భర్తను వేధించసాగింది. హీరోద్ ఆమె కోరినట్లే జాన్‌ని బంధించి ఒక నరకకూపంలో పడేశాడు. జాన్ శిష్యుల్ని, అభిమానుల్ని శిక్షిస్తామని భయపెట్టారు.

టెట్రార్క్ న్యాయస్థానం జాన్‌ను శిక్షించిందని తెలియగానే జీసస్ పరివారం గలిలీ వదలి పోవాలని నిశ్చయించుకున్నారు. జీసస్ వారితో అన్నాడు "నా కెలాంటి భయంలేదు. నాకింకా వ్యవధి ఉంది. నా పని పూర్తి చేసేవరకు ఎవరూ నన్నేమీ చేయరు".

"హీరోద్ జాన్‌ను శిక్షిస్తుంటే భగవంతుడు ఎందుకు ఊరుకోవాలి?" శిష్యులు ప్రశ్నించారు.

జీసస్ అన్నాడు : ధాన్యం గింజ గట్టిపడే వరకు పైపొర అవసరం. గింజ తయారైన తర్వాత పై పొట్టు రాలిపోతుంది. జాన్ పొట్టులాంటి వాడు. ఈ పంటను సిద్ధం చేసింది తను. అతను చేయవలసిన పని అయిపోయింది. ఇంక అతని భాషణలు అవసరం లేదు. నేను చేయవలసిన పని పూర్తిచేశాక పాలకులు నన్నూ వదలి పెట్టరు. ఇవి భగవంతుని ప్రణాళికలు. జరగక తప్పవు. క్రూరులు, దుర్మార్గులు అధికారంలో ఉన్నప్పుడు సామాన్య ప్రజలు కష్టాలు పడక తప్పదు".

క్రీస్తు పరివారం నజరత్ చేరుకున్నారు. అది సబ్బత్ రోజు. జీసస్ సరాసరి పురమందిరం వద్దకు వెళ్లాడు.

జీసస్ : "మహాత్ములెవరూ జన్మించిన చోట రాణించరు. వారికి పుట్టినచోట ఆదరణ లభించదు. ఒక మనిషిని ఉద్ధరించడానికి ఒక ప్రవక్త జన్మించడు. ఎలిజా మన పరమదైవం. ఆయన సర్వజ్ఞుడు. ఆయన ఒకసారి స్వర్గలోకం తలుపులు మూసివేశాడు. నలభైనెలలు వర్షాలు కురవలేదు. ఆయన ప్రార్థించగానే వర్షాలు కురిశాయి. ఎలిజా ఉన్న కాలంలో ఇజ్రాయిల్‌లో ఎందరో కుష్ఠువారుండే వారు. విశ్వాసం గల ఒక్కనికి చికిత్స చేశాడు. మీకు నాపైన విశ్వాసం లేదు. నా పట్ల పూర్తి విశ్వాసం కలిగేవరకు ఎలాంటి మహత్తులు చూపించను".

తమ అభ్యర్థన మన్నించనందుకు జనానికి జీసస్‌పై ఆగ్రహం కలిగింది. అతనిమీద పడి తాళ్లతో బంధించి రాళ్లమీద దొర్లిస్తూ, తీసుకుపోవాలని, అవమానించాలని వారు ఆలోచిస్తుండగా జీసస్ మాయమైనాడు. వారు నజరత్ తిరిగి వచ్చేసరికి దేవాలయం ప్రాంగణంలో కనిపించాడు. అప్పుడు జీసస్‌ను చూడాలన్నా, పలకరించాలన్నా వారికి భయం పట్టుకుంది.

**9** ఆ తర్వాత జీసస్ ఎలాంటి కార్యక్రమం నిర్వహించలేదు. కొంతకాలం తర్వాత శిష్యులతో కలిసి 'కానా'కు బయలుదేరాడు. ఒక వివాహం సందర్భంగా మంచి నీళ్లను ద్రాక్షరసంగా మార్చి, మనసులు దోచుకున్నాడు. ఆ విందులో జీసస్‌కు ఒక రాజకుటుంబీకునితో పరిచయం కలిగింది. అతను కోపర్నాంకు చెందినవాడు. ఆయన కొడుక్కి జబ్బుగా ఉంది. తనతో వచ్చి తన బిడ్డను రక్షించమని అర్థించాడు.

జీసస్ అన్నాడు : మీ విశ్వాసమే మీ బిడ్డను రక్షిస్తుంది. వెళ్లండి. మీ అబ్బాయి ఆరోగ్యం చక్కబడ్డది.

ఆయన జీసస్ మాటపై విశ్వాసంతో కోపర్నాంకు బయలుదేరాడు. మధ్య దారిలో సేవకుడు ఎదురై "బాబు ఆరోగ్యంగా ఉన్నాడు, కంగారు పడకండి" అని వార్త చెప్పాడు.

"బాబు ఆరోగ్యం ఎప్పుడు చక్కబడ్డది?" ఆయన ప్రశ్న. ఆసమయంలోనే అతను జీసస్‌ను రమ్మని అర్థించాడు.

జీసస్ సంకల్పబలంతోనే తన కుమారునికి ఆరోగ్యం ప్రసాదించాడని ఆయన గ్రహించాడు.

జీసస్ శిష్యబృందంతో కోపర్నాం చేరుకున్నాడు. అక్కడ వారికి ఒకపెద్ద ఇల్లు దొరికింది. తల్లి, శిష్యులు అంతా ఉండవచ్చు. అది శిష్యుల సాధనకు అనువుగా ఉంది. తనపై విశ్వాసం కలవారెవరైనా రావచ్చునని తెలియచేశాడు. ఆ ఇంటనే జీసస్ తొలి విద్యాలయం ప్రారంభమైంది. క్రీస్తు భావజాలం వ్యాప్తి కావడానికి ఒక కేంద్రం ఏర్పాటు జరిగింది. అది ఒక ద్రాక్షతోట. సువిశాలమైనది.

జీసస్ అన్నాడు : "ఈ తోటలో నేను ఒక ద్రాక్ష మొక్కను, ఈ తీగలు అన్ని వైపులకు విస్తరిస్తాయి. అన్ని దేశాలు ఈ ద్రాక్షల్ని రుచిచూస్తాయి".

గలిలీ తీరం క్రీస్తు గురుకులంగా మారింది. అది జీసస్ పాదస్పర్శతో పునీతమైంది. ఆయన సంచరించే తావుల్లో జనం గుంపులుగా చేరి దర్శనం చేసుకోసాగారు. బెస్తలు పడవల్లో రేవుకు చేరుతున్నారు. పీటర్, అతని సోదరుడు ఇంకా పడవలోనే ఉన్నారు. మిగిలిన బెస్తలు రేవులో వలలు చిక్కులు విడతీస్తున్నారు. జీసస్ వెళ్లి ఒక పడవ ఎక్కాడు. బెస్తలతో అన్నాడు "ఈసయ్య అనుగ్రహం ఇది. జెబులోన్, నఫ్తాకీ పిలుస్తున్నాయి. జోర్డాన్ దాటి పోదాం రండి".

పీటర్‌తో జీసస్ అన్నాడు : "మీ పడవల్ని తీరానికి చేర్చండి".

పీటర్‌కు జీసస్ మాటలపై విశ్వాసం కుదరలేదు.

"మాది వృథాప్రయాస జీసస్. గలిలీ సముద్రంలో చేపలు పడడం లేదు రాత్రంతా ఆండ్రుస్ నేను శ్రమించినా ఒక్క చేప కూడా వలలో పడలేదు".

జీసస్ సముద్రంవైపు చూచి అన్నాడు "నీటి అడుగున చాలా ఉన్నాయి పీటర్, నీ పడవ కుడివైపున వల వెయ్".

అలా వేయగా చేపలు వలనిండా పడ్డాయి. వాటిని మోయలేక లాగలేక దగ్గరలో ఉన్న జాన్, జేమ్స్‌ల సహాయం కోరవలసి వచ్చింది. జీసస్ మాటపై విశ్వాసం కుదరనందుకు పీటర్ సిగ్గుపడ్డాడు. జీసస్ పాదాలపైన వాలి క్షమాపణ కోరాడు.

జీసస్ నవ్వాడు : "ఇకపై నీవు వలవేయవలసింది చేపల కోసం కాదయ్యా. 'క్రీస్తు' అనే వలను మనుషులపైకి విసిరి, వారి మనసుల్ని పట్టుకోవాలి. జీవన సాగరాలపైన పయనించు. నీ పడవకు కుడివైపున వల విసురు. ఎందరో నీ వలలో చిక్కుతారు".

ఒడ్డుకు వచ్చాక పీటర్, ఆండ్రూ, జేమ్స్, జాన్‌లను పిలిచి చెప్పాడు. "మీరు గలిలీకి చెందిన బెస్తలు. మహాత్ములు మీచేత చేయించవలసిన మహత్కార్యాలున్నాయి. భగవానుడు మిమ్మల్ని ఓ ప్రత్యేక కార్యానికి పంపాడు. నేను ముందుంటాను. మీరు నన్ను అనుసరించండి".

అందరూ తలాడించారు. జీసస్‌ను అనుసరించారు.

అక్కడకు సమీపంలో రోమన్ భవనం ఒకటి ఉంది. అందులో రోమన్ అధికారి ఒకరున్నారు. అతని పేరు మాత్యూ. ఒకప్పుడు ఆయన జెరికోలో ఉండేవారు. అతను యువకుడుగా ఉన్నప్పుడు జెరూసలెంలో 'క్రీస్తు' అవతరణ గురించి విన్నాడు. మాత్యూ సంపన్నుడు. ధనికుడు. యూదు. సిరియ, గ్రీకుల సాహిత్యం చదివినవాడు.

జీసస్ అతనిని పరామర్శించాడు, "మాత్యూ, నీవు రోమన్‌లకు విశ్వాస పాత్రుడవని నాకు తెలుసు. మనల్ని మహర్షులు ఆదేశిస్తున్నారు. వారి పని చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు నాకు సహాయంగా ఉండాలి".

మాత్యూ జీసస్‌ని అనుసరించాడు. మాత్యు కొలువులో ఇస్కారియట్ ఒక ఉద్యోగి. అతని కొడుకు జుడాస్. వారు ప్రభుత్వ భవనంలోనే ఉంటారు. జుడాస్‌ను చూడగానే జీసస్ అన్నాడు. "నీతో నాకు పని ఉంది. నాతో రా" జుడాస్ జీసస్‌ను

అనుసరించాడు. జీసస్ ఒక న్యాయవాదిని కలిశాడు. అతను క్రీస్తు గురించి కొంత విన్నాడు. క్రీస్తు తత్వం ఏమిటో గ్రహించాలని ఆంటయో నుండి వచ్చాడు. అతని పేరు థామస్. అనుమానం ముందు పుట్టి తర్వాత థామస్ పుట్టాడు. అతన్ని 'డౌటింగ్ థామస్' అని ముద్దుగా పిలుస్తారు. అతను గ్రీకు తత్వవేత్త. సంస్కారం, సంపద, అధికారం కలవాడు. అతని విశ్వాసం చిత్రంగా ఉంటుంది. జీసస్ అతని నాడిని కనిపెట్టాడు. అతనితో అన్నాడు "థామస్. మహాత్ములకు మీతో పనిపడ్డది. రండి ఆ పని కలసి చేద్దాం" థామస్ జీసస్ శిష్యరికం స్వీకరించాడు.

సాయంత్రం జీసస్ ఇంటికి వెళ్లేసరికి అక్కడ జేమ్స్, జుడా ఉన్నారు. ఇద్దరూ యువకులే. ఆల్ఫాస్, మిరియంల పిల్లలు. వారిద్దరు జీసస్‌కు బంధువులు. సోదర తుల్యులు. ఇద్దరూ నజరత్‌లో వడ్రంగంపని చేస్తారు. జీసస్ వారిని పలకరించాడు "మీరు నాకు అయిన వారు. నా తండ్రి వద్ద పని నేర్చుకున్నవారు. మీరూ. నాతో ఉండండి. మనుషుల మనసుల్లో మానవతా మందిరాలు నిర్మిద్దాం".

మరునాడు జీసస్ సైమన్‌కు కబురు చేశాడు. సైమన్ యూదుల ఆచార వ్యవహారాలు బాగా తెలిసినవాడు. న్యాయశాస్త్రం చదువుకున్నవాడు. అతనిని తన బృందంలో చేర్చుకున్నాడు.

**(10)** సబ్బత్ రేపనగా జీసస్ తన పన్నెండు మంది శిష్యులతో తమ ఇంట్లో సమావేశమైనాడు. వారితో చెప్పాడు.

"ఈ రోజు నుండి మీరంతా సంపూర్ణంగా భగవత్కార్యానికి అంకిత మవుతున్నారు. మనందరం కలిసి ప్రార్థన చేద్దాం కూర్చోండి. మీ మనసుల్ని బాహ్యంనుండి అంతరంగానికి బదిలీ చేయండి. ఆత్మ లోపల వెతకండి. ప్రాపంచికమైన కోరికలు, అవసరాలు, ఆలోచనల పైన మూతవేయండి. తలుపులు మూయండి. ఆపైన శూన్యంలో నిరీక్షించండి. శూన్యంలో దివ్యచైతన్యాన్ని వెతకండి. ఆ చైతన్యం మిమ్మల్ని పవిత్రుల్ని చేస్తుంది. పరిపూర్ణులుగా తీర్చి దిద్దుతుంది".

పదముగ్గురు కలిసి ధ్యానం చేశారు. జీసస్ సూచించినట్లు శూన్యంలోకి ప్రస్థానించారు. మధ్యాహ్న సూర్యతేజాన్ని మించిన వెలుగు ఆ గదిని కమ్మింది . ప్రతి ఒక్కరి శిరస్సు నుండి జ్వాలామాలికలు పైకి లేచాయి. గలిలీ పట్టణం మొత్తం ఉలిక్కి పడ్డది. దూరాన కోపర్నంలో పిడుగులు పడినట్లనిపించింది. గంధర్వులు గానం చేసినట్లు వినిపించింది. జీసస్ పన్నెండు మందికి ఉపదేశం

చేసి దీక్ష యిచ్చాడు. వారితో అన్నాడు, "ఇకపైన మీకు పంచభూతాల పైన అధికారం ఉంటుంది. ఆకాశ శక్తులు మీవి అవుతాయి. మీరు ఆత్మలో ఆత్మను ధ్యానించండి. ఆత్మరహస్యం తెలుస్తుంది. పరమాత్మ రహస్యం తెలుస్తుంది. జనన, మరణ, సృష్టి రహస్యాలు తెలుస్తాయి. గతం భవిష్యత్తు మీ కళ్ల ముందు విచ్చుకుంటుంది".

మరునాడు సబ్బత్. శిష్యులతో కలిసి జీసస్ పురమందిరానికి వెళ్లి, అక్కడ ప్రసంగించాడు. ఆనాటి ప్రసంగం కొత్తగా, మధురంగా ఉంది. జనం తన్మయులై విన్నారు. అర్చక స్వాములవలె చిలకపలుకులు మాట్లాడ లేదు. జీసస్ మాట్లాడుతుండగా ఒకతనికి పూనకం వచ్చింది. ఏదో క్షుద్రశక్తి అతన్ని లోబరచుకున్నది. కిందపడి దొర్లసాగాడు. జీసస్ ఆ క్షుద్రశక్తిని గుర్తించాడు. ఆ శక్తి జీసస్‌ను గుర్తించి అన్నది.

"దేవపుత్రా! నీవు ఇక్కడ ఉన్నా వేమిటి? నీవున్నచోట మేముండలేము. మమ్మల్ని క్షమించి వదిలేయండి. మమ్మల్ని బాధించకండి".

జీసస్ అన్నాడు : "ఇప్పటికి చేసిన నిర్వాకం చాలు ఇక వెళ్లిపోండి" క్షుద్రశక్తి, ఆ మనిషిని నేలపైన విసిరికొట్టి వెళ్లిపోయింది. జీసస్ అతనిని ప్రేమగా లేవనెత్తి "నీ మనస్సులో మంచి ఆలోచనలు నింపుకో. చెడు ఆలోచించకు, చెడు వినకు, చెడు మాట్లాడకు. నీ మానసిక బలహీనత కారణంగానే క్షుద్ర ఆలోచనలు, క్షుద్ర శక్తులు నీలో ప్రవేశించాయి. మంచి మనస్సులోకి దయ్యాలు ప్రవేశించవు".

జీసస్ మాటలు, హితవచనాలు జనాన్ని బాగా ఆకర్షించాయి.

(12) జీసస్ ఎక్కడా, ఎవరికీ కనిపించడం లేదు. ఎక్కడ ఉన్నదీ, ఎక్కడకు వెళ్లిందీ తెలియరాలేదు. కొన్నాళ్ల పాటు అయన ఎవరికీ కనిపించడు పీటర్, జేమ్స్, జాన్ గురువును అన్వేషిస్తూ బయలుదేరారు. హమ్మత్ పర్వతాల్లో ఒక చిన్నగుహలో తపస్సు చేసుకుంటూ కన్పించాడు.

పీటర్ విజ్ఞాపన చేసుకున్నాడు, "కోపర్నం పట్టణం మీ కోసం దిగులు పడ్డది".

జీసస్ : "మన రాకకోసం ఇతర ప్రాంతాలు నిరీక్షిస్తున్నాయి పీటర్. అక్కడి వారినీ మనం గమనించాలి కదా. మన వాళ్లందర్నీ పిలుచుకురండి".

పన్నెండు మంది శిష్యులు వచ్చారు. అందరూ బెత్‌సైదా చేరుకున్నారు. ఫిలిప్, నతానియల్‌ను అక్కడ జ్ఞానబోధ చేయమని ఆదేశించాడు. అందరు సముద్ర

తీరం వెంట పోయి టిబెరియస్ పట్టణం చేరారు. అక్కడ సత్సంగం చేస్తుండగా ఒక కుష్ఠురోగి వచ్చి జీసస్ ముందు నిలబడ్డాడు. "బాబూ, నీ మనస్సు నిష్కల్మషం చేసుకో. రోగవిముక్తుడవవుతావు" నిమిషంలో ఆతని వ్యాధి నయమైంది.

"ఈ విషయం ఎవరికీ చెప్పకు. సరాసరి దేవాలయానికి వెళ్లి నీ మొక్కు చెల్లించుకో. దేవుళ్లకు ఇచ్చిన మాట తప్పకూడదు. మొక్కులు బాకీ ఉంచకూడదు".

అతను పోతూ పోతూ కనిపించిన వారందరికీ జీసస్ మహత్తు గురించి చెప్పసాగాడు.

కొద్దిరోజులు తర్వాత జీసస్ బృందం తిరిగి కోపర్నాం చేరుకున్నారు. జీసస్ రాక పట్టణంలో క్షణాలలో తెలిసిపోయింది. విద్యావేత్తలు, వైద్యులు, న్యాయవాదులు వచ్చారు. జీసస్ వారికి జీవనతత్వం బోధించాడు.

నలుగురు మనుషులు ఒక పక్షవాత రోగిని మోసుకువచ్చి జీసస్‌ను అర్థించారు. అతనిని నయం చేయమని జీసస్ ఆరోగిని చూచి అన్నాడు.

"హాయిగా బ్రతుకు. పో. నీ పాపాలు భగవంతుడు క్షమించాడు".

అక్కడ చేరిన పారిసీలు విచికిత్స చేయసాగారు : "పాపాలు క్షమించ వలసింది భగవంతుడు. ఈయనకు ఎలా తెలిసింది భగవంతుడు అతని పాపాలు క్షమించాడని. ఈయన భగవంతుడా! లేక దేవుని ప్రతినిధా?"

జీసస్ వారి మనస్సులోని దురాలోచన పసిగట్టినట్లు అదే విషయం ప్రస్తావించాడు : "ఎందుకు మీలో మీకు తర్జన భర్జన. అతని పాపాలు నశించాయని నేను చెబితే మీకేం నష్టం? అతను ఆరోగ్యంగా వెళ్లిపోయాడు కదా! మనిషి తను చేసిన పాపాలకు తానే నిష్కృతి పొందగలడనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? చూచింది, విన్నది నమ్మలేకపోవడం మూర్ఖత్వం అవుతుంది".

అందరికీ జీసస్ మహత్తులపట్ల పూర్ణవిశ్వాసం ఏర్పడ్డది.

అది క్రీస్తు పథంలో తొలిమలుపు.

**(13)** జెరూసలెంలో వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. జీసస్ బృందం బయలుదేరి రేపు సబ్బత్ అనగా, ఆ రోజు సాయంత్రానికి మౌంట్ ఆలీవ్ చేరుకున్నారు. ఒక సత్రంలో మకాం వేశారు. సబ్బత్ ఉదయాని కల్లా జెరూసలెం ప్రవేశించారు. ప్రధాన ద్వారం గుండా కాక గొర్రెల్ని పశువుల్ని తీసుకువెళ్లే త్రోవన ప్రవేశించారు. ప్రవేశద్వారం సమీపంలో 'బెతస్దా' సరస్సు ఉంది. ఆ

రోజున ఆ సరస్సులో స్నానం చేస్తే ఎలాంటి జబ్బులైనా తగ్గిపోతాయని ప్రజల నమ్మకం. ఆ రోజున ఒక దేవత దిగి వస్తుందని, నీటిలో మహత్తు కలుపుతుందని అంటారు. జీసస్ తన పన్నెండు మంది శిష్యులతో సరస్సు ప్రక్కన నిలబడ్డాడు. ప్రక్కన ఒక వృద్ధుడు, నీరసంగా కదలలేని స్థితిలో కనిపించాడు. అతనిని 38 సంవత్సరాలుగా ఆ రోగం వేధిస్తోంది. సాయం లేనిది లేవలేని స్థితి అతనిది.

జీసస్ ఆ వృద్ధుని సమీపించి, "తాతా, నీ జబ్బు నయం చేయమంటావా" అని అడిగాడు.

వృద్ధుడు : అందుకే గదా స్వామీ, ఇంతదూరం వచ్చింది. ఎప్పుడు ఆ దేవత వస్తుందో ఏమో? ఎట్టా తెలుస్తుంది. ఓపిక ఉన్నవాళ్లు వెంటనే వెళ్లి స్నానం చేస్తారు. నాకు ఓపిక లేదు. చీకటిపడేలోగా స్నానం చేయకపోతే మహిమ ఉండదు.

జీసస్ అన్నాడు : ఎవరు తాతా ఆ దేవత? ఆకాశం నుండి దిగివచ్చి, శక్తిని నీటిలో కలుపుతుందా నీ వెర్రిగాని? కొందరి జబ్బు తగ్గి, కొందరికి తగ్గదా? ఆ దేవతను పంపేది భగవంతుడు కాదు. భగవంతునికి పక్షపాతం ఉండదు. స్వర్గంలో ఉన్నవన్నీ ఇలాంటి సరస్సులే. అసలు నీకు ఆరోగ్యం యిచ్చే జలాలు నీలోనే ఉన్నాయి. నీ ఆత్మ ఆ సరస్సు. నీ విశ్వాసమే జలం. నీ ఆత్మకు అన్ని దైవశక్తులు, మహత్తులు ఉన్నాయి. కాని దాని తలుపులు తెరవవు. తెరవడానికి వీల్లేనంత గట్టిగా బిగించావు. ప్రతి మనిషిలో విశ్వాసం అనే తాళపు చెవి ఉంటుంది. దాంతో హృదయం తలుపులు తెరవవచ్చు. నీ ఆత్మశక్తి నీ రోగాలకు చికిత్స చేస్తుంది?

ఆ వృద్ధుడు జీసస్ వేపు లోతుగా చూచి అడిగాడు "నాలో విశ్వాసం కలిగేదెలా?"

జీసస్ : నా మాటలు అర్థం చేసుకో తాతా! విశ్వాసం నీది, నేను కలిగించేది కాదు. నేనిస్తే నీవు పుచ్చుకునేది కాదు. అది నీ స్వంతం. ఏదీ, నీలో విశ్వాసం ఉంటే లేచి నడువు".

అతను జీసస్ చెప్పినట్లు చేశాడు. రోగం కుదిరింది.

ప్రజల నుద్దేశించి జీసస్ ఉద్బోధించాడు : మానవులంతా దేవుని బిడ్డలే. పవిత్రంగా ఉన్నంతకాలం దేవునికి వారసులే. దైవచింతన కలవారు అన్ని పనులు దైవకార్యాలుగా భావిస్తారు. మనిషి దేవుని ప్రతినిధి. భూమిపైన భగవంతుని సంకల్పం నెరవేర్చడమే మనిషి కర్తవ్యం. నేను చేస్తున్న పనులు మహత్తులు

కావు. అది దైవకార్యాలు. ఎవరైనా విశ్వాసంతో ఆ శక్తులు పొందవచ్చు. అయితే ప్రాపంచిక ప్రలోభాలు అధిగమించాలి. కోరికలకు, వ్యసనాలకు బానిసలు కాకూడదు. సంకల్పం బలంగా ఉంటే మనిషి దేనినైనా సాధించగలడు.

**14** క్రిస్టిన్ గౌరవార్థం లాజరస్ ఒక విందు ఏర్పాటు చేశాడు. ఆ విందుకు జెరికో నుండి రుత్, ఆషెర్‌లు వచ్చారు. ఇప్పుడు జీసస్ పట్ల అషెర్‌కు శత్రుభావం లేదు. అతిథులు భోజనాలకు కూర్చోగానే బయట నుండి అరుపులు, ఏడుపులు వినిపించాయి. ఊరు తగలబడుతోంది. జనం వీధుల్లో పరుగులు తీస్తూ గగ్గోలు పెడుతున్నారు. ఇరుగు పొరుగు ఇళ్లకు నిప్పంటుకుంది. కాలుతున్న ఒక ఇంటి పై భాగంలో ఓ పాప సహాయం కోసం అరుస్తోంది. ఎవరూ మంటల్లోకి వెళ్లి పాపను రక్షించే సాహసం చేయటంలేదు. పాపతల్లి తన బిడ్డను రక్షించమని రొమ్ములు బాదుకుంటూ ఏడుస్తోంది.

జీసస్ కళ్లు ఎర్రబడ్డాయి. అగ్నిని శపిస్తున్నంత ఆగ్రహంతో అరిచాడు.

"శాంతిః శాంతిః శాంతిః" అని శాంతి మంత్రం జపిస్తూ తనే మంటల్లోకి పరుగెత్తాడు. పాపను బయటకు తెచ్చాడు. పాపకు ఏమీ కాలేదు. జీసస్‌కు ఏమీ కాలేదు. జీసస్ రెండు చేతులెత్తి అగ్నికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఊరు చల్లబడ్డది. ఆ సంఘటన వల్ల ప్రజలకు జీసస్ పట్ల విశ్వాసం హెచ్చింది.

జీసస్ వివరణ యిచ్చాడు : మనిషిని దహించడం అగ్నికి ధర్మం కాదు. అగ్ని మనిషికి ఉపయోగపడడానికి (అగ్నిమీళే పురోహితం). మనిషి తన శక్తుల్ని తెలుసుకుని, బయటకు తెచ్చి ఉపయోగించాలి. తాను భగవంతుని ప్రతినిధినని, తనలో ఉన్నవి దివ్యశక్తులని గ్రహిస్తే చాలదు. ఉపయోగించుకోగలగాలి. ప్రతి మనిషిలో ప్రతిభ ఉంది. ఆ ప్రతిభ మనస్సులో దాగి ఉంటుంది. ప్రకృతి శక్తులన్నీ మనస్సు అధీనంలోకి వస్తాయి. మనిషి మనస్సు కోరినట్లు ప్రకృతి ప్రవర్తిస్తుంది. రెండు గాడిదలు మనిషి శక్తుల్ని హరిస్తుంటాయి. అవి భయం, అవిశ్వాసం. ఆ రెండు గాడిదల్ని కట్టివేస్తే, మనిషి అంతర్ముఖుడు కాగలడు. సంకల్ప బలం పెరుగుతుంది. ఏ మాట అంటే అది అయి తీరుతుంది".

అతిథులు అందరూ వెళ్లి భోజనాలకు కూర్చున్నారు. ఎక్కడి నుండి వచ్చిందో ఒక పాప వచ్చి జీసస్ ప్రక్కన దీనంగా నిలబడ్డది. జీసస్ చేతిని పట్టుకు లాగింది తనను గమనించమన్నట్లు.

"మాస్టర్ ... మానాన్న పచ్చి తాగుబోతు. అమ్మ పొద్దస్తమానం కష్టపడి సంపాదిస్తుంది. అమ్మ సంపాదన నాన్న లాక్కుపోయి తాగుతుంటాడు. అమ్మ

మేము పస్తులుంటాం. ఆకలితో చచ్చిపోతున్నాం. మీరు నాతో వచ్చి మానాన్నని కోప్పడండి. తాగనప్పుడు మా నాయన చాలా మంచిగానే ఉంటాడు. తాగితే ప్రపంచాన్ని మరచి పోతుంటాడు".

జీసస్ పాప వెంట వెళ్లాడు. ఇల్లు రోతగా ఉంది. తల్లిని, పిల్లల్ని ఓదార్చాడు. మంచం మీద పాపతండ్రి ఒళ్లు పై తెలియకుండా పడి ఉన్నాడు. అతనిని లేపి కూర్చోబెట్టి మందలించాడు, "సోదరా, మనిషి దేవునికి ప్రతిరూపం అంటారు. రా. లేచి నాతో రా. మీ ప్రక్క ఇల్లు తగుల బడుతోంది. మనం వెళ్లి సాయం చేద్దాం".

నిజంగానే ఇల్లు తగులబడుతోంది. జనం గోల పెడుతున్నారు.

"మిత్రమా! నీవు ఒక పని చేయాలి. వీరికి సహాయం చేసే బాధ్యత నీది. అందరూ నీకు అండగా ఉంటారు".

ఆ తాగుబోతులో చైతన్యం కలిగింది. జ్ఞానోదయం అయింది. వెంటనే రంగంలోకి దిగాడు. తనను తనఇంటిని మరచిపోయాడు.

'నేను మనిషిని. నాలోనూ మానవత్వం ఉంది' అనుకున్నాడు. శ్రమపడ సాగాడు. తాగుడు మరచిపోయాడు. అందరి సహకారంతో మంచి మనిషిగా మారాడు.

'నువ్వు తాగుడు మానమని' జీసస్ సూటిగా చెప్పలేదు. బాధ్యతను గుర్తు చేశాడు అంతే.

(15) ఒకనాడు జీసస్ శిష్యులతో, అనుయాయులతో కలిసి పోతున్నాడు. గోధుమ పొలాలగుండా పోతున్నారు. పంట బాగుంది. శిష్యులు కొంతమంది జిహ్వా చాపల్యంచేత గోధుమ కంకులు కోసి తింటున్నారు. ఆ వస్తున్న వారిలో ఫారిసీలున్నారు. వారు పరమ చాదస్తులు, సనాతనులు. జీసస్ శిష్యులు చేసిన అఘాయిత్యానికి బాధపడి ఫిర్యాదు చేశారు.

"మీ శిష్యులు సబ్బత్ నియమోల్లంఘన చేశారు. చేయకూడని పని చేశారు".

జీసస్ వారితో అన్నాడు; "ఆకలైనప్పుడు దేవిడ్ ఏం చేసేవాడో తెలుసా! సరాసరి దేవాలయానికి వెళ్లి, దేవుని ముందు నివేదన చేసిన ఆహారాన్ని తీసుకొచ్చి, తను తిని, అక్కడి వారందరికీ పంచేవాడు. ఆకలి ముందు మీ నియమాలు, చట్టాలు పనికిరావు. సబ్బత్ నాడు పూర్వకాలంలో చాలా పనులు చేసినట్లు మన

గ్రంధాలలో ఉంది. పవిత్రంగా ఉండడం ముఖ్యం. ఆరాధన ప్రధానం. ఆ రెండు పూర్వకాలంలో ఉండేవి. భగవంతుడు మన నుండి ఆశించేది కరుణ, దయ, సానుభూతి. అన్ని నియమాలకన్న పైది మానవత. నియమాలు, చట్టాలు మనుషులు తమకోసం కల్పించుకున్నవి. అవసరార్థం అన్ని నియమాలు అతిక్రమిస్తాడు. చట్టాలు తీసి అవతల వెడతాడు. భగవంతుని ముందు తల వంచడంతో అన్ని తప్పులు చెల్లిపోతాయి".

జీసస్ చేస్తున్న పనులు పారిశీలకు ఆగ్రహం కలిగిస్తున్నాయి. సబ్బత్ నాడు చికిత్సలు చేయడం అసలు నచ్చడం లేదు. గుడికి వెళ్లి పూజలు చేయక పోవడం మరో కోపకారణం. జంతువుల్ని బలులివ్వవద్దని ప్రచారం చేయడం మూడవ కారణం. చట్టాన్ని, న్యాయాన్ని కరుణ, దయ, శాంతి, సానుభూతి అనే మాటలకు తాకట్టుపెట్టడం జీసస్ చేసిన నాల్గవ తప్పిదం.

హెరోడియన్స్‌తో రహస్య మంతనాలు సాగించారు. ఎలాగైనా జీసస్‌ను అంతం చేయాలని కుట్రపన్నసాగారు. జీసస్ ఎదురుగా నిలిచి వాదించి, ఓడించే శక్తి ఎవరికీ లేదు.

◆ ◆ ◆

# 15. మహాబోధ

(1) నాడు సూర్యోదయానికి ముందుగనే జీసస్ తన పన్నెండు మంది శిష్యులను సముద్ర తీరంలోని ఒక పర్వతంపైకి తీసుకువెళ్లాడు. అక్కడ వారికి రహస్యంగా బోధించాడు. ముందుగా ధ్యాన మహిమను చెప్పాడు.

"ధ్యానం అంటే మన ఆత్మను భగవంతునిలో లీనం చేయడం. ధ్యానం చేసేటప్పుడు మోసం పనికిరాదు. వ్యామోహం ఉండకూడదు. నిర్మోహత్వం, నిస్సంగత్వం అంటారు ఆ స్థితిని. అహంభావం, అతిశయం పనికిరావు. దేవాలయాల్లో వేదికలెక్కి దేవున్ని ప్రస్తుతిస్తారు. పెద్దపెద్ద మాటలతో స్తుతిస్తారు. వినేవారి చెవులు చిల్లులు పడతాయి తప్ప దేవునికి విన్నపాలు వినిపించవు. దేవుని వెతకవలసింది నిశ్శబ్దంలో. సామాన్యజనాన్ని ఆకర్షించడానికే ఈ ప్రసంగాలు, బోధనలు. దేవుని స్తుతించడం అంటే, దేవుడి ప్రతినిధులమని చెప్పుకునే వారిని పోషించడం, స్తుతించడం. అందరూ తమని గొప్పగా భావించి, గౌరవించాలని అర్చకస్వాముల ఆశ.

"ధ్యాన లక్షణం అది కాదు. ధ్యాన లక్ష్యం వేరు. ధ్యానం అంటే ఆత్మలోకి నిశ్శబ్దంగా ప్రవేశించడం హృదయాన్ని నిష్కళంకం చేసుకోవడం. మనస్సును శూన్య పరచుకోవడం. అన్ని ద్వారాలు, కిటికీలు మూసివేయాలి. ఇంద్రియ చాపల్యాలను అణచివేయాలి అప్పుడు ఏర్పడే శూన్యంలో శూన్యంగా మారిపోవాలి. ధ్యానానికి మాటలు, శబ్దాలు, మంత్రాలు అవసరం లేదు. ఏ మంత్రాన్ని ఏ దేవుని పేర పదేపదే స్మరించ కూడదు. ఉచ్చరించ కూడదు. అందుకు భిన్నంగా మన మతపెద్దలు, పూజారులు ప్రవర్తిస్తున్నారు. ఏది చేయకూడదో అదే చేస్తున్నారు.

"పరంధామా! పరమాత్మా! పరంలోకంలో ఉన్న నీవు పవిత్రుడవు. నీ వుండే స్వర్గం వలె నేనున్న తావును స్వర్గంగా మార్చు తండ్రీ" అని మనసులో సంకల్పిస్తే చాలు. "ఈ రోజు నాకు కావలసింది నాకు అనుగ్రహించు" అని

భావన చేస్తే చాలు. అత్యాశ పనికి రాదు. "ఇతరులు నాకు పడిన రుణాలను నేను మరచిపోయేలా చెయ్" మన రుణాలన్నీ రద్దయిపోతాయి. నేను వ్యసనాల బారిన పడకుండా రక్షించు. నాలో అత్యాశలు కలగకుండా చెయ్యి. ఉద్రేకాలు కలిగితే వాటిని నిగ్రహించే శక్తిని ప్రసాదించు. వాటిని అధిగమించే బలాన్ని అనుగ్రహించు.

"మీరు భగవంతునికి, సాటి మనిషికి రుణగ్రస్తులు కాకుండా ఉంటే చట్టానికి భయపడనవసరం లేదు. నీవు సాటివారి రుణాలు పూర్తిగా చెల్లిస్తే, భగవంతుడు నీ రుణాలను రద్దు చేస్తాడు. నీవు ఎవరికైనా ఉపకారం చేస్తే, దానిని ప్రచారం చేసుకోవద్దు. ప్రత్యుపకారం ఆశించి ఎవరికీ ఉపకారం చేయకు. ఉపకారం చేసి ఏదో మహా ఘనకార్యం చేసినట్టు పొంగిపోవద్దు. ఉపవాసం చేస్తే, దాని ఫలం ఆత్మకు చెందుతుంది. ప్రార్థన వలె, ఉపవాస దీక్ష ప్రశాంతంగా, నిర్మలంగా, 'ఆత్మ' పరంగా సాగాలి. మీ ప్రార్థనను భగవంతుడు స్వీకరించక పోవడం అంటూ ఉండదు. నిశ్శబ్దంలో భగవంతుడు సంచరిస్తుంటాడు. ఆయన ఆశీస్సులు ఎప్పుడూ ఆత్మలకు అందుబాటులోనే ఉంటాయి.

"ఆత్మ వంచన మహాపాపం. అది ఆత్మద్రోహం. నీలోలేని గుణాలు ఉన్నట్లు ప్రచారం చేసుకోవడం, ప్రదర్శనకు పెట్టడం ఆత్మవంచన. అది ఆత్మను కించ పరచడం అవుతుంది. ఒకరికి సహాయం చేసి దానిని మరొకరికి చెప్పకూడదు. ప్రచారంవల్ల చేసిన సత్కార్యఫలం నశిస్తుంది. నీవు చేసే దానాలు, ధర్మాలు ఈ ప్రపంచానికే పరిమితం. అవి భగవంతుని ఖాతాలో పుణ్యకార్యాలుగా జమకావు. కుడిచేయి చేసే దానాలు ఎడమచేతికి తెలియకూడదు. అంటే దానం అంత నిగూఢంగా జరగాలి".

**(2)** గురు-శిష్యులు పర్వతంపైన సమావేశమైనారు. వారు మూల స్తంభాలు. క్రీస్తు భావ ప్రచారకులు. జీసస్ వారిని ఉద్బోధించాడు :

"కొద్ది రోజులలో మీరు స్వతంత్రంగా ప్రచారం చేయాలి. క్రీస్తు భావనా వాహిని మీ చేతుల్లో ఉంది. ప్రజలకు అందచేయవలసింది మీరు. ముందుగా యూదులకు, తర్వాత ఇతరులకు క్రీస్తు సందేశం పంచండి. ఎవరినీ బలవంత పెట్టవద్దు. బలవంతంగా మతం మార్చిడి పనికిరాదు. ఎవరి విశ్వాసం వారిది. ప్రేమ, సహానుభూతి ఆధారంగా ప్రజల్లోకి వెళ్లండి. ప్రజల్ని మంచిమార్గం లోకి మళ్లించి, మంచిగా జీవించేటట్లు చేస్తే చాలు. వారి జీవితాల్లో వెలుగు నింపండి. వారికి దైవసామ్రాజ్యం అందుబాటులో ఉందని నమ్మకం కలిగించండి. ఎవరు

ఆత్మశక్తిని గుర్తిస్తారో వారే విజేతలు. ఆత్మబలం లేని వారు నెమ్మదిగా పయనిస్తారు. హృదయం పవిత్రంగా ఉన్నవారు వెంటనే ప్రభువు అనుగ్రహం పొందుతారు. తప్పు చేసినవారు పశ్చాత్తాపంతో పరిశుద్ధులు కావచ్చు. అన్నింటికి విశ్వాసం ప్రధానం. తనపట్ల విశ్వాసం ఉన్నవారిని భగవంతుడు తప్పక కరుణిస్తాడు.

"లోకులు మిమ్మల్ని గర్హించినా, చులకన చేసినా బాధపడవద్దు. దిగులు చెందవద్దు. చెడ్డవారిని మంచిమార్గంలోకి మళ్లించడం, పతితుల్ని, బాధితుల్ని, ఉద్ధరించడం మీ ప్రధాన లక్ష్యం. అదే కర్తవ్యం. లోకంలో సుఖభోగాలు కోరిన వారికి అవి మాత్రమే లభిస్తుంటాయి. దుర్మార్గులు మీకు అపకారం చేయవచ్చు. అందరితో మంచిగా ఉండండి. తప్పుచేసిన వారికి తప్పు సరిచేసుకునే అవకాశం ఇవ్వాలి. శత్రువుల పతనం మీ విజయం కాదు. చెడును పరిహరించడమే మీ కర్తవ్యం. అప్పుడే భగవంతుని సహాయం మీకందుతుంది. సుఖభోగాలు దొరికే బాటల్లో ప్రమాదాలు జాస్తి. అవరోధాలు ఎక్కువ. అసూయలు, ద్వేషాలు ఎక్కువ. ఆ మార్గాలలో అడుగడుగునా కాలుజారే ప్రమాదం ఉంది.

"అత్యాశ కలవారు పతనోన్ముఖంగా పయనిస్తారు. వారు సంపాదించేది తమది కాదని తెలుసుకోరు. తమకు మిగలదని గ్రహించరు. ఎవరు కూడబెట్టిన సంపద అయినా, మరొకరు అనుభవించవలసిందే. కుత్సితులు పెద్ద మనుషుల్లా కనిపిస్తారు. వారి మనస్సులో విషం ఉంటుంది. దుర్మార్గులు, దొంగలు ఉంటారు. వారికి వేరే శత్రువులు అవసరం లేదు. వారి పాపాలే వారిని పతనం చేస్తాయి. ఆత్మజ్ఞానం కలవారిని, సత్యం చెప్పేవారిని ఎవరూ పట్టించుకోరు. కృత్రిమ గురువుల్ని లోకం పొగుడుతుంది. మోసపోతుంది.

"మీరు సత్కార్యదీక్షతో, భగవంతుని తరపున సత్యకేతనం క్రింద పని చేయండి. నిరాడంబరత్వం మీ జీవనసహచరి. నిర్మోహంగా జీవించండి. ఏ స్థితిలోను సహనం కోల్పోవద్దు. వాటిని కోల్పోయినప్పుడు మీకు సమాజంలో విలువ ఉండదు. కొండపైన కట్టిన భవనం కనిపించకుండా ఉండదు. భవనం వెలుగులు దూరానికి కనిపిస్తాయి. దీపాన్ని వెలిగించి ముసుగులో దాచకూడదు. ఎత్తయిన చోట పెడితే నలుదిక్కులకు వెలుగు ప్రసరిస్తుంది. మీరు దేవుడు వెలిగించిన దీపాలు. ధర్మాన్ని నలుదిశలా ప్రవచించడానికి వచ్చినవారు. పూర్వ కాలంలోని మన మహర్షుల జ్ఞానం వృథా పోదు. పరమాత్మ శాశ్వతం. భగవత్ సంకల్పం నెరవేరితీరుతుంది.

"భగవంతుని శాసనం అనుల్లంఘనీయం. దైవ ధిక్కారం నేరం. మనిషి రుణాలు తీర్చేవరకు భగవంతుని సన్నిధికి చేరడు. అసలు భగవంతుని పట్టించు

కోదు. మన పూజారులు, అర్చక స్వాములు, మతపండితులు వారు రాసిపెట్టుకున్న నీతులు వల్లిస్తారు. ధర్మాల్ని ప్రవచిస్తారు. వారి సూత్రాల్ని ఆమోదించి తీరాలంటారు. వారు బోధించే నీతులు వారే పాటించరు. నీతులు చెప్పడానికే గాని ఆచరించడానికి కాదన్నట్లు ప్రవర్తిస్తారు. అలాంటివారెవరూ భగవంతుని చేరరు. ఆత్మ సామ్రాజ్యం ప్రవేశించడానికి మనిషికి కావలసింది మతం కాదు. భగవంతునిపట్ల విశ్వాసం. ఆత్మచైతన్యం. చట్టం మనిషి నిత్యకృత్యాలను క్రమబద్ధం చేస్తుంది. 'ఆత్మ' చైతన్యం అంతర్ జగత్తులో వెలుగుబాటలు నిర్మిస్తుంది".

**(3)** ఈ దశసూత్రాలు కఠోరనియమాలు. అవి శిలాక్షరసదృశాలు. అవి డేవిడ్ ప్రవచనాలు. కాలప్రవాహంలో అవి చెరగని రాతలు. అవి భగవంతుని ప్రజ్ఞకు ప్రతీకలు.

'సృష్టి' మొదటిది దివ్యసంకల్పం ... ప్రపంచం మొత్తం పరచుకున్నది ఒకే శక్తి ... అదే చైతన్యం. 'యెహోవా' పరమాత్మ ... యెహోవా సందేశాలను 'మోసెస్' మనకోసం రాసిపెట్టాడు.

యెహోవా అన్నమాటలు : నేనే సర్వసృష్టికి కారకుడిని. సర్వశక్తులు నావే. నా అధీనంలోనివే. నేను కానిది సృష్టిలో ఏదీ లేదు. నాశక్తి అనేక రూపాలలో, అనేక మార్గాలలో ప్రకటమవుతుంది. వీటిని దైవిక శక్తులంటారు. అఖండశక్తు లంటారు. విభూతులంటారు. అన్నీ నాలోనివే. అన్నీ నేనే. ఏ దేవుని ఆరాధించినా అన్ని ఆరాధనలు నిరుపయోగాలవుతాయి. ఆ విగ్రహాలు నా నీడలు. నీడల్ని ఆరాధించి పూజలు చేసేవారు గోడలపై బొమ్మల్ని ఆరాధించి నట్లవుతుంది. అందరిలోనూ భగవంతుడుంటాడు. 'నన్ను' మాత్రమే ఆరాధించాలి. మనిషి అసంపూర్ణుడు. అసంపూర్ణుడైన మనిషి ఎన్నటికీ సంపూర్ణుడైన భగవంతుని చూడలేడు. మనిషి తన శక్తితో భగవంతుని తెలుసుకోవడం దుర్లభం.

మనుషులు రాళ్లతో, చెక్కలతో, మట్టితో విగ్రహాలు చేస్తారు. అవి నీడల రూపాలు. నీడల ప్రతిరూపాలకు దేవాలయాలు కడతారు. పూజిస్తారు. చివరకు వారు నీడల్లాగానే మిగిలిపోతారు. దేవుని పేర రూపాలు, విగ్రహాలు తయారు చేయవద్దు. వాటి ద్వారా మనిషి సాధించేది ఏమీ ఉండదు. భగవంతుడంటే చైతన్యం. మనిషి ఆత్మ చైతన్యం చెంది భగవత్ చైతన్యాన్ని ఉపాసించాలి. ఆరాధించాలి. దేవుని పేరు పైకి ఉచ్చరించ కూడదు. ప్రాణస్పందన మాత్రమే 'పూర్ణప్రాణ'శక్తిని ప్రసాదిస్తుంది. మనిషి అహంకారంతో భగవంతుడు తనకు తెలిసినట్లే ప్రవర్తిస్తాడు. భగవంతుని చేరడం చాలా సులభం అని నమ్మిస్తారు.

అది మంచిది కాదు. ఒకసారి భగవద్దర్శనం అయితే, అది చెప్పడానికి తను ఉండడు. ప్రాణంతో ఆత్మను సంభావించలేని వారికి భగవంతుని గురించి తెలిసే అవకాశం లేదు. ఏవో రూపాలు కల్పించి ఆరాధించేవారిని భగవంతుడు పట్టించుకోడు.

(4) భగవంతుడంటే 'పరా'శక్తి మాత్రమే కాదు. మహాచైతన్యం, పరాప్రజ్ఞ. మనిషికి తల్లివంటిది జ్ఞానం. తండ్రివంటిది ప్రజ్ఞ. భగవంతుని సర్వజ్ఞత్వంపై విశ్వాసం కలవారు అదృష్టవంతులు. ధర్మం ఇలా చెబుతుంది : ప్రతి మనిషి తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులపట్ల కృతజ్ఞుడై ఉండాలి. ఈ ప్రపంచంలో బ్రతికే అవకాశం కలిగించింది తల్లిదండ్రులు.

"నీవు ఎవరినీ బాధించవద్దు. రేపు దేవుని ఎదుట సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుంది. క్షమాభిక్ష కోరడం కన్న తప్పు చేయకపోవడం మంచిది. ఒకరిని బాధించాలన్న ఆలోచన రావడం నేరం కాదు. ఆలోచన కరిగిపోతే తప్పుచేసినట్లు అవదు. ప్రతీకారవాంఛ కూడదు. అకారణంగా ఇతరుల్ని ద్వేషించవద్దు. ఎవరిని ద్వేషించినా, అసహ్యించుకున్నా రేపు దేవుని న్యాయస్థానంలో తల దించుకోవలసి వస్తుంది.

నీ కారణంగా సాటిమనిషి బాధలనుభవిస్తే, రేపు భగవంతుడి ఎదుట అపరాధిగా నిలబడడం కన్న, ఇప్పుడు అతనిని ఓదార్చడం మేలు.

కోపం, క్రోధం ఎక్కువ కాలం నిలవ ఉండనీయకు. వెంటనే మరచిపోవడం మేలు. స్వార్థం వదలి, బాధితుల్ని ఔదార్యంతో క్షమించ గలిగితే నీకు దోషం అంటదు.

నీవు ఎవరికైనా ఋణపడి ఉంటే, అతను నీ నుండి ఎక్కువ ఆశిస్తే, అతనితో తగవుపడి లాభం లేదు.

కోప తాపాలకు విరుగుడు సహనం, ఓర్పు ... కోపం కారణంగా విచక్షణ నశిస్తుంది.

న్యాయస్థానాలను ఆశ్రయించడం కంటే కొంత నష్టం, కష్టం భరించడం మంచిది. మనిషి సృష్టించిన న్యాయస్థానంలో 'న్యాయం' జరగదు.

న్యాయమైన నీ హక్కుల్ని హరించేవారితో దెబ్బలాడి ప్రయోజనం లేదు. నీ సొత్తు అపహరించేవాడు నీవంటి మనిషే. ప్రతిఘటించి అతనిని జయించలేవు. సహనంగా ఉండి అతని మనస్సును దోచుకోవచ్చు.

తప్పుచేసిన వారిని క్షమించు. నీకు కష్టం, నష్టం కలిగించిన వారికి

మరింతగా సహాయపడు, వారితో మరింత స్నేహంగా ఉండు. వారిలో మార్పు వచ్చి తీరుతుంది.

సహాయం అర్థించిన వారిని నిరాకరించవద్దు. అడిగినంత సహాయం అందించు.

ఒకడు నిన్ను కొడితే తిరిగి కొట్టవద్దు. జనం నిన్ను పిరికి వాడంటారు. ఓర్పు నీ ఔన్నత్యాన్ని తెలుపుతుంది. అది నీ సంస్కారం. శత్రువుపట్ల జాలి ప్రదర్శించు. అవమానించిన వారిని ఆశీర్వదించు. నిన్ను అవమానం చేసి, నీకు అపకారం చేసిన వారి మంచిని కాంక్షించు.

ఇతరులు నీ పట్ల ఎలా ప్రవర్తించాలని ఆశిస్తావో, నీవు ఇతరుల పట్ల అలా ప్రవర్తించు.

వెలుగు చూపించే వారు చీకటిలో ఉండకూడదు. తమలో రహస్యాలను దాచుకో కూడదు.

నీకు సహాయం చేసిన వారికి నీవు సహాయ పడడం విశేషం కాదు. మిత్రుల్ని అభినందించడం గొప్ప కాదు. శత్రువుల్ని అభినందించు.

అన్ని విధాల దోషరహితంగా జీవించడం పూర్ణమానవ లక్షణం.

**5** చట్టం పరిధిలో 'వ్యభిచారం' ఒక నేరం. సమాజ పరంగా అది తప్పని సరి అవసరం. శారీరక ధర్మం ప్రకారం స్త్రీ పురుషుల కలయిక తప్పుకాదు. ఉద్రేకాలు చల్లబడడానికి, కామప్రకోపం తగ్గడానికి అది మార్గం. వివాహేతర లైంగిక సంబంధాన్ని 'వ్యభిచారం' అంటారు. వివాహం అంటే ఏమిటి? చట్టం పరిధిలో ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య అవగాహనకు, అంగీకారానికి అనుమతి. ఒక పురోహితుని సాక్షిగా, పెద్దల సమక్షంలో కుదుర్చుకునే ఒప్పందం. ప్రేమ, అనురాగం, ఆప్యాయత అనే మూడుముళ్ల బంధం వివాహ బంధం. దానిని కాదనే హక్కు ఎవరికీ లేదు. పురోహితునికీ ఉండదు. ఆత్మబంధం ఆత్మల సంబంధి. అది ఆత్మీయమైనది. మధురమైనది. ఆత్మబంధానికి వివాహబంధం తొలి ఆమోదం. నిజమైన ఆత్మల అనుబంధానికి వివాహం అవసరం లేదు. కలిసి కాపురం చేయమని న్యాయస్థానం శాసించలేదు. ఆత్మీయ అనుబంధానికి చట్టం అడ్డుకాదు. చచ్చేవరకు ప్రేమించుకుంటూ ఉంటామని ఏ దంపతులు గ్యారంటీ ఇవ్వలేరు.

ఇష్టం వాంఛల కలపోత ప్రేమ. అది ఒక తీరని దాహం. మనిషి రత్నాలు కొనవచ్చు. వస్తువుల్ని ఎన్నిక చేసుకోవచ్చు. ప్రేమను కొనలేడు. అనురాగానికి

వెలకట్టలేదు. ఆత్మీయతకు ఖరీదుకట్టే షరాబు లేదు. 'ప్రేమ' వాస్తవానికి భగవంతుని స్వరూపం. లేదా స్వభావం. భగవంతునికి ప్రాతినిధ్యం వహించేది ప్రేమ. రెండు ఆత్మల్ని ఒకటి చేసేది ప్రేమ. పేగు బంధాన్ని తెంచుకోవచ్చు గాని ప్రేమబంధాన్ని తెంచేశక్తి ప్రపంచంలో ఏ వ్యవస్థకు లేదు. శరీరాలు వేరు కావచ్చు. మృత్యువు మనుషుల్ని దూరం చేయవచ్చు. కొంచెం విరామం తర్వాత ప్రేమించుకున్న ఆత్మలు తిరిగి ఏకమవుతాయి.

భగవంతుని సాక్షిగా మనిషి వివాహ బంధాన్ని గౌరవించాలి, సమీక్షించుకోవాలి. మిగిలిన అన్ని బంధాలు ప్రాపంచిక సూత్రాలు. ఒక్క వైవాహిక బంధం మాత్రమే 'ఆత్మ' సంబంధం. ప్రేమబంధం ఎన్నటికీ విడిపోదు.

చట్టం దృష్టిలో 'అపహరణ' నేరం. దొంగతనం చేయాలంటే ఆ వస్తువు కంటికి కనిపించేదై ఉండాలి. అలా చూచిన వస్తువును స్వంతం చేసుకోవడం దొంగతనం. 'ప్రేమ' కంటికి కనిపించే వస్తువు కాదు. దానిని అపహరించడం జరుగుతుందితప్ప దొంగలించడం కాదు. అవతలివ్యక్తికి తెలియకుండానే ప్రేమను అపహరించవచ్చు.

'అసత్య మాడరాదు' అంటారు నిజమే. అబద్ధాలు చెప్పకూడదు. 'అబద్ధం' అంటే ఏమిటి? వాస్తవం కాని దానిని మాటలతో మభ్యపెట్టడం. ఏ రూపంలో చేసినా 'మోసం' మోసమే అవుతుంది. మనిషి అబద్ధం చెబుతున్నట్లు మాటల్లోనే తెలుస్తుంది. ముఖ కవళికల్లో బయట పడుతుంది. న్యాయానికి అనుకూలంగా నోరు విప్పి చెప్పకపోవడం అసలైన అబద్ధం.

'ప్రమాణం' చేస్తారు. ప్రమాణపూర్తిగా అంటారు. దేనిపైననో ప్రమాణం చేస్తారు గాని తన 'జీవితం' పైన ఎవరూ ప్రమాణం చేయరు. కనిపించని దేవుని మీద, చదవని మత గ్రంథాలపైన ప్రమాణం చేస్తారు. ఎంత మోసం? ఎంత దగా? ఈ ప్రమాణాల వల్ల వొరిగేదేమీ ఉండదు. అబద్ధం చెప్పినా దేవుడు వచ్చి సాక్ష్యం చెప్పడు! ప్రామాణిక గ్రంథం ఏదీ నెత్తీ నోరూ కొట్టుకోదు. వచ్చి చెప్పేవాడి నోటికి అడ్డం పడదు. సత్యం మాట్లాడే వ్యక్తి సత్యమే చెబుతాడు. ప్రాణం పోయినాసరే అసత్యం పలకడు. అతను చెప్పేది నిజమని ఎవరికైనా తెలుస్తుంది. అబద్ధాలు చెప్పేవాడు నూరు మాటలు చెబుతాడు. సత్యం చెప్పేవానిది ఒకే మాట.

ఇద్దరు గురువుల్ని సేవించడం అంటే జ్ఞానం అధికంగా సంపాదిస్తున్నాడని కాదు. ఇద్దరు గురువుల్ని ఏకకాలంలో మోసం చేస్తున్నాడని అర్థం. తనను తాను

ఆత్మ వంచన చేసుకుంటున్నాడని అర్థం. మనిషి ఇహపర సంపదల్ని ఏక కాలంలో కూడబెట్టలేడు. ఒకటి వదులుకుంటే తప్ప రెండవది సాధ్యం కాదు. పరం కోసం దాచుకున్న సంపద తరిగిపోదు. భద్రంగా ఉంటుంది. దానిని ఎవరూ సంగ్రహించరు. భూమిపైన అనుభవించే సంపదలకు భద్రత ఉండదు. ఇక్కడ సంపదలన్నీ భ్రమలు. అసలు సంపదల్ని ఆత్మ భద్రం చేస్తుంది. సహృదయత ఉన్నచోట 'పర' సంపదలు పెరుగుతుంటాయి.

ఈ ప్రపంచంలో సంపాదించినవి ఏవీ నీ వెంట తీసుకుపోలేవు. నీతో రావు. తినడం, తాగడం, సుఖించడం, భోగించడం - లాంటివి నిత్యకృత్యాలు, నిత్యనైమిత్తికాలు. అవి రోజూ అందరూ చేసే పనులే. వాటికి భగవంతునికి సంబంధం లేదు.

**6** ప్రతిమనిషి పాటించవలసిన ధర్మాలు కొన్ని ఉన్నాయి. నీవు ఇతరుల నుండి సహాయం తీసుకోకతప్పదు. ముందుగనే నీవు ఇతరులకు సహాయం చేస్తూవుండు. ఇతరులతో వ్యవహరించవలసి వచ్చినపుడు ఎవరినీ విమర్శించ వద్దు. అప్పుడు ఎవరూ నిన్ను తప్పు పట్టరు. నీవు ఒరులను విమర్శిస్తే, నిన్ను వారు విమర్శించే అవకాశం యిచ్చినట్లు. నీవు వారిని నిందిస్తే, వారు నిన్ను నిందిస్తారు. నీవు దయగా ఉండి ఇతరుల అభిమానం సంపాదించవచ్చు. నీవు ప్రేమిస్తే వారు నిన్ను ప్రేమిస్తారు. ఇతరులను గౌరవించడం అంటే నిన్ను నీవు గౌరవించుకోవడమే అవుతుంది.

మనిషి సాటివారికి సహాయ పడడంలో స్వార్థం ఉంటుంది. స్వప్రయోజనం ఉంటుంది. చేసే సహాయం రెండింతలై తనకు మేలు కలుగుతుందని ఆశ పడతాడు. ఆశకు అంతం ఉండదు. ప్రతి పనికి ప్రక్కన ఫలాపేక్ష ఉంటుంది.

కోరికలు, ఆశలు ఎక్కువైన మనిషి దైవాన్ని లెక్కచేయడు. పాపకార్యాలు చేయడానికి వెనుకాడడు. పాపభీతి ఉండదు. పాపం పడగనీడలో ఎన్ని సుఖాలు అనుభవించినా ఆత్మ తృప్తి కలగదు. ఆనందం మిగలదు.

నీకు మేలుచేసే వారిని గుర్తించవు. అపకారం చేసే వారిని కనిపెట్ట లేవు. ప్రతిమనిషికి ఏవో సమస్యలుంటాయి. ఎవరి సమస్యలు వారే పరిష్కరించుకోవాలి. నీ సమస్యలే నీవు పరిష్కరించుకోలేనపుడు ఇతరుల సమస్యలు నీవేం పరిష్కరించ గలవు? ముందుగా నీ కంటి నీరు తుడుచుకో. నీ కంట్లో నలకతీసి వేస్తే చక్కగా చూడగలవు. ఇతరులకు సాయం చేయగలవు. నీ కళ్లకు మసక కమ్మితే ఇతరుల

కష్టాలు, బాధలు నీకు కనిపించవు. ఒక గుడ్డివాడు మరొక గుడ్డివానికి మార్గం చూపలేడు. ఇద్దరూ గోతిలో పడతారు.

నీవు దివ్య పథంలో నడవదలిస్తే చక్కని చూపు, అవగాహన ఏర్పరచుకోవాలి. నీ దృష్టికి దోషం ఉండకూడదు. నీ హృదయం పవిత్రంగా, నిర్మలంగా ఉండాలి. ప్రేమపూర్ణం కావాలి.

**(7)** జీవిత మహావృక్షానికి కాచే కాయలు మహామధురంగా ఉంటాయి. మనస్సును రంజింప చేస్తాయి. ఆకలి మీద ఉన్న వారికి రత్నాలు చూపిస్తే ఆకలి తీరదు. దేవుని ముందు వెలిగించే అగరు ధూపాలు దయ్యాలకు రుచించవు. మహాత్ములైన వారు ఆత్మ సంస్కారాన్ని, అవసరాన్ని గుర్తించి ఆత్మ సంగతులే బోధిస్తారు. అవసరమైన జ్ఞానం వారికి లేకపోవచ్చు. తెలుసుకుని మంచి విషయాలు బోధిస్తారు. అవి గురువుల మనస్సుకు అలవోకగా స్ఫురిస్తాయి. గురువు ఒకసారి భగవంతుని తలచుకుంటే చాలు కావలసినంత జ్ఞానం అందుతుంది.

సంపూర్ణ విశ్వాసంతో భగవంతుని ప్రార్థించేవారు తక్కువ. ఇది కావాలి, అది కావాలి అని అర్థించేవారే ఎక్కువ. అర్థించిన వారికి ఎప్పుడూ ఆశాభంగం కలగదు. ప్రార్థించిన వారికి అర్థించే అవసరం కలగదు.

భగవంతుని మందిరం తలుపు తట్టిన వారికి అది తెరుచుకోకుండా ఉండదు. నీ నుండి జ్ఞానం అర్థించే వారిని ఎన్నడూ కాదనకు. వారికి ఇహలోక సుఖాలు, సంపదలు ఇవ్వకు. నీవు ఇతరులకు చేసే సహాయం బట్టి నీ మంచి పెరుగుతుంది. మనసుంటే మార్గం కనిపిస్తుంది. ప్రతి మనిషికీ కనీసం ఒక్కసారైనా మంచి అవకాశం లభిస్తుంది. అదృష్టం తలుపు తడుతుంది. మంచిగా మారడానికి అవకాశం వస్తుంది. అయితే మీరు ప్రయాణించవలసిన బాట చాలా ఇరుకు. కొండల నడుమ, సన్నని కాలిబాట. కంకర రాళ్లపైన నడవవలసి ఉంటుంది. అడుగడుగున అవరోధాలుంటాయి. లోయలుంటాయి. అగాధాలుంటాయి. ఇహలోక జీవనం ప్రమాద భరితం. దివ్యజీవనం ప్రమోద భరితం.

అందరూ నడిచే బాట విశాలంగా ఉంటుంది. సుఖంగానూ ఉంటుంది. ఆ బాటకు ఇరువైపులా సుఖాలు, భోగాలు, సంతోషాలు, సంబరాలు ఉంటాయి. ఎక్కువ మంది అదే బాటన పోయి పోయి మృత్యువు నోట్లో చిక్కుతారు. ఆ జీవితం కృత్రిమం. సుఖాలు తాత్కాలికం.

ఎల్లకాలం మనిషి తనను తాను మభ్య పెట్టుకోలేడు. చిరకాలం మోసగించు

కోలేదు. ఫలితాన్ని బట్టి చేసిన పనుల మంచి, చెడు తెలుస్తుంది. ముళ్ల పొదల్లో ద్రాక్షలు లభించవు. చెట్టును బట్టి పండ్లు, తల్లిదండ్రుల్ని బట్టి పిల్లల బుద్ధులు".

పెద్దగా స్తోత్రాలు, మంత్రాలు వల్లించినంత మాత్రాన పవిత్రులు కారు. అరచి, గీపెట్టే దైవభక్తులు ఆత్మ సంగతి మరచిపోతారు. దివ్యజీవనం సాగిస్తూ నిరాడంబరంగా ఉండే వారి ఆత్మలో భగవంతుడు కొలువుంటాడు. వారి హృదయాలు తమ హృదయస్పందనను విశ్వవ్యాప్తం చేయగలవు.

◆ ◆ ◆

# 16. మలి పిలుపు

(1) జీసస్ 'మహాబోధ' ముగించి ప్రియశిష్యులతో కోపర్నం చేరుకున్నాడు. ఆ సమయంలో జీసస్ అనేక విషయాలు వారికి బోధించి, ఆధ్యాత్మిక రహస్యాలు తెలియ చేశాడు.

కోపర్నంలో సంపన్నుడైన ఒక రోమన్ సైన్యాధిపతి ఉన్నాడు. అతని క్రింద నూరుమంది పటాలం ఉంది. అతనికి యూదులంటే గౌరవం. వారికోసం తన స్వంత డబ్బుతో ఒక దేవాలయం కట్టించిపెట్టాడు. అతని సేవకుల్లో ఒకనికి పక్షవాతం వచ్చి, చావు బ్రతుకులో ఉన్నాడు. సైన్యాధికారికి జీసస్ మహత్తులు తెలుసు. ఆయన శక్తి సామర్థ్యాలు తెలుసు. యూదు ప్రముఖులతో కబురు పంపాడు.

జీసస్‌కు ఆ అధికారి విశ్వాసాల పట్ల నమ్మకం ఉంది. మంచివాడన్న అభిప్రాయం ఉంది. వెంటనే అంగీకరించి రోగిని చూడడానికి బయల్దేరాడు. కెప్టెన్ జీసస్‌కు ఎదురువెళ్లి స్వాగతం చెప్పాడు.

"మహాత్మా! దయచేయండి. నా భవనం మీ వంటి శాంతిదూతలు రాదగింది కాదు. నేను సైన్యాధికారిని, యుద్ధోన్మాదిని. నా ఉద్యోగమే మనుషుల్ని చంపడం. అలాంటి నా భవనంలో మీరు కాలు మోపలేరు. మీ శాంతి కాముకత్వానికి భంగం కలుగుతుందేమోనని నా భయం".

జీసస్ తన వెంట వచ్చిన అభిమానులతో అన్నాడు : "చూచారా! కెప్టెన్ వినయశీలం. విశ్వాసం. ఇంతటి వినయం, విశ్వాసం గల వ్యక్తి ఇజ్రాయిల్ మొత్తంలో మరొకరుండరు".

జీసస్ కెప్టెన్‌తో అన్నాడు! "మీరు శంకించకండి. మీ సేవకుడికి నయమైంది. నేను అక్కడకు రావలసిన పనిలేదు".

కెప్టెన్ జీసస్‌ను అర్థించిన సమయంలోనే ఇంటివద్ద రోగి లేచి తిరగసాగాడు. ఆరోగ్యం చక్కబడ్డది.

తర్వాత తన శిష్యులతో బయలుదేరాడు. హెర్మన్ మార్గంలో నైన్ పట్టణం చేరేసరికి ప్రవేశద్వారం వద్ద జనం గుంపులుగా గుమిగూడి ఉన్నారు. ఒక శవాన్ని ఊరేగింపుగా తీసుకుపోతున్నారు. ఒక విధవరాలి కొడుకు చనిపోయాడు. బంధువులు, మిత్రులు అతని శవాన్ని మోసుకు పోతున్నారు. ఆ చనిపోయిన వాడు ఆమెకు ఏకైక సంతానం. ఆమెకు ఆధారం అతను ఒక్కడే. ఆమె పెద్దగా రోదిస్తోంది. జీసస్ ఆమెను ఓదార్చాడు :

"అమ్మా, ఏడవకు. నీ కొడుకును నేను బ్రతికిస్తాను'.

శవ వాహకులు ఆశ్చర్యంగా చూడసాగారు. జీసస్ శవం దగ్గరకు వెళ్లి "లే బిడ్డా, లే" అని పిలవగానే అతను సజీవుడై లేచి కూర్చున్నాడు.

(2) జీసస్ ఇల్లు ఒక గురుకులం. ఒక జ్ఞాన విద్యాలయం. పన్నెండు మంది శిష్యులతో పాటు, ఇతర భక్తులు అనేకమంది బోధనలు వినసాగారు. చీనా, భారత్, బాబిలోన్, పర్షియా, ఈజిప్టు, గ్రీసు దేశాలనుండి యోగులు, తత్వవేత్తలు వచ్చి, జీసస్‌తో విషయచర్చలు చేస్తున్నారు. వారు తిరిగి వెళ్లి ఆయా దేశాలలో జీసస్ విజ్ఞాన బీజాలు వెదజల్లు తున్నారు. మొత్తం మీద పవిత్ర జీవనం గడపడం అందరి లక్ష్యం.

జీసస్ తను బోధించడమే కాక, శ్రోతల మనోస్థాయిని బట్టి, సంస్కారాన్ని బట్టి ఎప్పుడు, ఎంతవరకు బోధించాలో నేర్పుతున్నాడు. సత్సంగాలలో ఎదురయ్యే బాధలు ఆయనకు తెలుసు. బోధనలో స్పష్టత అవసరం. విషయ విశ్లేషణ అవసరం. మనిషి జీవితం ఏమిటి? మృత్యువంటే ఏమిటి? గమ్యం ఏది? అనే విషయాలు చెబుతూ, 'మహాచైతన్యం' చివరి అంచు అని, అక్కడ పరమాత్మతో సమీకరణ జరుగుతుందని, తాను విదేశాలలో నేర్చుకున్న విషయాలు అన్వయించి చెప్పేవాడు. పరమాత్మతో ఏకం కావడాన్ని మృత్యుంజయత్వం అంటారు.

సాయంత్రం వేళల్లో సామాన్య జనానికి అర్థమయ్యే రీతిలో నీతికథలు చెప్పేవాడు. వారికి పెద్ద పెద్ద విషయాలు అర్థం కావు. వారికి సామాన్య జీవనం, జీవన విధానాలు, నైతికత బోధించేవాడు.

సముద్రతీరంలా ఉన్న జాన్, జీసస్ చేస్తున్న కృషిని, ఆయన చూపుతున్న మహత్తుల్ని అంచనా వేస్తున్నాడు. ఆయనకు కారాగార జీవితం దుర్భరంగా ఉంది. దైన్యంగా, నిరాశగా జీవిస్తున్నాడు. ఆయనకు జీవితం పైన విరక్తి పెరిగింది. జీసస్ అవతారం పైన కాస్త అనుమానం కలగసాగింది. జీసస్‌లో అవతార పురుషుని లక్షణాలు కనిపించడం లేదని అనుమానం. ఈయన దైవజ్ఞులు

ప్రవచించిన 'క్రీస్తు' అవునా, కాదా? తాను పొరపడ్డాడా? భగవంతుడు నన్ను ముందుగా పంపడం ఏమిటి? క్రీస్తు ఎవరు? క్రీస్తు అవతరణ గురించి నేను చెప్పడం ఏమిటి?

కారాగారంలో బందీగా వున్న తనను పరామర్శించడానికి వచ్చిన ఆత్మీయుల ద్వారా జీసస్‌కు సందేశం పంపాడు. జీసస్‌ను గురించి తనకు సరైన సమాచారం తెమ్మని కొందరిని ఆదేశించాడు.

వారు నేరుగా జీసస్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు! "మమ్మల్ని మహర్షి జాన్ పంపాడు. మీరు 'క్రీస్తు' అన్నది వాస్తవమా, కాదా? లేక అసలు క్రీస్తు ఇంకా జన్మించవలసి ఉందా?"

జీసస్ వారి ప్రశ్నకు సమాధానంగా, "ఇక్కడ ఉండండి కొన్నాళ్లు. మీరే స్వయంగా అవునో, కాదో తేల్చుకోండి.

"మీరు చూచింది, నమ్మింది చెప్పండి. కల్పనలు వద్దు. అనుభవం ప్రధానం! తాను అర్థం చేసుకోగలడు. మిత్రులారా! మీరు జోర్డాన్ దర్శించారు. ఏం చూచారు? నాకు తెలియదు. ఒక ప్రయోక్తను చూచారు? ప్రయోక్త అంటే, భగవంతుని సందేశం వినిపించిన వ్యక్తి, ఒక ప్రవక్త ఆగమనాన్ని ముందుగా ప్రకటించిన వ్యక్తి. అతను మహాత్ముడా, మహా రుషా అంటే దేవదూత. జాన్ వంటి జ్ఞాని ఇంతవరకు జన్మించ లేదు. అతను నివురు కప్పిన నిప్పు. మానవ రూపంలోఉన్న దైవం. హీరోద్ బందీ చేసిన మహాత్ముడు. దైవాంశసంభూతుడు. దేవప్రియుడు. ఒక మహర్షిని నిర్దాక్షిణ్యంగా కారాగారంలో బంధించారు. అయన పరమాత్మ 'ఎలీజా' అంశలో జన్మించినవాడు. ఎలీజా అంటే ఎవరు? మరణాన్ని జయించినవాడు. శాశ్వతుడు. ఇక్కడ దేహాన్ని వదిలితే స్వర్గంలో సాక్షాత్కరిస్తాడు. మొదట్లో, జాన్ ప్రబోధం అందరూ నమ్మారు, న్యాయాధికారులకు. మతపెద్దలకు జాన్ ధర్మ పన్నాలు నచ్చక అతన్ని బందీని చేశారు.

వచ్చిన అవకాశం చేజార్చుకుంటే మరల అవకాశం రాదు. గమనించండి. మనిషి చంచలం. మనస్సు చంచలం. మనిషి స్వభావం చంచలం. సముద్ర తరంగాల వంటివి మనిషి ఆలోచనలు. ఇష్టం లేనప్పుడు లోపాలు వెదుకుతారు. నమ్మకాలు తగ్గిపోతాయి. జాన్ భోజనం చేయడు. తాగడు. గాలి తిని బ్రతుకుతాడు. ఎవరి కోసం! మీ కోసం, నా కోసం! ఎంతటి నిస్వార్థపరుడు! అతను ఎక్కడ ఎలా జీవించాడో ఎవరికీ తెలియదు. ఉన్మాది అని, పిచ్చివాడని, తిరుగుబోతని తీర్మానిస్తారు.

మరొకరైతే మీతో కలిసి విందులు, వినోదాలలో పాల్గొనేవారు. మీరే అతనిని తాగుబోతని, వ్యసన పరుడని చీదరించుకుంటారు. అతని ఆధ్యాత్మిక ఔన్నత్యం అడుగున పడిపోతుంది. మీరంతా అజ్ఞానులు. మీ కోసం పడిన శ్రమలో సగం శ్రమపడినా, టైర్‌లో, నిడాన్‌లో ఎంతో పరివర్తన వచ్చి ఉండేది. వారి పాపాలు తొలగిపోయి, పవిత్రంగా జీవిస్తుండేవారు. మీరు వచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నారు. ఈ రోజున కోపర్నం ఉన్నత స్థితిలో ఉండవచ్చు. రేపు పతనం అవుతుంది. చూడండి! పర్వతాలపైన జ్యోతి వెలుగుతోంది. వెలుగులు ప్రసరిస్తున్నాయి. గలిలీ తీరాలు ఆ వెలుగుల్ని నింపుకున్నాయి. భగవంతుని కరుణ, దయ ప్రతి ఒక్కరిపైన ఉంటుంది. ప్రతి ఇల్లు స్పందిస్తోంది. కానీ మీరు? ఆ వెలుగును మూసివేయడానికి ప్రయత్నిస్తున్నారు".

**3** తన దగ్గరకు వస్తున్నవారు జ్ఞానార్తితో రావడం లేదని, వారి అవసరాలు తీర్చుకోవడం కోసం వస్తున్నారని జీసస్ గ్రహించాడు. చాలా మందిలో విశ్వాసం లేదు, భక్తి లేదు. చదువుకున్నవారు, డబ్బున్నవారు, అధికారులు వచ్చినా వారికీ 'క్రీస్తు' హృదయం అర్థం కావడం లేదు. 'క్రీస్తు' తత్వాన్ని అర్థం చేసుకోలేక పోతున్నారు. వారికి ఆడంబరాలు కావాలి. అవి జీసస్ వద్ద లేవు. 'క్రీస్తు' స్పందన అనుభవించాలన్న తపన లేదు. వెలుగులో ఉన్నా వారి లోపల అంతా చీకటే గడ్డకట్టి ఉంది. ఆ చీకటి మృత్యువుతో సమానం.

ప్రజల నుద్దేశించి అన్నాడు : "మీ ముందున్న నన్ను ఒక వ్యక్తిగా చూడకండి. నేను చేస్తున్న పనులు, చెబుతున్న మాటలు నా స్వశక్తితో కాదు. భగవంతుని మీకు పరిచయం చేస్తున్నాను నేను. మీరు ఆశ్వాసించవలసింది దివ్యవిభూతిని. అదే క్రీస్తు చైతన్యం.

సైమన్ అనే పెద్ద మనిషి జీసస్ గౌరవార్థం ఒక విందు ఏర్పాటు చేశాడు. ఆ విందుకు పిలవకుండానే ఒక వేశ్య వచ్చింది. జీసస్‌ను చూడాలని ఆమె కోరిక. ఆమె జీసస్ పాదాలకు ఖరీదైన లేపనం మర్దిస్తూ, తన కన్నీటితో అభిషేకించి, పెదాలతో ముద్దుపెట్టుకుంది. సైమన్ లోలోపల రగిలిపోయాడు. పైకి ఏమీ అనలేదు కాని "ఈయన ప్రవక్త కాదు. వేశ్యాలోలుడు. మోసగాడు" అనుకున్నాడు. "ఆ వచ్చిన మనిషి ఒక వేశ్య అని గుర్తించలేని అజ్ఞాని జీసస్" అని అనుకున్నాడు. జీసస్ అతని మనసు తెలుసుకుని అన్నాడు :

"సైమన్! ఆమె కులట అని మీ అభిప్రాయం. ఆమె ఏం పాపం చేసిందో మీకు, నాకు తెలియదు. చూడండి! పాపం చేయని మనిషి ప్రపంచంలో ఉండడు. ప్రతి పాపానికి పరిహారం ఉంటుంది. కొందరు మంచిపని చేయగలిగే అహంకారం

వల్ల చేయరు. ఈ జనంలో పాపం చేయని వారెవరో చెప్పండి? చేసిన తప్పులు దిద్దుకునే వారు గొప్పవారు. ఈమె కన్నీటితో నా కాళ్లు కడిగింది. ఆ కన్నీటిలో ఆమె చేసిన పాపాలు కలిసిఉన్నాయి. కొన్నేళ్లుగా పాప జీవితం గడిపింది. ఇప్పుడు పశ్చాత్తాపంతో సన్మార్గంలోకి వచ్చింది".

సైమన్ సిగ్గుతో తలదించుకున్నాడు. జీసస్ ఆమెతో అన్నాడు : "అమ్మా! నీ పాపాలు రద్దయినాయి. నీ విశ్వాసంతో నిన్ను శుద్ధి చేసుకున్నావు. మనిషి చేసే పాపాలు, తప్పులు క్షమార్హాలు".

(4) గలిలీ పట్టణాలలో నివశిస్తున్న కొందరు కులీన, సంపన్న మహిళల దృష్టి జీసస్‌పైన పడ్డది. వారు జీసస్ చేస్తున్న బోధలు, సేవా కార్యక్రమాలు గమనిస్తున్నారు. జీసస్‌కు సహాయం చేసి, క్రీస్తు తత్వానికి ప్రచారం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. జీసస్ శిష్యుల్ని దేశదేశాలకు పంపి, ప్రచారం చేయమని అర్థించి, అందుకు ధనసహాయం చేయగలమని చెప్పారు.

అలా ఆసక్తి చూపిన మహిళలలో 'మేరీ మాగ్దలీన్' ఒకరు. అయితే ఆమె గ్రహ బాధితురాలు. చాలాకాలంగా ఆమెను ఏడు క్షుద్రశక్తులు ఆవహించి బాధిస్తున్నాయి. జీసస్ ఆమెను గ్రహ బాధావిముక్తురాలిని చేశాడు. మరొక ఆమె 'సునన్న'. ఆమెకు సిజరియా ఫిలిప్పీలో చాలా ఆస్తిపాస్తులున్నాయి. సంపద లున్నాయి. మరొక మహిళ 'జొహన్నా'. ఆమె భుజ్ భార్య. హిరోద్ ఆస్థాన ఉద్యోగి. మరొకామె రాఖేల్. ఆమెది టైర్ ప్రాంతం. మిగిలినవారు జోర్దాన్ గలిలీ సముద్రం ఆవలి తీరవాసులు. వారు క్రీస్తు బృందానికి తగిన వనరులు కల్పించారు. మొత్తం ఇరవైఒక్కమంది సద్భావనా యాత్రకు సిద్ధమైనారు.

వారు ఒక్కొక్క పట్టణం చేరి క్రీస్తు జ్ఞానం బోధిస్తూ, విశ్వాసం గల వారిని 'బాప్టిజం' ద్వారా మతంలో చేర్చుకోసాగారు. రోగులకు చికిత్సలు చేస్తూ ముందుకు సాగిపోతున్నారు. జీసస్ ఉదయం నుండి సాయంత్రం వరకు, అవసరమైతే ప్రొద్దుపోయేవరకు కూటముల్లో జ్ఞానబోధ చేసి, విశ్వాసం కలిగించసాగాడు. ఆయనకు విశ్రాంతి లేకపోవడం వల్ల ఆరోగ్యం క్షీణించసాగింది. బాగా నీరసించాడు. శిష్యులు భయపడ్డారు. భోజనం చేసి, విశ్రాంతిగా ఉండమని అర్థిస్తే జీసస్‌కు కోపం వస్తుంది. "నా మంచి చెడ్డలు చూడడానికి భగవంతుడు ఉన్నాడు. ఆయనే దేవతల్ని పంపుతాడు" అనేవాడు అర్థోక్తిగా.

"ఆ దేవుళ్లు నాకు ఆకలి కాకుండా, అలసట లేకుండా చేస్తారు. నేను ఈ దౌర్భాగ్యుల కోసం కష్టపడుతుంటే, భగవంతుడు నాకు శ్రమ కలిగిస్తాడా? నేను

చేస్తున్నది తన పనే కదా! నాకు కావలసింది ఆరోగ్యం కాదు, ఆహారం కాదు. శక్తి, దైవశక్తి. అదే నాకు ఆహారం. అదే నాకు ఆరోగ్యం. అది సరాసరి పై లోకం నుండి నాకు అందుతుంది. వారిలో ఉత్సాహం ఉన్నప్పుడు మనం బోధించకపోతే నిరుత్సాహపడతారు. నేడున్న ఉత్సాహం రేపు ఉండకపోవచ్చు.

**5** సముద్ర తీరంలోని ఒక పట్టణం ముగ్దలా. జీసస్ బృందం ఆ పట్టణంలో ప్రచారం చేస్తున్నారు. ఒక మూగ, గుడ్డివాడు వచ్చాడు. అతనికి దయ్యం పట్టింది. అతను జీసస్ వద్దకు రాగానే దయ్యం వదలి పోయింది. ఆయన్ని చూడగానే దయ్యం ఎందుకు పారిపోయింది? అన్న చర్చ వచ్చింది కొందరికి.

అక్కడ చేరిన మతాధికారులకు జీసస్‌పట్ల కోపం, అసూయ కలిగాయి. అది సాకుగా జీసస్‌ను విమర్శించారు. "ఇతనిది దైవశక్తి కాదు. క్షుద్రశక్తి. సైతాను ఇతని అధీనంలో ఉంటుంది. సైతాన్ సహాయంతోనే ఇతను జబ్బులు నయం చేసినట్లు నటిస్తున్నాడు. చచ్చిన వారిని బ్రతికించడం క్షుద్రవిద్యలో ఉంది".

జీసస్ వారి ఎత్తుగడ అర్థం చేసుకున్నాడు. వారితో వినయంగా అన్నాడు. "అయ్యలారా! మీరు పెద్దలు. చదువుకున్న వారు. న్యాయం, ధర్మం తెలిసిన పండితులు. ఆత్మవంచన మహాపాపమని తమకు తెలియనిది కాదు. అసూయ మనిషిని నాశనం చేస్తుంది. క్రోధం నిలువునా వివేకాన్ని కాల్చి వేస్తుంది. అంతః కలహాల వల్ల దేశం నష్టపోతుంది. ఆత్మ వంచన మనిషి నైతిక పతనానికి గుర్తు. నాది సైతాన్ శక్తి అన్నారు. తమరు ఏ శక్తితో మంచి పనులు చేస్తారు."

మతాధిపతుల నోళ్లు మూతపడ్డాయి. అంతలో ఒకతను వచ్చి జీసస్ చెవిలో ఒక మాట చెప్పాడు. "మీ అమ్మగారు, సోదరులు మీతో ఏకాంతంగా మాట్లాడలనుకుంటున్నారు".

జీసస్ అన్నాడు, "అమ్మా? ఎవరు అమ్మ? ఎవరికి అమ్మ? ఎవరికి ఎవరు? మనుషులు రక్త మాంసాలతో ఉన్నంతవరకే తల్లి అనీ, తండ్రి అనీ, సోదరులనీ అనుకుంటారు. శరీరాలు వదలిన తర్వాత ఆత్మలు మిగులుతాయి. ఈ బంధాలు, బాంధవ్యాలు నశించిపోతాయి. మనిషికి ప్రేమ, అభిమానం ఉండకూడదని కాదు. దివ్యప్రేమలో పడ్డవారికి భౌతిక బంధాలుండవు. నాకు అమ్మ, నాన్న, అక్క అన్న అన్నీ మీరే. భగవంతుని ప్రేమించే వారందరినీ నేను ప్రేమిస్తాను. వారందరూ నాకు స్నేహితులు. ఆత్మీయులు".

బంధువుల కోర్కె తీర్చడానికి ఇంటికి వెళ్లాడు. కన్నతల్లిని చూడగానే తనను, తన ఆత్మను ప్రబోధించిన 'కన్యక' ఆత్మ కనిపించింది ఆమెలో. తన ఆత్మను

ప్రేమించి, తన ఆత్మను 'ప్రేమ'తో నింపిన కన్నతల్లి ఆత్మ అది. అది శరీర బంధాలకు బాంధవ్యాలకు అతీతమైన ఆత్మీయత. తన గుండెలో దివ్యనాదాలు పలికించి, దివ్యస్పందన కలిగించిన మహాత్మగా గుర్తించాడు. అప్పుడు అక్కడ కలుసుకున్నది తల్లి, తనయులు కాదు. రెండు పవిత్రాత్మల కమనీయ సంగమం అది.

**6** ఒకనాడు జీసస్ సత్సంగం నిర్వహిస్తుండగా ఒక ఫారిసీ చాందసుడు లేచి

"అయ్యా, తమరు అవతార పురుషులైతే, అందుకు తగిన ఆధారాలు చూపగలరా? తాంత్రికులు చేసే పనులు మీరు చేస్తున్నారు. గారడీలు చేస్తున్నారు. అలా కాక ఏదైనా దైవికమైన పనిచేసి చూపండి. గారడీవాళ్లు, ఇంద్రజాలం చేసేవాళ్లు, కనికట్టు చేసి, మనస్సును మభ్యపెడతారు. ఇంద్రజాలికులు తుఫానులు సృష్టిస్తారు. నిలిపి వేస్తారు. దయ్యాల్ని వదలిస్తారు. దయచేసి కోట బురుజుపై కెక్కి సముద్రంలో దూకండి. మీరు బ్రతికితే భగవంతుని అవతారమని నమ్ముతాను" అన్నాడు.

జీసస్ అన్నాడు : తాంత్రికులు, మాంత్రికులు, గారడీవాళ్లు ఎవరూ పవిత్రంగా జీవించరు. దైవాన్ని విశ్వసించరు. అందుకు మీ జీవితమే ఉదాహరణ. మీ మనసులు కల్మషాలు, విషపూరితాలు. మీ నికృష్ట జీవితానికి ఉదాహరణ అనవసరం. నేను జన్మించింది దైవాన్ని అమ్మడానికి కాదు. 'విశ్వాసానికి' వెల కట్టలేను. విపణిలో పెట్టలేను. నన్ను నమ్మినవారు నా వద్దకు వస్తారు. విశ్వాసం డబ్బుతో కొనగలిగింది కాదు. నా జీవితమే ప్రత్యక్ష నిదర్శన.

మీకు 'జోనా' కథ తెలుసు కదూ. ఆ మహాత్ముడు మూడు రోజులపాటు చేప పొట్టలో ఉండిపోయాడు. మహాత్ములు మూడు రోజులు మరణ సమాధిలో ఉండి పోగలరు. ఆ తర్వాత వారి దివ్యకాంతిని నీలాంటివారు భరించలేరు. ఈనాడు నన్ను చూస్తున్న మీరు ఆనాడు ఆ కాంతికి అంధులైపోతారు. ఆ వెలుగు చిమ్మ చీకటిని చీల్చుకువస్తుంది. రాళ్లు, బండలు, కొండలు దానిని ఆపలేవు. మీకు తెలుసు షెబా మహారాణి కథ. ఆమె చీకటిలో వెలుగుకోసం వెతికేది. ఆమె సొల్మన్ హితవచనాలు విని మారిపోయింది. తాను ఒక జ్యోతిగా మారింది.

**7** జనాలకి చాదస్తా లెక్కువ. స్వార్థమూ అధికమే. ప్రక్క వారిని గౌరవించడం చేత కాదు. వారికి మనవలె ఆత్మాభిమానం ఉంటుందనుకోరు. బలవంతులు బలహీనుల్ని, బడుగువర్గాలను అణచివేయడం తమ హక్కనుకుంటారు.

జీసస్ దర్శనానికి వచ్చేవారిలో అదే ప్రవృత్తి. బలవంతులు, దృఢకాయులు బక్కవారిని వెనక్కు నెట్టి వేస్తారు. అలాంటి వారిని జీసస్ మందలించేవాడు.

"స్వార్థం దయ్యం లాంటిది. స్వార్థపరుడు దయ్యంపట్టిన మనిషి లాంటి వాడు. ఒక మంచి మాటతో దయ్యం వదలిపోతుంది. స్వార్థం అలాకాదు. పోయినట్లే పోయి మళ్లీ వచ్చి నీ తలుపు తడుతుంది. లోపల గట్టిగా గడియ వేయటం మరచిపోయావా, లోపల చొరబడి తిష్ఠ వేసుకు కూర్చుంటుంది. మీది అలాంటి స్వార్థం. ఇతరుల అదృష్టం మీకు దక్కాలన్న పేరాశ, స్వార్థమే కదా.

**8** ఫారిసీ ధనికుడొకరు జీసస్ గౌరవార్థం విందు ఏర్పాటు చేశాడు. జీసస్ కాళ్లు చేతులు శుభ్రపరచుకోకుండా వెళ్లి భోజనానికి కూర్చున్నాడు. అది అనాచారమని ఆయన ఎత్తి పొడిచాడు. జీసస్ వ్యంగ్యంగా సమాధానం చెప్పాడు.

"దిగులు పడకండి మహాశయా! మీరు భోజనానికి ముందు చేతులు, కాళ్లు శుభ్రం చేసుకుంటారు. మనసుల్లోని కల్మషం కడుక్కోరు. మీ హృదయాలు ఎప్పుడు మురికిగానే ఉంటాయి".

ఆ మాటలకు ఒక న్యాయవాదికి కోపం వచ్చింది : "రబ్బోనీ, మీ మాటలు కటువుగా ఉన్నాయి. మా ఆచారాన్ని ఎందుకు విమర్శిస్తారు. మమ్మల్ని విమర్శించే హక్కు మీకు లేదు".

జీసస్ అన్నాడు : "మీ చట్టాలు మీకు రక్షణ కలిగించడానికి. అవి ఏ విధంగానూ పేదవారికి మేలుచేయవు. మీరు సమాజ హంతకులు, స్వార్థపరులు. రేపు భగవంతుని ఎదుట మీరంతా తల దించుకోక తప్పదు".

జీసస్ వ్యాఖ్యలకు ఫారిసీలకు ఆగ్రహం కలిగింది. జీసస్‌ను తిట్టిపోస్తూ వెళ్లిపోయారు. నిజానికి కావాలని జీసస్ వారిని విమర్శించలేదు. అది దైవఘటన. లోపలనుండి దైవప్రేరణ ఆయనచేత అలా పలికించింది.

**9** విందు కాగానే జీసస్ శిష్యబృందంతో బయలుదేరాడు. వెంట మేరీ, మిరియం, మరికొందరు స్త్రీలు ఉన్నారు. అందరిని ఓ నిర్జన ప్రదేశానికి తీసుకు వెళ్లి ధ్యానం చేయించాడు. ధ్యానం తర్వాత తన వారితో ఇలా చెప్పాడు. "మీరిక అప్రమత్తంగా ఉండాలి. ఈ ఫారసీలు ఎప్పుడు ఏం చేస్తారో తెలియదు. వీరు ప్రమాదకారులు. వారు, సాధువులకు అపకారం చేయడానికి వెనుకాడరు. వారితో మాట్లాడితే చాలు, 'విషం' తగులుతుంది. మీ ఆత్మలు సైతం కళంకిత మవుతాయి. వారి మాటలు తియ్యగా ఉంటాయి. ఆ మాటలవెనుక విషం ఉంటుంది. వారి ప్రవర్తన స్వచ్ఛం కాదు.

మన ప్రతి ఆలోచన రికార్డయి ఉంటుంది. అది జీవన గ్రంథం. మహాత్ములైన వారు ఎప్పుడు సంకల్పించినా ఆ మార్మిక గ్రంధాన్ని విప్పి చదవగలరు. ఆ గ్రంథం తెరిస్తే అందరి తప్పులు బయటపడతాయి. భగవంతుడు తీర్పు యిచ్చేనాడు ఆ గ్రంధం విప్పుతారు. భగవంతుని పరంగా చేసే ఆలోచనలు కొన్నింటికి రక్షణ కల్పిస్తాయి. ఆత్మని ప్రకృతి రక్షిస్తుంది. అగ్నిలో శరీరాలు కాలిపోతాయి. ఆత్మ కాలదు. మనిషికున్న ఆత్మశక్తితో దురాలోచనల్ని నిగ్రహించ వచ్చు. శాశ్వతంగా నిలిచేది ప్రేమ. కరుణ, జాలి నిలుస్తాయి. భగవంతుడు ప్రతి ఒక్కరిని గమనిస్తుంటాడు".

**(10)** ఒకనాడు జీసస్ వద్దకు ఒక బాధితుడు వచ్చి మొరపెట్టుకున్నాడు. "రబ్బోనీ! మా తండ్రి చనిపోయాడు. చాలా ఆస్తి ఉంది. మా సోదరులు కుతంత్రంతో మొత్తం ఆస్తిని కాజేశారు. నాకు అన్యాయం జరిగింది. ఎలాగైనా మీరు నాకు న్యాయం జరిగేలా చూడండి".

జీసస్ చెప్పాడు : "బాబూ! నేనున్నది. మీఆస్తి పాస్తులు చూడడానికి కాదు. మీ తగవులు పరిష్కరించడం నాపని కాదు. న్యాయం చేయమని ఎవరిని అడగాలి? ప్రతి మనిషిలో స్వార్థం ఉంది. న్యాయం ఉంటుంది. ఎవరి న్యాయం వారిది. అది ఇతరులకు అన్యాయంలా కనిపిస్తుంది. జ్ఞానం కలిగితే, భగవంతుని పట్ల ప్రేమ పెరిగితే 'స్వార్థం' పోతుంది. అసలు న్యాయం నిలబడుతుంది. బురదలో కూరుకుపోయే మనిషికి న్యాయం, ధర్మం అందనంత ఎత్తున ఆకాశంలో కనిపిస్తాయి. కొండపైన ఉన్నవారికి ఆకాశం దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది. నక్షత్రాలు చేతికి అందినట్లే ఉంటాయి".

తన వారిని ఉద్దేశించి జీసస్ ఇలా చెప్పాడు : "జీవితంలో వాంఛలన్నవి బురదతో సమానం. సత్యదృష్టి ఏర్పడితే గిరిశిఖరం చేరడం కష్టం కాదు. జీవితాన్ని చూచి భయపడి పారిపోకండి. ఎక్కడికి పారిపోతారు? మరింత అపజయానికి. మనిషి సంపద డబ్బు సంపాదనలో రాలేదు, గుణంలో ఉంది. ఆత్మలో మంచిని నిలువచేసుకోండి. అది అసలైన సంపద".

**(11)** శిష్యులతో ఇంటికి చేరిన తర్వాత చెప్పాడు : "భవిష్యత్తు మీది. ఆత్మ సామ్రాజ్యాన్ని ఏలవలసింది మీరు. సాటి మనిషికి సేవ చేయడంలో భగవంతుని సేవ ఉంది. ధనంపైన వ్యామోహం కూడదు. మంచి సమయం ఆసన్నమైంది. ఉదయం కాబోతోంది. తొలి వెలుగులు కనిపిస్తున్నాయి. మీరు సిద్ధంగా ఉంటే భగవంతుడు ఎప్పుడూ సిద్ధమే. తలుపులు తెరచి నిద్రపోకండి. చీకటికి భయపడ

కుండా ఎదురు చూడండి. అప్రమత్తంగా ఉండండి. ఏ క్షణంలో భగవంతుడు మీలో జ్యోతిని వెలిగిస్తాడో ఎవరికి తెలుసు".

పీటర్ ప్రశ్నించాడు : ఈ ఉపదేశం మీ సొంతానికా, మాకా?

జీసస్ : "భగవంతుడంటే మనిషి కాదు పీటర్. ఒకరిని అభిమానించి, మరొకరిని ద్వేషించడానికి. ఎవరి జ్యోతి వారు వెలిగించుకోవాలి. ఎవరి వెలుగు వారిది. పరమాత్మ ఏ ఒక్కరి స్వంతం కాదు. మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోకుండా భగవంతుడు అనుగ్రహించ లేదంటే ఎలా? మీరు సుఖ, భోగాలలో మై మరచినంత కాలం భగవంతుడు మీవైపు తొంగిచూడడు. ప్రభువు ఆంతర్యం గ్రహించిన వారికే ఆయన అనుగ్రహం కలుగుతుంది".

(12) ఒకనాడు జీసస్ శిష్యపరివేష్టితుడై ఉండగా భారతదేశం నుండి వచ్చిన మిత్రుడు లమాసా అడిగాడు.

"మిత్రమా, జీసస్, ఇకనైనా ప్రపంచంలో శాంతి నెలకొంటుందా? తమరు శాంతిదూత. మీ కారణంగా విశ్వశాంతి, విశ్వప్రేమ, సుహృద్భావన ఏర్పడగలవని విశ్వసిస్తున్నారా?"

"మిత్రమా లమాసా. ఇప్పుడు శాంతి లేదా? ఉంది. అయితే ఇది తుఫాను ముందరి ప్రశాంతి. శ్మశాన ప్రశాంతి. శాంతిలోనూ తారక స్థితి ఉంటుంది. నీటిలో కదలిక ఉండనప్పుడు సరస్సు నిశ్చలంగా ఉంటుంది. అలాంటి నిశ్చలన ప్రశాంతి ప్రపంచంలో ఏర్పడాలి. నేడు ప్రపంచదేశాలు అవినీతిలో కూరుకుపోయి, అల్లకల్లోలంగా ఉన్నాయి. మైత్రీ, సద్భావన కనిపించడం లేదు. మనిషి మృత్యువును స్వాగతిస్తున్నాడు. జాతి పతనం కావడం సమాజానికి మృత్యువు. జాతి పతనం చెందితే మనిషి జీవచ్ఛవం లాగా బ్రతక వలసి వస్తుంది.

"మనిషి జీవితానికి ప్రాతికూల్యం ఎక్కువైంది. మనిషి ద్వంద్వంగా జీవిస్తున్నాడు. జీవన సాగరంలో అట్టడుక్కి వెళితే తప్ప శాంతి లేదు. శాంతిని భయం కమ్మింది. జీవితాన్ని మృత్యువు భయపెడుతోంది. నా వలన ముందు కల్లోలం ఏర్పడి, నెమ్మదిగా ప్రశాంతి కలుగుతుంది. అది లోక ధర్మం, సమాజ ధర్మం. నా సత్యాలు మొదటగా మనిషిలోని మృగాన్ని రెచ్చగొడతాయి. కొంతకాలం సంక్షోభం తప్పదు. మనిషిలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలుంటా యని మీకూ తెలుసు. అవి ఆరు దుర్గుణాలు. ప్రలోభాలు, మనిషి బలహీనతలు. వాటిలో రెండు మూడింటితో మనిషి తలపడుతుంటాడు. కన్నకొడుకు తండ్రితో విభేదిస్తాడు. కన్నకూతురు తల్లిని ద్వేషిస్తుంది. అది ఘర్షణ ... స్వార్థపరత్వం,

అనుమానం. మనిషిలో సంఘర్షణను పెంచుతుంటాయి. ఈ నేలంతా రక్తసిక్తమై ఉంది. యుద్ధాలు అనివార్యం అనే స్థితి నుండి అనవసరం అనే స్థితికి చేరాలి. ద్వేషం స్థానంలో ప్రేమ నెలకొనాలి. నిస్సహాయపరిస్థితిలో గాని మనిషి భగవంతుని ఉనికిని గుర్తించడు.

**(13)** జీసస్ ప్రసంగానికి ఒకతను అడ్డుపడి అడిగాడు. "జీసస్, రాత్రి సముద్రం మీద పెద్ద తుఫాను వచ్చింది. చాలా పడవలు మునిగిపోయాయి. కొందరు జాలరులు చనిపోయారు. వారి భార్యా బిడ్డలు దిక్కులేని వారయ్యారు. వారికి సహాయం చేయవచ్చుగదా".

జీసస్ అన్నాడు. "మంచి సలహా చెప్పావు. మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం అవసరం. ఊరడింపులు, నీతి బోధలు నిరుపయోగం. చనిపోయిన వారిని తిరిగి తెచ్చి ఇవ్వలేం. ఉన్నవారిని ఆదుకోవడం ధర్మం. వారి కన్నీరు తుడిచి కష్టాల నుండి గట్టెక్కించవచ్చు. మీలో దయగల వారున్నారు. డబ్బు గల వారున్నారు. మీ ఔదార్యానికి విలువ ఇలాంటి సందర్భాలలోనే పెరుగుతుంది. దాచుకున్న డబ్బు బయటకు తీయండి. ఆర్తులను ఆదుకోండి".

తన శిష్యులలో జూడాస్ వైపు చూచి జీసస్ అన్నాడు. "జూడా, మనవద్ద ఉన్న డబ్బు తీసుకురా. నిజానికి అది మనం కష్టపడి సంపాదించింది కాదు. అభిమానులు ఉదారంగా యిచ్చింది. దానిని మనం ఉదారంగా ఖర్చు చేయడం మంచిది".

జూడాకు ఆ డబ్బు తీయడం ఇష్టం లేదు. 'ఈ దౌర్భాగ్యుల కోసం ఉన్న డబ్బు ఖర్చు చేస్తే రేపు మనకేది గతి?' అని తన సహచరులు పీటర్, జేమ్స్, జాన్‌లతో మంతనాలు జరిపాడు.

"కొంత సొమ్ము వేరే దాచేస్తాను. మిగిలింది పంచి పెడదాం. రేపు మనకు డబ్బు అవసరం రావచ్చు. అప్పుడు వీరెవరూ మనకివ్వరు. ఇక్కడ ముష్టెత్త డానికైనా ఎవరూ మనకు పరిచయం లేదు".

పీటర్ అడ్డుకున్నాడు. "జూడా, నీ ఆలోచన బాగాలేదయ్యా. ప్రభువు చెప్పినట్లు చేద్దాం. ఈ డబ్బు మన స్వంతం కాదు. సమాజానిది, అవసరానికి ఉపయోగపడని డబ్బు, 'దొంగ సొమ్ము' అవుతుంది. మనకంత అవసరం ఏముంది దాచిపెట్టు కోవడానికి?

జూడా డబ్బు సంచులు విప్పి బాధితులకు పంచిపెట్టాడు.

ఒక న్యాయవాది జీసస్‌ను ప్రశ్నించాడు : "ఈ లోకాలను సృష్టించింది, పాలిస్తున్నది పరలోకంలో ఉన్న ప్రభువు అంటారు. ఈ తుఫానులు, కల్లోలాలు కలిగించేది ఆ ప్రభువే కదా! మధ్య మనకెందుకీ ఆరాటం, విచారం, సానుభూతి. ప్రభువు ఆగ్రహించిన వారిపై మనం దయ, సానుభూతి చూపితే అది దైవద్రోహం అవుతుంది కదా! ఒకసారి యూదులు కొందరు గలిలీ నుండి జెరూసలెం వచ్చారు. వారేదో నేరం చేశారని రోమన్ ప్రభువులు వారి తలలు తీయించారు. కొందరిని దేవాలయంలో బలి ఇచ్చారు. వారిని భగవంతుడు శిక్షించినట్లే. వారు నిజంగా పాపం చేశారా? మరొకసారి జెరూసలెంలో 'సిలోమ్' కోటబురుజు నేల కూలిపోయింది. దానిక్రిందపడి పద్దెనిమిదిమంది మరణించారు. వారేం పాపం చేసినట్లు? వారి పాపాలకు భగవంతుడు వేసిన శిక్ష అనుకోవాలా?

జీసస్ : "చిన్న చిన్న సంఘటనల మంచిచెడుల్ని ఏక పక్షంగా నిర్ణయించ కూడదు. దేనిలోనైనా గుర్తించవలసింది సత్యం. ఫలితాన్ని బట్టి కారణాలు వెతకడం జరుగుతుంది. మనిషి కర్మలకు మూలాలు పూర్వజన్మలో ఉంటాయి. ఒక జన్మ కాగానే ఆ జన్మలో చేసిన పాపపుణ్యాలు గాలిలో కలసిపోవు. నశింపు కానివి ఆకాశంలో చాలా ఉంటాయి. అవి వస్తూ పోతూ ఉంటాయి తప్ప నశించవు. ఫలితం కనిపించడానికి, అనుభవానికి రావడానికి ఒక జన్మకాలం సరిపోదు. ఈ జన్మలో ఇప్పుడు చేస్తున్న వాటికి, అనుభవాలకు కారణం ఈ జన్మలో దొరక్కపోవచ్చు.

"మరొకజన్మ లేదనుకునేవారు, ఈ జన్మ ఇంతటితో ఆఖరు అనే వారు భగవంతుని ప్రతిభను గుర్తించలేరు. మనిషికి ఎన్నో జన్మల సంచితం ఉంటుంది. మనిషి అంటే నేడు మట్టిలో పుట్టి రేపు మట్టిలో కలిసిపోయే అల్పప్రాణి కాదు. అనంతంగా విస్తరించివున్న మహాప్రాణిలో ఒక భాగం మానవ జీవనం. మనిషిలేని సమయం అంటూ కాలంలో లేదు. రేపు ఉండని స్థితి ఉండదు. ఒకప్పుడు రాజులుగా, భోగులుగా జీవించిన వారే ఇప్పుడు ముష్టివాళ్ళు, కుంటి, గుడ్డి, అనాధలు కావచ్చు. దైవ నిర్ణయం మనిషికి తెలియదు. ఈ జన్మలో చేసిన తప్పులు, చేసిన పాపాలు ఈ జన్మలోనే అనుభవించకపోవచ్చు. మనిషి ప్రతి ఆలోచనకూ, ప్రతి మాటకు విలువ ఉంటుంది. కార్యకారణ సంబంధం ఉండి తీరుతుంది. తన తప్పు తెలుసుకుని, సరిదిద్దుకోగల మనిషి భగవంతునితో సమానం".

**(14)** పీటర్ ప్రశ్నించాడు : మీరు చెప్పేవన్నీ నిజాలా? కట్టుకథలా?

జీసస్ : నేను చెప్పే విషయాలు చెవులతో వినేవారు కొందరయితే హృదయంతో వినేవారు కొందరుంటారు. చెవులతో వినేవారికి అవి కమ్మని

కథలు. హృదయంతో వినేవారికి కట్టుకథలు. కథను విశ్లేషించి అర్థం చేసుకుంటే జీవితసత్యాలు బోధపడతాయి. దేవుని సామ్రాజ్యంలో రెండు పార్శ్వాలుంటాయి. ఒక పార్శ్వమే మనకు కనిపిస్తుంది. రెండవ సగం కనిపించదు. అది ఆత్మ గత ప్రపంచం. ఒక పార్శ్వాన్నే మనిషి చూడగలడు. రెండవది హృదయంతో తెలుసు కోవలసి ఉంటుంది. ఎక్కువమంది బాహ్యాప్రపంచంలో నివశిస్తారు. అంతర్ ప్రపంచంవైపు తొంగిచూడరు. ఆత్మప్రపంచానికి ద్వారం హృదయం.

నిప్పులో కాల్చినపుడు బంగారం శుద్ధి అవుతుంది. ప్రతి మనిషిలోనూ బంగారం వంటి హృదయం ఉంటుంది. అయితే 'కల్తీ'పడి ఉంటుంది. కాల్చిన కొద్దీ కాలుష్యాలు నశిస్తాయి. కష్టాలు, అనుభవాలు హృదయాన్ని శుద్ధి చేస్తాయి. చెడు గుణాలు నశించిన కొద్దీ, మంచిగుణాలు బయటకొస్తాయి. బంగారు నిక్షేపాలు మనపొలంలో ఉన్నవే మనకు తెలియదు – తెలుసుకునే జ్ఞానం కొరవడి.

(15) మకరస్ పాలకుని జన్మదినోత్సవ వేడుకులకు, హీరోద్, అతని భార్య, హెరోడియస్, సలోమీ. మరెందరో హాజరైనారు. రాజోద్యోగులు సకుటుంబ సమేతంగా వచ్చారు. విందులో అంతా పీకల దాకా తాగారు. నృత్యవినోదాలు ముమ్మరంగా సాగుతున్నాయి. హెరోడియన్ కూతురు 'సలోమి' మహాసౌందర్యవతి. యవ్వన విలాసిని. ఆమె రాజు ముందు శృంగారనాట్యం చేసింది. తన వంపు సొంపులతో కైపెక్కించింది. హీరోద్ సలోమీని పిలిచి "నీ నృత్యం మాకు నచ్చింది. ఏం బహుమతి కావాలో అడుగు ఇస్తాం" అన్నాడు.

సలోమీ కలవరపడ్డది. ఏం కోరాలో, ఏం కోరకూడదో తెలియక వెళ్లి తల్లిని అడిగింది. ఆమె అన్నది, "జాన్ సన్యాసి తల బహుమతిగా తెచ్చి ఇమ్మని అడుగు". ఆమె వెళ్లి అదే కోరిక కోరింది.

హీరోద్ తన ఆంతరంగికుని పిలిచి, సలోమీ కోరిక తీర్చమని ఆజ్ఞాపించాడు. కొద్దిసేపట్లోనే పని జరిగిపోయింది. జాన్ తలనరికి ఒక పళ్లెంలో తెచ్చి రాజుకు బహూకరించాడు. అతను సలోమీకి ఇచ్చాడు. అది చూచి సలోమీ బావురుమని ఏడ్చింది. దాని వైపు చూడలేకపోయింది. సలోమి తల్లి రాటుతేలిన వగలాడి. నరహంతకి. ఆమె జాన్ శిరస్సును చేతితో పట్టుకుని సభికుల ముందు ప్రదర్శిస్తూ, వికటాట్టహాసం చేసింది. "ఎవరైనా రాజును విమర్శించినా తిట్టినా ఇదే గతి పడుతుంది. రాజ ధిక్కారానికి ఇది శిక్ష" అని ఆక్రోశించింది.

ఖండిత శిరస్సును 'వధ్య'శిలకు చేర్చి, జాన్ దేహాన్ని అతని మిత్రులకు అందజేశారు. మిత్రులు జాన్ మృతశరీరాన్ని జోర్డాన్‌కు తీసుకువెళ్లారు. ఆ ద్వారం

గుండా మొదటిసారి జాన్ నగర ప్రవేశం చేశాడో ఇప్పుడు అదే ద్వారం గుండా అతని శవాన్ని జోర్డాన్ పర్వతాల పైకి తీసుకువెళ్లారు. హెబ్రోన్ వద్ద జాన్ వంశీకుల సమాధుల ప్రక్కన సమాధి చేశారు. జాన్ హత్యోదంతం గలిలీలో ప్రాకింది. వార్త తెలిసిన జీసస్ శిష్యులతో పడవెక్కాడు. జాన్ ఆత్మీయ మిత్రుడొకరు తానూ వస్తానని, తనను వెంట తీసుకువెళ్లమని జీసస్‌ను అర్థించాడు.

జీసస్ అన్నాడు : మాతో వస్తే నీకు రక్షణ ఉంటుందని నీ భావం. నిజానికి మాతో ఉంటేనే ఎక్కువ ప్రమాదం. ఆ దుర్మార్గులు జాన్‌ని చంపినట్లు నన్నూ చంపవచ్చు. దుష్టుల పరిపాలనలో మంచివారికి రక్షణ ఉండదు.

జీసస్‌కు జాన్ వాణి వినిపించింది "కొంతకాలం బాధ పడక తప్పదు. తర్వాత నేను సమాధిలోనే తండ్రి ప్రక్కన విశ్రమిస్తాను".

జీసస్ అనుకున్నాడు : "అందరూ చనిపోయేవారే! కాని చనిపోయినవారు తర్వాత వచ్చే వారి గురించి తపిస్తుంటారు. పోయినవారి గురించి బ్రతికున్న వారు విచారిస్తుంటారు. విచిత్రం".

సాయంకాలం ఒకేసారి చాలా పడవలు బయలుదేరాయి. జీసస్ మొదటి పడవలో ఉన్నాడు. అర్ధరాత్రి సముద్రంపైన తుఫాను మొదలైంది. గాలికి, వానకు పడవలు చెదిరిపోయాయి. కొన్ని నీట మునిగిపోయాయి. అందరికీ ప్రాణభయం పట్టుకుంది. థామస్ ఎలాగో జీసస్ ఉన్న పడవలోకి వచ్చాడు. జీసస్ నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఆయన్ని తుఫాను కదిలించలేదు. థామస్ బిగ్గరగా అరచి గీపెట్టాడు. "గురూ! ఈ తుఫానులో మేమంతా చావడం ఖాయం. మమ్మల్ని రక్షించే భారం మీదే".

జీసస్ లేచి నిలబడి, చేతులెత్తి ప్రకృతిని అర్థించాడు. గాలుల్ని, నీటి అలల్ని శాంతించమని ప్రార్థించాడు.

జీసస్ అన్నాడు : "మీపై మీకు విశ్వాసం లేదు. మీరు ప్రార్థించినా తుఫాను ఉపశమిస్తుంది. మనపై మనకు. విశ్వాసం ఉంటే ప్రకృతి ఎప్పుడూ మనకు సహకరిస్తుంది. మన ప్రార్థన వింటుంది".

**(16)** ఉదయానికి జీసస్ బృందం గెలాసిన్స్ తీరం చేరారు. ప్రధాన పట్టణం గాడాం కు చేరారు. అక్కడ కొందరు ఉండిపోవలసి వచ్చింది. గదరా పర్వతాలు పవిత్రమైనవి. అక్కడ అన్ని ప్రదేశాలు పుణ్యక్షేత్రాలే. చనిపోయిన వారి పవిత్రాత్మలు ఆ కొండపైకి చేరుతుంటాయని ప్రజల నమ్మకం. ఆ చుట్టుపట్ల మరణించిన

వారి సమాధులు అక్కడ ఉన్నాయి. గలిలీలో చనిపోయిన కొందరు పెద్దల సమాధులు అక్కడ ఉన్నాయి. ఇటీవలి కాలంలో చనిపోయిన వారి ఆత్మలు పరలోకానికి చేరనిపక్షంలో ఇక్కడ శిథిల శరీరాల్ని ఆశ్రయించి ఉంటాయంటారు. వారి ఆత్మలు బ్రతికున్న వారిని ఆవహిస్తుంటాయి. ఆవహించి బాధిస్తుంటాయి. వారి ద్వారా తమ తీరని కోర్కెలు తీర్చుకుంటాయి.

గడారాలో ఎక్కడికి వెళ్లినా దయ్యాలు పట్టిన మనుషులు కనిపిస్తారు. వాటిని వదిలించే మొనగాడు అక్కడ ఒక్కడూ లేడు. వారికి యూదులు శత్రువులు. క్రీస్తు బోధలు గిట్టవు. అయినా క్రీస్తు శిష్యుల్ని బతిమిలాడి భూతవైద్యం నేర్చుకోవాలనుకున్నారు. జీసస్ బృందం నగరద్వారం చేరుకునే సరికి ఒక దయ్యం పట్టిన మనిషి ఎదురుగా వచ్చాడు. అతనిలో వివిధ రకాల క్షుద్రశక్తులు కాపురం చేస్తున్నాయి. అతనికి వాటి శక్తి తోడవుతుంది. అంచేత అతడి దాపులకు ఎవరూ పోరు. ఇనుప గొలుసులతో బంధించినా ఒక్క ఊపుతో వాటిని తెంచుకుంటాడు.

జీసస్ నెమ్మదిగా అడిగాడు. "మీరెవరు? మీ పేరేమిటి? ఎక్కడి వారు?" సమాధానం విని జీసస్ పెద్దగా నవ్వాడు. ఆ నవ్వు కొండలలో ప్రతిధ్వనించింది.

"పొండి. వెళ్లిపొండి. ఇంతకాలం బాధపెట్టింది చాలు".

జీసస్ చేసింది మంచి పని అయినా ఆ గ్రామస్తులు భయపడ్డారు. వీరు దయ్యాల్ని వదిలించి ఊరిని స్వాధీనం చేసుకుంటారేమోనని వారి అనుమానం. జీసస్ వెంటనే అక్కడనుంచి శిష్యబృందంతో బయలు దేరి కపర్నాం చేరుకున్నారు.

**17** జీసస్ శిష్యులతో కోపర్నం వచ్చిన విషయం అందరికీ తెలిసింది. జీసస్ శిష్యులలో మాత్యూ ధనవంతుడు. ఒక విందు ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రముఖు లందరినీ ఆహ్వానించాడు. అన్ని వర్గాల వారు, సంపన్నులు, పేదలు, ధనికులు వచ్చారు. జీసస్ బడుగు మనుషులతో కలిసి మెలిసి ఉండడం ఫారసీలకు ఇబ్బందిగా ఉంది. "ఈయన తను దేవుడంటాడు. దేవుని కుమారుడంటాడు. మాటిమాటికీ 'పర లోకంలో ఉన్న·నా తండ్రీ' అంటాడు. ఇక్కడ నిమ్న జాతి వారితో కులటలతో కలిసి విందులు చేస్తాడు. చిందులు వేస్తాడు. సిగ్గుచేటు పని... మాన మర్యాదలు తెలియవు" అని విమర్శించ సాగారు.

జీసస్ వారి మనోగతాన్ని గ్రహించినట్లు అన్నాడు. "అన్నీ ఉన్న వారికి మనం సహాయం చేయనవసరం లేదు. జబ్బు చేసిన వారికే చికిత్స కావాలి. ఆరోగ్యంతో ఉన్నవాడికి కాదు. పవిత్రంగా జీవిస్తున్న వారికి మనం చెప్పవలసింది,

బోధించవలసింది ఏముంటుంది? వారిని వారే ఉద్ధరించు కుంటారు. నేను క్రింది వర్గాల వారి కోసమే వచ్చాను".

జాన్ మరణవార్త అక్కడ శిష్యులకు, అభిమానులకు తెలిసింది. వారంతా జాన్ ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేస్తూ, ఉపవాసాలున్నారు. ఫారిసీలు అది చూచి, జీసస్‌ను ప్రశ్నించారు. "జాన్ అభిమానులు ఉపవాసం చేస్తున్నారు. మీ శిష్యులు చేయడం లేదు. కారణం ఏమిటి?"

జీసస్ సమాధానం : "మీకు ధర్మశాస్త్రాలు తెలుసు. 'కర్మ' సిద్ధాంతం కూడా తెలిసి ఉండాలి. మీరే చెప్పండి. ఉపవసించడం అంటే ఏమిటి?"

ఫారిసీలు మొహమొహాలు చూసుకున్నారు జవాబు చెప్పలేక.

జీసస్ చెప్పాడు : "మనిషికి జీవశక్తి తినే ఆహారంలో, తాగే నీటిలో ఉంది. వాటి వల్లనే శరీర పోషణ జరుగుతుంది. ఆధ్యాత్మ జీవనంలో ప్రార్థన వల్ల సమకూరే శక్తి, అన్న పానీయాల వల్ల లభించే శక్తి కన్న గొప్పది. ఉపవాసం వల్ల ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది. భగవంతుని శక్తి ఆవాహన చేయలేని వారు నిజంగా బలహీనులు, అర్భకులు. మీ అర్చక స్వాములంతా అర్భకులే. భగవంతుని మౌనంగా ప్రార్థించేవారు నిజమైన అర్చకులు, బలవంతులు, నీతిపరులు. జాన్ మరణించిన విషాదంవల్ల అతని మిత్రులు, భక్తులు ఏమీ తినడం లేదు. అది జాన్ పట్ల వారి భక్తి విశ్వాసాలకు గుర్తు. మరణించిన ఆత్మీయుల్ని అంత సులభంగా మరచిపోలేము గదా. అంచేత నిరాహారంతో ఉన్నారు. అది వారి అంతరాత్మ ప్రబోధం. ఎవరి అంతరాత్మ వారికి సాక్షి. 'ధర్మం' కాలానుగుణంగా మనిషి సంస్కారాన్ని బట్టి మారుతుంది. సమయ సందర్భాలను బట్టి మంచి చెడ్డల్ని నిర్ణయిస్తుండాలి".

(18) అక్కడ సమావేశమైన వారిలో నికోదమస్ ఒకరు. ఆయన ఒకప్పుడు రాత్రివేళల్లో, రహస్యంగా వెళ్లి, జీసస్ బోధలు వింటుండేవాడు. జీసస్ అభిమాని. ఆయన ప్రశ్నించాడు : "మీ బోధలు అర్థవంతంగా ఉన్నాయి. అయినా యూదులు అంగీకరించడం లేదు. వారి ఆచారాలు, పట్టుదల వేరుగా ఉన్నాయి. మతాచారా లలో మార్పు రావలసి ఉంది. ప్రజలు అంగీకరించాలంటే ప్రభువులు, పాలకులు ముందు ఆమోదించాలి. చట్టం అంగీకరించాలి. ఇంతటి వ్యతిరేకతలో మీ మార్గం ఎవరు అనుసరిస్తారు! మీ ఆశయాలు పెద్దలు ఆమోదించేటట్లు చూడండి".

జీసస్ : "నా సిద్ధాంతాలకు తగిన బలం చేకూరినప్పుడు అవే ప్రాచుర్యం

పొందుతాయి. నాకు ఎలాంటి తొందరలు లేవు. చీకి చివికిపోతున్న బట్టకు కొత్త టాకాలు వేసి లాభం లేదు. నా సిద్ధాంతం కొత్త తరానికి వెలుగు చూపుతుంది. దారి చూపుతుంది. అవి పాతవారి కోసం కాదు. దీనిని యూదుల ప్రాచీన విశ్వాసాలతో ముడిపెట్టవద్దు. అదే విస్తరిస్తుంది. నెమ్మదిగా ఆదరణ పొందుతుంది. క్రీస్తు భావన, క్రీస్తుతత్వం భగవంతుడంతటి ప్రాచీనమైనది. పవిత్రమైనది. రేపు సూర్యోదయం కాకుండా ఎవరూ ఆపలేరు".

అంతలో ఒక యూదు మత పెద్ద జైరస్ లేచి ప్రశ్నించాడు.

"మహాత్మా, నా బిడ్డకు జబ్బుగా ఉంది. చనిపోతుందనే అనుమానం. మీరు వచ్చి చూస్తే బిడ్డ బ్రతుకుతుందని నా విశ్వాసం. ఆమె నా ఏకైక సంతానం".

వెంటనే బయలుదేరి జీసస్ జైరస్ వెంట వెళ్లాడు. అనేక మంది వారి వెంట వెళ్లారు. మార్గంలో ఒక సంఘటన జరిగింది. ఒకామె రక్త స్రావంతో బాధపడుతోంది. ఏ చికిత్సలు పనికి రాలేదు. జీసస్ దారంట రావడం చూచి ఆమె తలపోసింది. 'ఈ మహాత్ముని స్పర్శ తగిలితే ఆరోగ్యం చక్కబడుతుంది' అనుకుని వెంటనే జనాన్ని చీల్చుకుంటూ వచ్చి జీసస్‌ను స్పృశించింది.

పరధ్యానంగా ఉన్న జీసస్ "ఎవరు? ఎవరది! నాకు తెలియకుండా నన్ను స్పృశించిన వారెవరు?"

పీటర్ అన్నాడు. "ఎవరు చెబుతారు గురూ! ఎవరికి వారు తమరి స్పర్శ తగిలితే చాలని తోసుకుంటూ వస్తుంటారు".

జీసస్ : "లేదు పీటర్. ఇది అలాంటి స్పర్శ కాదు. ఈ స్పర్శలో ఆర్తి ఉంది. అది నాలోని శక్తిని లాక్కుంది".

ఆమెకు తను చేసిన పని తెలిసిపోయింది. భయంతో వణికిపోతూ జీసస్ ముంగట నిలబడి "క్షమించాలి, మహాత్మా! నేనే ఆ తప్పు చేసింది" ఆయన కాళ్ల మీద పడి కాళ్లకు చుట్టుకుపోయింది కన్నీరు కారుస్తూ.

జీసస్ : "అమ్మా నీ విశ్వాసమే నీకు రక్ష. ఎవరు నన్ను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తే వారికి నా శక్తి అందుతుంది".

అంతలో జైరస్ ఇంటి నౌకరొకరు వచ్చి 'అమ్మాయి చనిపోయింది' అని కబురు చెప్పాడు. జైరస్ ఏడవసాగాడు.

జీసస్ : జైరస్. కష్టసమయంలో విశ్వాసం కోల్పోకూడదు. ధైర్యంగా ఉండండి. నన్ను నమ్మారు కదా! బాధ్యత నాకు వదలి పెట్టండి. మీ నౌకరు

చెప్పింది ఏమిటి? అమ్మాయి చనిపోయిందని. చని పోవడం అంటే ఏమిటి? శరీరాన్ని వదలి 'ఆత్మ' వెళ్లిపోవడం. శరీరం చావడం, ఆత్మ పోవడం ఒకేసారి జరిగే పనులు. మనిషికి శరీరం పైన మమకారం ఉంటుంది. ఆత్మపైన అధికారం ఉండదు. ఆత్మపైన అధికారం సంపాదిస్తే 'మరణించడం' జరగని పని. మరణాన్ని జయించినట్లు. ఖాళీ చేసిన ఇంటికి అదే ఆత్మను ఆహ్వానించవచ్చు".

జీసస్ అందరితో కలిసి పాప మృతశరీరం దగ్గరకు వెళ్లి 'తలితాకుమి' అని పిలిచాడు. "బిడ్డా! లే" అనగానే ఆ పాప లేచి 'ఆకలిగా ఉంది. ఏమైనా తినడానికి పెట్టండి' అన్నది. జీసస్ నిశ్శబ్దంగా శిష్యులతో వచ్చిన దారంట వెళ్లి పోయాడు.

(19) జీసస్ శిష్యులతో ఒక ఏకాంత ప్రదేశానికి నిష్క్రమించి, ఏడు రోజులు ఏక దీక్షగా ధ్యానం చేయించాడు. అప్పుడు వారికి కొన్ని విషయాలు బోధించాడు.

"చూడండి. మనం ఎక్కడకు వెళ్లినా, జనం అసంఖ్యాకంగా వస్తున్నారు. జనానికి నిగ్రహం తక్కువ. ఎటు గాలి వీస్తే అటు పరుగు తీస్తుంటారు. విశ్వాసం కలగని వారు వెళ్లిపోతుంటారు. నమ్మకం కలిగించడం మన కర్తవ్యం. ఇది అనుకూలమైన సమయం. మీరు గలీలిలో ప్రతి గ్రామం, పట్టణం వెళ్లండి. ధర్మాన్ని బోధించండి. రోగులకు చికిత్స చేయండి. భగవంతుని అనుగ్రహం వల్ల మీకు 'ప్రాణ' సహాయం అందుతుంది. 'రోగచికిత్స' చాలా అవసరం.

"తలపైన చేయి ఉంచి ఆశీర్వదించండి. దేవుని పేర శక్తిపాతం జరుగుతుంది. కేవలం ప్రార్థనతో దైవం అనుగ్రహం పొందగలరు. అకాల మరణం చెందిన వారిని 'కరుణ'తో బ్రతికించవచ్చు. మీరు అస్సీరియా, గ్రీసు, సమరియాలకు వెళ్లవద్దు. తండాలకు వెళ్లండి. అనాగరిక జనం వద్దకు వెళ్లండి. క్రీస్తు రాకను తెలియచేయండి. మీ ప్రతి ఒక్కరిలో శక్తి ఉంది. దానిని వినియోగించండి చాలు. జనానికి మీపైన నమ్మకం కలగాలి. విశ్వాసం ఏర్పడాలి. మీ వద్దనున్న డబ్బు పేదలకు పంచండి. మీపైన నమ్మకం ఏర్పడుతుంది. పేదలతో కలసి మెలసి జీవించండి. వారు మిమ్మల్ని ఆదరిస్తే నన్ను ప్రేమించినట్లే. మిమ్మల్ని నిరాదరిస్తే నన్ను కాదన్నట్లే. పట్టణ ప్రజలు ఆదరించకపోయినా నష్టం లేదు. ఎవరినీ చిన్నచూపు చూడకండి".

ఇద్దరిద్దరిని ఒక జట్టుగా చేసి పంపి వేశాడు. కొంతకాలం తర్వాత కాపర్నంలో తిరిగి కలుసుకుందామని చెప్పాడు.

**20** కొంతకాలం జీసస్ ఒంటరిగా, ఏకాంత ప్రదేశంలో తపస్సులో గడిపి, విదేశాలకు చెందిన శిష్యుల్ని పిలిపించుకున్నాడు. వారికి సందేశం ఇచ్చాడు.

"బిడ్డలారా! పన్నెండు మందిని ఇజ్రాయిల్‌లో పలు ప్రాంతాలకు నియోగించాను. ఇప్పుడు మిమ్మల్ని ప్రపంచ దేశాలన్నింటికీ పంపబోతున్నాను. మీరు ఒక్కటి గుర్తుంచుకోండి. ఎక్కడకు వెళ్లినా పరమాత్మ ఒక్కడే, అందరికీ భగవంతుడు ఒక్కడే, పేర్లు వేరు అని చెప్పండి.

"జీవ చైతన్యం అందుకోగలిగిన వారెవరికైనా దివ్యత్వం తెలుస్తుంది. దివ్య స్పందన అనుభూతికి అందుతుంది. మీ అందరినీ ఇక్కడకు చేర్చింది పరమాత్మ. ప్రపంచంలోని ఏడు ఖండాలకు మీరు ప్రతినిధులు. అందరిలోని ప్రాణ స్పందన ఒక్కలాంటిదే. మీరు దివ్య తేజస్సును అన్ని దేశాలకు అందించండి. మీరే సత్యయుగానికి వైతాళికులు".

జీసస్ ఆదేశించిన ప్రకారం అందరూ తమ తమ దేశాలకు వెళ్లారు. కొన్నాళ్లు గలీలి పర్వతాలపై తపస్సు కొనసాగించి జీసస్ టైల్ తీరం చేరాడు. అక్కడ రాఖేల్ ఇంట మకాం పెట్టాడు. తన రాక ఎవరికీ తెలియనివ్వ వద్దని, తనకు ఏకాంతం కావాలని చెప్పినా, జనానికి జీసస్ రాక తెలిసిపోయింది. జనం జీసస్ దర్శనానికి యదావిధిగా రాసాగారు.

ఫెనాషియా నుండి ఒక గ్రీకు వనిత వచ్చింది. ఆమె కూతురుకు గాలి సోకింది. తన బిడ్డను కాపాడమని జీసస్‌ను అర్థించింది.

రాఖేల్ ఆమెతో అన్నాడు : అమ్మా! గురువుగారు ఇప్పుడు ఎక్కడకూ రారు. ఏకాంతంగా తపస్సు చేసుకుంటున్నారు.

జీసస్ రాఖేల్‌ను వారించి అన్నాడు : రాఖేల్, నేను గ్రీసు వెళ్లనవసరం లేదు ..... ఇక్కడ ఉండి ఆమెకు చికిత్స చేయగలను.

తర్వాత జీసస్ ఆ ప్రాంతం వదలి సిడాన్ వెళ్లి సముద్ర తీరంలో కొంత కాలం గడిపాడు. తర్వాత లెబనాన్‌లో పర్వతాలు, లోయలు దాటుతూ అక్కడక్కడ కొన్ని రోజులు ఆగి, ధ్యానం చేసుకుంటూ ముందుకు సాగాడు. తన అంతిమ కాలం సమీపిస్తోంది అనిపించేది అప్పుడప్పుడు. ఇది చివరిది జీవితాధ్యాయం కాదు గదా అనిపించేది ఒంటరిగా ఉన్నప్పుడు. తనకు అదనంగా శక్తి నిమ్మని ధ్యానించే వాడు.

హెర్మన్ శిఖరాలెక్కి ఆకాశం వైపు నిర్మలంగా దృష్టి సారించి భగవంతునికి విన్నవించుకునేవాడు. తర్వాత జీసస్ సిజారియా, ఫిలిప్పీ వెళ్లి 'సుసన్న' ఇంట

కొంతకాలం గడిపాడు. తర్వాత డెకా పోలిస్‌లో కొంతకాలం గడిపాడు. గడారా వెళ్లినప్పుడు చిన్న నాటి మిత్రుల ఆదరణ లభించింది. చుజున్‌లో. హీరడ్ ఆంటిపస్ సహకారంతో. రాజనౌకలో పయనించి కోపర్నం చేరుకున్నాడు.

జీసస్ తిరిగ ఇంటికి రాగానే ఘన స్వాగతం లభించింది. కొద్ది రోజుల వ్యవధిలో జీసస్ మౌన సందేశం అందుకుని పన్నెండుమంది శిష్యులు అక్కడకు చేరుకున్నారు.

◆ ◆ ◆

# 17. తుది మెరుపు

(1) పన్నెండు మంది శిష్యులు పరిణతి చెందారు. వారికి మరిన్ని తాత్విక విషయాలు, ఆత్మ విషయాలు, నిగూఢమైనవి చెప్పాలని జీసస్ నిర్ణయించుకున్నాడు. మరొక వారం రోజులలో యూదులపండుగ. తామంతా జెరూసలెం చేరుకోవాలని మాత్యూస్ సూచించాడు.

జీసస్ అన్నాడు, "అప్పటికి మనం చేరలేం మాత్యూ. మీకు బోధించ వలసిన విషయాలు ఇంకా చాలా మిగిలిపోయాయి. మనందరం ఎడారి ప్రాంతానికి వెళ్లాలి. అక్కడ కొన్ని రోజుల పాటు మీకు పాఠాలు చెప్పాలి".

అందరూ అంగీకరించారు. పడవెక్కి సముద్రం దాటి జులియస్ బెత్‌సైదా తీరం చేరుకున్నారు. వాళ్లు రహస్యంగా పయనించడం కొందరు అభిమానులు గమనించి వెంటపడ్డారు. రాత్రి అయింది. అంతమందికి తిండితిప్పలు సమకూర్చడం మాటలా! థామస్ వెళ్లి జీసస్‌తో మొరపెట్టుకున్నాడు. వీరంతా తిండి లేక చస్తారేమో!

"వెళ్లి అందరికి భోజనాలు చూడండి" అన్నాడు జీసస్.

జుడాస్ అడిగాడు : దగ్గర పట్టణం వెళ్లి రొట్టెలు తెమ్మంటారా? రెండు వందల నాణాలున్నాయి.

జీసస్ అన్నాడు : వద్దులే. మన వద్ద ఎన్ని రొట్టెలున్నాయో చూడండి.

ఆంద్రూస్ అన్నాడు : రొట్టెలు లేవు స్వామీ, అయిదు బార్లీ రొట్టెలు, రెండు చేపలు ఉన్నాయి. దాంతో ఏమవుతుంది?

జీసస్ : వాళ్లందర్నీ పన్నెండు మంది చొప్పున కూర్చోపెట్టండి.

జీసస్ ఆ బార్లీ రొట్టెలు, చేపలు తీసుకుని ఆకాశంలోకి చూస్తూ ప్రార్థించి రొట్టెల్ని పన్నెండు ముక్కలు చేశాడు. చేపల్ని పన్నెండు ముక్కలు చేసి పన్నెండు మంది శిష్యులకు పంచిపెట్టాడు. "ఊఁ వెళ్లి వడ్డించండి".

చిత్రంగా అవి వచ్చిన జనం అందరికీ సరిపోయాయి. అందరూ తిన్న తర్వాత జీసస్ అన్నాడు "ఒక్క ముక్క కూడా వృధా కాకూడదు. వెళ్లి కింద పడిన ముక్కలన్నీ ఏరుకు రండి. మరికొంత మందికి పనికొస్తాయి".

అలా ఏరిన బార్లీ, చేప ముక్కలు పన్నెండు గంపలకు నిండాయి. జీసస్ మహత్తుకు జనం ముగ్ధులైనారు.

జీసస్ ఒంటరిగా ఒక కొండలోయకు బయలుదేరాడు ధ్యానానికి. శిష్యులు పన్నెండుమంది సముద్రం దాటి కోపర్నం వెళ్లడానికి సిద్ధమైనారు. అర్ధరాత్రి భయంకరంగా తుఫాను మొదలైంది. అలల ఉధృతానికి పడవలు ఎగిరెగిరి పడుతున్నాయి. అందరికీ ప్రాణభయం పట్టుకుంది. అంతలో ఎవరో సముద్రం పైన నడిచి వస్తున్నట్లు గమనించారు. అదేదో 'జలపిశాచి' అని భయపడ్డారు.

జాన్ ఆ రూపాన్ని పోల్చుకుని 'జీసస్' అని అరిచాడు.

'మాస్టర్ రక్షించండి' అని అరవసాగారు. జీసస్ రూపం వారికి దగ్గరగా వచ్చింది. "రా ... పడవ దిగి రా". పీటర్ పడవ దిగి కాలు క్రింద పెట్టాడు. కాళ్లకు నీరు తగలలేదు. నేల గట్టిగా ఉంది. హాయిగా నీటి మీద నడుస్తున్నాడు. కొంత దూరం వెళ్లాక అనుమానం వచ్చింది. "నా కాళ్ల క్రింద అలలు కరిగిపోతే?"

అంతే, వెంటనే అతని కాళ్ల క్రింద అలలు కరిగిపోసాగాయి. నీటిలో మునిగిపోతూ జీసస్‌ను ప్రార్థించాడు. "మహాత్మా, రక్షించు".

(2) జీసస్ తన చేయి అందించి పైకి లాగాడు. "నీకు విశ్వాసం ముఖ్యం. ఎందుకు అనవసరంగా అనుమానించావు" అని పడవవరకు నడిపించి పడవ నెక్కించాడు. నెమ్మదిగా పడవలు వడ్డుకు చేరాయి.

జీసస్ శిష్యులతో వచ్చాడన్న వార్త గెన్నెసారెట్ లోయలో పాకింది. జనం గుంపులుగా ఆయన దర్శనానికి రాసాగారు. జీసస్ అక్కడ ఎవరికీ కనిపించకుండా మాయమైనాడు. జనం కోపర్నం వెళ్లారు. అక్కడ జీసస్ జాడలేదు. తిరిగి గెన్నెసారెట్ వచ్చారు.

జీసస్ వారిని మందలించాడు. "మీ అవసరాలు తీర్చుకోవడం కోసం నా వెంట పడుతున్నారు. ఎందుకిలా మాటిమాటికి సముద్రం దాటి రావడం. ఆ ఎడారిలో మీకు తిండి దొరకదు. మాయచేసి, మంత్రం వేసి ప్రతిసారి మిమ్మల్ని మేపడం కుదరదు. మీ గలీలి మనుషులకు తిండియావ తప్ప మరో ధ్యాస లేదు. ఆత్మకు ఆహారం గురించి ఒక్కరు ఆలోచించరు. మీలో ఉన్న

క్రీస్తుకు (ఆత్మ) ఆహారం ఇవ్వండి. ఆత్మను ఆరాధిస్తే జీవితానికి సరిపడే ఆహారం లభిస్తుంది".

అక్కడి నుండి జీసస్ కొపర్నాం వెళ్లాడు. గెన్నెసారెట్‌లో జీసస్ బోధలు విన్న యూదులు కొందరు కోపర్నాం వెళ్లారు. వారు జీసస్ గురించి చులకనగా మాట్లాడసాగారు. "ఇతను మామూలు మనిషి, దేవుడు కాదు నజరత్ నుండి వచ్చాడు. ఇతని బంధువులు మాకు తెలుసు".

జీసస్ వారి మనోభావాలు గ్రహించి అన్నాడు "ఎందుకు మీలో మీరు మధనపడతారు. గొణుక్కుంటారు. నన్ను అడగవచ్చుగదా! నేను 'క్రీస్తు'ను కానని మీ అనుమానం. క్రీస్తు అంటే 'పరంజ్యోతి'. అది శాశ్వతమైంది. 'క్రీస్తు' పరలోకానికి అధిపతి. స్వర్గ ద్వారాలు తెరిచే 'బీగాలు' క్రీస్తు వద్ద ఉంటాయి. ఏ మనిషి అయినా పవిత్రుడు అయితేతప్ప స్వర్గ ప్రవేశం వీలు పడదు".

జనాలకు ఆశ్చర్యం కలిగింది. కొందరు జీసస్‌కు భయపడి పారిపోయారు. జీసస్ మాటలు అర్థం కాక కొందరు వెళ్లిపోయారు.

"ఇప్పుడు మీకు సత్యం అర్థం కాదు. పరలోకంలో ప్రభువు ప్రక్కన నన్ను చూచినప్పుడు నేనెవరో తెలుసుకుని నివ్వెరపోతారు."

జీసస్ శక్తి సామర్థ్యాలను పరీక్షించే నిమిత్తం కొందరు మతపెద్దలు జెరూసలెం నుండి వచ్చారు. జీసస్ మహత్తుల ఆంతర్యం తెలుసుకోవాలి. ఆయన జనాకర్షణ రహస్యం తెలుసుకోవాలి. జీసస్ వారిని ప్రశ్నించారు :

"మీలో భేషజం ఎక్కువ. నిజాయితీ శూన్యం. మీ వంటివారి గురించి ఈసయ్య ఏం చెప్పాడో తెలుసా'? 'మనుషులు పెదాలతో ఆరాధిస్తారు. వారి హృదయాలు శూన్యంగా ఉంటాయి. నన్ను పూజిస్తారు కానీ తమ చాదస్తాలు వదలరు'. మీరు దేవుని ధర్మం పాటించడం లేదు. మానవ బలహీనతలు మీకున్నాయి'. "నియమాలన్నవి మనం కల్పించుకున్నవి. ఆచారాలు మనకోసం మనం తయారుచేసుకున్నవి. అవి మన భౌతికావసరాలు, సామాజిక సూత్రాలు. వాటికీ భగవంతునికీ సంబంధం లేదు. వాటిని అతిక్రమించడం ఎంత మాత్రం పాపం కాదు. 'పాపం' అన్న పదాన్ని మీవంటివారు స్వార్థప్రయోజనాల కోసం సృష్టించి పెట్టారు. ఆత్మకు కావలసిన శక్తి పైనుండి వస్తుంది. మనిషి తినే తిండిలో, పీల్చే గాలిలో ప్రాణశక్తి ఉంటుంది. శరీరానికి అవసరమైన శక్తి అది. ఆత్మకు కావలసిన శక్తి అన్నంతో, నీళ్లతో రాదు. ఆత్మను ఆరాధిస్తే అవసరమైన ప్రాణశక్తి సమకూరుతుంది. 'ఆత్మశరీరం' స్వర్గంలో పెరుగుతుంది. శరీరాన్ని శుభ్రంగా

ఉంచుకోవాలి. మనస్సును, బుద్ధిని శుచిగా ఉంచుకోవాలి. అప్పుడే 'ఆత్మ' ఏమిటో తెలుస్తుంది".

"మనిషికి ఆత్మ ఎంత ముఖ్యమో శరీరం అంతే అవసరం కదా?" ఒకరు ప్రశ్నించారు.

"అవును శరీరధర్మం శరీరానిది, ఆత్మధర్మం ఆత్మది. శరీరం పవిత్రంగా, శుచిగా ఉంటేనే 'ఆత్మ'వికాసం కలుగుతుంది. ఆహార పానీయాల ప్రభావం ఆత్మపైన పడుతుంది. మంచి మనిషి మంచిగా ఆలోచిస్తాడు. మంచి ఆలోచనలు ఆత్మని నిద్రలేపి, చైతన్య పరుస్తాయి".

(3) జీసస్ ద్వాదశ శిష్య సమేతంగా ఒకనాటి రాత్రి, సముద్రం దాటి డెకాపోలిస్ సరిహద్దుకు చేరుకున్నాడు. అక్కడ నిర్మలంగా ఉన్న ఒక గుహలోకి వారిని తీసుకువెళ్లాడు. అక్కడ మూడు రోజులు అందరూ ధ్యానం చేశారు. ఆ తర్వాత లోయలో శిష్యులను సమావేశపరచి బోధించాడు.

"చూడండి, ఇంక మనం కలిసి ఉండే కాలం బహు తక్కువ. తన వారి ప్రయోజనం కోసం శరీరాన్ని త్యాగం చేయడం విశేషం. తనవారి కోసం ఎక్కువ కాలం జీవించాలనుకోవడం అత్యాశ. మహాత్ములు, మహర్షులు, యోగులు ఎక్కువ కాలం జీవించాలని కోరుకోరు. పూర్ణత్వాన్ని, దివ్యత్వాన్ని, మృత్యు రాహిత్యాన్ని కోరతారు. నేను జన్మించిన కారణం వేరు. మానవ వికాసానికి సహాయపడడం నా జీవిత లక్ష్యం. నేను హెలియో పోలిస్‌లో ఉన్నప్పుడు ఏడు కఠిన పరీక్షలు ఎదుర్కొన్నాను. అప్పుడే నన్ను నేను మానవజాతికి అంకితం చేశాను. నా కంటూ ఏమీ అవసరం లేదని గ్రహించాను. జుడియాలో ఉన్నప్పుడు 'శత్రుత్వ' భావనను జయించాను. అరిషడ్వర్గాలను జయించి, నా సర్వస్వాన్ని మానవ కళ్యాణానికి వినియోగించ నిశ్చయించాను. కష్టాలకు, బాధలకు నేను ఎన్నడూ చలించలేదు. నాపై నిందలు మోపినవారిని, నేరాలు ఆరోపించిన వారిని క్షమించాను. నాకు ప్రభువు రక్షణ పూర్తిగా ఉందని నా ప్రగాఢ విశ్వాసం. ప్రభువు దయతో అనేక మందిని రోగ, బాధా విముక్తుల్ని చేయగలిగాను. వారికి దివ్య సందేశం వినిపించాను.

"కొద్ది రోజుల్లో మనం జెరూసలెం వెళ్లవలసి ఉంది. ఇప్పుడు నా మాటలు శ్రద్ధగా వింటున్న మీలో ఒకరు నాపట్ల విశ్వాసం కోల్పోతారు. నాకు ద్రోహం తలపెడతారు. స్వార్థచింతనతో నాకు అపకారం చేస్తారు. అధికారులూ మతపెద్దలూ నన్ను దోషిగా నిర్ణయిస్తారు. రోమ్ అనుమతితో నన్ను 'శిలువ' వేస్తారు. ఇది నా భావన కాదు. మనస్సులో ఉంచుకోండి. ఇది భవిష్యవాణి".

పీటర్ ఆందోళనగా అన్నాడు, "ప్రభూ! అలాంటి అకృత్యం ఎన్నటికీ జరగదు. మాలో ఎవరూ తమకు ద్రోహం చేయరు. రోమ్ ప్రభువులు మా పన్నెండు మంది శవాలను దాటి గానీ మీ 'జోలికి రాలేరు'.

జీసస్ : "పీటర్, ఎవరు ఎవరిని రక్షించగలరు? నేను దేనినీ ప్రతిఘటించను. దైవ నిర్ణయాన్ని కాదనను. నేను వచ్చిన పని వేరు. మీ పన్నెండు మందిని నేను ఎన్నిక చేయలేదు. భగవంతుడే మిమ్మల్ని నావద్దకు పంపాడు నాకు సహాయంగా. రేపు నాపనికి మీరు కావాలి. అయితే మీలో ఒక్కరు 'స్వామి ద్రోహం' చేస్తాడు. అది చేదు నిజం. నాతో నా శరీరం పోతుంది. నా ఆత్మ మీతోనే ఉంటుంది. మిమ్మల్ని అనుసరిస్తూ ఉంటుంది.

"లోకంలో దుర్మార్గులు, అసూయాపరులు ఎక్కువగా ఉన్నారు. మీరు దైవ ప్రార్థన చేస్తున్న సమయంలో వీధుల్లోకి మిమ్మల్ని ఈడ్చి వేస్తారు. మీపైన నేరాలు ఆరోపిస్తారు. మిమ్మల్ని చంపి వారి దేవుళ్లకు తృప్తి కలిగిద్దా మనుకుంటారు. అయినా నిగ్రహం చెదరనీయకండి. సంయమనం పాటించండి. శాంతంగా ఉండండి. మీ కర్తవ్యం ముందు మీరు పడే కష్టాలు అతిస్వల్పం. మీ విశ్వాసమే మీకు బలం. బాధల్ని నిగ్రహిస్తూ ముందుకు సాగండి. ఈ భౌతికబంధాలు లేనిచోట మనం మళ్లీ కలుసుకుందాం.

"ఈ దుర్మార్గాన్ని ఎదిరించలేమా? అని మీరు అడగవచ్చు. దుర్మార్గం, దౌష్ట్యం వ్యవస్థలో ఉంది. సమాజంలో పాతుకుపోయి ఉంది. వ్యవస్థలో మార్పు రావాలి. ఎదిరిస్తే మార్పురాదు. మనం అందరివంటి వాళ్లం కాదు ఎదిరించి పోరాడటానికి. మనం శాసించవలసింది కాలాన్ని – మనుషుల్ని కాదు. మనం ఆశ్వాసిస్తే పంచభూతాలు మన దగ్గరకు వస్తాయి. మనం చెప్పినట్లు వింటాయి, చెప్పిన పనులు చేస్తాయి. మనం 'ఆత్మ' విశ్వాసంతో క్షుద్రశక్తులను శాసించవచ్చు. దైవశక్తుల్ని ప్రసన్నం చేసుకోవచ్చు. అవే మన శత్రు వర్గాన్ని తుదముట్టిస్తాయి. దైవశక్తుల్ని మన స్వప్రయోజనాలకు వినియోగించుకోకూడదు. నేను మీకు మార్గదర్శిని. రేపటి తరానికి మీరు మార్గదర్శులు కావాలి. 'సహనం' మన ఆయుధం. సౌశీల్యం మన కవచం. విశ్వ శ్రేయస్సు, మానవ వికాసం మన లక్ష్యాలు.

"నా లక్ష్యం నా మరణంతో ఆగిపోకూడదు. నా ఆశయాన్ని మీరు కొనసాగించాలి. నా సమాధి అందరి సమాధుల వంటిది కాదు. ఇది చైతన్య విలసితం అవుతుంది. మరణ సమాధిలో నేను గడిపేది మూడు రోజులు మాత్రమే. ఆ తర్వాత నా పితృదేవతలతో కలసి, దేవలోకంలో ఉంటాను. నా ఆత్మ పరలోకం

చేరిందనడానికి గుర్తు సమాధిలోని నా భౌతిక శరీరం అంతర్ధానం కావడమే. అందరూ చూస్తుండగానే నేను ఆకాశ తత్వంగా మారిపోతాను. నా ఆత్మ పరమాత్మలో కలుస్తుంది".

తర్వాత జీసస్ బృందం సముద్రం దాటి ఒక గ్రామం చేరారు.

4 శిష్యులు ఆదమరచి నిద్రపోతుండగా అర్ధరాత్రి జీసస్ ఒంటరిగా ఆరుమైళ్ల దూరాన ఉన్న ఒక లోయకు చేరుకుని ప్రశాంతంగా ధ్యానం చేసుకోసాగాడు. ఉదయం జీసస్ కనిపించకపోవడంతో శిష్యులు కలతపడ్డారు. ఊరంతా గాలించినా ఆయన ఆచూకి తెలియలేదు. ఊరి జనం, శిష్యవర్గం సముద్ర తీరం వెంట అన్వేషణకు బయలుదేరారు. అపరాహ్నం వేళకు జీసస్ కనిపించాడు. కొండల మధ్య దీర్ఘతపస్సులో ఉన్నాడు. వారి రాకతో ఆయనకు ధ్యానభంగమై కళ్లు విప్పాడు. ఎవరినీ పలకరించలేదు. ఎందుకు వచ్చారని ఎవర్నీ అడగలేదు. అసలు ఎవరినీ పట్టించుకోలేదు. సాయంత్రానికి అందరూ ఆకలికి నకనక లాడసాగారు. వెళ్లిపొమ్మని చెప్పినా ఎవరికీ నడిచే ఓపిక లేదు. అందరూ నీరసించి పోయారు.

ఒక శిష్యుడు అన్నాడు : ఇంత మందికి తిండి ఎలా సమకూర్చడం. ఆడవారు, పిల్లలతో సహా నాలుగువేల మంది ఉన్నారు.

ఏడు రొట్టెలు, కాసిని చేపలు ఉన్నాయి.

"లోగడ చేసినట్లే. అందర్నీ కూర్చోబెట్టి వడ్డించండి".

పన్నెండు మంది ఒక బృందం చొప్పున గుంపులు కట్టిన తర్వాత జీసస్ ప్రార్థన చేసి, రొట్టెల్ని ముక్కలుగా చేయించాడు. ఒకొక్క రొట్టె ముక్క పెద్ద రొట్టెగా, చేప ముక్క పెద్దచేపగా మారాయి. పన్నెండు మంది శిష్యులు వాటిని అందరికీ పంచారు. కడుపునిండా తిని త్రేన్చుకుంటూ వారు ఇళ్లకు బయలుదేరారు జనం.

జీసస్ శిష్యులతో పడవెక్కి దాల్మనాథాకు చేరుకున్నాడు. అక్కడ కొద్ది రోజులు గడిపారు. ఒకనాడు జీసస్ శిష్యులకు పరంజ్యోతి, ఆత్మతేజస్సు గురించి వివరించాడు.

"ఆత్మ సామ్రాజ్యమే క్రీస్తు సామ్రాజ్యం. విశ్వాసమే శక్తి. శాశ్వతత్వం అంటే చనిపోయిన వారి ఆత్మలు జీవించిఉన్న వారికి సహాయపడడం".

ఆ విషయం మరింత వివరంగా విశదీకరించాడు.

తర్వాత అందరూ పడవలో గలీలి ఉత్తర ప్రాంతానికి చేరారు. ఖొరాజిన్‌లో థామస్ బంధువులున్నారు. అందరు అక్కడకు చేరారు. తర్వాత మెరోమ్ చేరారు. అక్కడ కొంతకాలం ధ్యానంలో గడిపారు. అక్కడి నుండి బయలుదేరి సిజారియా ఫిలిప్పి చేరారు.

జీసస్ అన్నాడు. "ఇక్కడి వారికి మనం ఎవరమో తెలియదు. నా గురించి తెలియదు. వారి మనోభావాలు కనిపెట్టండి".

మాత్యూ ఊళ్లో తిరిగి వచ్చి చెప్పాడు "డేవిడ్ మీ రూపంలో అవతరించాడని చెప్పుకుంటున్నారు. వారు మీ గురించి విన్నారు. తమరే ఈనాక్ అని, సాల్మన్ అని, సెత్ అని రకరకాలుగా చెబుతున్నారు. కొందరైతే మీరు అచ్చం 'జెరెమియా' లాగా ఉన్నారనుకుంటున్నారు.

నథానియేల్ అన్నాడు : ప్రాక్ దేశాల నుండి వచ్చిన వారు మీలో గౌతమ బుద్ధుని చూస్తున్నారు. గౌతముడే తిరిగి జీసస్‌గా అవతరించలేదు గదా అనుకుంటున్నారు.

జేమ్స్ అన్నాడు: యూదు పెద్దలు మీరు ఎలిహు అవరావతారంగా నమ్ముతున్నారు.

జాన్ అన్నాడు : జెరూసలెంలో విన్నాను. అది ఒక 'రుషి' వాక్యం. 'మెలెహి జెవెక్' జీసస్ రూపంలో అవతరించాడట. రెండువేల సంవత్సరాలకు పూర్వం ఆయన శాంతి ప్రదాత మెల్చి జెపెన్. తాను రెండువేల సంవత్సరాల తర్వాత తిరిగి జన్మిస్తానని ఆయన అప్పుడే చెప్పాడుట.

థామస్ అన్నాడు : జాన్ ఆత్మ మీలో ప్రవేశించింది. జాన్ నాకు కలలో కనిపించి చెప్పాడు.

"ఇంతకీ నేను ఎవరని మీ అభిప్రాయం" జీసస్ ప్రశ్నించాడు.

పీటర్ అన్నాడు : మీరే పరమ పురుష. తమరే క్రీస్తు అవతారం. తమరు ప్రేమావతారులు.

జీసస్ : వాస్తవానికి అంతే. నీది దివ్యవాణి, నీది దివ్యసందేశం నీకు నాపట్ల అచంచల విశ్వాసం ఉంది పీటర్. రేపటి నిర్మాణానికి నీవు పునాది కావాలి. విశ్వాసానికి నీవు మారుపేరు. నీ విశ్వాసం పైన 'క్రీస్తు' భావ నిర్మాణం జరుగుతుంది. నా చేతి 'తాళంచెవి' నీ చేతికి అందిస్తున్నాను. మానవ రక్షణ భారం నీది. భగవంతుడు, నిన్ను మిగిలిన పదిమందిని నడిపిస్తాడు. జెరూసలెంలో

ఎలుగెత్తి దివ్యవాణి వినిపించండి. జ్ఞానం ప్రసారం చేయండి. అదే నేను మీ నుండి ఆశించే గురు దక్షిణ.

మరొక మాట : ఇప్పుడు మీరు చెప్పిన విషయాలు, విన్న సంగతులు ఎవరికీ చెప్పకండి. అవి మీకే పరిమితం.

తర్వాత జీసస్ బృందం 'సుసన్న' ఇంట కొంతకాలం ఉన్నారు.

**5** జీసస్ జనాదరణ రోజురోజుకు పెరుగుతోంది. ఎక్కడికి వెళ్లినా జనం తండోపతండాలుగా రాసాగారు. ఒకచోట ఇలా ప్రసంగించాడు : "మీ రంతా నా దర్శనానికి వచ్చారు. సంతోషం. నన్ను చూచినంత మాత్రాన మీకేమీ లాభం కలగదు. పూర్తి ఫలితం కలగాలంటే క్రీస్తును అవధరించండి. నా వెంట పడి తిరగనవసరం లేదు. మనస్సులో పరమాత్మ స్వరూపుడైన క్రీస్తును ధ్యానించండి. స్వార్థప్రయోజనాలకై ప్రార్థన చేయకండి. నష్టపోతారు. సాటి వారి కోసం మీరు పాటుపడండి. మీరూ ఉద్ధరించబడతారు. ఈ జీవితం ఎవరికైనా కొంతకాలమే. ఇది ఒక నీటిబుడగ లాంటిది. అంతంకాని జీవితం మరొకటి ఉంది. ఆత్మను వెదలిపెడితే కలిగే ప్రయోజనాలు ఏవీ ఉండవు. ఆత్మను బలిపెట్టి ఏమీ సాధించలేరు. జీవితంలో ఆత్మకున్న విలువ అనన్యం. భగవంతుని చేరుకునే మార్గం చాలా ఇరుకు. చిన్న ద్వారం గుండా లోపల ప్రవేశించాలి. ద్వారం పేరు క్రీస్తు. మార్గం పేరు ప్రేమ. తలవంచి ద్వారంలో ప్రవేశించాలి".

ఏడురోజుల పాటు జీసస్ బృందం సిజారియా ఫిలిప్పిలోనే గడిపారు. పీటర్, జేమ్స్, జాన్‌లను జీసస్ ఒక పర్వతం పైకి తీసుకువెళ్లాడు. అక్కడ నలుగురు చాలా తీవ్రంగా ధ్యానం చేశారు. వారి ఎదుట దివ్యతేజస్సు రూపం ధరించి నిలిచింది. దివ్యకాంతి నలుదిక్కుల ప్రసరించింది. రూపు దాల్చిన ఆ దివ్య పురుషుడు ధగధగ మెరిసిపోతున్నాడు. జీసస్ వెళ్లి ఆ మూర్తిలో కలిసిపోయాడు. జీసస్ రూపం కాంతిరూపంగా మార్పుచెందింది. మొదట కాంతిని దర్శించిన వెంటనే ముగ్గురు శిష్యులు స్పృహకోల్పోయారు. గాఢ సుషుప్తిలోకి జారిపోయారు. అలా ఎంతసేపు తన్మయంగా ఉన్నారో! అంతలో ఒక దివ్యపురుషుడు వారి కళ్లను స్పృశించి 'లేవండి లేచి ప్రభువు తేజస్సును వీక్షించండి' అని హెచ్చరించాడు. వారు కళ్లు తెరిచి దివ్యతేజస్సు దర్శించారు. అది స్వర్గలోకమా, పరలోకమా? జీసస్ దివ్యమూర్తికి ఇరువైపులా ఇద్దరు దివ్యపురుషులు నిలబడి ఉన్నట్లు అనుభూతి చెందారు.

తనను నిద్రలేపి చైతన్య పరచిన మహాత్ముని పీటర్ ప్రశ్నించాడు. "ప్రభువుకు అటు ఇటు ఉన్న వారెవరు మహాత్మా?"

ఆయన సమాధానం : వారు మోసెస్, ఎలిజాల ఆత్మశరీరాలు. భూమి, స్వర్గం ఒక్కలాగే ఉంటాయి. ఇక్కడి వారే అక్కడ తేజశ్శరీరాలతో ఉంటారు. భూలోకాన్ని పరలోకాన్ని వేరు పరచేది ఈథర్ తెర. వారికి 'మృత్యువు' అవరోధం కాదు. ఇక్కడ ఉండి పరాన్ని దర్శించగలరు. అక్కడ పరలోకంలో ఉంటూ భూ ప్రపంచాన్ని చూడవచ్చు. మృత్యువనేది ఒక భ్రాంతి.

శిష్యులు ముగ్గురు ఆశ్చర్యం నుండి తేరుకునే లోగా ముగ్గురి దివ్యశరీరాలు అదృశ్యమైనాయి. అశరీరవాణి వినిపించింది.

"ఇతనే మహాత్ముడు. 'క్రీస్తు' అవతరణ జరిగిపోయింది". ఆ మాటలు విన్న శిష్యులు ముగ్గురు స్పృహ కోల్పోయారు. జీసస్ వచ్చి వారిని స్పృశించగానే స్పృహలోకి వచ్చారు. జీసస్ అన్నాడు : "భయపడకండి. నేను మీతోనే ఉన్నాను".

వాళ్లు కళ్లు తెరిచి చుట్టూ చూచారు. ఇందాక దర్శన మిచ్చిన మహాత్ములు లేరు. వారి దివ్యశరీరాలు లేవు. అనుభూతి మాత్రం మిగిలింది. జీసస్ వెన్నంటి ముగ్గురు కొండ దిగి వచ్చారు. మధ్యలో తాము చూచిన దృశ్యం అర్థం ఏమిటని జీసస్‌ను ప్రశ్నించారు.

"ఎవరికీ ఈ సంఘటన గురించి చెప్పకండి. నేను మృత్యువును జయించే వరకు దీనిని రహస్యంగా ఉంచండి".

(6) జీసస్ తన ప్రియశిష్యులు పీటర్, జేమ్స్, జాన్‌లతో కొండపైకి వెళ్లగా, మిగిలిన తొమ్మిదిమంది పట్టణంలో ప్రవేశించారు. వారు ఒక పిల్లవానికి చికిత్స చేశారు కాని రోగం తగ్గలేదు. గురువు 'తగ్గింది పో' అంటే తగ్గిపోతుంది. మనం ఎంత శ్రమపడినా తగ్గలేదని, దిగులుపడి, జీసస్ రాకకోసం ఎదురుచూడసాగారు. జీసస్ కొండదిగి రాగానే పిల్లవాని తండ్రివచ్చి లబోదిబో మన్నాడు. తన బిడ్డను రక్షించమని ప్రాధేయపడ్డాడు.

జీసస్ ప్రశ్నించాడు : ఎంత కాలంగా ఉంది ఈ జబ్బు?

కుర్రవాని తండ్రి : చిన్నతనం నుండి వుంది స్వామీ. చాలాచోట్ల చికిత్స చేయించాం. తగ్గలేదు. ఆ కుర్రవాడే మాకు గతి.

జీసస్ చేయి తాకగానే ఆ కుర్రవాడు లేచి కూర్చున్నాడు.

తొమ్మిది మంది శిష్యుల పక్షాన ఒకరు అడిగారు. "ప్రభూ! మీరు చెప్పిన మంత్రమే మేమూ ప్రయోగించాం. మేం చేస్తే ఎందుకు తగ్గలేదు. మాకా శక్తి లేదా? ఉన్నది పోయిందా?"

జీసస్ : లోగడ మీరు ఎందరికో చికిత్సలు చేశారు కదా! అందరికీ బాగైంది. దాంతో మీకు గర్వం, అహంకారం తలకెక్కాయి. మీలో పూర్వం ఉన్న శ్రద్ధ ఇప్పుడు లేదు. 'శక్తి' అన్నారు అది భగవంతుని కరుణ గానీ, మీ స్వంత శక్తి కాదు. మీ 'స్వశక్తి' అనుకున్నారు కనుక మంత్రం పనిచేయలేదు. ఆత్మవిశ్వాసం ముఖ్యం. ప్రార్ధనకు శ్రద్ధ, విశ్వాసం అనేవి రెండు రెక్కలు. అవి ఉంటే ప్రార్థనా బలంతో కొండలను కూడా కదిలించవచ్చు. ఈ వైఫల్యం మంచిదే. గుణపారం నేర్పుతుంది. వైఫల్యాలు అన్నీ అపజయాలు కావు".

అందరూ ధ్యానానికి కూర్చోగానే జీసస్ చెప్పాడు, "నేనిప్పుడు చెప్పిన విషయంపైన మనసు లగ్నం చేయండి. అదే ధారణ అవుతుంది. వాస్తవం మీకే తెలుస్తుంది. ఇకపైన మీ బరువు, బాధ్యతలు మీవే అని గుర్తుంచుకోండి".

**7** జీసస్ విడిది చేసిన ఇంటికి. పన్నులు వసూలు చేసే ఉద్యోగి ఒకరు వచ్చారు:

"జీసస్, మీరు రుసుం చెల్లించాలి" అన్నాడు.

పీటర్ 'రుసుం' చెల్లించడానికి సిద్ధమైనాడు. జీసస్ వారించి

"ఎవరు పన్నుకట్టాలి, ఎవరికి చెల్లించాలి. స్థానికులా పరదేశులా?"

పీటర్ అన్నాడు : "బయటి నుండి వచ్చిన వారు రుసుం చెల్లించాలి".

జీసస్ : "మనం స్థానికులం. ఈ దేశం మనది ... మన దేశంలో మనం పన్ను కట్టడం ఏమిటి?"

కట్టి తీరాలని ఉద్యోగి పట్టుబట్టాడు. జీసస్ పీటర్‌తో అన్నాడు సముద్ర తీరానికి వెళ్లి వలవెయ్యి. ఒకచేప పడుతుంది వలలో. ఆ చేప పొట్టలో ఒక వెండి నాణెం ఉంటుంది. అది తీసి చెల్లించు.

జీసస్ చెప్పినట్లే పీటర్ చేసి, తిరిగి వచ్చాడు.

తమలో ఎవరు గొప్ప, ఎవరు ముఖ్యులు అని పన్నెండు మంది శిష్యులు మల్లగుల్లాలు పడసాగారు. వారెవరికి ప్రాపంచిక వాసనలు తగ్గలేదని, కీర్తి ప్రతిష్ఠల యావ తగ్గలేదని జీసస్ గ్రహించాడు. వారితో అన్నాడు. "ఎవరు గొప్ప వాడంటే ఇతరులకు సేవచేసేవాడు".

ఒక పసిపిల్లవాడిని దగ్గరగా పిలిచి, "ఈ పసివాడు గొప్ప. మీరు గొప్ప వారు కావాలంటే ఈ పసిపిల్ల వాడంతటి అమాయకులు కావాలి. మీ అహాన్ని చంపుకోవాలి. కీర్తి వ్యామోహం ఉండకూడదు. అమాయకత్వం, సత్యసంధత, సౌశీల్యం అలవడాలి. అవి సహజభూషలు కావాలి. గొప్పవారెవరూ చిన్నవారిని

చులకనగా చూడరు? మీరు భగవంతుని అనుగ్రహం పొందాలంటే ఈ పసివాడి వలె అమాయకులు కండి. వినయం పాటించండి. అణుకువ అలవరచుకోండి".

"మరొక విషయం : ఒకరికి చెడు జరగాలని కోరుకునే వారు తాము చెడిపోతారు. ఎక్కడ చూచినా చెడు కనిపిస్తుంది. మనుషుల్లో చెడుగుణాలు కనిపిస్తాయి. మంచిని వెతకండి, మంచిని చూడండి".

**8** వీధుల్లో జనసంచారం ఎక్కువగా ఉంది. అధికారులు ఒకరిని న్యాయ స్థానానికి తీసుకుపోతున్నారు. అతను చేసిన మహాపాపం ఒక రొట్టెను దొంగలించడం. మరికొంతసేపటికి అతనిని న్యాయస్థానంలో హాజరు పరిచారు. అతను బక్క చిక్కిఉన్నాడు. ఆకలితో నకనకలాడుతున్నాడు. అతనిపై అభియోగం మోపిన స్త్రీ గొప్పింటి మహిళ, సంపన్నురాలు. ఆమె న్యాయమూర్తి ఎదుట నిలబడి చెప్పింది.

"నేను స్వయంగా దొంగను పట్టుకున్నాను. మొన్న ముష్టికోసం వచ్చాడు లేదు పొమ్మన్నాను. నిన్న మళ్లీ వచ్చాడు. లేదు పొమ్మన్నాను. ఈ రోజు దొంగతనం చేసి పట్టుబడ్డాడు ఇరుగుపొరుగు వారు అతను దొంగతనం చేసినట్లు సాక్ష్యం చెప్పారు. న్యాయస్థానం అతన్ని 'దొంగ'గా తీర్మానించింది".

"ఆగండి! అతను తను దొంగతనం చేసినట్లు అంగీకరించలేదు. ఏకపక్ష నిర్ణయం న్యాయం అనిపించుకోదు". జీసస్ అన్నాడు.

న్యాయమూర్తి దొంగను ప్రశ్నించాడు. అతను ఏడుస్తూ చెప్పాడు: "నా భార్య, పిల్లలు ఆకలితో అలమటించిపోతున్నారు. ఎంతమందిని అర్థించినా పని ఇవ్వలేదు. ఎవరూ సహాయం చేయలేదు కాస్త రొట్టె ధర్మం చేయమని అడిగాను. ఈ అమ్మ నాచేతిలో రొట్టె లాక్కుని కుక్కలకు వేసింది. నన్ను పట్టిచ్చింది దొంగనని".

జీసస్ ప్రశ్నించాడు : "ఇప్పుడు చెప్పండి నేరం ఎవరిది?"

న్యాయస్థానం అతనిని నిర్దోషి అని విడిచిపెట్టింది.

జీసస్ అన్నాడు : "ఈపేదవానికి రొట్టెఇవ్వడం న్యాయం, పని చూపించడం న్యాయం. అతని భార్యాబిడ్డల్ని బ్రతకనివ్వడం న్యాయం. ఒక నేరానికి ఒకే రకం శిక్ష ఉండదు. కారణాలు తెలుసుకోవాలి, వాస్తవాలు గ్రహించాలి. న్యాయమూర్తికి హృదయం కూడా ఉండాలి".

**9** పెద్ద పండుగ దగ్గర పడుతోంది. పన్నెండు మంది శిష్యులు జెరూసలెం చేరుకున్నారు. జీసస్ కోపర్నంలో ఆగిపోయాడు. మిగిలిన భక్తులలో 70 మందిని ఎన్నికచేసి జీసస్ బోధ చేశాడు. వారెవరూ యూదుజాతివారు కారు.

"క్రీస్తు యూదులకే పరిమితం కాదు. ప్రతి ఒక్కరికీ క్రీస్తు తత్వం తెలుసుకునే వీలున్నది. క్రీస్తు అంటే ఒక వ్యక్తి కాదు. ఒక భావన. లోగడ పన్నెండు మందిని ఎన్నుకున్నాను. వారు యూదులకు బోధిస్తారు. వారంతా యూదులు. పన్నెండు యూదుల సంఖ్య. మిగిలిన వారంతా ఏడు క్రిందికి వస్తారు. భగవంతుని సంఖ్య పది. అది చిత్రమైన సంఖ్య. మనిషి సంఖ్య 7ను భగవంతుని సంఖ్య 10తో గుణిస్తే 70 అవుతుంది. అది భ్రాతృత్వ చిహ్నం. మీరు ఇద్దరిద్దరు జతకట్టి వెళ్లండి. ప్రపంచదేశాలన్నీ మీవి. గ్రీసు, అస్సీరియా, సమరియ. ఇలా సప్త సముద్రాలు దాటి వెళ్లండి. మరీ దూర దేశాలకు వెళ్లనవసరం లేదు. సమరిటన్‌లో అన్నిదేశాల వారు అన్ని జాతులవారు ఉంటారు. ఆత్మవిశ్వాసంతో పనిచేయండి. మీ వెంట డబ్బు, బంగారం, వెండీ తీసుకువెళ్లవద్దు. విశ్వాసం ఒక్కటి ఉంటే చాలు. అందరి మంచిని కాంక్షించండి. 'శాంతి' మీ పరమలక్ష్యం. శాంతి కోరేవారు ఎక్కడకు వెళ్లినా ఆదరణ లభిస్తుంది".

70 మంది ఇద్దరిద్దరుగా బయలుదేరి గ్రామాలు దాటుకుంటూ సుడాన్ చేరారు. కొందరు గ్రీసు, మరికొందరు గలీలి వెళ్లారు. జీసస్ ఒంటరిగా సమరియా మార్గం గుండా జెరూసలెం చేరుకున్నాడు. అప్పటికే జీసస్‌పైన అభియోగా లున్నాయి. ఆలయంలోకి రాగానే బంధించాలని పూజారుల పన్నాగం.

జీసస్ అన్నాడు : "నేను ఉండేది ఇంక కొద్ది రోజులు. నా పని పూర్తి కాగానే వెళ్లిపోతాను. తర్వాత మీరు కావాలన్నా నన్ను చూడలేరు. నేను వెళ్లే చోటుకు మీరు రాలేరు".

**(10)** ఉత్సవం చివరి రోజున జీసస్ ఆలయానికి మెరుపులా వచ్చి పిడుగులు కురిపించాడు. అర్చకస్వాముల ఆగ్రహం ఆయనకు బాగా తెలుసు. వారు పన్నిన కుట్ర గురించి తెలుసు. చాలా కోపంగా, అసహనంగా ఉన్నాడు. "మీలో నిజమైన ఆస్తికులుంటే, దయచేసి ముందుకు రండి. వచ్చి అమృతం సేవించండి. క్రీస్తును విశ్వసించేవారికి నేను అమృతం పంచిపెడుతున్నాను. ఆ అమృతం మీకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది. క్రీస్తు భావనతో మీరు బ్రతికినా చాలు".

ఆ మాటలకు జనంలో కలకలం బయలుదేరింది. రకరకాలుగా వ్యాఖ్యానించసాగారు. 'ఈయన ప్రవక్త' అన్నారు. 'ఈయన మెస్సయ్య' అన్నారు. 'అబ్బే ఏమీ కాదు. ఇతను గలీలి నుండి వచ్చాడు, మాకు తెలుసు' అన్నారు. "క్రీస్తు అంటే డేవిడ్ వారసుడు కదా. బెత్లహాం నుండి రావాలి కదా" అనుకున్నారు.

అర్చకులు, మతపెద్దలు, అధికారులు కూడబలుక్కుని అతనిని బంధించి తెమ్మని సైనికుల్ని పంపారు. వారు వెళ్లి రిక్త హస్తాలతో తిరిగి వచ్చారు.

"ఎందుకు బంధించి తీసుకురాలేదు?" అని ఆక్రోశించారు.

"జీసస్ చెప్పేమాటలు మంచిగా ఉన్నాయి ఎందుకు బంధించడం?"

"మీకు పిచ్చి పట్టింది. మీకు క్రీస్తు దయ్యం పట్టింది" అని తిట్టారు.

నికోడెమస్ అన్నాడు, "యూదు న్యాయస్థానం జీసస్‌ను శిక్షించ వీలులేదు. అతనిపైన అభియోగాలే గాని, నిరూపణలు లేవు. జీసస్ వాదన వినకుండా ఎలా శిక్షిస్తారు"?

"జీసస్ మోసగాడు. అతనికి మాట్లాడే అవకాశం ఇస్తే మనల్ని భ్రష్టు పట్టిస్తాడు. నోరెత్తనీయడు ఎవరిని".

అధికారులు మాట్లాడలేదు. జనం వెళ్లిపోయారు. జీసస్ ఒంటరిగా ఆలివ్స్ పర్వతాలపైకి ధ్యానానికి వెళ్లిపోయాడు. తెల్లవారక ముందే తిరిగి ఆలయ ప్రాంగణంలో ప్రత్యక్షమైనాడు. ఎలాగైనా అతనిపై నేరం మోపాలని అర్చకులు పట్టుదలగా ఉన్నారు.

ఒక కులటను తెచ్చి జనం మధ్య కూర్చోబెట్టారు.

మధ్యలో లేచి జీసస్‌ను ప్రశ్నించారు : ఈమె కులట, వ్యభిచారం చేస్తుంది. వ్యభిచారం చేసిన వారిని రాళ్లతో కొట్టి చంపాలన్నది న్యాయం. ఈమెకు నీవు ఎలాంటి శిక్ష వేస్తావు?

జీసస్ అన్నాడు : పాపం చేయని వారెవరు? మీలో ఎవరైనా పాపం చేయని వారుంటే ముందుకి రండి, వచ్చి ఆమెపైన రాళ్లు రువ్వండి.

ఒక్కరూ వచ్చి ఆమెను రాళ్లతో కొట్టలేదు. జీసస్ కళ్లు తెరచి చూచేసరికి ఆమె ఒక్కతే ఉంది. అందరూ వెళ్లి పోయారు. తప్పుడు జీవితం జీవించవద్దని మందలించి జీసస్ ఆమెను పంపివేశాడు.

**11** పండుగ సంబరాలు ముగిశాయి. జీసస్ వెంట పీటర్స్, జేమ్స్, జాన్‌లు మాత్రం ఉన్నారు. మిగత శిష్యులు కోపర్నం వెళ్లిపోయారు. జీసస్ ఆలయ ప్రాంగణంలో ఒకచోట ఉండగా జనం పోగైనారు. జీసస్ వారికి చెప్పాడు. "నేను దీపాన్ని మాత్రమే. ఈ దీపాన్ని వెలిగించే చమురు క్రీస్తు. అంటే విశ్వ ప్రాణ వెలుగు ముఖ్యం. నన్ను అనుసరించే వారెవరూ చీకటి అనే అజ్ఞానంలో ఉండరు. ప్రతి ఒక్కరిలో జ్యోతి ప్రకాశిస్తుంది".

ఒక న్యాయవాది ప్రశ్నించాడు. "నీకు నీవుగా గొప్పలు చెప్పుకుంటున్నావు. నీవు పెద్ద సత్యవంతుడివన్న ఆధారాలు ఏవి? నీ మాటలు ఎలా నమ్మాలి? ఎందుకు నమ్మాలి?"

జీసస్ అన్నాడు : అవును నాకు నేనే సత్యం. నేను చెప్పేది నిజం. సత్యానికి నిరూపణలు, ఆధారాలు అవసరం లేదు. నేను ఇక్కడికి వచ్చింది, ఎక్కడికి వెళ్లేది నాకు మాత్రమే తెలిసిన రహస్యం. మరొకరి ఆమోదం అవసరం లేదు. నా మాటలు, నా చేష్టలు నిదర్శనలు. అవి నా మాటలు కావు. పరమ సత్యాలు. భగవంతుడే వాటికి సాక్షి.

న్యాయవాది : నా తండ్రి, నా తండ్రి అంటావు. ఎవరా తండ్రి? ఎక్కడ ఉంటాడు?

జీసస్ : నేనెవరో తెలుసుకోలేని మీరు నా తండ్రినెలా గుర్తిస్తారు. తండ్రి ఎవరో తెలిస్తే కుమారుని గుర్తించగలరు. నిజానికి తండ్రీ తనయులు ఇరువురూ ఒక్కరే. నా త్రోవన నేను పోతాను. నీవు నన్ను తెలుసుకోలేవు. నా బాట నీకు తెలియదు. నేను ఎక్కడకు వెళ్లిందీ అసలు తెలియదు. మీ చెవులకు దివ్యవాణి వినిపించదు. మీరు దివ్యత్వాన్ని చూడలేరు. మీ హృదయాలలో వెలుగు ప్రసరించదు. నేను పోయిన తర్వాత నా కోసం వెతుకుతారు. నేనెవరో, ఏమిటో అప్పుడు గుర్తిస్తారు.

ఒక ఫారిసీ లేచి అరిచాడు "అతను ద్రోహి, నయవంచకుడు. అతని మాటలు నమ్మకండి".

న్యాయవాది అన్నాడు. "అతనికి దయ్యం పట్టింది. అవి ప్రేలాపనలు".

అర్చక బృందం అతనిపై రాళ్లు రువ్వడానికి ప్రయత్నించగా జీసస్ అదృశ్యమైనాడు.

మరొకనాడు జీసస్ ప్రసంగం వినడానికి ఒక న్యాయకోవిదుడు వచ్చాడు. జీసస్ మాటల్లో చట్ట వ్యతిరేకభావాలు కనిపిస్తే, అతనిపై అభియోగం చేయాలని ప్రయత్నం.

న్యాయవాది అడిగాడు : జీసస్! నాకు శాశ్వతత్వం కలగాలంటే ఏం చేయాలి?

జీసస్ : మీకు న్యాయం తెలుసు. చట్టం ఏం చెబుతుంది?

న్యాయవాది : హృదయ పూర్వకంగా భగవంతుని ధ్యానించాలి. ఆత్మ

నిండుగా భగవద్భావన నింపుకోవాలి. శక్తియుక్తులు, సాధన అన్నీ భగవంతుని పరం చేయాలి. ఇరుగుపొరుగు వారిని ప్రేమించాలి.

జీసస్ : చక్కగా సెలవిచ్చారు. అలా జీవించగలిగితే సంపూర్ణంగా జీవించినట్లే.

లాయర్ : ఇరుగు పొరుగంటే ఎవరు?

జీసస్ : ఒకాయన జెరూసలెం నుండి జెరికో వెడుతున్నాడు. త్రోవలో దొంగలు అతన్ని దోచుకున్నారు. రక్తం కారుతుండగా అతను దారిప్రక్కన పడి ఉన్నాడు. ఒక ఫారిసీ ఆ దారంట పోతున్నాడు. దొంగలబారిన పడిన వానిని చూచాడు. ఆక్షతగాత్రుని పరామర్శించే తీరికలేదని వెళ్లిపోయాడు. ఒక న్యాయవాది అటుగా పోతూ అతనిని చూచి అనుకున్నాడు. ఇతనికి సాయం చేస్తే నాకేం లాభం. వీడి దగ్గర డబ్బు లేదు నాకు ఫీజు ఇవ్వడానికి. ఇలా ఉచిత సేవలు చేస్తూపోతే నేనేం కావాలి, తర్వాత కొంతసేపటికి సమారియా నుండి ఒక వ్యక్తి వచ్చాడు. అతని బాధ చూచి తాను బాధపడ్డాడు. గుర్రం దిగి అతనికి సేవచేశాడు. తన దగ్గరున్న డబ్బు దారిఖర్చుల కిచ్చి అన్నాడు. "నాయనా! నీకు ఇంతకన్న సహాయం చేసే స్థితిలో లేను. ఈ డబ్బు నీవు తిరిగి నాకు ఇవ్వనవసరంలేదు. మరో అభాగ్యుడికి అవసరం వచ్చినప్పుడు సాయపడు చాలు" అని వెళ్లిపోయాడు. తమరు న్యాయం తెలిసనవారు. వీరిలో ఎవరి కెవరు అయినవారు? ఎవరు పొరుగువారు?

న్యాయవాది : అతని స్థితికి జాలిపడి సహాయం చేసిన వ్యక్తి ఆప్తుడు.

జీసస్ : మీరు అలా ఆపదలో, కష్టంలో ఉన్నవారిని కనికరించండి.

**(12)** వివిధ ప్రాంతాలకు ప్రచార నిమిత్తం వెళ్లిన శిష్యులు రావలసిన గడువు సమీపిస్తోంది. జీసస్, ముగ్గురు శిష్యులతో గలీలి చేరుకున్నాడు. సమరియా వరకు ఉన్న గ్రామాలలో ప్రసంగించాడు. దారి పొడవునా జనం జీసస్ దర్శనానికి రాసాగారు. కొన్ని తావుల స్వస్థత సభలు నిర్వహించాడు. వారు కోపర్నం చేరే సరికి, వివిధ ప్రాంతాలకు వెళ్లిన డెబ్బయి మంది శిష్యగణం తిరిగి వచ్చారు.

జీసస్ శిష్యులతో అన్నాడు : మనం గలీలి తీరప్రాంతాలకు వెళ్లి ప్రజలకు కృతజ్ఞతలు చెప్పాలి.

అంతలో ఒక రోగిని తీసుకువచ్చారు. ఆమె 18సంవత్సరాలుగా మంచం పట్టి ఉంది. జీసస్ ఆమె వైపు చేయి చాచి "అమ్మా - లే. నిన్ను ఆవహించిన క్షుద్రశక్తులు నిన్ను వదలి వెళ్లిపోయాయి ... లే ..."

ఆమె లేచి కూర్చుంది. వెంటనే నడచి వెళ్లగలిగింది.

అది గమనించిన ఒక దేవాలయ పూజారికి కన్నుకుట్టింది. ఆమెకు తాను చాలాసార్లు చికిత్స చేశాడు. జీసస్‌ను ఆయన ముఖాముఖి చూచింది లేదు వినడం తప్ప. అతను కోపంతో అరిచాడు.

గలీలి తీరప్రాంతంలో వెళుతుండగా, ఒకరు అడిగారు "మహాత్మా, దివ్య జీవనంతో ఎవరైనా రాణించగలరా?"

జీసస్ : దివ్య జీవనం అన్నది కీర్తి ప్రతిష్టలకూ, రాణించడానికి రాజ మార్గం కాదు. ఆ బాట చాలా ఇరుకు. పూర్ణ విశ్వాసం కలవారికే ఆ మార్గం కనిపిస్తుంది. చాలామంది ప్రయోజనాలు ఆశిస్తారు. వారి కోసం దివ్యధామం తలుపులు తెరుచుకోవు. లోపల ఉన్నవారు ఏమంటారో తెలుసా 'నీవు ఎవరవో మాకు తెలియదు. నీ బట్టలపైన పాపం మరక లున్నాయి. వెళ్లిపో నీకు స్వర్గంలో ప్రవేశం లేదు' "అని. వారు ఏడుస్తూ వెనుతిరిగి పోతుంటారు".

అంతలో ఒక ఫారిసీ కంగారుగా పరిగెత్తుకువచ్చి జీసస్‌తో చెప్పాడు.

"ప్రాణాలపైన ఏ మాత్రం ఆశవున్నా వెంటనే పారిపోండి. హీరోద్ నిన్ను చంపాలని చూస్తున్నాడు. అతని మనుషులు మీ కోసం వస్తున్నారు".

జీసస్ : మీకు నా ప్రాణం పైన ఇంత దయ కలిగిందా! వెళ్లి ఆ గుంట నక్కగాడితో చెప్పండి. నేను ఎక్కడికీ పారిపోను. జెరూసలెంలోనే ఉంటాను.

**(13)** జీసస్ బృందం మరొక పట్టణం చేరుకున్నారు. అక్కడి ప్రజల నుద్దేశించి శాంతి, శ్రేయస్సుపై ప్రసంగించాడు. అక్కడ జనాలకు అవి అర్థం కాని పదాలు. అర్థం లేని మాటలు. రాక్షసంగా, అనాగరికంగా జీవించడం వారి అలవాటు. పరస్పర స్పర్థలు, కార్పణ్యాలు హెచ్చు. వారికి జీసస్ మాటలు చిత్రంగా ఉన్నాయి.

"మీరంతా స్వార్థంతో బ్రతుకుతున్నారు. నన్ను అనుసరించాలంటే ప్రేమించడం నేర్చుకోవాలి. భగవంతునిపై విశ్వాసం పెంచుకోవాలి. ఎవరికీ అపకారం చేయకూడదు. అందర్నీ ప్రేమించాలి. అందరితో మంచిగా ఉండాలి. మీ పాత పద్ధతులు మార్చుకోవాలి. స్వచ్ఛంగా,పవిత్రంగా జీవించడం నేర్చుకోండి. మోసం పనికిరాదు".

అంతలో ఒక యువకుడు వచ్చి జీసస్ కాళ్లకు నమస్కరించి –

"ప్రభూ! నాకు చిరజీవనం ప్రసాదించండి. ఏంచేయమన్నా చేస్తాను" అన్నాడు.

జీసస్ అతన్ని లేవనెత్తి అన్నాడు : "నన్ను 'ప్రభూ' అని సంబోధించావు. అది తప్పు. అందరికీ ప్రభువు భగవంతు డొక్కడే. దివ్యజీవన సూత్రాలు అనుసరించడం ఒక్కటే మార్గం".

"ఏమిటి మహాత్మా ఆ సూత్రాలు?"

"ఎవరినీ హింసించకూడదు. దొంగతనం చేయకూడదు. నీతిగా జీవించాలి. ఎవరినీ అవమానించకూడదు. అబద్ధాలాడకూడదు. భగవంతుని హృదయ పూర్వకంగా ప్రేమించాలి. సేవించాలి".

"అయ్యా, ఈ సూత్రాలు నేను పాటిస్తూనే ఉన్నాను".

"కాని ఒక్కటి చేయడం లేదు. భౌతిక విషయాలపైన వ్యామోహం తగ్గించు కోలేదు. వాటి నుండి విముక్తి పొందు".

ఆ యువకుడు కంగారు పడ్డాడు. తాను ధనవంతుడు, లేమిలో బ్రతకడం ఎలా? తల వంచకున్నాడు.

"మనిషి ధనరాశులు, సంపదలు స్వర్గానికి ప్రవేశార్హతలు కావు. డబ్బు కలవారు, సుఖభోగాలు మరిగినవారు భగవంతుని మరచిపోతారు".

"అయితే మార్గాంతరం లేదా గురూజీ".

"ఉంది. వ్యామోహం లేకుండా బ్రతకవచ్చు. ముందుగా మనస్సును శూన్యం చేసుకుంటే, కోరికలు ఆశూన్యంతో అంతరించిపోతాయి".

**(14)** ఒకనాడు జీసస్‌ను ఒక శ్రోత ప్రశ్నించాడు.

"మనిషి చేసే మంచి పనులకు బహుమతులు లభిస్తాయి. మనం మంచిగా బ్రతికితే భగవంతుడు బహుమానం ఇస్తాడా?"

జీసస్ : కష్టానికి ప్రతిఫలం దక్కడం వేరు. బహుమానాలు రావడం వేరు. ఇతరులు చేసేది మనకు తెలియదు. ఒకతను చేసిన పనిని పదిమంది మెచ్చుకుంటారు. అధ్యాత్మికరంగంలో ఫలితాలు వెంటనే కనిపించవు. అసలు ఎవరూ గుర్తించకపోవచ్చు. ఒక మనిషి మరో మనిషి మంచితనం గ్రహించడం కష్టం. ఎందరు అభిమానించి, పూజించినా ఆ వ్యక్తి మరణంతో అన్నీ మరుగున పడతాయి.

అంతలో ఒక ఫారసీ ప్రశ్నించాడు, "మహాత్మా, భార్యను వదిలి పెట్టడం న్యాయమేనా?"

జీసస్ : చట్టం మీది – న్యాయం నాది.

పారసీ : చట్టం ప్రకారం మగాడు విడాకులు ఇవ్వవచ్చు.

జీసస్ : అది మగవాడి అహంకారం. చట్టాలు చేసింది మగవారు. అమలు పరుస్తున్నది మగవారే. భగవంతుడు ఆడవారిని, మగవారిని సమంగా సృష్టించాడు. మగవాడు తల్లిని, తండ్రిని వదిలి వేసినట్లయితే భార్యను వదిలిపెట్టవచ్చు. బాంధవ్యాలు ఎవరి విషయంలోనైనా బాంధవ్యాలే. భగవంతుడు కలిపిన వారిని చట్టం విడదీయ కూడదు. భార్య వ్యభిచారి అయితే విడిచిపెట్టవచ్చు. మరొకర్ని చేసుకోవడమూ వ్యభిచారమే. అలాగే భర్తను వదలి మరొక పురుషుడితో తిరిగే ఆడది వ్యభిచారం చేసినట్లే.

థామస్ : అసలు వ్యభిచారం అంటే ఏమిటి స్వామీ!

జీసస్ : వ్యసనాలకు బానిసై, చేసుకున్న వారితో కాక, ఇతరులతో సంబంధాలు పెట్టుకోవడం ... రెండు హృదయాలను చట్టం కలపలేదు. ఇద్దరు స్త్రీ పురుషులు ప్రేమతో ఏకమైనపుడు వారి మధ్య 'కామం' ప్రధానం కాదు. కామవాంఛ అధికంగా కలవారు వ్యభిచరిస్తారు.

ఫిలిప్స్ : పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతుంటాయంటారు నిజమా?

జీసస్ : భగవంతుడు పవిత్రహృదయుల్ని మాత్రమే గుర్తిస్తాడు. వ్యసన పరుల్ని పట్టించుకోడు. కనుక అన్ని జంటల్ని దేవుడు స్వర్గంలో కుదిర్చి పెట్టాడను కోరాదు.

నతానియెల్ : అసలు పెళ్లి చేసుకోకపోతే ఏ గొడవ ఉండదు కదా?

జీసస్ : పెళ్లి మానేసినంత మాత్రాన ఎవరూ పుణ్యపురుషులు అవరు. కామవాంఛ లేకుండా పోవాలి. ఆపైన దైవచింతన ఏర్పడాలి. భార్య ఉన్నా లేకపోయినా స్త్రీ వ్యామోహం మంచిదికాదు. కొందరు చదివి తెలుసుకుంటారు. కొందరు విని జ్ఞానం పొందుతారు. రెండింటికన్న ఆత్మచైతన్యం గొప్పది.

**(15)** గలిలీ పల్లెలు, పట్టణాలు దాటి జీసస్ బృందం టిబెరియస్ చేరుకున్నారు. అక్కడ 'క్రీస్తు' అభిమానులున్నారు. జీసస్ అక్కడివారికి 'అంతరంగ జీవితం' గురించి బోధించాడు. ఉదాహరణగా ఒక కథ చెప్పాడు.

"ఒక ఊరిలో ఒక గొప్ప ధనవంతుడుండేవాడు. అతనికి ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు తండ్రితో అన్నాడు, 'నా వాటా నాకు పంచి ఇవ్వండి. పై దేశాలకు పోయి వ్యాపారం చేసుకుంటాను. బాగా సంపాదించాలని నాకోరిక'. సరేనని

తండ్రి ఆస్తి పంచాడు. చిన్న కొడుకు వెళ్లిపోయి, విచ్చలవిడిగా, జల్సాగా డబ్బు ఖర్చుచేశాడు. శృంగారంలో మునిగితేలాడు. తాగుడు, వ్యభిచారం. ఇలా అతని వ్యసనాలకు మితం లేదు. చివరకు తినడానికి తిండిలేని పరిస్థితి వచ్చింది. కొన్ని సంవత్సరాలకు అన్నీ పోగొట్టుకుని కట్టుబట్టలతో కొంపకు చేరాడు. 'నాన్న దగ్గర డబ్బు ఉంది. పొలాలున్నాయి. చాలామంది పని వాళ్లుంటారు. నాన్న ఒక పనివాడిగా తీసుకున్నచాలు అని వెళ్లి అర్థించాడు.

'నాన్నగారూ! నన్ను మీ కొడుకుగా చూడవద్దు. ఒక పనివాడిగా మన్నించి పని ఇవ్వండి. కూలీ డబ్బుతో బ్రతుకుతాను. నేను తప్పులు చేశాను. క్షమించమని అడగను. నా పాపఫలం నేనే అనుభవిస్తాను'.

తలిదండ్రులు కొడుకును ప్రేమగా ఆదరించారు. అతని గతాన్ని అడగలేదు. అతనికి గత జీవితం గుర్తుచేయలేదు.

జీసస్ అన్నాడు. 'హృదయాన్ని మించిన న్యాయం లేదు'.

**16** ఒకనాడు కొందరు హీబ్రూ పెద్దమనుషులు వచ్చి జీసస్‌ను ప్రశ్నించారు: "మహాశయా! మీరు దేవుని రాజ్యం దగ్గరలో ఉన్నట్లు చెబుతున్నారు ... మాకూ తెలుసు భగవంతుని సామ్రాజ్యం ఒకటి ఉందని. అది స్వర్గం కావచ్చు. పరలోకం ఏదైనా కావచ్చు. మీరు చెప్పే దేవుని రాజ్యం ఎక్కడ ఉంది?"

జీసస్ : పూర్వకాలంలో మహర్షులు చెప్పారు. స్వర్గం గురించి, పరం గురించి. ఆ దివ్యధామం భగవంతుని చిరునామా. అది మనకు చేరువగానే ఉంటుంది. కానీ కనిపించదు. ఈ కళ్లతో దానిని చూడలేము. అది బయట ఎక్కడో లేదు, మన హృదయం లోపల ఉన్నదని నేను పదేపదే చెబుతుంటాను. హృదయం పవిత్రంగా ఉన్న వారికి మాత్రమే ప్రభువు దర్శనం కలుగుతుంది. ప్రభువును 'ఆత్మ'తో అనుభూతించాలి. పవిత్ర హృదయం కలవారంతా భగవంతునికి ఆత్మీయులు, సన్నిహితులు. ఒకటి గుర్తుంచుకోండి. గతించిన రోజులు తిరిగిరావు. చరిత్ర పునరావృతం కాదు.

ఒక న్యాయమూర్తి ఉండేవాడు. ఆయనకు దేవుడంటే భయం, భక్తి లేవు. సాటిమనుషుల పట్ల సానుభూతి, ప్రేమ ఉండేవి కావు. ఒక ముసలామె ఎప్పుడు తన తప్పుల్ని క్షమించమని ఆ న్యాయమూర్తిని సతాయిస్తుండేది. ఆమె రోజూ తనకు ఇష్టం లేని వారిని తిట్టిపోస్తూ, వేధిస్తుంది. సాయంత్రానికి వచ్చి క్షమించమని అడుగుతుంది. మొదట న్యాయమూర్తికి ఆమె చెప్పే మాటలు అర్థం అయ్యేవి కావు. తర్వాత పట్టించుకోవడం మానేశాడు. చివరకు ఒకనాడు ఆమెతో అన్నాడు:

"అమ్మా నాకు దేవుడంటే భయం లేదు, భక్తి లేదు, మనుషులన్నా భయపడను. కాని నిన్ను చూస్తే మాత్రం భయం, దడ, వణుకు పుడుతుంది".

"ఈ కథ మాకెందుకు చెప్పినట్లు?" శిష్యులు అడిగారు.

"బుద్ధి ఉన్నవాడు, మంచి మాటలు వింటాడు.

బుద్ధి లేనివాడు ఏం వినీ ప్రయోజనం లేదు".

జీసస్ శాశ్వతంగా గలీలి వదలి వెళ్లి పోతున్న వార్త చుట్టు పట్ల పట్టణాలలో వ్యాపించింది. ఆయన దర్శనం కోసం జనం గుంపులుగా రాసాగారు. అలా వచ్చిన వారిలో 'లూక్' ఒకరు. ఆయన సిరియా నుండి వచ్చాడు. మంచివాడన్న పేరుంది. 'ధియోఫిలన్' అని గ్రీకు సెనేటర్ ఒకరు. అతను సీజర్ వద్ద మంత్రిగా ఉన్నాడు. అలా చాలా మంది ప్రముఖులు వచ్చారు.

జీసస్ అందరి వద్ద సెలవు తీసుకున్నాడు. జీసస్‌ను అభిమానించి, ప్రేమించే వారంతా జెరూసలెం దారిపట్టారు. జీసస్, మేరి, మిరియం, పన్నెండు మంది శిష్యులు బయలుదేరారు. మార్గం మధ్యలో ఇనాన్‌స్ప్రింగ్స్ జలపాతం వద్ద విశ్రమించినప్పుడు, జెబేదీ భార్య, మేరీ జీసస్‌ను సమీపించి అడిగారు.

"బాబూ, జీసస్, నాకు అనిపిస్తోంది దైవసామ్రాజ్యం దగ్గరవుతోందని. నాకు ఒక వరం ప్రసాదించు తండ్రీ! నా బిడ్డల్ని నీతో పాటు తీసుకుపో. నీకు ఇరువైపుల వారిని చూడాలని నా కోరిక".

ఆమె జేమ్స్, జాన్‌ల కన్నతల్లి.

జీసస్ అన్నాడు : అమ్మా! నీ బిడ్డల్ని నేను కరుణించినా, నా ప్రక్కన వారికి స్థానం లభించదు. నేను ఒక పని మీద వచ్చిన వాడిని. నా పని పూర్తి కాగానే వెళ్లిపోతాను.

**(17)** జెరూసలెం ఉత్సవాలకు గలీలి, జూడియా, సమరియా నుండి చాలా మంది యూదు ప్రముఖులు హాజరైనారు. వారిలో ఒకవేత్త జీసస్ వద్దకు వచ్చి ప్రశ్నించాడు : "రబ్బోనీ. మీరు జనాన్ని ఎందుకు సందిగ్ధంలో ఉంచుతున్నారు. జ్ఞానులు ప్రవచించిన ప్రవక్త మీరే అయితే ఆ విషయం స్పష్టంగా ప్రకటించ వచ్చు కదా!"

జీసస్ : ఆ సత్యం చాలా సందర్భాలలో వ్యక్తమైంది. మీకే నమ్మకం కుదరడం లేదు. నేను చెప్పే విషయాలు సత్యప్రమాణాలు. అవి దివ్య వాక్కులు.

ఇకపైన ఏ దివ్యవాణి ఎవరికీ వినిపించదు. మనిషి హృదయం నిండా స్వార్థం పేరుకుపోయింది. కళ్లకు మాయ పొరలు క్రమ్మాయి.

ఆ మాటలు వినగానే అక్కడ చేరిన యూదులు జీసస్‌పైన రాళ్లు రువ్వడానికి సిద్ధపడ్డారు.

"నీవు వాగింది, మేం విన్నది ఇక చాలు" ఉక్రోషంగా అరిచారు.

జోసెఫ్ అనే వ్యక్తి యూదులలో ప్రముఖుడు. ఆయన లేచి, జీసస్‌కు అడ్డుగా నిలిచి, "ఆగండి. మీ చేతుల్లోని రాళ్లను అవతల పారేయండి. ఉద్రేకం వల్ల వివేకం కోల్పోతున్నారు. స్థిమితంగా ఆలోచించండి. మీ ఆరోపణలు అనుమానాలు నిరూపణ కావాలి".

జీసస్ వినయంగా చెప్పాడు : మన ప్రాచీన మహర్షులు చెప్పారు! మనుషుల్లో దేవతలుంటారని. నేను దేవుని కుమారుడినన్నాను తప్ప నేనే దేవుడి నని చెప్పలేదు. నా మాటలు నమ్మవద్దు. నాచేతల్ని విశ్వసించండి చాలు. నేను చేసిన పనుల వెనుక భగవంతుని హస్తం ఉందని, ఆయన ఆమోదంఉందని అంగీకరించండి చాలు. భగవంతుని శక్తి, కరుణ నాలో ఉంటే, భగవంతుడు నాలో ఉన్నట్లే, నేను భగవంతునితో ఉన్నట్లే కదా!

ఆ మాటలకు యూదులు మరింత ఆగ్రహించారు. మళ్లీ రాళ్లు తీసుకున్నారు కొట్టడానికి. జీసస్ ఎవరికీ కనిపించకుండా మాయమైనాడు. శిష్యులతో చేరి, జోర్డాన్ దాటి, బెత్‌హారాలో చాలా రోజులు ఉండిపోయాడు.

**18** అరబాలో ఒకరి ఇంట ధ్యాన సమావేశంలో ఉండగా ఒకరు వచ్చి "మహాత్మా! బెలూలీలో మీ మిత్రుడొకరు మృత్యుముఖంలో ఉన్నాడు. తమరిని వెంట తీసుకురమ్మని పంపారు" అని వార్త చెప్పాడు.

జీసస్ శిష్యుల వైపు చూచి "లారజస్ నిద్రపోతున్నాడట. నేను వెళ్లి నిద్ర లేపాలి" అన్నాడు.

"నిద్రపోయేవాడిని మీరు వెళ్లి లేపడం ఎందుకు? తనే నెమ్మదిగా లేస్తాడు" అన్నాడు ఒక శిష్యుడు.

జీసస్ అన్నాడు : అది మామూలు నిద్ర కాదయ్యా, దీర్ఘ నిద్ర. లాజరస్ చనిపోయాడు.

అయినా జీసస్ వెంటనే బయలుదేరలేదు. రెండు రోజులు అరబాలోనే

ఉన్నాడు. మూడవనాడు శిష్యులతో "పదండి పోదాం. మనం వెళ్లవలసిన సమయం వచ్చింది".

శిష్యులు జీసస్‌ను వెళ్లవద్దని బ్రతిమలాడారు. "యూదులు మిమ్మల్ని అక్కడకు రప్పించడానికి కుట్రపన్నారనిపిస్తోంది. వాళ్లు మిమ్మల్ని బ్రతకనీయరు".

జీసస్ : వాళ్లెవరయ్యా నా ప్రాణం తీయడానికి. నా అంతట నేను స్వచ్ఛందంగా మరణించవలసిందే. సమయం వచ్చినప్పుడు నేనే వెళ్లిపోతాను. భగవంతుని నిర్ణయం ఎలా ఉంటే అలాగే జరుగుతుంది. పదండి పోదాం.

థామస్ అన్నాడు. పదండి అందరం పోదాం, చస్తే అందరం కలిసే చద్దాం.

అందరు బయలుదేరారు. ఇంటివద్ద మేరి, రూత్ ఏడుస్తున్నారు. 'జీసస్ వచ్చాడు' అని చెప్పారు ఎవరో. మేరీకి ఆమాట వినిపించలేదు. రూత్, మార్తాలు బయలు దేరారు. గ్రామం మొగదల జీసస్‌ను చూచారు. జీసస్‌ను చూచి మార్తా అన్నది, "నీవు చాలా ఆలస్యం చేశావయ్యా, లాజరస్ మనకిక లేడు. కాస్త ముందుగా వస్తే బావుండేది".

జీసస్ : కంగారు పడకండి. లాజరస్ బ్రతుకుతాడు. నేనే ప్రాణాన్ని, నేనే జీవాన్ని. నన్ను విశ్వసించిన వారికి మరణం ఉండదు. ఎక్కడ సమాధి?

మార్తా అన్నది : సమాధి చేసి నాలుగు రోజులైంది. ఇప్పటికి శవం కుళ్లిపోయి ఉంటుంది.

జీసస్ శవపేటిక తెరిపించి "లే, లాజరస్, లే" అన్నాడు. అప్పుడే గాఢనిద్ర నుండి మేల్కొన్నట్లు లేచి కూర్చున్నాడు.

కొందరు జెరూసలెం పరుగెత్తి లాజరస్ తిరిగి బ్రతికిన సంగతి చెప్పారు. మతాధికారులు తలలు పట్టుకున్నారు. ఇప్పుడేం చేయాలి? ఇతగాడు మహాద్భుతాలు చేస్తున్నాడు. ప్రజలు అతనిని దేవుడుగా చూస్తున్నారు. ఇతను రోమ్ సింహాసనానికి ఎసరు పెట్టేట్లున్నాడు అనుకున్నారు.

అందరు కూడబలుక్కుని ఒక పథకం వేశారు. పూజారులలో పెద్ద కైఫస్ అన్నాడు. "మన ధర్మాన్ని రక్షించుకోవడం కోసం ఒకరిని చంపినా తప్పులేదు".

ఎలాగైనా జీసస్‌ను అంతం చేయాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

జీసస్ అక్కడ ఉండకుండా శిష్యులతో కలిసి ఏఫ్రియన్ పర్వతాలపైకి వెళ్లిపోయాడు. సమరియా సరిహద్దుల్లోని ఒక ఇంటిలో రహస్యజీవనం గడపసాగాడు.

(19) జెరూసలెం ఉత్సవాలకు పదిరోజులు ముందుగానే జీసస్, తన శిష్య బృందంతో బయలుదేరాడు. ఏఫ్రియన్ పర్వతాలు దాటి జోర్దాన్ గుండా జెరికా చేరారు. అక్కడ ఒక ధనవంతుడు జీసస్‌ను కలవాలనుకుని జనానికి భయపడి చెట్టెక్కి కూర్చున్నాడు. జీసస్ ఆ దారిని వెళుతూ ఆ చెట్టు దగ్గర నిలబడి "జచ్చాన్, చెట్టు దిగిరా. ఈ రోజు నేను నీతోనే గడుపుతాను".

అతను చెట్టు దిగిరాగానే, కలిసి అతని ఇంటికి వెళ్లాడు.

అతను జీసస్‌ను అర్థించాడు. "మహాత్మా, నేను మంచి పని చేయడానికి ఎప్పుడూ వెనుకాడను. పేదసాదలను ఆదుకుంటాను. ఎవరికి అన్యాయం జరిగినా నష్టపరిహారం ఇస్తాను".

జీసస్ : నీ నిజాయితీ, సత్ప్రవర్తన నాకు తెలుసు. అయినా నీ అంతట నీవు, నీ మంచి గుణాలు చెప్పుకోవడం మంచిపని కాదు. మనిషి తన జ్ఞానాన్ని, సంపాదించిన ధనాన్ని విరివిగా పంచుతుండాలి. డబ్బు దాచిపెట్టకోవడం, జ్ఞానం పదిమందికి పంచకుండా తనలోనే దాచుకోవడం, పాపం కాదు గాని, నిష్ప్రయోజనం. ఇంకా ఇంకా ధనం సంపాదించు. ఖర్చుపెట్టు. ఇంకా ఇంకా జ్ఞానం సంపాదించు. పదుగురికి పంచు. అందరిని జ్ఞానుల్ని చెయ్. దేవుని గుళ్లో దాచుకునేవాడు అర్చకుడు. దేవుళ్ల వెనుక తలదాచుకునే వారిలో మానవత్వం నశిస్తుంది".

అక్కడ నుండి బెతానీ బయలుదేరారు. జెరికాలో ఒక సంఘటన జరిగింది. జీసస్ ఆ దారిన వస్తున్న విషయం తెలిసి జనం వీధుల్లో పోగైనారు. అక్కడ ఒక అంధుడు ఆ హడావుడి విని, 'ఏమిటి' అని అడిగాడు.

'నజరత్ జీసస్ వస్తున్నాడు' అన్నారు జనం.

అంధుడు : "ప్రభూ నీవు వస్తున్నావా! నన్ను కరుణించడానికి వస్తున్నావా!" అని ఆనందంగా అనుకున్నాడు.

జనం ఆ గుడ్డివాడిని పక్కలకు తీసేశారు. జీసస్ ఆ త్రోవన వస్తూ, ఆ అంధుడున్న చోట నిలబడి "ఆ గుడ్డి తాతను తీసుకురండి" అన్నాడు.

అతనిని తీసుకురాగానే 'నీకేం కావాలి తాతా' అని అడిగాడు.

"నిన్ను చూడడానికి చూపు".

"నీవు చూడగలవు - చూడు తాతా".

అతనికి చూపు వచ్చింది.

**(20)** జీసస్ బృందం బెతానీ చేరుకున్నారు. ఆదివారం సినగాగ్‌లో ప్రార్థనలు చేసి ప్రసంగించాడు. తర్వాత శిష్యులతో అన్నాడు "ఈ రోజు మనం జెరూసలెం వెడుతున్నాం. నాకేదో అవుతుందని భయపడకండి. మీలో ఇద్దరు బెత్‌ఫానే వెళ్లిరావాలి. అక్కడ చెట్టుకు కట్టిన గాడిద ఒకటి కనిపిస్తుంది. దాని సరసన గాడిద పిల్ల ఉంటుంది. ఆ గాడిదను తోలుకు రావాలి.ఎందుకు తీసుకుపోతున్నారని ఎవరైనా అడిగితే నాపేరు చెప్పండి. దాని స్వంతదారుడు మీతో వస్తాడు".

జీసస్ ఆదేశించినట్లు ఇద్దరు శిష్యులు వెళ్లి గాడిదను తెచ్చారు. జీసస్ ఆ గాడిదపైన కూర్చుని జెరూసలెం బయలుదేరాడు. జనం స్వాగతం చెప్పి కోలాహలంగా ఉండగా ఫారిసీలకు కోపం వచ్చింది. సాయంత్రానికి జీసస్ తిరిగి బెతాని వెళ్లిపోయాడు.

మరునాడు, సోమవారం జీసస్ శిష్యగణంతో జెరూసలెం సినగాగ్ చేరే సరికి, ఆలయ ప్రాంగణం నానాభీభత్సంగా ఉంది. గొర్రెలు, పశువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దేవాలయం ముంగిట బలిదానంతో రక్తం కాల్వలై ప్రవహిస్తోంది. జీసస్ ఆగ్రహం ఆపుకోలేక అరిచాడు : "ఆలయం కబేలాగా మార్చేస్తున్నారు. ఎన్నిసార్లు మందలించినా మీకు బుద్ధిరాలేదు.

ఆయన మాటలు విని వర్తకులు నవ్వుకుంటూ గేలిచేయసాగారు. అవమానంతో జీసస్ ఉగ్రరూపం ధరించి ఇనుపగొలుసుతో వాళ్లని బాదుతూ, తరిమి తరిమి కొట్టాడు. గొర్రెల కట్లు విప్పి వదిలాడు. ప్రధానార్చకుడు, మిగిలిన పెద్దలు కోపంతో రంకెలు వేయసాగారు. జీసస్‌ను ఒక్కమాట అన్నా జనం తిరగబడేటట్లున్నారు.

సాయంకాలానికి తిరిగి బెతానీకి వెళ్లిపోయారు జీసస్ బృందం.

**(21)** మరునాడు మంగళవారం మళ్లీ బయలుదేరారు. క్రితం రోజు జీసస్ ఆ దారిన వెళుతూ కాయలు కాయని ఫిర్ వృక్షాన్ని, నిరర్థకం నిరుపయోగం అని వ్యాఖ్యానించిన చెట్టు, ఈ రోజుకు ఎండి, మాడిపోయి కనిపించింది. ఈ రోజు జీసస్ మరలా వ్యాఖ్యానించాడు. 'నిరర్థకమైన మనిషి జీవితమూ అంతే. ఉత్తినే బ్రతకడాన్ని దేవుడు క్షమించడు, ఆమోదించడు.'

జీసస్ బృందం దేవాలయ ప్రాంగణం చేరేసరికి అర్చకులు, పూజారులు కైఫస్‌లో మంతనాలు జరుపుతున్నారు. కొందరు అధికారులు వచ్చి జీసస్‌ను అడ్డుకున్నారు. "నీకెవరిచ్చారు అధికారం! ఇక్కడ నీ పెత్తనం చెల్లదు?"

జీసస్ అన్నాడు : జాన్ ప్రయోక్త దైవాంశ కలవాడు. అవునా, కాదా? ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పండి".

పూజారులు మొహామొహాలు చూసుకున్నారు. 'జాన్' దివ్యపురుషడని అందరూ అంగీకరిస్తారు. ఇప్పుడు అమాట ఒప్పుకుంటే 'జాన్' తన గురించి చెప్పిన విషయాలు నమ్మమంటాడు. కాదంటే ప్రజలు ఎదురు తిరుగుతారు.

ఆలయంలో అనుమతి లభించకపోవడం వల్ల, జీసస్ ఆలయం వెలుపల వేదిక ఎక్కి ప్రసంగించాడు. హీరోద్‌కు చెందిన ఒక చాదస్తుడు అడిగాడు, "జీసస్, మీరు చెప్పేది సత్యం అని నమ్మమంటున్నారు. దేవుడు మీ ఒక్కరి స్వంతం అయినట్లు మాట్లాడుతున్నారు. మనిషి వ్యక్తిత్వం మీకు నచ్చదా? దానిని గుర్తించరా? మేం పెద్ద మనుషులం. మేమంటే నీకు కాస్తంత గౌరవం ఉన్నట్లు లేదు".

"ఎవరి విశ్వాసం వారిది. మీ విశ్వాసాన్ని నేను శంకించడం లేదు. మీ ప్రవర్తన, అసూయ, ద్వేషం - వాటిని కాదంటున్నాను".

మరొక వితండవాది ప్రశ్నించాడు "రబ్బానీ, మోసెస్ న్యాయం ప్రకారం ఒక వ్యక్తి చనిపోతే, పిల్లలు లేని పక్షంలో, అతని భార్య అతని సోదరుని వివాహం చేసుకోవచ్చు".

జీసస్ అన్నాడు "ఇహలోకంలో వావి వరుసలూ, సంబంధ బాంధవ్యాలు రకరకాలుగా ఉంటాయి. స్వప్రయోజనం, స్వార్థం ఎక్కువ. సమాజపరంగా ఆలోచించడం కుదరదు. ఈ ప్రపంచం వదిలిన తర్వాత పై లోకంలో ఈ ప్రమాణాలు, బంధాలు ఉండవు. మనుషులు అక్కడ దేవతలై పోతారు. సుఖం కోసమో తృప్తి కోసమో స్త్రీ పురుషులు కలవరు. కలసి కాపురం చేయడం ఉండదు. ఈ సామాజిక న్యాయం, కట్టుబాట్లు పరలోకంలో కనిపించవు.

మృత్యువు జీవితానికి చరమాంకం కాదు. సమాధి కావడం చివరి ఘటన కాదు. మృత్యువు తర్వాత మరల జీవితం మొదలవుతుంది. సమాధి నుండి జీవం మరొక జీవిలోకి ప్రవేశిస్తుంది. మనిషిని సమాధి చేసినా, తిరిగి బయట పడగలడు. భగవంతుని కరుణ ప్రసరించినంతకాలం 'జీవి' మరణించదు. మళ్లీ మళ్లీ జన్మిస్తూ, జీవిస్తూ, మరణిస్తూ ఉంటుంది.

మరొకరు అడిగారు : పది సూత్రాలలో ముఖ్యమైనది ఏది?

జీసస్ : మొదట భగవంతుడు ఒక్కడే నన్న విశ్వాసం ఉండాలి. భగవంతుడు నిర్గుణుడు, నిరాకారుడు అని నమ్మకం కలగాలి. అయినా హృదయ పూర్వకంగా

భగవంతుని భావన చేయాలి, ఆరాధించాలి. అంటే మనస్సు, హృదయం, ఆత్మ మూడింటిని భగవంతునికి అర్పించాలి. 'అర్పణ' నిజమైన 'అర్చన'. ఆత్మతో, ఆత్మలోపల అన్వేషించడం అలవరచుకోవాలి. అప్పుడు హృదయంతోనే భగవంతుని దర్శించగలం".

తన శిష్యుల నుద్దేశించి చెప్పాడు : ఈ మత గురువులు, పూజారులు, అర్చకులు, మతాధిపతులు అందరూ మోసం చేస్తున్నారు. వారందరివీ వేషాలు, ఆడంబరాలు. అవి వారి అహంకార చిహ్నాలు. వారికి సుఖాలు భోగాలు కావాలి. సుఖజీవనం కావాలి. తామే దేవుళ్ల వారసుల మంటారు. ప్రతినిధుల మంటారు. అంతా మోసం. వీరు పూజారులు కారు తోడేళ్లు. అంతా తమకే తెలుసు ననుకునే అహంభావులు. మరొక విషయం 'ఎవరినీ ఫాదర్' అనవద్దు. ఈలోకంలో పైలోకంలో అందరికీ 'ఫాదర్' ఒక్కడే – భగవంతుడు. మీరు ఆధ్యాత్మికంగా ఉన్నతులు కావాలంటే గురువు పాదాల వద్ద శుశ్రూష చేయాలి. అది ఒక్కటే మార్గం.

ఆ మాటలకు అర్చకస్వాములకు, మత పెద్దలకు ఒళ్లు మండింది. జీసస్ మాటలు వారిని మరింతగా రెచ్చగొట్టాయి.

"మీరు పెద్దవారు. మీకు అహంకారం ఎక్కువ. ఆడంబరాలు ఎక్కువ. గుడిగుమ్మానికి అడ్డంగా నిలబడతారు. ఎవరినీ దేవుడి దగ్గరకు రానివ్వరు. మంచి వారంటే, నిజం చెప్పేవారంటే మీకు కోపం. మీ మంత్రాలలో, తంత్రాలలో దేవుని జాడ దొరకదు. మీరు చూపించేది స్వర్గం కాదు. నరకం. మీరే గుడ్డి వాళ్లు. ఇతరులకు మీరెలా దారి చూపిస్తారు. మీ లోపలి కల్మషాలను ముందుగా కడిగివేసుకోండి. మీలో ఉన్నది అంతా కుళ్లు, పాపం, కంపు. మీ లాంటివారి అగడాలకు అరకట్టలు వేయడానికి భగవంతుడు ఎప్పుడు మహాత్ముల్ని పంపుతూనే ఉంటాడు. అలాంటి మహర్షుల్ని మహాత్ముల్ని మీరు గుర్తించరు. గౌరవించరు. మీ మూర్ఖత్వం వదలుకోరు".

కొందరు యూదు ప్రముఖులు జీసస్ దర్శనానికి వచ్చారు. వారితో అన్నాడు. "ప్రస్తుతం నా ఆత్మ కల్లోలంగా ఉంది. అలజడిగా ఉంది. ఎందుకు అంటే చెప్పలేను".

ఒక్కసారిగా పరిసరాలు వెలుగుతో నిండిపోయాయి. ఆ కాంతిని భరించలేక కొందరు మూర్ఛపోయారు. కొందరు కళ్లు మూసుకున్నారు. ఆకాశవాణి వినిపించింది.

"నీ ప్రయత్నం, నా ప్రబోధం నెరవేరే సమయం వచ్చింది".

ఆ మాటలు జీసస్ ఒక్కడికే కాదు. అందరికీ వినిపించాయి.

"ఆ దివ్య సందేశం నా కోసం, మీ కోసం. అందరి కోసం. నేను ఎవరో మీకు నమ్మకం కలగడం కోసం దివ్యవాణి వినిపించింది".

"జెరూసలెం, సెలవు ... నీ ఔన్నత్యానికి, నీ నేరచరిత్రకు ఇదే కడపటి వీడ్కోలు".

అక్కడ నుండి వెంటనే శిష్యవర్గంతో క్లీవ్స్ పర్వతం పైకి వేగంగా నిష్క్రమించాడు. ఏకాంతంలో శిష్యులకు కొన్ని సందేశాలు ఇవ్వదలచాడు. పర్వతం మీద నుండి జెరూసలెం అందంగా కనిపిస్తోంది.

(22) బుధవారం నాడు జీసస్ శిష్యబృందంతో 'ఓలివెట్' వెళ్లి ఏడుగంటలు ఏకబిగిని ధ్యానం చేయించాడు. తర్వాత వారిని దగ్గరగా పిలిచి చెప్పాడు :

ఇప్పుడు మీకు కొన్ని రహస్యాలు తెలియచేస్తాను. దాంతో మీకు ఆధ్యాత్మిక అవగాహన పూర్తవుతుంది. పరమాత్మ, మహాప్రాణ, దివ్యజ్యోతి గురించిన వివరణ ఇచ్చాడు. జీవనసారం, దివ్యస్మృతులు, మహర్షుల సూక్తులు వివరించాడు. అయితే నోరు విప్పి ఒక్క మాట చెప్పలేదు. అంతా మౌనసందేశం. అంతా హృదయభాష. అప్పుడు ఆకాశం నిశ్శబ్దమైంది. అరగంటసేపు ప్రకృతి పరవశించింది.

"ఈ విషయాలు నోరు విప్పి చెప్పకూడదు. ఇవి దేవరహస్యాలు. వీటిని అక్షరబద్ధం చేయడం కుదరనిపని. మాటల్లో వ్యక్తం చేయడం జరగని పని. ఇవి అవ్యక్త సత్యాలు".

తర్వాత పన్నెండు మందికి, వారు బోధించవలసిన విషయాలు వివరించాడు.

"నిన్న మనం చెప్పుకున్నాం. అవతార పురుషుల గురించి. ప్రజలకు ధ్యానం చేయడం నేర్పండి చాలు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. ఏదీ భగవంతుని 'నాకు ఇవ్వమని' అడగనవసరం లేదు. మనం ఏమీ కోరనప్పుడు భగవంతుని అనుగ్రహం మనకు సంపూర్ణంగా లభిస్తుంది".

◆ ◆ ◆

# 18. ఆత్మనిర్వేదం

(1) సైమన్ ఒకప్పుడు కుష్ఠురోగి. జీసస్ అనుగ్రహంతో రోగవిముక్తుడైనాడు. బెతానిలో నివాసం. జీసస్ బృందానికి అతడొక విందు ఏర్పాటు చేశాడు. ఆహూతులలో లాజరస్ ఒకడు. రూత్, మార్తాలు వంటా వార్పు బాధ్యత తీసుకున్నారు. అతిథులంతా బల్లల వద్ద భోజనాలకు సిద్ధమైనపుడు మేరీ సుగంధ పరిమళ లేపనం తెచ్చి, జీసస్ తలకు, అరికాళ్లకు మర్దన చేయసాగింది. తలవంచి తన కేశాలతో జీసస్‌పాదాలు తుడిచింది. ఆ పరిమళం గదినిండా పరచుకుంది.

జూడాస్‌కు స్వార్థం ఎక్కువ. పైగా అసూయాపరుడు. అతను మేరీ చేస్తున్న పని గమనించి చమత్కారంగా ఎందుకంత ఖరీదైన తైలం వృథా చేస్తావు అన్నాడు. ఆ నూనె అమ్మితే డబ్బు వస్తుందని అతని ఆశ. జీసస్ శిష్య వర్గంలో డబ్బు వ్యవహారాలు చూచేది అతనే. మిగిలినవారు జూడాస్‌కు వంత పలికారు.

జీసస్ మందలిస్తున్నట్లు, “ఉస్. మాట్లాడకండి. తనకిష్టం వచ్చినట్లు తను చేస్తుంది. మీకు ప్రేమాభిమానాల విలువలు తెలియవు. ‘సేవ’ రకాలుగా ఉండవచ్చు. నేను గాని, మీరు గానీ ఎక్కువకాలం ఉండం. అమె నాకు సేవచేయడానికి ఇదే గదా చివరి అవకాశం”.

విందు అనంతరం లాజరస్‌తో కలిసి జీసస్ అతనింటికి వెళ్లాడు.

జెరూసలెంలో కుట్రలు, కుతంత్రాలు జోరందుకున్నాయి. జీసస్ కథ ముగింపుకు రకరకాల ఆలోచనలు చేస్తున్నారు. ఫారిసీలు, అధికారులు, మతపెద్దలు, యూదుల ప్రధాన పూజారి రహస్య సమావేశం ఏర్పాటుచేసి చెప్పాడు.

“ఈ పని చాలా గోప్యంగా జరగాలి. జనం దగ్గరలేని సమయంలో అతన్ని పట్టుకోవాలి. జనం మధ్య ఆ పని సాధ్యం కాదు. అతగాని కోసం ప్రజలు ప్రాణాలివ్వడానికైనా సిద్ధపడతారు. దేవాలయం మానవరక్తంతో కలుషిత మవుతుంది. ఈసారి మన పని నిరాటంకంగా సాగాలి”.

అనానియస్ అన్నాడు : “నాకో ఆలోచన వచ్చింది. జీసస్ రోజూ శిష్యులతో ఓ రహస్య ప్రదేశానికి ధ్యానానికి వెడుతుంటాడు. ఆ చోటు ఎక్కడో కనిపెట్ట

గలిగితే, మన పని అయినట్లే, వెళ్లి బంధించవచ్చు. జనానికి తెలిసే అవకాశం ఉండదు. ఆయన శిష్యులలో ఒకడు నాకు బాగా తెలుసు. వాడు డబ్బు మనిషి. స్వార్థపరుడు. వాడికి కాస్త లంచం ఇస్తే, వారు వెళ్లే చోటు చూపిస్తాడని నాకు నమ్మకం".

ప్రధాన అర్చకుడు కైఫస్ అన్నాడు : నీవు ఆ పని చేస్తే నీకు నూరునాణాలు బహుమానంగా ఇస్తాను.

అందుకు అనానియస్ అంగీకరించాడు. అతను బెతాని వెళ్లి సైమన్ ఇంట్లో ఉన్న జుడాస్‌ను బయటకు పిలిపించుకుని చెప్పాడు.

"జుడాస్, నీవు ముప్పయి నాణాలు సంపాదించే సులభమార్గం ఉంది. ఆపని చేయడంవల్ల జెరూసలెంలో పెద్దలు నిన్ను అందలం ఎక్కిస్తారు. నీ విలువ పెరుగుతుంది. జెరూసలెం పెద్దలు ఒంటరిగా జీసస్‌తో సంప్రదించాలను కుంటున్నారు. ఆయన క్రీస్తు అవునో కాదో వారు స్వయంగా నిర్ణయించు కుంటారట. రేపు రాత్రి మీ గురువు ఏకాంతంగా ఉండే చోటుకు వారిని తీసుకువెళ్లు. నీ వెంట ఎవరో ఒక మతాధికారి రావచ్చు".

జుడాస్ ఆలోచించాడు. ఇది జీసస్‌కు మంచి అవకాశం! తానే క్రీస్తునని నిరూపించుకునే గొప్ప అవకాశం అవుతుంది. ఒకవేళ ఈ పూజార్ల గుంపు ఆయనకు అపకారం తలపెడితే తను ఆయన మహత్తుతో అదృశ్యం అయిపోగలడు. నాకు ముప్పయి నాణాలు మిగులుతాయి. అ వచ్చిన వాడికి జీసస్ ఎవరో ఎలా తెలుస్తుంది? అనానియస్‌తో తను రహస్య ప్రదేశానికి తీసుకు వెడతానని చెప్పాడు. నేను ముందుగా వెళ్లి జీసస్ చేతిని ముద్దుపెట్టుకుంటాను. ఆయనే జీసస్ అని గుర్తించండి".

(2) గురువారం ఉదయం జీసస్ తన పన్నెండు మంది శిష్యుల్ని పిలిచి

"ఈ రోజు చాలా ముఖ్యమైన రోజు. మన ధ్యానం కూడా చిత్రంగా ఉంటుంది. మనం మాత్రమే పాస్కల్ సప్పర్‌కు హాజరవుతున్నాం".

"జెరూసలెంలో ఎక్కడకు వెళ్లాలి! ఎక్కడ ఏర్పాటు చేయాలి".

జీసస్ : ఫౌంటెన్ ద్వారం గుండా వెళ్లండి. మీకు ఒకతను కనిపిస్తాడు. అతని చేతిలో ఒక కుండ ఉంటుంది. అతనితో చెప్పండి "ఈ రోజు చివరిరోజు. మీ భోజనశాల సిద్ధం చేయమని నామాటగా చెప్పండి. పన్నెండు మందికి 'పాస్ ఓవర్' చివరి విందు.

ఈ మాటలకు వారు ముగ్గురు వణికిపోయారు. 'చివరి విందు?' అంటే.

"భయపడకండి. వెళ్లండి. మీరు కలిసే వ్యక్తి నికోడమస్. మనకు కావలసినవాడు. యూదు పాలకులలో ఒకడు".

ముగ్గురు శిష్యులు జెరూసలెం చేరగానే ఆయన కనిపించాడు. జీసస్ సందేశం వినగానే ఇంటికి వెళ్లి ఏర్పాట్లు చేయసాగాడు. ఇంటిలో రెండవ అంతస్తు విందుకు సిద్ధం చేయించాడు.

అపరాహ్నం దాటిన తర్వాత జీసస్ శిష్యులతో జెరూసలెంకు వెళ్లాడు. విందు ఏర్పాట్లు జరిగాయి. విందు బల్ల వద్ద ఎవరు ఎక్కడ కూర్చోవాలని శిష్యులు కలహించుకోసాగారు. ఎవరు గురువుగారికి దగ్గరగా కూర్చోగలిగితే వారంత ఆత్మీయులని వారి భావన.

జీసస్ అన్నాడు. "చీకటి పడేలోపు మీ వ్యవహారం తేల్చుకోండి. పరలోకంలో ఎవరికీ ప్రత్యేక స్థానాలుండవు. చివరన కూర్చున్నా ఆత్మీయతకు, ఆదరణకు లోపం కలగదు".

అని జీసస్ లేచి ఒక గిన్నెనిండా నీరు తీసుకుని, టవల్ తీసుకుని వంగి అందరి కాళ్లు కడగసాగాడు. గుడ్డతో తుడిచాడు. వారితో అన్నాడు :

"ఈ మీ పాదాలు ఇకనైనా సన్మార్గంలో నడుస్తాయని ఆశిస్తున్నాను".

జీసస్ పీటర్ వద్దకు వచ్చి ఆయన కాళ్లు కడగబోతుండగా పీటర్ ప్రశ్నించాడు. "మీరు శిష్యులమైన మాపాదాలు తాకకూడదు".

జీసస్ : నీ అర్థం వేరు, నా అవగాహన వేరు పీటర్. తర్వాత మీకే అంతర్యం తెలుస్తుందిలే.

పీటర్ : మీ ఇష్టం. కాళ్లనే కాదు నా చేతుల్ని తలను కడగండి.

జీసస్ : అమాయకుడా, పరిశుద్ధంగా ఉన్నవారి పాదాలను శుభ్రపరిస్తే చాలు. 'పాదాలు' మనిషి నైజానికి ప్రతీకలు. మనిషి ప్రవర్తనకు పాదాలే గుర్తులు. మనిషి జీవన ప్రవాహంలో తనను శుభ్రపరచుకోవాలి. అప్పుడు అతని జీవన విధానం చక్కబడుతుంది.

విందు బల్ల వద్ద అందరూ కూర్చున్న తర్వాత జీసస్ 'ఆత్మనిర్వేదం' కొట్టవచ్చినట్లు కనిపించింది.

"ఈ రోజు మీ చివరి పాఠం నేర్చుకోండి. మీరు నన్ను మాస్టర్ అని, గురువు అని సంబోధిస్తుంటారు. నేను మాస్టర్నే. అంటే మహర్షిని. మీరు 'ప్రభువు'గా సంబోధించి, భావించే నేను మీ కాళ్లవద్ద కూర్చుని మీ పాదాలు కడిగాను. అలాగే మీరు ఇతరుల పాపాలను శుభ్రంగా కడిగి వేయగలగాలి.

ఆ పని మీరు చేయగలిగితే మీలో 'క్రీస్తు తత్వం' నిలబడినట్లు. 'క్రీస్తు భావన' మీలో స్థిరపడినట్లు. ఈ రోజు నేను నిజంగా భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకునే పవిత్రమైన రోజు. నన్ను ఆవరించి ఉన్న మాయతెర తొలగిపోయింది. ఇప్పుడు మీతో కలసి విందు చేస్తున్నాను. ఇహలోకంలో మనం కలిసి చేస్తున్న చివరి విందు ఇది. తర్వాత ఎప్పుడో పరలోకంలో ఉన్న ప్రభువు సన్నిధిలో కలుద్దాం".

భోజనం చేస్తుండగా మధ్యలో జీసస్ అన్నాడు, సాలోచనగా : "మీలో ఒకరు ఈ రాత్రి ఇక్కడ నుండి వెళ్లిపోయి నాకు ద్రోహం చేస్తారనిపిస్తోంది".

శిష్యులు మొహామొహాలు చూచుకున్నారు. ఎవరికి వారు 'నేను' కాదు. అని సమాధాన పడ్డారు. జీసస్ ప్రక్కన కూర్చున్న జాన్‌తో పీటర్ అన్నాడు.

"ఎవరై ఉంటారు?"

జాన్ నెమ్మదిగా తన చేతితో జీసస్ చేయిని అందుకుని

"ప్రభూ! మాలో ఎవరా ద్రోహి? చెప్పండి" అని అడిగాడు.

జూడాస్ అడిగాడు "ప్రభూ! నన్ను అనుమానిస్తున్నారా?"

జీసస్ "నా పళ్లెంలో చేయిపెట్టిన వాడు నాకు ద్రోహం చేసినట్లు".

అందరి దృష్టి జీసస్ పళ్లెం వైపు తిరిగింది. జుడాస్ చేయి జీసస్ పళ్లెంలో ఉంది.

జీసస్ : మహాత్ముల నోటివెంట అనృతాలు రావు. వారి మాటలు పొల్లు పోవు. మామూలు మనుషులు చెప్పే మాటలు నిజం కాకపోవచ్చు. మహాత్ముల మాటలు అయి తీరుతాయి.

టేబుల్ వద్ద నుండి జుడాస్ చివాలున లేచాడు.

జీసస్ జుడాస్ నుద్దేశించి అన్నాడు. "త్వరగా వెళ్లి చేయవలసిన పనులు చేసెయ్. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి కదా".

జుడాస్ వెళ్లిపోయాడు. భోజనం తర్వాత జీసస్ మిగిలిన పదకొండు మందితో కొంతసేపు మౌనంగా గడిపాడు. ఒక రొట్టెను చేతిలోకి తీసుకుని అన్నాడు, "ఈ రొట్టె మన జీవితాలకు సంకేతం. ఈ రొట్టెలో సగభాగం నాశరీరం. ఇతరులకోసం నావంటి వారు జీవితాన్ని త్యాగం చేస్తుంటారు. మనం రొట్టెను తింటున్నట్లు, జీవితాన్ని తినాలి. ఇది నా జీవనసారం. అందరి జీవనసూత్రం అదే. 'క్రీస్తు'ను విశ్వాసంతో సేవించండి. ద్రాక్షరసం అంతమధురం క్రీస్తు జీవితం.

జీసస్ అన్నాడు : "ఇది చివరి విందు కదా. పాస్ ఓవర్ పండుగ మనం

దేవుని పేరుతో చేసుకున్న సప్పర్. ఇకపైన దీనిని నా 'జ్ఞాపకం'గా నిలుపుకోండి. ఈ రొట్టె, ఈ ద్రాక్షరసం నా జ్ఞాపికలు.

పీటర్ దీనంగా అడిగాడు, "ప్రభూ! మీరు వెళ్లే తావుకు నన్నూ తీసుకుపోండి. మీ కోసం నా ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్నాను".

జీసస్ : "మిత్రమా! అత్యాశవద్దు. నన్ను అనుసరించు. నాతో కూడా రాగల శక్తి నీకు లేదు. ప్రస్తుతం నీకున్న శక్తి చాలదు. తెల్లవారేలోగా నీవు నా మాటను మూడుసార్లు ఉల్లంఘిస్తావు .... మీ అందరూ ఈ రాత్రితో నన్ను విస్మరిస్తారు. నేను తిరిగి బ్రతికినప్పుడు మీరంతా వస్తారు. మీ కంటె ముందుగా నేను గలీలి చేరుకుంటాను".

పీటర్ : ప్రభూ, అందరూ విస్మరించినా నేను మిమ్ము స్మరిస్తుంటాను.

జీసస్ : సైమన్ పీటర్, నీ ఆసక్తి గొప్పది, నీ విశ్వాసమూ గొప్పదే. కానీ సైతాన్ ప్రభావం నుండి ఎలా తప్పుకోగలవు. నీ బాధ్యత నీవు నిర్వర్తించు. తర్వాత నా పై విశ్వాసం బలపడుతుంది.

శిష్యులు : ప్రపంచంలో ఏ శక్తి మిమ్మల్ని నిలవరించలేదు ప్రభూ! మీ పట్ల మా విశ్వాసం చెదరదు కాక చెదరదు.

జీసస్ : మీ విశ్వాసం సడలనీయకండి, విషాదం మిమ్మల్ని అంట నీయకండి. మీకు భగవంతుని పైన పూర్ణ విశ్వాసం ఉంది. నాపైన విశ్వాసం ఉంది. నేను ముందుగా వెళ్లి మీ రాకకు ఏర్పాట్లు చేస్తాను. ముందు నేను వెళితే తప్ప, ఆమార్గం మీకు ప్రయాణ యోగ్యం కాదు. మార్గంలో ఎలాంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా చేస్తాను.

థామస్ : మీరు ఎటు వెళ్లేది, ఎక్కడకు వెళ్లేది మాకెలా తెలుస్తుంది?

జీసస్ : నేనే మార్గం, నేనే గమ్యం, నేను భగవంతుని ప్రతినిధిని.

ఫిలిప్ : ప్రభూ! మాకు ఆ తండ్రిని పరిచయం చేయండి.

జీసస్ : ఇంతకాలం మీతో కలిసి ఉన్న నన్నే మీరు తెలుసుకోలేదు.

మహాత్ముల్ని గుర్తించిన వారికి పరమాత్మ దర్శనం సులభం. ఆ తండ్రి తనకు తానుగా ఎరుక పరుస్తాడు. నేను ఇంతకాలం చెప్పిన మాటలు నావి కావు, ఆయనవి. నేను చేసిన పనులు ఆయన చేయించినవి. అన్నీ పరమాత్మ ప్రేరణలు. ఆయన నాలో ఉండి, నాచేత పలికించినట్లు, చేయించినట్లు మీకు నమ్మకం గలిగితే చాలు. మీరూ నాలా చెప్పగలుగుతారు నాలాగా

చేయగలుగుతారు. భగవంతుని సమక్షంలో మనం ఇంతకన్న గొప్ప పనులు చేయవలసి ఉంటుంది.

జీసస్‌ను అమితంగా ఆరాధించి, ప్రేమించే జాన్ లోలోపల కుమిలిపోతూ "ప్రభూ నన్ను మీతో రానివ్వండి. మీరు లేని ప్రపంచంలో నేనుండలేను" అన్నాడు.

జీసస్ : నాతో కలిసి మరణిస్తావు. కాని నేను వెళ్లే చోటుకు నీవు రాలేవు. అక్కడికి చేరడానికి నా కింకా చాలా వ్యవధి ఉంది.

అందరినీ సంబోధిస్తూ జీసస్ అన్నాడు : "విచారించకండి. ప్రస్తుతానికి నేను వెళ్లడమే మంచి పని. నేను వెళ్లకపోతే మీకు స్వేచ్ఛ లభించదు. శరీరంతో ఉండగానే కొన్ని విషయాలు చెప్పాలి. మీలో పరమాత్మ ప్రవేశం తర్వాత మీ అంతరాత్మ మరిన్ని విషయాలు ప్రబోధిస్తుంది. ప్రస్తుతం వాటిని చెప్పినా ఎవరూ నమ్మరు. కొన్ని విషయాలు భగవంతుడు స్వయంగా ప్రబోధిస్తాడు. అంటే మీ అంతట మీరు గ్రహించేలా చేస్తాడు.

"ఆత్మ' అంటే ఏమిటి? ఆత్మ రహస్యాలేవి? జీవితం అంటే ఏమిటి? మృత్యువంటే ఏమిటి! అమృతత్వం ఎలా కలుగుతుంది? శాశ్వతత్వం అంటే ఏది? ఆత్మ పరమాత్మలో కలవడం ఎలా సాధ్యం? మనిషికి, ఆత్మకు, పరమాత్మకు ఉన్న సంబంధం ఏమిటి? ఇవి అన్నీ చాలా నిగూఢ విషయాలు. అవి తెలుసుకున్న మనిషి సత్యంగా మారిపోతాడు. దానిని సత్యదర్శనం అంటారు. మీకు ఆత్మజ్ఞానం కలిగినపుడు నేను చెప్పే విషయాలు మీకే తెలుస్తాయి. అందుకు భౌతికబంధాలు తెగిపోవాలి. ప్రాపంచిక వాసనలు నశించాలి. ఆత్మజ్ఞానం కలిగిన వారికి భగవంతుని ప్రేరణ, ప్రమేయం అవసరముండదు. నావంటి వారి అవసరమూ ఉండదు. స్థితప్రజ్ఞతో స్వయం ప్రకాశం కలుగుతుంది".

శిష్యులు అడిగారు : ప్రభూ! తాము సర్వజ్ఞులు. మీకు అంతా తెలుసు. సూటిగా చెప్పండి. మీ మాటలకు అర్థం ఏమిటి? అర్థోక్తిగా – చెప్పకుండా పోతానంటారు. మళ్లీ వస్తానంటారు?

జీసస్ : అవునయ్యా, నేనన్నది నిజం. నామాట వాస్తవం. నా భావన సత్యం. ప్రతి మనిషి భయం గుప్పిట్లో బ్రతుకుతుంటాడు. ప్రాణభయంతో పరుగులు తీస్తుంటాడు. అవసరమైనప్పుడు అందరూ పారిపోతారు. నన్ను ఒంటరిని చేసిపోతారు. నా వెంట ఉండి, నన్ను రక్షించేది నా తండ్రి ఒక్కరే. నాకు తెలుసునయ్యా, ఈ దుర్మార్గులు నా ప్రాణాలు బలితీసుకుంటారని అయినా నేను చనిపోను. తిరిగి ప్రాణాలతో వస్తాను. మిమ్మల్ని ఋభ్యపెట్టడానికి ఈ మాట

చెప్పడం లేదు. జరగబోయే వాస్తవం ఇది. ఈ ప్రపంచాన్ని దాటి నేను ఎప్పుడో వెళ్లిపోయాను".

(3) జీసస్ పదకొండు మంది శిష్యులతో ఇంటి బయటకు వచ్చే సరికి రోమన్ సైనికుడొకడు ఎదురొచ్చి "మీలో గలీలినుండి వచ్చిన వారెవరు?" అని ప్రశ్నించాడు.

"మేమంతా గలీలి నుండి వచ్చిన వాళ్లమే"నని సమాధానం చెప్పాడు పీటర్. "ఇంతకూ నీకు ఎవరు కావాలి??"

సైనికుడు : జీసస్ కావాలి. ఆయన తాను క్రీస్తు నని అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని విన్నాం. ఆయన్ని తీసుకురమ్మని అజ్ఞ.

జీసస్ పీటర్‌తో, మిగిలిన వారితో 'మీరంతా లోపలకు వెళ్లండి' అన్నాడు.

"నేను ఒంటరిగా వెళ్లి గవర్నరును కలుస్తాను".

జీసస్ సైనికుని వెంట బయలుదేరాడు. రాజ భవనం వద్దకు వచ్చేసరికి పైలేట్ ఎదురై "మిత్రమా! నీవు చేసే బోధలు, చెప్పే సత్యాలు మూడు సంవత్సరాలుగా వింటున్నాను. నీ మహత్తులు నాకు తెలుసు. నీ వారు, నీ జాతివారు, ఇక్కడ ఫారసీల దుర్మార్గం మితిమీరిపోయింది. నిన్ను చంపడానికి కుట్రపన్నారు. నీకు ఇక్కడ రక్షణ లేదు. పారిపో. ఎక్కడికైనా వెళ్లి పో జీసస్. నావద్ద కొద్దిమంది రక్షణ సైనికులున్నారు. వారు నిన్ను సురక్షితంగా దేశం ఎల్లలు దాటిస్తారు".

జీసస్ : మిత్రమా! పొంటియన్! మీరు సీజర్ క్రింది ఉద్యోగి. మీరు చెప్పినవి ప్రపంచం దృష్టిలో మంచి మాటలు, హిత వచనాలు కాని భగవంతుని దృష్టిలో అవి తెలివితక్కువ మాటలు. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు పారిపోయేవాడు పిరికివాడు. ఒరులకు రక్షణ కల్పించేవాడు ఆత్మరక్షణకు పారిపోడు. అమాయకుల, సాధువుల రక్తం కళ్లచూచిన జాతి బాగుపడదు. హంతకులు ఈ సరికి అన్ని ఏర్పాట్లు చేసుకునే ఉంటారు.

పైలెట్ : అలా అనకు జీసస్. రోమ్ నిన్ను రక్షిస్తుంది.

జీసస్ : లేదు పైలెట్, నన్ను రక్షించగల శక్తి ప్రస్తుతం ప్రపంచంలో లేదు.

పైలెట్ వద్ద సెలవు తీసుకుని జీసస్ బయలుదేరాడు. అయినా పైలెట్ ఇద్దరు సైనికుల్ని 'రక్షణ'గా ఉండమని వెంట పంపాడు.

క్షణంలో జీసస్ భౌతికంగా అంతర్ధానమైనాడు. వెంట వస్తున్న సైనికులకు ఆయన జాడ తెలియలేదు. మరుక్షణంలో తన శిష్యులమధ్య ప్రత్యక్షమైనాడు.

(4) సెలయేటికి ఆవల ఒక ఆరామం ఉంది. అక్కడ ఒక ఇంటిలో ముస్సాలియస్ అనే వ్యక్తి ఉంటున్నాడు. జీసస్ అప్పుడప్పుడు అతని ఆతిథ్యం స్వీకరిస్తుంటాడు. ఆయనకు జీసస్‌పైన విశ్వాసం. జీసస్‌ను భగవంతుని అవతారంగా భావిస్తాడు. ఆరామంలో ఒక పూజామందిరం ఉంది. దానిపేరు గెత్సెమానే. అది ఒక చిన్న గుహ. చాలా ప్రశాంత వాతావరణం.

చీకటి పడ్డ తర్వాత గెత్సెమానెలో మరీ చీకటిగా ఉంటుంది. జీసస్ ఏడుగురు శిష్యుల్ని నదివద్ద కాపలా ఉండమని ఆదేశించాడు. తను, పీటర్, జేమ్స్, జాన్‌లతో గెత్సెమానేకు ధ్యానం నిమిత్తం వెళ్లాడు. ఒక ఆలీవ్ చెట్టు క్రింద కూర్చుని, తన వెంట వచ్చిన ముగ్గురు శిష్యులకు కొన్ని జీవన రహస్యాలు బోధించాడు.

"ఈ విశ్వం అనంతమైనది. విరాట్పురుషుడు అనంతుడు. ఆయనే విశ్వకర్త, విశ్వబ్రహ్మ. సృష్టి కర్త. ఆ విశ్వవ్యాపక శక్తిని భగవంతుడని, దేవుడని, పరమాత్మ అని పిలుస్తారు. ఆయనే జగత్పిత, జగద్రక్షకుడు. భగవంతుడే సృష్టికి, విశ్వానికి తల్లి, తండ్రి, తనయుడు. సృష్టించబడిన విశ్వంలో బ్రహ్మయొక్క మూడు భాగాలుంటాయి. అవి మూడు రకాల విభూతులు, జగత్పిత, పరాశక్తి. ఇహానికి, పరానికి సంబంధించిన శక్తి పేరు జగన్మాత. ఇహ, పరాల సంకల్పం జగన్మాత. జగత్తు సృష్టించబడడానికి జగన్మాత 'ప్రేమ', పరమాత్మ 'సంకల్పం' హేతువులు. అంచేత ప్రపంచంలో ప్రేమ ప్రథమ స్థానంలో నిలుస్తుంది. 'ప్రేమ' కుమారుడు క్రీస్తు.

"నేను మానవరూపంలో అవతరించింది మానవులకు 'ప్రేమ' విలువ తెలియజేయడానికి. ప్రేమను పంచడానికి. మనిషిగా పడవలసిన కష్టాలు నేను అనుభవించాను. మానవ ప్రలోభాలన్నింటిని అధిగమించాను. ఈ పనులు మనుషులందరూ చేయదగినవి, చేయవలసినవి. ఇప్పుడు నేను మానవశక్తిని నిరూపించాలి. మనిషి మృత్యువును జయించడం గొప్ప సాహసం. ప్రతిమనిషి రక్త, మాంస నిర్మితమైన భగవంతుని అంశ. నేను నా జీవితాన్ని చాలించి మరల జీవించగలను. అది నా పునరుత్థానం. అప్పుడు మీకు జీవితం అంటే ఏమిటో? మృత్యువు అంటే ఏమిటో తెలుస్తుంది. చనిపోయిన వ్యక్తి తిరిగి బ్రతకడంలోని అంతర్యం గ్రహిస్తారు.

"నా భౌతిక కాయాన్ని భూస్థాపితం చేసిన తర్వాత ఆత్మ పైకి లేస్తుంది. ఆ ఆత్మ నా భౌతిక రూపానికి ప్రతిబింబం. కంటికి కనిపించే రూపాన్ని ధరిస్తుంది. మూడు రోజుల వ్యవధిలో నా మొత్తం జీవితాన్ని, మరణాన్ని, పునరుత్థానాన్ని

మీరు ప్రత్యక్షంగా చూస్తారు. నేను చేసే ఈ పని అందరూ చేయగలగాలి. మీరు ముగ్గురూ నాకు ప్రియతములు. నాలోని అంతర్భాగాలు. రేపటి క్రీస్తు మందిరానికి మీరే పునాదిరాళ్లు. దైవశక్తులకు మీరు ప్రతినిధులు. పీటర్ దైవత్వానికి ప్రతినిధి. జేమ్స్ దివ్యసంకల్పానికి ప్రతినిధి. జాన్ దివ్య ప్రేమకు ప్రతినిధి. ప్రపంచాన్ని చూచి, మనుషుల్ని చూచి భయపడకండి. మిమ్మల్ని భగవంతుడు మహాకార్య నిర్వహణకు ఎన్నిక చేసుకున్నాడు. ఈ ప్రపంచంలోని శక్తులు అన్నీ కలిసినా మిమ్మల్ని ఏమీ చేయలేవు. మిమ్మల్ని ఇక్కడ నా పనికి నియోగించి, నేను నిష్క్రమిస్తాను".

(5) జీసస్ తూర్పు దిశగా మూడు వందల అడుగులు నడిచి తీవ్రంగా ప్రార్థన చేసుకున్నాడు. "హే భగవాన్, రానున్న విష ఘడియల నుండి రక్షించమని నిన్ను అడగను. మార్గాంతరం చూపమనీ అడగను. నా శరీరం శక్తిని కోల్పోతున్నది. ఆత్మ పదిలంగానే ఉన్నది. అయినా ధైర్యం చాలడం లేదు తండ్రీ! అంతా నీ దయ, నీ సంకల్పం మేరకు కానివ్వు ప్రభూ!"

ఆర్తిగా ఆత్మ నివేదన చేసుకున్నాడు. భౌతిక శరీరంపైన, మనస్సుపైన వత్తిడి, శ్రమ అధికమైంది. నరాలు తెగిపోయే వత్తిడి. నుదురుచిట్లి రక్తం ప్రవహిస్తున్నదా అనిపించింది. జీసస్‌కు.

ప్రార్థన ముగించి వెనుతిరిగి వచ్చాడు. ఆయన వచ్చేసరికి ముగ్గురు శిష్యులు ఆదమరచి నిద్రపోతున్నారు. జీసస్ అన్నాడు "సైమన్. నిద్రపోతున్నావా! నా కోసం ఒక గంటసేపు మేల్కొని ఉండలేకపోయావా! అప్రమత్తంగా ఉండాలయ్యా! బలహీనతల్ని అధిగమిస్తే తప్ప బాధ్యతలు నిర్వహించే శక్తి కలగదు. ఆత్మ మేల్కొని ఉంటుందని నాకు తెలుసు. కాని మనస్సు వ్యాకుల పడుతుంది. శరీరాన్ని కల్లోల పరుస్తుంది. మనిషి మొత్తంగా బలహీనుడవుతాడు".

జీసస్ మళ్లీ వెళ్లి ధ్యానానికి ఉపక్రమించాడు –

"ప్రభూ! బాధల్ని తాగుతున్నాను. నా ఆత్మకున్న శక్తి నా శరీరానికి లేదు. ఆశక్తి నాకివ్వరాదూ? నేను కోరానని కాదు, నీకు ఇష్టం అయితేనే ఇవ్వు, నాకు అవసరం అనిపిస్తేనే ఇవ్వు! నీవు ఎలా సంకల్పిస్తే అలాగే కానివ్వు ప్రభూ!"

జీసస్ తిరిగి వచ్చేసరికి ఇంకా ముగ్గురూ మొద్దు నిద్రలోనే ఉన్నారు. వారిని నిద్ర లేపి, జేమ్స్‌తో అన్నాడు :

"నీ గురువు మానవ శత్రువులతో భీకరంగా పోరాడుతుంటే, నీవు

నిశ్చింతగా నిద్రపోతున్నావా? నా కోసం ఒక గంటసేపు మేల్కొని ఉండలేక పోయావా జేమ్స్".

జీసస్ మరల వెళ్లి ధ్యానం చేసుకున్నాడు –

"భగవాన్ శరణు శరణు. ఇంక నాకు నిన్ను అర్థించే ఓపిక లేదు. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవయ్యా! నీకు సంపూర్ణ శరణాగతుడవైనాను. నాదంటూ ఏమీ లేదు. నాకంటూ ఏమీ వద్దు. నీ ఇష్టం".

తిరిగి వచ్చేసరికి ఇంకా ముగ్గురూ నిద్రపోతూనే ఉన్నారు. జాన్‌ని నిద్రలేపాడు. "జాన్ నీవు నన్ను అమితంగా ప్రేమిస్తానంటావు. ఏదీ? నా కోసం ఒక గంట మేల్కొని ఉండలేకపోయావు గదా! పోనీలే. పదండి పోదాం, వాళ్లు నా కోసం వస్తున్నారు".

వారు నదీ తీరం చేరేసరికి ఎనిమిది మంది శిష్యులు సొమ్మసిల్లి నిద్రపోతున్నారు. జీసస్ అన్నాడు. "లేవండి, లేవండి. మీ మత్తు వదిలే కాలం దగ్గర పడింది. మన నమ్మకద్రోహి వస్తున్నాడు".

**(6)** జీసస్, పదకొండు మంది శిష్యులు మస్సాలియన్ తోటలో ఉండగా కొందరు దీపాలు, కాగడాలు పట్టుకుని కత్తులు, కటార్లు, బరిసెలు తీసుకుని పరుగున వచ్చారు. వారిలో జుడాస్ కూడా ఉన్నాడు. శిష్యులు జీసస్‌ను అర్థించారు. 'పదండి పారిపోదాం'.

జీసస్ అన్నాడు : "దేనికి పారిపోవడం? ఎక్కడికి పారిపోవాలి! ఈ హంతకుల నుండా! మృత్యువులోకా!"

జీసస్ తను ఒక్కడే జనం ముందుకు వచ్చి "ఎందుకొచ్చారు? మీకు ఎవరు కావాలి?" అని ప్రశ్నించాడు.

"జీసస్ కావాలి" వారు ముక్త కంఠంతో అరిచారు.

"నేనే జీసస్‌ని" అంటూ చేయి పైకెత్తాడు. ప్రకృతిని అవాహన చేయగా గాలి వెలుతురుగా మారింది. పరిసరాలు వెలుగుతో నిండిపోయాయి. కళ్లు మిరుమిట్లు గొల్పి చూపు ఆనక వచ్చినవారు చెల్లాచెదరైనారు. కొందరు పరుగు తీశారు. కొందరు మూర్ఛపోయారు. కొద్దిమంది మొండివాళ్లు నిలదొక్కుకున్నారు.

వారితో జీసస్ అన్నాడు "మీకేం కావాలి?"

అనాలియస్ ప్రక్కన నిలబడివున్న జుడాస్ క్షణంలో జీసస్ దగ్గరకు వచ్చి "ప్రభూ!" అంటూ ఆయన చేతిని ముద్దాడాడు.

జీసస్ : "నన్ను మోసం చేస్తావా దుర్మార్గుడా. నీవు గురుద్రోహివి. ఆత్మ ద్రోహివి".

అంతలో మిగిలిన శిష్యులు వచ్చి జుడాస్‌ను చంపడానికి సిద్ధపడ్డారు.

జీసస్ : "అతనినేం చేయకండి. అతనిని శిక్షించవలసింది మీరు కాదు. అతని అంతరాత్మే అతడిని శిక్షిస్తుంది. తనే ఆత్మహత్య చేసుకుంటాడు".

అంతలో కైఫస్ మాల్కస్ జనంతో వచ్చి, జీసస్‌ను గొలుసులతో బంధించాడు.

జీసస్ అన్నాడు : "ఇంత అర్ధరాత్రివేళ శ్రమపడివచ్చారు. కైఫస్! నన్ను పట్టుకోవడానికి ఇన్ని కత్తులు, సుత్తెలు అవసరమా? ఈ గొలుసులు నన్ను బంధించగలవా?"

అని జీసస్ చేతులు పైకెత్తగానే ఇనుప గొలుసులు పెటపెట పగిలి ముక్కలై పోయాయి. జీసస్ పారిపోతాడని మాల్కస్ భయపడ్డాడు. దుడ్డు కర్రతో తలమీద బాది స్పృహ తప్పేలా చేయాలనుకున్నాడు. అతని ప్రయత్నం గమనించిన పీటర్ తన చేతిలోని కత్తితో మాల్కస్ తలమీద బాదాడు.

జీసస్ అన్నాడు, "వద్దు పీటర్, నీ కత్తి దించు. మనం ఉన్నది కత్తులతో పాఠాలు చెప్పడానికి కాదయ్యా. కత్తి పట్టిన వాడు కత్తికే ఎరవుతాడు. నాకు ఎవరి సహాయం, రక్షణ అవసరం లేదు. ప్రకృతిలోని పన్నెండు శక్తుల్ని నేను ఆహ్వానించగలను. అవి నన్ను రక్షించగలవు. కాని, నేను ఆపని చేయను.

'మాల్కస్, నీకు ఎలాంటి కష్టం కలగదు' అని పీటర్ కత్తి గాటు వేసిన చోట తన చేతితో స్పృశించాడు. తక్షణం రక్తం నిలిచిపోయి గాయం మానింది.

జీసస్ అన్నాడు : "నేను అదృశ్యం కావడం లేదు. కంగారు పడకు. నాకు బ్రతుకుపైన ఆశ ఉంటే నన్ను నేను రక్షించుకోగలను".

జీసస్ శిష్యులు పారిపోతుండగా, పట్టుకోవడానికి జనం వారివెంట పడ్డారు. అందరూ పారిపోయి ప్రాణాలు రక్షించుకున్నారు. చివరివాడు జాన్ వాళ్లకు దొరికాడు. అతని బట్టలు చింపి, నగ్నంగా వదలిపెట్టారు.

మెస్సాలియా అతని దుస్థితి చూచి, జాలిపడి తన ఇంటికి తీసుకు వెళ్లాడు. పీటర్ తన పిరికితనానికి సిగ్గుపడి పోయాడు. జాన్‌తో కలిసి జెరూసలెం చేరుకున్నారు.

◆ ◆ ◆

# 19. ఆత్మ నివేదన

1 మతపెద్ద కైఫస్. జీసస్ వెంట జనం. న్యాయస్థానం జనంతో క్రిక్కిరిసి పోయింది. న్యాయనిర్ణేతలు పూజారులు, మతాధికారులు, న్యాయవాదులు, పుర ప్రముఖులు ఉన్నత స్థానాలలో వరుసగా ఆశీనులైనారు. ప్రవేశద్వారం వద్ద జాన్‌ను పీటర్‌ను నిలిపి వేశారు. ద్వారపాలిక వారిద్దరినీ అనుమానించింది జీసస్ అనుయాయులని. పీటర్ భయపడి మందిరం వెలుపలనే ఉండిపోయాడు. పీటర్‌ను ద్వార పాలిక పలకరించింది.

"నీవు గలీలి నుండి వచ్చిన ఆయన శిష్యుడివా?"

"ఉహూఁ కాదు" అని పీటర్ అబద్ధమాడాడు. నిజం చెబితే తననేం చేస్తారోనని భయపడ్డాడు. జీసస్‌ను తీసుకు వచ్చిన భటులు కొందరు మందిరం బయట చలిమంటలు వేసుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పీటర్ నెగళ్ల దగ్గర చేరి వేడిగాలి పీల్చుకుంటుండగా, అక్కడ ఉన్న ఒకామె అన్నది, "నీవు గలీలి యాసలో మాట్లాడుతున్నావు. నీవు ఆ మనిషి అభిమానివా".

పీటర్‌కు భయం వేసింది, "మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలియడం లేదు. ఆ 'మనిషి' ఎవరో నాకసలు తెలియదు".

అంతలో మరొకరు అక్కడకు వచ్చాడు. అతడు కైఫస్ ఆంతరంగికుడు. జీసస్‌ను పట్టి బంధించిన వారిలో ఒకడతను. పీటర్‌ను పోల్చుకున్నాడు. "రాత్రి ముస్సొరియన్ తోటలో నిన్ను చూచిన జ్ఞాపకం. అవునూ నీవు జీసస్ శిష్యులలో ఒకడివి కదూ".

పీటర్ చివాలున లేచి నిలబడి చిందులు తొక్కుతూ "ప్రమాణ పూర్తిగా ఆ 'ద్రోహి' నాకు తెలియదు. నన్ను నమ్మండి" అన్నాడు.

పీటర్ అలా అంటున్నప్పుడు జాన్ పక్కనే ఉన్నాడు. అతను గ్రహించాడు పీటర్ అబద్ధాలు చెబుతున్నాడని. అతని వేపు గుర్రుగా చూచాడు. అంతలో మందిరం పైన కోడికూసింది. జీసస్ చెప్పిన మాటలు పీటర్‌కు గుర్తుకు వచ్చాయి.

"తెల్లవారుతుందనగా ఒక కోడి కూస్తుంది. అప్పటికి నీవు ముమ్మారు అబద్ధం ఆడతావు". అది జ్ఞాపకం రాగానే పీటర్ మనస్సు కువకువ లాడింది. గుండెలో మంటలు రేగాయి. చీకట్లోకి దూరంగాపోయి వెక్కివెక్కి ఏడవసాగాడు.

కైఫస్ న్యాయమూర్తి స్థానంలో కూర్చున్నాడు. జీసస్‌ను ముద్దాయి స్థానంలో నిలబెట్టారు. కైఫస్ ప్రశ్నించాడు : "జెరూసలెం ప్రజలారా! మీరు నేరస్థుడిగా తెచ్చిన ఆ వ్యక్తి ఎవరు?"

"జీసస్ అనే ఈ మనిషి తానే క్రీస్తువని, ప్రభువునని ప్రచారం చేసు కుంటున్నాడు. అమాయకుల్ని మోసం చేస్తున్నాడు".

కైఫస్ జీసస్‌ను అడిగాడు, "ఏవయ్యా, వారి అభియోగం నిజమేనా? నీవు చెప్పుకోవలసింది ఏమైనా ఉందా? నీ ప్రచారానికి ఆధారాలు ఏవి? నీవు క్రీస్తువని నిరూపించుకోగలవా?"

జీసస్ : "మీది ప్రపంచభాష! నాది దైవభావన. నా మాటలు, చేతలు మీకు నచ్చక పోవచ్చు. అనేక మార్లు బహిరంగంగానే నా భావాలు వ్యక్తం చేశాను. అందులో రహస్యం లేదు. వెళ్లి ప్రజల్ని విచారించండి. నేను చేసినవి తప్పులో ఒప్పులో తెలుస్తుంది".

జీసస్ ఆ మాటలు అంటున్న సమయంలో ఒక యూదు సేవకుడు వచ్చి మొహంమీద కొట్టాడు.

"ఎంత మదం నీకు, మతపెద్ద ముందు మాట్లాడతావా?"

"నేను అబద్ధాలు చెప్పలేదు, నిజమే చెప్పాను. నమ్మటం, నమ్మకపోవటం మీ ఇష్టం".

కైఫస్ : "నీవు ఏంచేసినా రాజ్యాంగచట్టం పరిధిలో చేయాలని నీకు తెలియదా. న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘించకూడదు కదా! మేము రోమ్ పాలకులకు సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుంది. మన మాటలు, చేతలు అధికారులకు, పాలకులకు ఆగ్రహం తెప్పించకూడదు".

జనాలను ఉద్దేశించి కైఫస్ అన్నాడు, "ఈయనపై నేరారోపణ చేసేవారు, అభియోగాలున్నవారు ముందుకు వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయండి".

కొందరు అభియోగాలు రాసి ఇచ్చారు. అన్ని అభియోగాలు చదివిన తర్వాత కైఫస్ అన్నాడు : "జీసస్ ప్రజావిరోధి. తను దేవిడ్ సింహాసనానికి వారసుడనని చెప్పడం మహాపచారం".

ఒకటి : జీసస్ అనే ఇతడు దేవుని అవమానించాడు. తానొక్కడే దేవుని కుమారుడైనట్లు, మిగిలినవారు ఏమీ కానట్లు చెబుతున్నాడు.

రెండు : పవిత్ర దేవాలయాలలో నిషిద్ధరోజుల్లో చికిత్సలు చేశాడు. అది ఆచార విరుద్ధం. అది దైవధిక్కారం.

మూడు : తనే ప్రభువు ననడం అపచారం. తానే 'క్రీస్తు' ననడం మహా ఘోరం.

నాలుగు : ఈ దేవాలయాన్ని నేలమట్టం చేసి, మూడు రోజుల్లో తిరిగి నిర్మింపచేస్తాననడం అన్నింటికన్న అపచారం.

అయిదు : ప్రజలను జెరూసలెం నుండి వెళ్లగొడతాడట. దేవాలయ ప్రాంగణం నుంచి వ్యాపారుల్ని వెళ్లగొడతాడట. ఈ పవిత్ర పర్వతాలపైన దేవుడంటే తెలియని వారిని తెచ్చి పెడతాడట.

ఆరు : మన అర్చకుల్ని, మతాధికారుల్ని బహిష్కరించాలట.

అందరూ ఆ అభియోగ పత్రంపైన సంతకాలుచేసి ఇచ్చారు. అలా సంతకాలు చేసినవారు –

అన్నాస్, సైమన్, అబిసీ, ఆదాబ్, అన్నానియస్, జోష్, అజాలియా, హెజెకియా.

అభియోగాలు ప్రకటించగానే ప్రజలు "అలాంటివాడిని శిక్షించవలసిందే. శిలువ శిక్ష వేయవలసిందే" అని అరిచారు.

కైఫస్ : ఇజ్రాయిల్ ప్రజలారా! మీరంతా ఈ అభియోగాలను ఆమోదిస్తున్నారా?

అప్పటికే లంచాలు తీసుకున్న నూరుమంది పౌరులు నిలబడి తమ ఆమోదం తెలియచేశారు. ప్రతి అభియోగం వాస్తవమేనని ప్రమాణం చేశారు.

కైఫస్ జీసస్‌తో అన్నాడు "ఏవయ్యా! నీవు చెప్పుకోవలసింది ఏమైనా మిగిలి ఉందా. నీవు దేవుని కుమారుడవు కదా!"

జీసస్ : అవును ఆమాట తమరే సభాముఖంగా ఒప్పుకున్నారు.

ఆ పైన జీసస్ మౌనం వహించాడు.

జీసస్ ఇంక నోరు విప్పడని నిర్ధారించుకున్న కైఫస్ లేచి నిలబడి జనాన్ని ఉద్దేశించి అన్నాడు.

"నేరస్థుని గొలుసులతో బంధించండి. యూదు న్యాయస్థానం 'సన్ హెడ్రెన్'కు తీసుకుపోండి. అక్కడ న్యాయ విచారణ జరుగుతుంది. నేరం నిరూపణ అయ్యేవరకు శిక్షించకూడదు. యూదు న్యాయపీఠం విచారించడమే ధర్మం".

★ ★ ★

ఉదయం న్యాయస్థానం కొలువు తీరింది. నిందుతుని నేర పీఠం ఎక్కించారు. నిందారోపకులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. కైఫస్ న్యాయమూర్తి స్థానంలో ఉన్నాడు. న్యాయస్థానం ఉద్యోగి ఒకరు లేచి నిలబడి అభియోగాలు ఏకరువు పెట్టాడు. సాక్షులు నిలబడి ప్రమాణాలు చేశారు.

అప్పుడు నికోడమెస్ లేచి వాదించాడు : "న్యాయం జరగాలి. జీసస్ చెప్పినవి అబద్ధాలని నిరూపించండి. జీసస్ ద్రోహి అని, మోసగాడని అభియోగం చేసినంత మాత్రాన సరిపోదు. నిరూపించండి. ఆయనపైన అసూయతో, ద్వేషంతో వీరు అభియోగాలు చేస్తే ఉండవచ్చు".

అభియోగ పత్రాలు న్యాయమూర్తికి అందాయి. వాటిలో ఏ రెండు ఒక తీరుగా లేవు. ద్వేషపూరితంగా చేసిన అభియోగాలని తెలిసిపోయింది.

"న్యాయస్థానం జీసస్‌ను నిరాధారంగా శిక్షించదలిస్తే శిక్షించండి. శిక్షకు ఈ సాక్ష్యాలు సరిపోవు. ఈ అభియోగాలలో వాస్తవం లేదు".

అందరూ మొహమొహాలు చూచుకున్నారు. గౌరవనీయులైన పెద్ద మనుషులు తటపటాయించారు ఎటూ చెప్పలేక.

కైఫస్ జీసస్‌ను అడిగాడు : దేవుని పైన ప్రమాణం చేసి చెప్పు. నీవు 'క్రీస్తు'వా? దేవుని కుమారుడివా? నిజం చెప్పు?

జీసస్ : నేను ఏం చెప్పినా ఇప్పుడు మీరు నమ్మే స్థితిలో లేరు గదా. నా మాట వినేదెవరు? వినిపించుకునే దెవరు? ఆలకించే దెవరు?

కైఫస్‌కు కోపం వచ్చింది: విన్నారా? ఎంత పొగరుగా సమాధానం చెబుతున్నాడో? ఇంతకన్న న్యాయధిక్కారానికి సాక్ష్యం అవసరం లేదు. చెప్పండి, ఏం శిక్ష విధించాలి?

"మరణశిక్ష విధించండి. చంపండి" జనం అరుస్తూ లేచి మొహం మీద ఉమ్మారు. పిడికిళ్లు బిగించి గుద్దారు.

"ఏయ్ దేవుని కుమారుడా, ఇప్పుడు నీ మొహం మీద కొట్టింది ఎవరో చెప్పుకో".

ఎవరెంత అవమానించినా, అవహేళన చేసినా జీసస్ కిమ్మనలేదు.

కైఫస్ అన్నాడు : "మనం ఎవరినీ చంపకూడదు. చంపే అధికారం మనకు లేదు. రోమన్ చక్రవర్తి మన తీర్పును ఆమోదించాలి. ఇతనిని తీసుకుపోయి చెరసాలలో బంధించండి.

జీసస్‌ను వీధుల వెంట ఈడ్చుకుంటూ, అవమానిస్తూ గవర్నరు భవంతి వరకు తీసుకువెళ్లారు.

**(2)** జీసస్‌ను ప్రధాన ద్వారంలోంచి తీసుకువెళితే జనాన్ని అదుపు చేయడం కష్టమని రహస్య గుమ్మం ద్వారా లోపల ప్రవేశ పెట్టారు. జనం చేస్తున్న హడావిడికి పైలట్ చిరాకు పడ్డాడు.

"ఏమిటి? ప్రొద్దుటే ఈ గొడవ? ఏం కావాలి?"

జనం వివరించారు. పైలట్ అన్నాడు, "నాదగ్గరకు ఎందుకు తెచ్చారు. మీరే విచారించుకోండి. మీకు చట్టం ఉంది. మీ ధర్మం మీకున్నది. రోమన్ ప్రభువు మీ తీర్పుని యధాతథంగా ఆమోదిస్తాడు".

"మాకు శిలువ శిక్ష వేసే అధికారం లేదు. పైగా ఇతను రాజద్రోహి. మీ ప్రభుత్వమే సరైన శిక్ష విధించాలి".

పైలట్ అన్నాడు : "రోమ్ చట్టం ఎవరినీ దోషిగా తీర్పు చెప్పదు. నిరూపణ అయ్యేవరకు ఎవరినీ దోషి అనకూడదు. ఏ నేరస్థుడైనా తన పక్షాన వాదించుకో వచ్చు. మీ అభియోగాలు, సాక్ష్యాలు పరిశీలించవలసి ఉంటుంది".

యూదుల ఫిర్యాదు రోమ్ ఉన్నత న్యాయస్థానానికి బదిలీ అయింది.

వారు చేసేది లేక మరొక ఫిర్యాదు నమోదు చేశారు. "జీసస్ రోమ్ ప్రభుత్వ వ్యతిరేకి అని, టైబీరియన్‌కు కప్పం చెల్లించనవసరం లేదని ప్రజల్ని రెచ్చగొడుతున్నాడని" అభియోగం.

పైలట్ : జీసస్, నీ సంజాయిషీ ఏమిటి! అభియోగాన్ని అంగీకరిస్తున్నావా?

జీసస్ : మీ మానవనిర్మిత న్యాయస్థానంలో నేను చెప్పుకోవలసింది ఏమీ లేదు. అవి కేవలం ఆరోపణలు కదా, వాస్తవాలు కావని అర్థం అవుతోంది.

పైలట్ : ఏది సత్యం? నీవు చెప్పేది సత్యమని నీ అభిప్రాయం.

జీసస్ : సత్యం అంటే భగవంతుడు. తరిగిపోనిది, మొక్కవోనిది, చిరకాలం నిలిచేది సత్యం. భగవంతుని గుర్తించడమే సత్యం. పరమాత్మ ఒక్కటే పరమసత్యం.

పైలట్ యూదు ప్రముఖుల్ని పిలిపించాడు. వారితో అన్నాడు –

"జీసస్ ఏమీ తప్పు చేసినట్లు అనిపించడం లేదు. అతనిని మీరు కోరినట్లు శిక్షించడం కుదరని పని".

జనం పెద్దపెట్టున అరిచి, గోల చేయసాగారు.

"మా న్యాయస్థానం చెప్పింది న్యాయం. ఇతనిమీద ఇరవై అభియోగాలు ఉన్నాయి. అతనిని నిర్దోషిగా వదిలి పెడితే యూదు జాతినే నాశనం చేస్తాడు. రోమ్ సింహాసనాన్ని తన వశం చేసుకుంటాడు. శిలువ శిక్ష వేయండి".

పైలట్ : జీసస్ గలీలికి చెందినవాడు గదా, ఈ అభియోగాలు అక్కడ పాలకుడు చూచుకుంటాడు.

★ ★ ★

(3) హీరోద్ సపరివారంగా జెరూసలెం చేరుకున్నాడు. జీసస్‌పై అభియోగాలు విచారించడానికి. పైలెట్ జీసస్‌ను హీరోద్ వద్దకు పంపాడు.

హీరోద్ జీసస్‌తో అన్నాడు. "నీ గురించి విన్నానయ్యా, నిన్ను చూడాలనీ అనుకున్నాను. చెప్పు నీ సిద్ధాంతం ఏమిటి? నీ బోధనల మర్మం ఏమిటి?"

జీసస్ సమాధానం చెప్పలేదు. హిరోద్‌కి కోపం వచ్చింది.

"అడిగిన దానికి సమాధానం చెప్పక పోవడం రాజధర్మాన్ని అవమానించడం".

సిబ్బందిని పిలిచి సమాధానం చెప్పేవరకు కొట్టమని ఆదేశించాడు. సైనికులు జీసస్‌ను తీసుకువెళ్లి హింసించ సాగారు. కొట్టారు, తిట్టారు. ముళ్ల కిరీటం తలపైన పెట్టారు. అరచేతుల్లో మేకులు దించారు.

జీసస్ నోరు విప్పలేదు. ఓర్పుగా బాధల్ని భరించాడు. హీరోద్ తన నిర్ణయం పైలట్‌కు పంపాడు. జీసస్‌ను తిరిగి పైలెట్ మందిరానికి పంపివేశాడు.

జీసస్‌పై నున్న ఆరోపణలు, అభియోగాలు నిజమే. హీరోద్‌కు పైలట్‌కు పడదు. జీసస్ విషయంలో ఏకాభిప్రాయంతో మిత్రులైనారు.

పైలట్ న్యాయ స్థానంలో నిలబెట్టినపుడు రోమన్ గవర్నరు అన్నాడు : "ఇతను తప్పుచేసినట్లు నాకు అనిపించడం లేదు. ఇతనికి మరణదండన అవసరం లేదు ... నిర్దోషిగా భావించి, విడుదల చేస్తున్నాను".

యూదులు ఆగ్రహంతో కేకలు వేశారు. పైలట్ వారితో అన్నాడు. "కొంచెం సేపు స్థిమితంగా ఉండండి".

తను లోపలి గదిలోకి వెళ్లి ఆలోచించసాగాడు. అతను తీవ్రమైన ఆలోచనలో

ఉండగా అతని భార్య వచ్చింది. ఆమెకు దైవభక్తి ఎక్కువ. మంచి సద్వంశంలో జన్మించిన వ్యక్తి.

మొగుడుతో అన్నది : "మీరు దిగులు పడకండి. గలీలి నుండి వచ్చిన ఆయన రుషి, సత్పురుషుడు. సత్పురుషులను శిక్షిస్తే భగవంతుడు క్షమించడు. రాత్రి నాకో కల వచ్చింది. కల కదా అని కొట్టివేయకండి. ఈయన సముద్రంపైన నడిచి వెళ్లాడు. కాంతి రెక్కలతో తుఫానులో ఎగిరిపోయాడు. జెరూసలెం రక్త ప్రవాహంలో మునిగిపోయింది. సీజర్ల విగ్రహాలు పడిపోయాయి. సూర్యునిపైన నల్లనిముసుగు కప్పినట్లు పగలే చీకటి కమ్మింది. భూమి కంపించింది. దయచేసి మీ చేతులు జీసస్ రక్తంతో కలుషితం చేసుకోవద్దు".

ఆ మాటలు చెప్పి ఆమె వెళ్లి పోయింది. పైలెట్ వెక్కివెక్కి రోదించాడు.

4 యూదులకు మూఢ నమ్మకాలు ఎక్కువ. వారు విగ్రహాలను పూజిస్తారు. ఆ ఆచారం ఇతర దేశాల నుండి తెచ్చుకున్నారు. ప్రతి సంవత్సరం చివరన పెద్ద పండుగ చేసి తాము చేసిన పాపాలను ఇతరుల తలకెత్తుతుంటారు. వారు వీరి పాపాలను భరించాలి. ఆ వ్యక్తి పాపాల భైరవుడు. అందరి పాపాలు భరించేవాడు. ఆ పాపాల భైరవుని తరిమికొడితే, తమ పాపాలన్ని పోతాయని వారి నమ్మకం. వారి పాపాలు భరించడానికి కారాగారం నుండి ఒక ఖైదీని ఎన్నిక చేసుకుంటారు.

జెరూసలెంలోని యూదుల కారాగారంలో అలాంటి పాప భైరవులు ముగ్గురున్నారు. వారికి శిలువ శిక్షపడ్డది. గజదొంగలు, మహాహంతకులకు శిలువ శిక్ష విధిస్తారు. వారిలో బరబ్బస్ ఒకడు. శిలువకు సిద్ధంగా ఉన్నాడు. అతను బాగా ధనవంతుడు. మతాధికారులను డబ్బుతో కొన్నాడు.

పైలట్ ఆలోచించాడు. ఈ భయంకర సంప్రదాయాన్ని, జీసస్‌ను రక్షించడంలో ఉపయోగించాలనుకున్నాడు. యూదు పెద్దలతో చెప్పాడు.

"పెద్దలారా! మీ అచారం ప్రకారం ఈ రోజున ఒక పాపాలభైరవుని మీకప్పగిస్తాను. ఎవరు కావాలో చెప్పండి".

బరబ్బస్‌ను తమకు అప్పగించమని వారు కోరారు. బరబ్బస్ ఇరవై మందిని హత్య చేసిన నరహంతకుడు.

"జీసస్ పైన మీ పాపభారాన్ని మోపి అతనిని తరిమివేయండి. దేశం నుండి అతనిని బహిష్కరించండి".

అలా అయినా జీసస్‌ను మరణం నుండి తప్పించవచ్చునని పైలట్

ఆలోచించాడు. కాని జనం ఆయన మాట వినలేదు. రాజభవనం కూలగొట్టాలని, పైలట్‌నే వెళ్లగొట్టాలని ఆలోచించసాగారు. ప్రజల ఇష్ట ప్రకారం ప్రవర్తించకపోతే అరాచకం తప్పేట్లు లేదు. ఒక గిన్నెతో నీరు తెప్పించి అందరి ముందు చేతులు కడుక్కుని అన్నాడు. "మీరు ద్రోహిగా భావిస్తున్న జీసస్ దేవుని కుమారుడు. నేను నా అజ్ఞానాన్ని అసహాయతను అంగీకరిస్తున్నాను. జీసస్ శరీరం నుండి చిందిన రక్తం నాకు అంటకుండు గాక! ఆ పాపం నాకు తగలకుండు గాక".

జనం అరిచారు : "ఆ రక్తం మీకు అంటదు. మాకు మా సంతానానికి అంటుతుంది".

పైలట్ ఆకులా వజవజ వణికిపోయాడు. జనం ముందు నిలబడిన జీసస్‌ను చూపించి : "ఇదిగో మీ ప్రభువు. మీ చేతులతో మీ ప్రభువును చంపుకుంటారా?"

"అతను మా ప్రభువు కాదు. మాకు 'టైబరస్' తప్ప వేరే ప్రభువు లేదు".

కైఫస్ : "మనకు శిలువ వేసే అధికారం లేదు. రాళ్లతో కొట్టి చంపడం తప్ప వేరే శిక్ష అమలు జరపలేం".

జనం ఆగ్రహంతో జీసస్‌ను తరుముకుంటూ వెళ్లారు. రాళ్ల దెబ్బలకు జీసస్ సొమ్మసిల్లిపోయాడు.

నగరం ప్రవేశ ద్వారం వద్ద బరబ్బస్ కోసం శిలువ సిద్ధంగా ఉంది.

కైఫస్, ఇతర మతగురువులు వచ్చి జీసస్‌కు 'శిలువ' వేయడానికి ఆమోదం తెలిపారు. సిరిస్ నుండి సైమన్ అనే వ్యక్తి జీసస్ మిత్రుడు, అభిమాని. జీసస్ శిలువను మోయలేక బాధపడుతుంటే ఓర్వలేక ఏడ్చాడు. అతని సానుభూతి భరించలేని జనం శిలువను సైమన్ భుజాలకెత్తి నడిపించారు.

(5) తన గురువుకు ద్రోహం చేసిన జుడాస్ ఆ గుంపులోనే ఉన్నాడు. ఇంకా జీసస్ తన మహిమలేవో చూపిస్తాడని, జనంపై తిరగబడి తనను రక్షించు కుంటాడని ఎదురుచూస్తున్నాడు. కాని, జీసస్ ఒంటినిండా గాయాలు రక్తం ఓడుతూ వీధిలో నడవలేక, నీరసించిపోవడం చూచి అతని మనస్సు విల విల్లాడింది. కుళ్లి కుళ్లి ఏడవసాగాడు.

"ప్రభూ ..... నేను పాపం చేశాను. భగవంతుని కుమారుడవైన నీకు ద్రోహం చేశాను. నేను క్షమార్హుడను కాను. నన్ను శిక్షించు తండ్రీ".

అని విలపిస్తూ అక్కడినుండి దేవాలయానికి పరుగెత్తాడు. దేవాలయం చేరేసరికి అక్కడ కుట్రవన్నిన మతాధికారులు కనిపించారు. వారితో

మొరపెట్టుకున్నాడు, "ఇవిగో మీరు నాకు లంచంగా ఇచ్చిన రూకలు తీసుకోండి. ఇది మీరు నా ఆత్మ ద్రోహానికి కట్టిన విలువ. భగవంతుని అవతారమైన జీసస్‌కు నేను ద్రోహం చేసి కుమిలిపోతున్నాను".

"నీ స్వంత విషయం అది. మాకేం సంబంధం లేదు" అన్నారు పూజారులు.

జుడాస్ వెండి నాణాలు వారి మొహాన కొట్టి ఏడుస్తూ వెళ్లిపోయాడు. పోయిపోయి నగరం ప్రహరీగోడపై కెక్కి ఉరివేసుకుని ప్రాణాలు వదిలాడు. అతని శవం హిన్నాన్ నదిలో పడి, కొద్దిరోజులకు గుర్తుపట్టలేనంతగా చీకి పోయింది.

మతపెద్దలు ఆసొమ్ముతో ఒక బీడు ప్రదేశం కొని దిక్కుమొక్కులేని శవాల సమాధులకు దానిని కేటాయించారు. ఆ స్థలంలోనే జుడాస్ శవాన్ని భూస్థాపితం చేయించారు.

**6** జనం తోపులాట, తొక్కిడి ఎక్కువైంది. ఎవరికి వారు ముందుకు వెళ్లి ఒక రాయి విసరాలనుకున్న వారే. ఇద్దరు మేరీలు, మిరియా మరికొందరు మహిళలు జీసస్ వద్ద ఏడుస్తున్నారు. వారి గొంతుకలు విని జీసస్ అన్నాడు -

"నా కోసం ఎవరూ కన్నీరు కార్చవద్దు. నేను వెళ్లినా, శిలువ ద్వారా ప్రయాణించి, మర్నాడు సూర్యోదయానికి మళ్లీ వస్తాను. మిమ్మల్ని కలుస్తాను".

జీసస్ 'అంతిమ' యాత్ర వధ్యమండపానికి చేరింది. అప్పటికే రోమన్ సైనికులు ఇద్దరు నేరస్థులను శిలువకు కట్టి వేశారు. హీరోద్ గలీలి నుండి పిలిపించిన నలుగురు మనుషులు న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు పరచ వలసి ఉంది. జీసస్‌ను హింసించవలసింది వారే. చేతులలో మేకులు కొట్టింది వారే. నేరగాళ్ల దుస్తులు ధరింపచేసింది వారే. 'నువ్వు ప్రభువువా' అని గేలిచేసింది వారే. వారే ఇప్పుడు జీసస్ బట్టలు తీసి శిలువ కెక్కించారు. ఇనుప గొలుసులతో కట్టారు. పాదాలలో మేకులు దించారు. శిలువను పైకెత్తి వేలాడతీశారు. మత్తు పానీయాలు నోటి వద్ద అందించారు. జీసస్ వాటి వాసన చూడలేదు. ఇద్దరు దొంగల మధ్య బరబ్బస్ కోసం నిర్ణయించిన స్థానంలో జీసస్ శిలువ లేచింది. ఆపైన వారిని చివరి శ్వాస వరకు సైనికులు గమనించవలసిందే.

జీసస్ అర్థించాడు : తండ్రీ, భగవాన్ ఈ అమాయకుల్ని క్షమించు. వీరు ఏం చేస్తున్నదీ వీరికే తెలియదు ప్రభూ!

పైలెట్ ఒక ఫలకం తయారుచేసి తెచ్చాడు శిలువపైన తగిలించడానికి. హీబ్రూ, లాటిన్, గ్రీకు భాషల్లో 'యూదుల ప్రభువు జీసస్ క్రీస్తు' అని రాయించి

శిలువపైన తగిలించాడు. యూదు మతాధిపతులకు ఆ రాతలు నచ్చలేదు. వారు జీసస్‌ను క్రీస్తుగా అవసాన సమయంలో అంగీకరించినట్లయింది.

శిలువపైన దీనవదనంతో వేలాడుతున్న జీసస్‌ను చూచి, యూదులు 'ప్రభువు – ప్రభువు' అని హేళన చేశారు. అయిష్టంగా నైనా ఆ పేరు ఉచ్ఛరించడం జరిగింది.

శిలువ పైన ఉన్న ఒకతను అన్నాడు. "నీవు క్రీస్తు వైతే మంత్రం వేసి మమ్మల్ని కాపాడు".

శిలువకు దగ్గరగా గలీలి నుండి, జుడియా నుండి వచ్చిన స్త్రీలు ఉన్నారు. వారిలో జీసస్ తల్లి మేరి, మిరియా లున్నారు.

"అమ్మను, చెల్లిని జాగ్రత్తగా చూచుకుంటావు కదూ" జీసస్ జాన్‌తో చెప్పాడు.

అక్కడి ఆచారం ప్రకారం శిలువ చేసిన వారు, వేయబడినవారి బట్టలు తీసుకోవాలి. జీసస్ బట్టల్ని రోమన్ సైనికులు పంచుకున్నారు. జీసస్ 'అంగారఖా' చిత్రంగా ఉంది. అది చేతిలో నేసిన బట్ట కాదు. కుట్టినది కాదు. అందులో ఒక్క నూలు పోగు లేదు.

**7** సూర్యోదయమై ఆరుగంటలైంది. మిట్టమధ్యాహ్న వేళ అకస్మాత్తుగా చీకట్లు ముసురుకున్నాయి. జనం ఇళ్లల్లో దీపాలు వెలిగించుకున్నారు. ఏదో ఉపద్రవం శంకించారు. కొండలపైన నెగళ్లు మండసాగాయి.

జీసస్ అన్నాడు : "హెలాయ్! హెలాయ్ లమ సబత్ తాని"

భగవాన్, నిన్ను విస్మరించకు.

జీసస్ తనకు దాహం వేస్తుందని అడిగాడు.

తొమ్మిదవ గంటకు భూమి కంపించ సాగింది. చిమ్మచీకటిలో జీసస్ తలచుట్టూ కాంతివలయం బంగారు రంగువలయం ఏర్పడ్డది. ఆ కాంతి వలయం నుండి ఒక వాణి వినిపించింది.

"తండ్రీ! నా ఆత్మను నీకు నివేదన చేస్తున్నాను" అన్నాడు జీసస్.

అతని మరణబాధను చూచి తట్టుకోలేక ఒక రోమన్ సైనికుడు జీసస్ గుండెలో శూలంతో ఒక పోటు పొడిచాడు. ఆ క్షణంలోనే జీసస్ భౌతికంగా మరణించాడు.

మరొక మారు భూమి విలవిల్లాడింది. జెరూసలెం నగరం దయ్యం పట్టినట్లు ఊగింది. కొండలు పగిలాయి. సమాధుల ద్వారాలు తెరుచుకున్నాయి. వీధుల్లో దయ్యాలు, భూతాలు స్వైరవిహారం చేసినంతగా జనం భయపడ్డారు. దేవాలయం గజగజ వణక సాగింది. శిలువపైన జీసస్‌ను చూస్తున్న రోమన్ సైనికుడు "ఈయన నిస్పందేహంగా దేవుని కుమారుడే" అనుకున్నాడు. మతాధిపతులు, అర్చక స్వాములు ప్రాణభయంతో పరుగులు తీశారు.

సబ్బత్ నాడు ఎవరిని శిలువపైన ఉంచరాదన్నది ఆచారం. శిలువ వేసిన వారిని క్రిందికి దించమని జనం పైలట్‌ను అర్థించారు. యూదు ప్రముఖులు ఇద్దరు పైలెట్‌ను కలిసి జీసస్‌ను క్రీస్తుగా తాము నమ్ముతున్నామని విన్నవించారు. ఆ వచ్చినవారు రబ్బీ జోసెఫ్ నికోడమస్. జీసస్ పార్థివ శరీరాన్ని తమకు అప్పగించమని వారు అర్థించారు. పైలట్ అందుకు సమ్మతించాడు.

సైనికులు వచ్చి 'నజరత్' మనిషి చనిపోయాడని, మిగిలిన ఇద్దరు బ్రతికే ఉన్నారని చెప్పారు. వారినీ బల్లాలతో పొడిచి చంపమని పైలెట్ ఆదేశించాడు.

రబ్బీ జోసెఫ్, నికోడమస్‌లు జీసస్ భౌతిక కాయాన్ని సమాధి నిమిత్తం తీసుకువెళ్లారు. రాతి సమాధి నిర్మించారు. జీసస్ శరీరాన్ని లోపల ఉంచి ఒక బండరాయిని మూత పెట్టారు.

యూదు మతాధికారులకు అనుమానం జీసస్ అభిమానులు మిత్రులు వచ్చి జీసస్ శవాన్ని తీసుకుపోతారని. ఆ మర్నాడు జీసస్ సమాధి నుండి లేచి వచ్చినట్లు ప్రచారంచేసి ఆయనే క్రీస్తు అని చెబుతారని భయపడి, పైలట్‌కు ఫిర్యాదు చేశారు.

పైలట్ అన్నాడు "నేను ఒక్క రోమన్ సైనికుని పంపను. మీరే వెళ్లి కాపలా కాసుకోండి సమాధి దగ్గర".

ఆ రాత్రి నూరు మంది యూదు సైనికులు జీసస్ సమాధి వద్ద శవ జాగరణకు సిద్ధమైనారు.

◆ ◆ ◆

# 20. మహాభినిష్క్రమణ

(1) జీసస్ భౌతిక కాయాన్ని సమాధి చేసింది ఒక తోటలో. దానిని సిలోమ్ తోట అంటారు. అది జోసెఫ్ ఇంటికి దగ్గర. జీసస్ సమాధి వద్ద కాపలా సరిగా ఉందో లేదో తెలుసుకోమని కైఫస్ కొందరు స్థానికుల్ని పురమాయించాడు. సమాధి ద్వారానికి అడ్డుగా ఉన్న బండను తొలగించి లోపల శవం భద్రంగా ఉందని వారు నిర్ధారణ చేసుకున్నారు. తర్వాత ఆ బండను ద్వారానికి అడ్డంగా జరిపి తృప్తి పడ్డారు.

పైలట్ ఒక రాజోద్యోగిని పంపి సమాధిపైన రాజముద్ర వేయించాడు. ఎవరైనా బండను కదిలిస్తే ముద్ర చెదిరిపోతుంది. అలా బండను తొలగించడం అంటే మరణశిక్షను ఆహ్వానించడమే. యూదు సైనికులు కైఫస్‌కు మహా విశ్వాస పాత్రులు. కంటిపై కునుకులేకుండా పహరా కాస్తున్నారు. అర్ధరాత్రివరకు అంతా సవ్యంగానే జరిగింది. అర్ధరాత్రి దాటగానే అకస్మాత్తుగా సమాధిపైన పెద్ద వెలుగు పడ్డది. తోటలోకి తెల్లటి బట్టలు కట్టుకున్న సైనిక పటాలం నిశ్శబ్దంగా ప్రవేశించింది. సమాధి వద్దకు వచ్చి చుట్టుముట్టారు. యూదు సైనికులు అప్రమత్తంగానే ఉన్నారు. వచ్చిన వారు జీసస్ మిత్రులో, అభిమానులో అయి ఉంటారని, సమాధిలోని జీసస్‌ను తీసుకుపోవడానికి వచ్చి ఉంటారని భావించారు. సైన్యాధిపతి ఒక్కసారిగా గావు కేక పెట్టాడు. సైనికులు కత్తులు, కటార్లు దూసి, వచ్చిన వారి మీదకు దూసుకుపోయారు. తెల్లసైన్యంలో ఒక్కరికీ చిన్నగాయం కూడా కాలేదు. వారి కదలికకు అంతరాయం కలుగలేదు. సమాధిపై నున్న రోమన్ అధికార ముద్ర తొలగింది. యూదుసైనికులు పిక్కబలం చూపి పారిపోయారు. కొందరు కిందపడి స్పృహ కోల్పోయారు. తెల్లసైన్యం వెళ్లి పోయేవరకు యూదు సైనికులు ఒక్కరు కదలలేదు. కిమ్మనలేదు. వారు వెళ్లిన తర్వాత సమాధిపై పరచుకున్న కాంతి వెలుగు క్రమంగా తగ్గిపోయింది.

అప్పుడు స్పృహ వచ్చి యూదుసైనికులు జీసస్ సమాధిని చూచారు.

అంతా యదావిధిగా ఉంది. రాజముద్ర అలాగే ఉంది. సమాధి మూత బండ అలాగే ఉంది. తిరిగి కాపలా మొదలెట్టారు.

సిలోమ్ తోట నిశ్శబ్దంగా ఉంది. యూదు సైనికులు వేయి కళ్లతో సమాధిని కాపలా కాస్తున్నా, జరగవలసింది జరిగిపోయింది. అర్ధరాత్రి తర్వాత ప్రతి యూదు సైనికునికి వినిపించిన స్వరం "అడోన్ మషిబ్ కుమి" (ప్రభువు క్రీస్తు లేచాడు) సైనికులు అనుకున్నారు. జీసస్ అభిమానులెవరో వచ్చి జీసస్ శరీరాన్ని తీసుకుపోతారని కత్తులు దూసి శత్రువుల్ని ఎదిరించడానికి సిద్ధంగా ఉన్నారు. మళ్లీ అవే మాటలు వినిపించాయి. ఆ మాటలు ఎక్కడ నుండో వచ్చినట్లు కాక, తమలోంచి వెలువడుతున్నట్లు అనిపించింది. ఎక్కడా మనిషి అలికిడి లేదు. సైనికులకు కంపరం కలిగింది. అలాగే మిడిగుడ్లు వేసుకుని చూడసాగారు.

సూర్యోదయం అవుతుండగా, మరల అవే మాటలు వినిపించాయి. ఆకాశం ఒక్కసారిగా వెలుగులు నింపుకుంది. ఎక్కడో ఉరుము ఉరిమి మెరుపు మెరిసింది. భయంకర తుఫాను రానున్న హెచ్చరిక. భూమి కంపించసాగింది. ఆకాశం నుంచి ఒక రూపం భూమికి దిగి వచ్చింది. ఎవరో దేవదూత దిగి వచ్చారని సంబరపడ్డారు. ఆకాశం నుండి దిగివచ్చిన దేవదూత జీసస్ సమాధిపై నున్న ముద్రికను ఛేదించాడు. అడ్డంగా ఉన్న బండరాయిని విసిరి వేశాడు "జీసస్ .... లే. సూర్యోదయమైంది" అనగానే జీసస్ లేచి దేవదూత పక్కన నిలబడ్డాడు.

యూదుసైనికులు కొందరు భయంతో మూర్ఛపోయారు. కొందరు చూస్తూ ఉండిపోయారు. జీసస్ భౌతికశరీరం క్రమంగా ఈథర్ శరీరంగా మార్పు చెంది అంతలోనే అదృశ్యమైంది. సమాధి శూన్యంగా మిగిలింది. సమాధిలో శూన్యం మిగిలింది.

సైనికులు భయంతో జెరూసలెం పరుగెత్తి కైఫస్‌కు జరిగింది వివరించారు. కైఫస్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి జీసస్ సమాధి నుండి తప్పించుకు పోయిన సంగతి ఎవరికీ తెలియనివ్వవద్దని ప్రకటించాడు. ఎవరూ చెప్పకపోయినా జీసస్ దేవుని కుమారుడేనని అప్పటికే జనంలో నమ్మకం కలిగింది.

(2) జీసస్‌ను సమాధి చేసినప్పుడు తల్లి మేరి, మాగ్దలీన్ మేరి, మిరియా అక్కడే ఉన్నారు. కార్యక్రమం అయిన తర్వాత జోసెఫ్ ఇంటికి వెళ్లారు. తర్వాత యూదు సైనికులు సమాధిని కాపలా కాయడం, ఆపైన జరిగిన సంఘటనలు వారికి తెలియదు. ఉదయం సమాధి పూజచేయడానికి తోటకు వచ్చారు. తోటలో ప్రవేశిస్తుండగా సైనికులు కంగారుగా ఎదురైనారు. సమాధి స్థలానికి చేరి ఆశ్చర్యపోయారు. సమాధి తెరచి ఉంది. లోపల జీసస్ శవం లేదు.

ఆ విషయం చెప్పడానికి మేరి మాగ్దలీన్ హుటాహుటిన జెరూసలెం బయలు దేరింది. త్రోవలో పీటర్, జేమ్స్, జాన్‌లు ఎదురుపడ్డారు. ఎవరో సమాధిలోని ప్రభువు శరీరాన్ని తస్కరించారని చెప్పింది. శిష్యులు ముగ్గురు పరుగులు తీశారు. గురువు మాటలు నిజమైనాయి. 'సమాధి చెందిన మర్నాడు సమాధి నుండి తను లేస్తాన"ని చెప్పాడు. మేరీ మనస్సు శూన్యంగా ఉంది. నిశ్చలంగా, నిర్మలంగానూ ఉంది. ఆమె సమాధిలోకి శూన్య దృక్కులతో చూస్తుండగా లోపల లీలగా ఇద్దరు మహర్షుల రూపాలు కదిలినట్లనిపించింది.

వారిద్దరు మేరీతో అన్నారు ..... "ఎందుకు విచారిస్తావు?"

మేరీ అన్నది : "ప్రభువు కనిపించడం లేదు. ఎక్కడకు వెళ్లాడో మరి! ఎవరు తీసుకుపోయారో?"

ఆమె సమాధి దాపుల అటు ఇటు తిరుగుతుండగా ఒక మహర్షి దగ్గరగా వచ్చి అడిగాడు, "ఎందుకు విచారం! ఎందుకీ ఆరాటం? ఎవరి కోసం?"

ఆ ప్రశ్నలు వేసింది తోటమాలి అనుకున్నది మొదట.

"నువ్వే ప్రభువు శరీరాన్ని దొంగిలించావా?"

ఆ మహర్షి రూపం ఆమె దగ్గరగా వచ్చి "అమ్మా" అని పిలిచింది. అది జీసస్ గొంతుక. గుర్తించింది. మేరీ, మిరియం జీసస్‌ను దర్శించి తన్మయులైనారు. జీసస్ అన్నాడు "శిలువ వద్ద చెప్పాను కదమ్మా. నా సమాధి వద్ద మిమ్మల్ని కలుస్తానని".

అల్లంత దూరంలో ఉన్న మేరి మాగ్దలీన్ దగ్గరగా వెళ్లింది.

"అమ్మా, సజీవంగా ఉన్నవారిని విగత జీవులు పరామర్శించడం ఆశ్చర్యంగా ఉంది కదూ. నేను చెప్పినట్లు మరల వచ్చానమ్మా! నేను మీ జీసస్ నమ్మా".

సలోమి, జాన్, జేమ్స్, మేరీ, జొన్నా ఇంకా అనేకులు జీసస్‌ను పలకరించి, పరవశించారు.

జీసస్ సమాధి నుండి బయటకొచ్చిన వార్త, శిష్యులు చెప్పినా ఎవరికీ నమ్మకం కుదరలేదు. వారు భ్రమపడ్డారనుకున్నారు. తోటలోకి వెళ్లి తోటమాలిని రాత్రి జరిగిన సంఘటనలు చెప్పుమని అడిగారు. అంతలో దూరంనుంచి ఒక వ్యక్తి రావడం జరిగింది. ఆయన చిరునవ్వుతో "నేను" అన్నాడు. ఆయన జీసస్.

ముగ్గురు శిష్యులు పీటర్ జేమ్స్ జాన్‌లతో జీసస్ అన్నాడు.

"మనిషి భౌతిక శరీరం వదలిన తర్వాత దివ్యశరీరం ఏర్పడుతుంది. ఆ దివ్య శరీరం కామరూపి, తన ఇష్టం వచ్చిన రూపం ధరిస్తుంది. ఎప్పుడు ఏ రూపం అవసరమైతే ఆ రూపం ధరిస్తుంది. ఇప్పుడు నా దివ్యశరీరం మీరు గుర్తించగల రూపాన్ని ధరించింది. మరొక రూపం ధరించి వస్తే మీరు నన్ను 'నన్ను'గా గుర్తించరు. మీరు వెళ్లి థామస్‌తో చెప్పండి ఇతర శిష్యులకు చెప్పండి. యూదులు, రోమనులు నేను చనిపోయానని సంబరపడుతున్నారు. నాకు మరణం లేదని చెప్పండి. నేను సిలోమ్ తోటలో తిరుగుతున్నానని, మీతో మాట్లాడానని చెప్పండి. జెరూసలెంలో దేవాలయ ప్రాంగణంలో మతాధికారుల గుండెల్లోకి వస్తానని చెప్పండి. వారి ముందు నుండే గలీలికి వెడతానని చెప్పండి. మహాత్ములు ఎన్నటికీ మరణించరని, మహర్షులు మరణానికి అతీతులని చెప్పండి".

**(3)** పునరుత్థానం జరిగిన నాటి సాయంత్రం అక్కడకు ఏడు మైళ్ల దూరంలో, జీసస్ మిత్రులిద్దరు జాకస్, క్లియోఫస్‌లు ఇళ్లకు వెళుతుండగా, ఒక వ్యక్తి వచ్చి వారితో మాటలు కలిపాడు.

అతను అడిగాడు : మిత్రమా! ఎందుకంత దిగులుగా ఉన్నారు. ఏదో ప్రియమైన వారిని పోగొట్టుకున్నట్లు అనిపిస్తోంది?

క్లియోఫస్ అన్నాడు : నువ్వు జుడియాకు కొత్త వాడివిలా ఉన్నావు. ఇక్కడ జరిగిన ఘోర సంఘటన నీకు తెలిసినట్లు లేదు.

ఆగంతకుడు : ఏమిటా ఘోరం! అంత గొప్ప విషాద సంఘటనా?

క్లియోఫస్ : అవును బాబూ! మా గలీలి మహర్షి జీసస్ తెలుసుగదా! సాక్షాత్తు ఆయన భగవంతుని అవతారుడు, క్రీస్తు. ఆయన్ని జెరూసలెం పొట్టన పెట్టుకుంది.

ఆగంతకుడు వారితో కలిసి వారి ఇంటికి వెళ్లాడు. రాత్రి వారితో కలిసి భోజనం చేశాడు.

అతను వెళ్లిపోయిన తర్వాత వారికి అనుమానం వచ్చింది. ఆ వచ్చిన వ్యక్తి 'జీసస్' అని. జీసస్ ఆత్మశరీరం అని. జీసస్ ఆత్మ మరొక రూపంతో వచ్చి తమ ఆతిధ్యం స్వీకరించాడని.

అదేరోజు సాయంత్రం పదిమంది శిష్యులు బెతానిలో సైమన్ ఇంట సమావేశమైనారు. వారిలో థామస్ ఒక్కడు లేదు. తలుపులు లోపల గట్టిగా

గడియపెట్టారు. ఎవరైనా చూస్తే తమని గుర్తుపట్టి తరిమి వేస్తారని భయం. వారు మాట్లాడుతుండగా జీసస్ రూపం వారి ముందు ప్రత్యక్షమైంది.

"అంతా బాగున్నారా?" అని జీసస్ అందరిని పరామర్శించాడు.

శిష్యులు నోళ్లు వెళ్లపెట్టారు. ఎవరి నోట మాట రాలేదు. భయంతో వణికిపోయారు. తమని జీసస్ దయ్యమై అనుసరిస్తున్నాడని అనుమానించారు.

జీసస్ : ఎందుకా కంగారు, కలవరం, అనుమానం? నేను దయ్యాన్ని కాను. భూతాన్ని కాను. జీసస్‌ను. నేను సజీవంగా వచ్చాను. భయపడకండి. నేను చనిపోయినా మళ్లీ బ్రతికి వస్తానని మీకు అనేకమార్లు చెప్పాను. అప్పుడు ఎవరూ నమ్మలేదు. ఇప్పుడు మీకు నమ్మకం కలిగిందా? దయ్యాలకు, భూతాలకు ఇలా శరీరం ఉండదు. నన్ను స్పృశించి, నిర్ధారణ చేసుకోండి".

ఒక్కొక్కరు లేచి, జీసస్ చేతిని ముద్దాడారు. పాదాలు సైతం స్పృశించారు. జీసస్ చేతుల్ని తమ తలపై పెట్టుకున్నారు.

హడావుడిగా వెళ్లి తినుబండారాలు తెచ్చారు. జీసస్ వాటిని అందరికీ తన చేతితో పంచాడు. అప్పటికి నమ్మకం కుదిరింది. అంతలోనే జీసస్ రూపం అదృశ్యమైంది.

అదే సమయంలో మేరీ, మార్తా, రూత్, లాజరస్‌లు ఇంట్లో జీసస్ పునరుత్థానం గురించి ముచ్చటించుకుంటున్నారు.

"అలా జరగడం సాధ్యమా? ఎప్పుడూ వినలేదు" మార్తా అనుమానం.

మేరీ అన్నది : జీసస్ చనిపోయిన వారెందరినో బ్రతికించాడు కదా. అలాగే తాను బ్రతికి రావచ్చు.

అంతలో జీసస్ రూపం వారి మధ్య దర్శనమిచ్చింది.

"అవును. నేనే". మార్తా పరుగున వెళ్లి ఒక కుర్చీ తెచ్చి వేసింది. ఆ కుర్చీ జీసస్ కిష్టమైంది. జీసస్ ఆ కుర్చీలో విశ్రమించాడు. గడచిన సంగతులు చెప్పుకున్నారు.

జీసస్ అన్నాడు : "ధైర్యంగా ఉండండి. నేను ఎప్పుడూ మీ వెంట ఉంటాను".

అని చెప్పి అంతర్ధానమైనాడు.

**(4)** భారతదేశంలోని ఒరిస్సా (ఉత్కళ) చక్రవర్తి రవణ్ణ గొప్ప కళా పోషకుడు. ఆయనకు సాహితీపరులన్నా, సత్పురుషులన్నా ఇష్టం. దేశ దేశాల నుండి వచ్చే

కవి పండితులకు, యోగులకు, తన భవనంలో సత్కారాలు, సన్మానాలు చేస్తుంటాడు. తరచు సభలు, గోష్ఠులు నిర్వహిస్తూ ఉంటాడు.

జీసస్ చిన్నతనంలో భారతదేశం వచ్చినప్పుడు రవణ్ణ యువకుడు యువరాజు. ఇప్పుడు తానే రాజు. ప్రాచ్య పండితులతో, వేత్తలతో సమావేశం జరుపుతున్నాడు. వచ్చిన అతిధులలో మెంగ్‌స్తే, లమాసా, విద్యాపతి కూడా ఉన్నారు. వీరు ముగ్గురు జీసస్ నెరిగినవారు. సమావేశం అధ్యాత్మిక విలువలపైన, వికాసం పైన చర్చిస్తోంది. ఆ సమావేశ మందిరం సింహద్వారం తూర్పువైపుగా ఉంది. మందిరంలో తూర్పున ఒక అసనం ఖాళీగా ఉంది. వారు తీవ్రంగా చర్చిస్తుండగా ఒక వ్యక్తి మందిరంలో ప్రవేశించి, అందరికీ అభివాదం చేశాడు. ఆయనచుట్టు తేజోవలయం. ఆయనలో బ్రహ్మ తేజస్సు. ఆయన ప్రవేశించడంతో మందిరం మొత్తం వెలుగు ప్రసరించింది. అందరూ అసంకల్పితంగా నిలబడి ఆ తేజస్వంతునికి స్వాగతం పలికారు. ఖాళీగా ఉన్న ఆసనంపైన ఉపవిష్టుని చేశారు. ఆ వచ్చినవాడు హీబ్రూ మహర్షి జీసస్ అయిఉండవచ్చునని అందరికీ ఒక భావన ఒకే సమయంలో కలిగింది.

వెంటనే జీసస్ వారి మనోగతాన్ని గుర్తించినట్లు అన్నాడు :

“అవును. నేను నేనే. నేను క్రీస్తుగా వచ్చాను. జీసస్‌గా నన్ను మీరు ఎరుగుదురు. నేను మృత్యువును జయించాను. అమృత సిద్ధిని పొందాను. నేను సాధించిన విజయం ముందు ముందు అందరూ సాధించాలి”.

లేచి ప్రతిఒక్కరితో కరచాలనంచేసి, అందరినీ పరామర్శించాడు.

“నేను గాలిని కాదు, ధూళిని కాదు, ఆకాశాన్ని కాదు, భూమినీ కాదు. ఎంతదూరమైనా క్షణాలలో పయనించగలను. అదృశ్యం కాగలను”.

అందరు నిరుత్తరులై చూడసాగారు.

“నేను వెళ్లిపోతాను. మీరు దివ్యత్వం గురించి బోధించాలి. దివ్య విభూతులు పంచిపెట్టవలసింది మీరు. మనిషి మృత్యువును జయించగల దన్న సత్యాన్ని బోధించండి. ఈ సిద్ధాంతాన్ని విశ్వసించిన వారికి మృత్యువు లేదు. మరణించినా తిరిగి స్వ ఇచ్ఛతో జన్మిస్తారు”.

జీసస్ క్షణంలో గాలిలో కలిసిపోయాడు.

“జీవునికి మరణం లేదు” అన్న సిద్ధాంతం భారతదేశంలో స్థిరపడ్డది.

**(5)** అక్కడ పర్స్ పోలిస్‌లోని 'కస్పర్'లో సమావేశాలు జరుగుతున్నాయి. నాడు బెత్లహాం వెళ్లి జీసస్ జననాన్ని గుర్తించి, అభినందించి వచ్చిన దైవజ్ఞులకు ఇప్పుడు జీసస్ స్మృతిలో మెదలసాగాడు. వారు సంకల్పించినదే తడవుగా జీసస్ వారి ముందు ప్రత్యక్షమైనాడు. జీసస్ తలచుట్టు తేజోవలయం – ఆయన 'ఆత్మశరీరి' అని చెప్పక చెబుతోంది.

కస్పర్ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నాడు. "మహర్షి మండలానికి చెందిన ఒక మహర్షి ఇప్పుడు మన మధ్య ఉన్నారు. మనందరం ఆయనను సంకల్పించి ఆవాహన చేసుకుందాం. ఆ మహర్షి 'ఆత్మ' ఇక్కడ సంచరిస్తున్నది".

సంకల్పం చేయగానే జీసస్ ఆత్మశరీరం వారి ఆత్మకు దర్శన మిచ్చింది. అందరూ 'ఓం శాంతిః శాంతిః శాంతిః' అని శాంతి మంత్రాన్ని జపించారు. ఆ మంత్రం మహాత్ములకు ఆహ్వాన గీతం. అది మార్మికత్వాన్ని భక్త రహితం చేయడం. మృత్యు రహస్యాన్ని విప్పి చెప్పడం. మనిషి భౌతికంగా ఉంటూనే అమృతత్వాన్ని సాధించ గలడు. మృత్యువును జయిస్తాడు.

"మీరు చూస్తున్న నా ఈ రూపం భౌతికం కాదు. ఇది అభౌతికం. ఇది కాంతిఅణు కిరణ సమాహారం. ఇది తేజస్సుకు ఆకృతి. మానవ భౌతికత్వం కాంతిలో లయించి, ఆకాశతత్వంలో కరిగి మరల అవసరపడినప్పుడు సూక్ష్మరూపాన్ని సంతరించుకుంటుంది. ఇది ఆత్మికమైన, ఆత్మగతమైన ఈశ్వర తత్వం. ఇది భౌతిక అభౌతిక విన్నాణం, నిర్మాణం".

**(6)** ఆదివారం నాడు జెరూసలెం ఆలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో పెద్దలు, పండితులు, పూజారులు సమావేశమైనారు. జీసస్ మరణం వారికి ఆనందం కలిగించినా, సమాధి నుండి జీసస్ మాయమైన విషయం మింగుడు పడడం లేదు. దానిని ఆకళింపు చేసుకోలేకపోతున్నారు. ఎప్పుడు ఏ ఉపద్రవం వచ్చి పడుతుందోనని భయపడుతున్నారు. అంతలో ఒక అపరిచితుడు లోపలకు వచ్చాడు. ఆయన ధరించిన బట్టలు 'జాలరి'వి అనిపించాయి. లోపలకు రాగానే అడిగాడు : "క్రీస్తుగా వ్యవహరించబడుతున్న జీసస్ ఏమైనాడు? ఆయన ఈరోజు దేవాలయంలో ప్రసంగించడం లేదా?"

ఒక యూదు అన్నాడు : ఎవరయ్యా! ఆ గలీలి మనిషా? ఇంకెక్కడ జీసస్. ఆయన్ని వారం క్రితమే శిలువ వేశాం. అతనో పెద్ద మోసగాడు.

జాలరి : అలాగా. ఆ మహాత్ముని ఎక్కడ సమాధి చేశారో చెప్పగలరా!

"మాకు తెలియదు. అతని శిష్యులో, అభిమానులో అర్ధరాత్రి వేళ వచ్చి, సమాధి తెరిచి అతని శవాన్ని తస్కరించుకుపోయారు. పైగా, ఆయన గారు సమాధిలోంచి లేచివచ్చాడని ప్రచారం చేసుకుంటున్నారట".

జాలరి : ఆయనగారి శిష్యులే దొంగిలించారని ఎలా చెప్పగలరు? దొంగతనం చేస్తున్నప్పుడు మీరెవరైనా చూచారా?

"వందమంది సైనికులు కాపలా ఉన్నారు. వారిలో ప్రతిఒక్కరు సాక్ష్యం చెబుతారు. ఆయన శిష్యులే ఆ పనిచేసినట్లు".

జాలరి : ఏదీ. ఆ వందమందిలో ఒక్కరిని వచ్చి చెప్పమనండి.

"మాకు అదంతా తెలియదయ్యా. వారు మా మనుషులు. వారి మాట మేం నమ్మాం!"

జాలరి : మీరు పెద్దమనుషులు. నా మాట నమ్మండి. నేను ప్రత్యక్ష సాక్షిని. మీ వందమంది సైనికులతో పాటు ఆరాత్రి నేనూ సిలోమ్ తోటలో ఉన్నవాడిని. అప్పుడు మీ వంద మందిలో ఒక్కడూ నన్ను చూచినట్లు చెప్పలేదు. జీసస్‌ను ఎవరూ తస్కరించలేదు. నేను ప్రమాణం చేసి చెప్పగలను. తనే, స్వయంగా లేచివెళ్లాడు".

"ఇది మీరు సమాధి చేసిన శరీరమే. నాకు మరణం లేదు అని చెప్పడానికే వచ్చాను".

అక్కడ ఉన్నవారికి ఆగ్రహం కలిగింది. ఆగంతకుని పట్టి బంధించాలని ప్రయత్నించారు. అంతలో జాలరి కాంతిరూపంగా మారిపోయాడు. ఆ కాంతిని తట్టుకోలేక భయంతో అందరూ పారిపోడానికి యత్నించారు.

**7** మిత్రులు చెప్పినప్పుడు థామస్ నమ్మలేదు. ఇక్కడ స్వయంగా చూచి అవాక్కయినాడు. అతనికి మూర్ఛవచ్చినంత పనైంది.

అదే రోజు సాయంత్రం బెతానిలో సైమన్ ఇంట్లో పదకొండు మంది శిష్యులు సమావేశమైనారు. తలుపులు లోపల గడియవేసి మాట్లాడుకుంటున్నారు. జీసస్ రూపం మూసిన తలుపుల్లోంచి వచ్చింది. జీసస్ థామస్‌తో అన్నాడు. "నీవు నన్ను నమ్మవు కదూ. పోనీ నన్ను నేనుగా అయినా గుర్తించావా?"

జీసస్ అంతలో అంతర్ధానమైనాడు. శిష్యుల నమ్మకం మరీ బలపడింది.

(8) గ్రీసులో అపోలో మహాశయుడు తాత్వికుల బృందంతో చర్చిస్తున్నవేళ డెల్ఫియన్ వనంలో ఒక దివ్యవాణి వినిపించింది. పూజారులు దేవతా విగ్రహం ఎదుట నిలబడ్డారు. దేవతా విగ్రహం లోంచి ముందుగా కాంతిచ్ఛటలు వెలువడి తర్వాత దివ్యవాణి వినిపించింది. పూజారులు భయభ్రాంతులైనారు. అలా జరిగితే దేవతలకు మనుషుల పైన ఆగ్రహం కలిగినట్లు గుర్తు. కొంతసేపటికి అగ్ని కీలలు ఆగిపోయాయి. విగ్రహం నిలిపిన రాతిపలకపైన ఒక వ్యక్తి ప్రత్యక్షమైనాడు.

"దేవుడు మనుషులతో మాట్లాడడానికి రాతి విగ్రహాలు, కొయ్యబొమ్మలు అవసరం లేదు. ఇకపైన మనిషి హృదయమే దేవుని అవాసం. ఇకపైన ఈ విగ్రహాలు స్పందించవు. సందేశాలివ్వవు".

అపోలో ఆ వ్యక్తిని పోల్చుకోగలిగాడు. ఆయన జీసస్ మహాశయుడు ఒకప్పుడు ఆరోపోలిస్ లో విగ్రహారాధనను వ్యతిరేకిస్తూ ప్రసంగించినవాడు.

(9) రోమ్‌నగరంలో పాలెటెన్ లో క్లాడస్, అతని భార్య జులియట్ ఒకప్పుడు గలీలి వెళ్లి జీసస్ బోధలు విన్నారు. ఇప్పుడు ఆ దంపతులు టైబర్ నదిపైన ఒక ఓడలో ప్రయాణం చేస్తున్నారు. సముద్రం పైన తుఫాను చెలరేగింది. దాని ఉధృతికి క్లాడస్, జులియట్ ప్రయాణం చేస్తున్న ఓడ నీట మునిగే ప్రమాదం ముంచుకొచ్చింది. వారి ముందు జీసస్ ప్రత్యక్షమైనాడు. అలల మీద నడచి వచ్చి, చేయి అందించాడు. వారిద్దరు జీసస్‌తో కలిసి నీటిమీద నడుస్తూ ఒడ్డుకు చేరారు.

జీసస్ వారితో అన్నాడు, "నేను క్రీస్తును. నాకు మతం లేదు. మరణం లేదు. పూర్వకాలంలో దేవుళ్లు వచ్చి మనుషులతో మాట్లాడేవారు. ఇకపైన దేవుళ్లు దిగిరారు. కనిపించరు. మనిషిలోనే దైవత్వం కనిపిస్తుంది. మానవుడే మహనీయుడు".

మృత్యువు మనిషికి వరం. మరణించిన మనిషిలో దివ్యత్వం రూపుమారి, భౌతికశరీరం పూర్తిగా నశించిన తర్వాత దివ్య శరీరంగా రూపు దాల్చుతుంది. అలా పూర్తిగా లయించడమే మృత్యువు. దివ్యత్వం పొందడం పునరుత్థానం.

(10) అపొస్టల్స్ గలీలి లోనే ఉన్నారు. ఆడవారు జోడియా వెళ్లారు. పీటర్, జేమ్స్, జాన్, ఆండ్రూ, ఫిలిప్, నథానియల్, జునా, జుబేరీలు రాత్రంతా సముద్రం మీద చేపల వేటకు వెళ్లి ఉదయం ఉత్తి చేతులతో వచ్చారు. వారు తిరిగి వచ్చేవేళకు తీరంలో ఒక దివ్య పురుషుడు వారికోసం ఎదురు చూస్తున్నాడు.

"ఇంకా ఎన్నాళ్లు ఇలా చేపలు పడతారు. నాతో రండి". వారు మంత్రం వేసినట్లు ఆయన వెంట వెళ్లారు. బెతానిలో మేరీ, సలోమిలను కలుసుకున్నారు. ఆపైన మార్తా, రూత్, మిరియం, లాజరస్‌లను కలుపుకుని గలీలి చేరుకున్నారు.

జీసస్ అందరికీ దూరంగా జరిగి చేతులెత్తి ప్రార్థించాడు. అందరు చూస్తుండగా జీసస్ శరీరం కాంతివంతంగా మారింది. రెండు రెక్కలతో ఆకాశంలోకి ఎగిరిపోవడం అందరూ గమనించారు. జీసస్ రూపం అరూపమైంది. ఆకాశంలో అంతర్హితుడైనాడు.

అంతవరకు తాము చూచింది వాస్తవమా, భ్రమా, ఎవరికీ ఏమీ అర్థం కాలేదు!!!

**అది మహాత్మాజీసస్ మహాభినిష్క్రమణ**

# మాస్టర్ యోగాశ్రమం ప్రచురణలు

శ్రీశార్వరి రచనలు

**తెలుగు**

**కొత్త పుస్తకాలు**

| | | |
|---|---|---|
| 1. | మహాత్మా జీసస్ | 100/- |
| 2. | యోగప్రభ | 100/- |
| 3. | అసతోమా సద్గమయ | 60/- |
| 4. | తమసోమా జ్యోతిర్గమయ | 60/- |
| 5. | మృత్యోర్మా అమృతంగమయ | 60/- |
| 6. | బ్రహ్మ జిజ్ఞాస | 60/- |
| 7. | ఆత్మజ్ఞానం | 60/- |
| 8. | పరావిద్య | 60/- |
| 9. | యోగాట్రీట్‌మెంట్ | 60/- |
| 10. | మహాచైతన్యం | 60/- |
| 11. | కుండలిని | 60/- |
| 12. | శక్తిపాతం | 60/- |
| 13. | సమాధి | 60/- |
| 14. | మృత్యువు తర్వాతి జీవితం | 60/- |
| 15. | మాస్టర్ సి.వి.వి. జీవితకథ | 60/- |
| 16. | మాస్టర్ 'యోగ' చరిత్ర | 60/- |
| 17. | భుక్తం - రహితం - తారకం | 60/- |
| 18. | యోగాశ్రమ లేఖలు | 60/- |
| 19. | సత్యసంహిత | 60/- |
| 20. | సత్యయోగ ప్రకాశిక | 60/- |
| 21. | ధ్యానం యోగం | 60/- |
| 22. | శ్రీ గురుగీత | 60/- |
| 23. | యోగానుభవాలు (సాధకులు) | 60/- |
| 24. | సాధనా రహస్యం - డా॥ వాసిలి | 60/- |

| | | |
|---|---|---|
| 25. | యోగలయ – డా॥ వాసిలి | 60/- |
| 26. | శ్రీకృష్ణావతారం | 60/- |
| 27. | గీతా పరమార్థం | 60/- |

**ఆంధ్రమహాసావిత్రి** (3 భాగాలు)

| | | |
|---|---|---|
| 28. | యోగదర్శనం - I | 100/- |
| 29. | సత్యదర్శనం - II | 100/- |
| 30. | విశ్వదర్శనం - III | 100/- |

**శ్రీ శార్వరి యోగజీవితం** (3 భాగాలు)

| | | |
|---|---|---|
| 31. | ఆత్మయోగి సత్యకథ - I | 100/- |
| 32. | యోగాశ్రమ జీవితం - II | 100/- |
| 33. | యోగా విజన్ - III | 100/- |
| 34. | మాస్టర్ యోగదర్శిని | 100/- |
| 35. | జీవన్ముక్తి | 100/- |
| 36. | గీతా జ్ఞానయజ్ఞం | 100/- |
| 37. | మంత్రపుష్పాలు (తెలుగు) | 150/- |
| 38. | హస్తసాముద్రిక సర్వస్వం | 100/- |

**ఇంగ్లీషు పుస్తకాలు**

| | | |
|---|---|---|
| 39. | Masters and the Art of Meditation | 100/- |
| 40. | The Life Beyond Death | 60/- |
| 41. | The Mystery of Kundalini | 60/- |
| 42. | Master C.V.V. Prayers (Eng) | 150/- |

***For detailed description :***

*Website : www.avkf.org/books/yoga*
*Ref : Yoga Mastar Sarvari*

**MASTER YOGA ASHRAM**
Plot No. 89 & 90 Krishna Enclave, M.D. Farm Road,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Ph : (040) 27790094

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No 94475
గచ్చిబౌలి, హైదరాబాద్-500032



ఓ మహాత్మా ! ఓ మహర్షీ !!

" నాకు మతం లేదు ... నాకు మరణం లేదు." అన్నది జీసస్ ప్రవచనం.

మతం నీడ సోకనివాడు మహాత్ముడు.

మతాలకు అతీతమైనవాడు మహర్షి.

పారమాత్మిక స్పృహతో, చైతన్యంతో జీవించేవాడు మహాత్ముడు. మరణాన్ని జయించినవాడు మహర్షి.

జీసస్ మహర్షి, మహాత్ముడు, కారణజన్ముడు, అవతారపురుషుడు.

ఇది జీసస్ చిత్రచయనికకు కొత్తరంగు లద్దిన రచన.

ఇది కాలగర్భంలో దాగిన చారిత్రక రహస్యాలను శోధించి, పరిశోధించి, పరిష్కరించి, ఆవిష్కరించిన రచన.

జీసస్ జీవితం ఒక కోణం ...

క్రీస్తు తాత్వికత మరొక కోణం.

జీసస్ జీవితంలో ప్రతి మలుపులో ఒక మెరుపు...

బోధనల్లో అంతర్లీనంగా తళుకొత్తిన తాత్వికత.

ఆయన ఆలోచనల్లో భారతీయ తాత్విక సత్య రోచిస్సుల గుభాళింపులు ... అనుభూతుల్లో 'ఆర్ష' సంస్కృతీ పారమాత్మిక స్పృహ.

ఇది జీసస్ మూలసూత్రాలకు మౌళికభాషణ ...

క్రీస్తు తాత్వికతకు సరికొత్త నిర్వచన రచన.